ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 12-1-2026 సోమవారం సిటీ సంపుటి 52 . సంచిక 153 | రూ. 6-50 పేజీలు 14 | www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru


తెలుగు వారి పెద్ద పండగ సంక్రాంతి శుభాకాంక్షలు
అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్ అందించే అతిపెద్ద ఎలక్ట్రానిక్ స్టోర్
సోనోవిజన్ సంక్రాంతి సేల్
LG 195 Cm (77") OLED
Flexi EMI : 6999/-
SAMSUNG 189 Cm (75") 4K QLED
Flexi EMI : 2990/-
SONY 164 Cm (65") LED 4K Ultra HD Smart
Flexi EMI : 2995/-
LG 164 Cm (65") LED 4K UHD
Flexi EMI : 2999/-
Haier 139 Cm (55") LED 4K HD Smart
Flexi EMI : 1994/-
TCL 139 Cm (55") Mini LED
EMI : 3500/-
LLOYD 108 Cm (43") LED 4K UHD
EMI : 2059/-
vivo 5G X - 300 Pro 8/0, 12/0, 24/0 Schemes Available
10% Cash Back
EMI : 4666/-
oppo F-31, F-31 PRO 5G 8/0, 9/0 Schemes & 12/1 Scheme Available
EMI : 2500/-
iPhone 17, 17 Pro 4000/- Cash Back 12/0, 24/0 & 24/8 Schemes Available
Selected Bank Cards (Exchange Bonus 8000/-)
iPhone 16 EMI : 3454/-
iPhone 16+ EMI : 3745/-
SAMSUNG S-25 Ultra Mobile 12000/- Cash Back 24/0 Scheme Available
EMI : 4875/-
ONEPLUS 15 5G Ram Expandable Instant Cash Back
ICICI Credit Card 12/4 Scheme Available
EMI : 3750/-
realme 15 - 5G 6/0, 8/2, 10/3 Schemes Available Selected Models
EMI : 3700/-
mi Redmi 5G Note 15 Series 6/0, 8/0, 10/2, 12/4 Schemes Available
Smart Watch Ear Buds Mobile Accessories
Boat, Realme, Fastrack, Hapipola
hp 12/4 Scheme Available
EMI : 4333/-
Lenovo 12/4 Scheme Available
EMI : 4166/-
DELL 15/5 Scheme Available
EMI : 4583/-
ASUS 12/4 Scheme Available
EMI : 3960/-
MacBook 24/0 Scheme Available
EMI : 4166/-
boAt JBL Sound Bar
LG 5 & 3 Star Inverter A.C
Starting EMI : 2709/-
LLOYD 5 & 3 Star Inverter A.C
Starting EMI : 2625/-
BLUE STAR 5 & 3 Star Inverter A.C
Starting EMI : 2792/-
VOLTAS 5 & 3 Star Inverter A.C
Starting EMI : 2584/-
DAIKIN 5 & 3 Star Inverter A.C
Starting EMI : 2750/-
Godrej 5 & 3 Star Inverter A.C
Starting EMI : 2417/-
HITACHI 5 & 3 Star Inverter A.C
Starting EMI : 2667/-
Haier 5 & 3 Star Inverter A.C
Starting EMI : 2625/-
LG FL W / M 12/7 Kg 100% Dryer
EMI : 4709/-
LG FL W / M 9-Kg
EMI : 2692/-
SAMSUNG FL W / M 12-Kg
EMI : 2900/-
BOSCH FL W / M 7-Kg
EMI : 2742/-
LG TL W / M 7-Kg
EMI : 1435/-
Whirlpool TL W / M 7-Kg
EMI : 1267/-
IFB TL W / M 7-Kg
EMI : 1617/-
LG Semi W / M 7-Kg
EMI : 884/-
LLOYD Semi W / M 7-Kg
EMI : 850/-
LG RF SBS 635 Ltrs
EMI : 4999/-
SAMSUNG RF SBS 650 Ltrs
EMI : 5750/-
LG RF FF 466 Ltrs
EMI : 2555/-
LG RF FF 272 Ltrs
EMI : 1833/-
Godrej RF FF 270 Ltrs
EMI : 1791/-
LG RF FF 246 Ltrs
EMI : 1833/-
Haier RF FF 240 Ltrs
EMI : 1899/-
Whirlpool RF FF 235 Ltrs
EMI : 1800/-
LG RF DC 210 Ltrs
EMI : 1708/-
VOLTAS beko RF DC 175 Ltrs
EMI : 1250/-
LLOYD RF DC 188 Ltrs
EMI : 1160/-
Water Dispenser Starting Price Rs: 9500/-
Water Purifier RO Starting Price Rs:13000/-
Water Geyser 10 Litres Starting Price Rs: 6700/-
Microwave Oven Starting Price Rs: 7500/-
KITCHEN SMALL APPLIANCES
Air Chimney Starting Price Rs: 8100/-
3 Burner Glass Cooktop Starting Price Rs: 5000/-
Wet Grinder Starting Price Rs: 3100/-
Rice Cooker Starting Price Rs:1650/-
Mixer Grinder 3 Jar, 750 Watts Starting Price Rs: 2900/-
Juicer
Kettle
Iron Box
Air Fryer
Blender
T & C Apply
BAJAJ BUILT FOR LIFE
Preethi
Prestige
HAVELLS
morphy richards
KENT Mineral RO Water Purifiers
EUREKA FORBES
FABER
pureit
V-GUARD
Sunflame
Crompton
AO Smith
Butterfly
Vidiem
అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన షోరూం సోనోవిజన్
విశాఖపట్నం
డైమండ్‌పార్క్-1, ద్వారకా నగర్, వైజాగ్. - 8333924946
డైమండ్‌పార్క్ - 2 ద్వారకా నగర్, వైజాగ్ 9246667474, 8333924929
3వ కొత్త షోరూం : ద్వారకానగర్, పోలక్స్‌స్కూల్ ఎదురు, డైమండ్‌పార్క్ వైజాగ్ - 8712635857, 858, 859.
దువ్వాడ స్టేషన్ రోడ్, కుర్మన్నపాలెం. 8712416261, 62, 63.
శ్రీకన్య థియేటర్ ఎదురు, గాజువాక 9246667575, 9154281127
న్యూ గాజువాక జంక్షన్,గాజువాక. 9440804187, 9100991705
న్యూ సుకన్య థియేటర్,గోపాలపట్నం 9100991704, 9154281129
భారత్ పెట్రోల్ బంక్ ఎదురు, గోపాలపట్నం. 8712635833
కార్‌షెడ్ జంక్షన్, మధురవాడ. 9246666214, 9390006613
తూర్పు గోదావరి
కోటిపల్లి బస్టాండ్, రాజమండ్రి. 9246662288, 9246666212
జె.యన్.రోడ్, రాజమండ్రి. 9100991700, 9154281119
ఇన్నస్‌పేట, రాజమండ్రి. 9154281197, 98, 99
రాజమండ్రి - 4. కోటిపల్లి బస్టాండ్ వి.టి.కాలేజ్ రోడ్ - 9246666212.
రామయ్య స్ట్రీట్, కాకినాడ. 9246665511, 9246666201
సర్పవరం జంక్షన్, కాకినాడ. 7331149376, 77, 78
శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా
చెన్నయ్ బస్టాండ్ దగ్గర, నెల్లూరు. 9246666206, 9154279913
ముత్తుకూరు గేట్, మిని బైపాస్ రోడ్, నెల్లూరు.- 8712600519, 20, 21
ఒంగోలు, బాపూజి మార్కెట్, 9246666329, 9154279911
పశ్చిమ గోదావరి
జువ్వల పాలెం రోడ్, భీమవరం. 8333924936, 9154281175
బడేటి పార్క్ ఎదురు, ఏలూరు. 9246666205, 9154281172
అశోక్ నగర్, ఏలూరు. 9390006620, 9154281112
అంబికాదేవి టెంపుల్, సత్రంపాడు, ఏలూరు - 8712635838, 839
ఫైడిపర్రు రోడ్, తణుకు. 8333924938, 9154281115
తాడేపల్లిగూడెం, గొల్లగూడెం సెంటర్, 8712635854, 55, 56
అమలాపురం, కె.యన్.ఎఫ్. రోడ్, 8712416257, 58, 59.
విజయనగరం
3 లాంతర్ల సెంటర్, 9246666208, 9154281239
ఐస్ ఫ్యాక్టరి జంక్షన్, 8712600523, 8712600535
శ్రీకాకుళం, రామలక్ష్మణ్ జంక్షన్, జి.టి.రోడ్. - 9154281140, 41
విజయవాడ ఎన్.టి.ఆర్. జిల్లా, కృష్ణా జిల్లా.
రామ మందిరం దగ్గర, ఏలూరు రోడ్, విజయవాడ. 9440804182, 9246666202
కంట్రోల్ రూమ్ దగ్గర, యం.జి.రోడ్, విజయవాడ. 9440804183, 9246666209
ఆల్ ఇండియా రేడియో ఎదురు, యం.జి.రోడ్, విజయవాడ. 9246666203, 9154281640
మోహన్‌దాస్ థియేటర్ దగ్గర, పటమట, విజయవాడ. 9246661616, 9100991702
దుర్గా ప్లాజా, యం.జి.రోడ్, పటమట, విజయవాడ. 8712417841, 42, 43.
రింగ్ రోడ్, విజయవాడ. 8712600531, 532, 533
పాయకాపురం, విజయవాడ. 8712648704, 05, 06.
విజయప్లాజా (విజయటాకీస్) ఏలూరు రోడ్, విజయవాడ. 9154281648, 649, 650.
ప్రియదర్శిని థియేటర్ బిల్డింగ్, అరండల్‌పేట, విజయవాడ. 9100991701, 9246666664
ఎనికేపాడు - 1, విజయవాడ. 9100991703, 9154281626
ఎనికేపాడు - 2, ఏలూరు రోడ్, విజయవాడ. 8712416250, 51, 52.
గొల్లపూడి, విజయవాడ. 8333924930, 9154281628
కానూరు, యం.జి.రోడ్, విజయవాడ. 8712600536, 8712600537
మెయిన్ రోడ్ సెంటర్, పోరంకి 9154281645, 46, 47
గుడివాడ, ఏలూరు రోడ్. 9100991708, 9154281178, 79
మచిలీపట్నం, కోనేరు సెంటర్, మునిసిపల్ పార్క్ ఎదురు, 7331149379, 80, 81
గుంటూరు జిల్లా
జిన్నాటవర్ సెంటర్, గుంటూరు. 9154279910, 9440804185
లక్ష్మీపురం, మెయిన్ రోడ్, గుంటూరు. 9246667373, 9154867822, 23, 24
లక్ష్మీపురం, గుంటూరు. 9246666204, 9154279905
బ్రాడిపేట్, గుంటూరు. 9246666215, 9100991706
రత్నాటాకీస్ దగ్గర, తెనాలి. 8333924937, 9154279903
టౌన్ చర్చ్ ఎదురు, బోస్ రోడ్, తెనాలి. 9246666211, 9154279901
మునిసిపల్ ఆఫీస్ ఎదురు, రేపల్లె. 9390006609, 9154281200
కనకదుర్గమ్మ వారధి దగ్గర, తాడేపల్లి - 7331149366, 367, 368
బాపట్ల మెయిన్ రోడ్, బాపట్ల. 9246666207.
నరసరావుపేట
రైల్వేస్టేషన్ రోడ్, అరండల్‌పేట, 8712648710, 11, 12.
రాయలసీమ
న్యూ బాలాజి కాలని, ఎయిర్ బైపాస్ రోడ్, తిరుపతి - 7331149370, 371, 372
అలిపిరి రోడ్, లీలామహల్ జంక్షన్, తిరుపతి - 9100991707, 9154279918
నేతాజి రోడ్, తిరుపతి. 9440804186, 9154279916
ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఎదురు, పార్క్ రోడ్, కర్నూలు - 9154281642, 43,
అమ్మా హాస్పిటల్ సెంటర్, సి-క్యాంప్ ఆఫీస్, కర్నూలు - 8333924947, 48
అంబేద్కర్ నగర్ స్ట్రీట్, ఆదోని. 8712416853, 54, 55.
హెచ్.పి.పెట్రోల్ బంక్ ప్రక్కన, సుభాష్ రోడ్, అనంతపురం - 9154281191, 92
రాజీవ్ గాంధి పార్క్ రోడ్, యస్.ఆర్.రాజీవ్ పార్క్ కడప - 9154281194, 96
పలమనేరు రోడ్, దర్గా ఎదురు, చిత్తూరు. 8712600528, 8712600530
తపోవనం స్కూల్ ఎదురు, వెల్లూరు రోడ్డు, చిత్తూరు. 8712635836, 46, 47
టి.టి.డి. కళ్యాణ మండపం ఎదురు, శ్రీనివాస నగర్ నంద్యాల - 8712600525, 526, 527
ఖమ్మం
కస్బాబజార్, ఖమ్మం. 9246666319, 9154281634
వైరా రోడ్, ఖమ్మం. 9100991709, 9154281635
పర్ణశాల ఎదురు, వైరారోడ్, ఖమ్మం. 8333924931, 9154281637, 38
కొత్తగూడెం
కొత్తగూడెం, భద్రాచలం రోడ్. 9154867825, 26, 27
సూర్యాపేట, కుడకుడ రోడ్. 8712648761, 62, 63
నల్గొండ, ప్రకాశం బజార్. 8712648715, 16, 17.
వరంగల్
అదాలత్ సర్కిల్, హనుమకొండ. 8712648718, 19, 20.
కరీంనగర్
వి. పార్క్ ఎదురుగా, జగిత్యాల రోడ్ 8712635843, 44, 45
వేములవాడ రోడ్, మంకమ్మతోట 8712635841, 42
హైదరాబాద్
పంజాగుట్ట, హైదరాబాద్. 9246663535, 9440804181
మెట్రోస్టేషన్ దగ్గర, కూకట్‌పల్లి. 9154281180, 9154281181
హైదర్ నగర్, హైదరాబాద్. 7331149363, 364, 365
మలక్‌పేట్, హైదరాబాద్. 8333924932 / 933
ఎల్.బి.నగర్, డి-మార్ట్ ఎదురు. 8333924943, 9154281188
బి.యన్.రెడ్డి నగర్, సాగర్ రోడ్, 8712648707, 708, 709
ప్యారడైస్ కాలని, షాద్‌నగర్. 8712648701, 02, 03.
మహబూబ్‌నగర్, మెట్టుగడ్డ గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర, 8712635851, 52, 53
నిజామాబాద్, వినాయక్ నగర్. 8712648766, 67, 68.
మిర్యాలగూడ, ఆర్&బి సాగర్ రోడ్, వైష్ణవిగ్రాండ్ దగ్గర - 8712635848

ఈనాడు

విజయవాడ 12-1-2026 సోమవారం సిటీ సంపుటి 52 . సంచిక 153
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఇరాన్‌పై దాడికి అమెరికా సన్నాహాలు?

పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధమేఘాలు!

ఆందోళనలతో నెత్తురోడుతున్న టెహ్రాన్ సహా పలు నగరాలు

538కి చేరిన మృతుల సంఖ్య

- 10 వేల మందికి పైగా అరెస్టు
- నిరసనకారులపై సైన్యం ఉక్కుపాదం
- అమెరికాకు టెహ్రాన్ తీవ్ర హెచ్చరికలు

దుబాయ్: నిరసనలతో ఇరాన్ అట్టుడుకుతోంది. ఆందోళనకారుల్ని సైన్యం తీవ్రస్థాయిలో అణచివేస్తుండడంతో ఇరాన్ వీధులు నెత్తురోడుతున్నాయి. ఘర్షణల్లో మరణించిన వారి సంఖ్య ఆదివారం ఏకంగా 538కి చేరుకుంది. ఇందులో 48 మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. దాదాపు 10,670 మందిని సైన్యం అరెస్టు చేసింది. మరోవైపు ఇరాన్‌పై సైనిక చర్య అవకాశాల్ని అమెరికా తీవ్రంగా పరిగణిస్తోందన్న వార్తలు పశ్చిమాసియావ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. యుద్ధమేఘాలూ అలముకుంటున్న సంకేతాలనిస్తున్నాయి. ఈ ఆందోళనలకు సంబంధించి ఇరాన్, అమెరికా మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ఆందోళనకారులకు ఏమైనా జరిగితే తాము రంగంలోకి దిగుతామని పదే పదే హెచ్చరిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైనిక చర్య దిశగా సన్నాహాలు చేస్తున్నారని మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. సైనికాధికారులు ఇప్పటికే అధ్యక్షుడితో చర్చించారని సమాచారం. ఇరాన్‌పై చర్య విషయంలో వివిధ ప్రతిపాదనలు ట్రంప్ ముందున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇందులో అమెరికా నేరుగా జోక్యం చేసుకోకుండా (మిగతా 2లో)



ఇరాన్‌లోని మసాద్‌లో ఆందోళనకారులు నిప్పు పెట్టడంతో కాలిపోతున్న వాహనం

గోదారి తీరానికి.. సంక్రాంతి

మొదలైన పండగ సంబరం • ప్రభుత్వ ఆధ్వర్యంలో వేడుకలు • 3 రోజుల పాటు వివిధ పోటీల నిర్వహణ

రావులపాలెం గ్రామీణం, పట్టణం, ఆత్రేయపురం, న్యూస్‌టుడే: తెలుగు లోగిళ్లలో అతిపెద్ద పండగైన సంక్రాంతి కోనసీమకు ముందే వచ్చిందన్నట్లు గోదావరి తీరం పులకించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న 'సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ' సంక్రాంతి సంబరాలు ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో మొదలయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు విచ్చేయడంతో సందడి నెలకొంది. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించారు. సత్యానందరావు మాట్లాడుతూ.. వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంతో ఈ ప్రాంతం కీర్తి ప్రపంచం నలుమూలలా వ్యాపించిందని, కేరళ తరహాలో డ్రాగన్ పోటీలు నిర్వహిస్తూ ఈ ప్రాంతానికి మరింత పేరొచ్చేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. మహేష్‌కుమార్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలను ఏడాది పొడవునా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని, ఇక్కడి ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి (మిగతా 2లో)



ఆత్రేయపురంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా రంగవల్లులు తీర్చిదిద్దుతున్న మహిళలు

గంటకు సగటున 1,917 వాహనాలు!
హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారికి పండగ కళ
2లో



సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ

ఆ శక్తులు ఇప్పటికీ ఉన్నాయి

అవే సోమనాథ్ చరిత్రను తుడిచేయాలని చూశాయి

బానిస మనస్కులు ఆలయ ప్రాముఖ్యాన్ని విస్మరించారు


'సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్'లో ప్రధాని మోదీ

2లో

విపత్తుల నుంచి రక్షణకు
గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఏపీ

ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిన అటవీశాఖ

తీరమంతటా 5 కిలోమీటర్ల వెడల్పుతో పర్యావరణ కారిడార్



ఈనాడు, అమరావతి: ప్రకృతి విపత్తుల నుంచి తీరప్రాంతాన్ని రక్షించడం, వాటి వల్ల కలిగే నష్టాన్ని తగ్గించటమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర అటవీ శాఖ 'గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (మహా హరిత కుడ్యం)' ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా రాష్ట్రంలోని మొత్తం తీరప్రాంతం పొడవునా 5 కిలోమీటర్ల వెడల్పుతో పర్యావరణ కారిడార్ ఏర్పాటు (మిగతా 2లో)

2లో

- ప్రకృతి విపత్తులు, వాతావరణ మార్పుల ముప్పును అధికంగా ఎదుర్కొంటున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి
- రాష్ట్రంలో తీరప్రాంతానికి 5 కిలోమీటర్ల పరిధిలో నివసిస్తున్న ప్రజలు **33 లక్షల మంది**
- కోతకు గురవుతున్న తీరప్రాంతం **32% మేర**
- సముద్రమట్టాల పెరుగుదల వల్ల ముప్పు ఎదుర్కొంటున్నది **282 గ్రామాలు. 10 లక్షల మంది పైగా ప్రజలు ఆవాసాలు కోల్పోయే ప్రమాదం**
- రాష్ట్రంలో గత 30 ఏళ్లలో ప్రకృతి విపత్తుల కారణంగా వాటిల్లిన ఆర్థిక నష్టం » **రూ.2.25 లక్షల కోట్లు**

2,801 ఎకరాల్లో 'స్పేస్ సిటీ' మొదటి దశ

571 ఎకరాల్లో స్టార్టప్ యాక్టివేషన్ ప్రాంతం

రూ.140.95 కోట్లతో సదుపాయాలు

ప్లగ్ అండ్ ప్లే విధానంలో అభివృద్ధి

పాలసీని తెచ్చిన కూటమి ప్రభుత్వం

3లో

నిరుద్యోగులకు సైబర్ ఉచ్చు

- విదేశాల్లో ఉద్యోగాలంటూ భారతీయులకు ఆశలు
- రూ.లక్షల్లో వేతనాలంటూ సోషల్‌మీడియాలో ప్రకటనలు
- తీసుకెళ్లి సైబర్ నేరాల్లోకి దింపుతున్న చైనా సిండికేట్
- 'డిజిటల్ అరెస్టు' అంటూ వారితోనే జనాలకు ఫోన్లు



ఈనాడు, అమరావతి: విదేశాల్లో ఉద్యోగాలంటూ ఆశ చూపుతారు.. కస్టమర్ కేర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ వంటి కొలువులిస్తామని వల విసురుతారు.. రూ.లక్షల్లో వేతనాలు చెల్లిస్తామంటూ ప్రలోభపెడతారు. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, వాట్సప్ బ్రాడ్‌కాస్ట్ మెసేజ్‌లు, టెలిగ్రామ్ గ్రూపుల్లో మోసపూరిత ఉద్యోగ ప్రకటనలతో హోరెత్తిస్తారు. అదంతా నిజమేనని నమ్మేసి ఒక్కసారి ఆ ఉచ్చుకు చిక్కారో.. 'అంతర్జాతీయ సైబర్ నేరాల ముఠా' గుప్పిట్లో బందీలైపోయినట్లే. దక్షిణాసియాలోని థాయ్‌లాండ్, వియత్నాం, కంబోడియా, లావోస్ వంటి దేశాల్లో 'సైబర్ నేరాల కాంపౌండ్'లను వ్యవస్థీకృతంగా నిర్వహిస్తున్న చైనా సిండికేట్.. మన వేళ్లతో మన కళ్లనే పొడుస్తోంది. విదేశాల్లో ఉద్యోగాల పేరిట భారత్ నుంచి తీసుకెళ్లిన యువతను ఆ 'కాంపౌండ్‌ల్లో' బంధించి సైబర్ నేరాల్లో పావులుగా వాడుతోంది. సీబీఐ, ఈడీ, ఐటీ అధికారులమంటూ వారితో ఫోన్లలో మాట్లాడించి నేరాలు చేయిస్తోంది. (మిగతా 2లో)



పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఆదివారం ఉదయం బారులుతీరిన కార్లు

గంటకు సగటున 1,917 వాహనాలు!

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారికి పండగ కళ

నందిగామ, న్యూస్‌టుడే: ప్రవాహంలా వస్తున్న వాహనాలతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి కళకళలాడింది. కీసర టోల్‌ప్లాజా వద్ద శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం ఆరు గంటల వరకు 24 గంటల్లో హైదరాబాద్ వైపు నుంచి విజయవాడకు 46 వేల వాహనాలు వచ్చినట్లు నమోదైంది. సాధారణంగా విజయవాడ వైపు రోజుకు 10-12వేల వాహనాలు నిత్యం తిరుగుతుంటాయి. సంక్రాంతి పండగ నేపథ్యంలో మరో 34 వేల వాహనాలు వచ్చాయి. నందిగామ వై.జంక్షన్ వద్ద సర్వీస్ రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేశారు. ఇక్కడ గుంతల కారణంగా ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సూచన మేరకు నందిగామకు చెందిన నాయకుడు పాలేటి సతీష్ గుంతలకు మరమ్మతులు చేయించారు. విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు స్పీడ్ బ్రేకర్లు లేకుండా చేశారు. గుత్తేదారు సంస్థ లక్ష్మీ ఇన్‌ఫ్రా ప్రతినిధులు విజయవాడ వైపు సర్వీసురోడ్డులో గుంతలకు మరమ్మతులు చేయించారు. దీంతో విజయవాడ వైపు వాహనాలు ఇబ్బంది లేకుండా వెళ్తున్నాయి. పండగ అనంతరం హైదరాబాద్ వైపు తిరిగివెళ్లే వాహనాలకు ఇబ్బంది లేకుండా వంతెనకు పైభాగంలో, నందిగామ వై.జంక్షన్ వద్ద తాత్కాలికంగా పనులు చేపట్టారు.

ఇరాన్‌పై దాడికి అమెరికా సన్నాహాలు?

(మొదటి పేజీ తరువాయి)

పరోక్షంగా రంగంలోకి దిగేందుకు వీలైన సూచనలూ ఉన్నాయి. ఈ ప్రతిపాదనలపై ట్రంప్ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని ఓ అధికారి తెలిపారు. మృతుల సంఖ్య పెరిగితే మాత్రం ఆయన తీవ్ర చర్యలు తీసుకునే అవకాశం ఉందని అన్నారు.



టెహ్రాన్‌లోని కహ్రిజాక్ ఫోరెన్సిక్ మెడికల్ సెంటర్‌లో భారీగా పడివున్న మృతదేహాలు

దేశాన్ని నాశనం చేస్తున్నారు

ఆందోళనకారులను ఉగ్రవాదులతో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ పోల్చారు. ఈ ముఠాలు మొత్తం సమాజాన్నే నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ప్రజల్లో నెలకొన్న ఆందోళనలను పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. దేశాన్ని అస్థిరపరిచేందుకు ఇజ్రాయెల్, అమెరికా కుట్ర పన్నుతున్నాయని ఆయన అన్నారు.


స్వేచ్ఛ కోసం పరితపిస్తున్నారు: ఇరాన్ ప్రజలు స్వేచ్ఛ కోసం పరితపిస్తున్నారు.. వారికి అండగా ఉంటామని ట్రంప్ పేర్కొన్నారు. "గతంలో ఎన్నడూ లేని విధంగా స్వేచ్ఛ కోసం ఇరాన్ పరితపిస్తోంది. ఇందుకు సాయం చేయడానికి అమెరికా సిద్ధంగా ఉంది" అని ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమమైన 'ట్రూత్ సోషల్'లో పేర్కొన్నారు. అమెరికా విదేశాంగ శాఖ కూడా కీలక ప్రకటన విడుదల చేసింది. 'ట్రంప్‌తో ఆటలాడకండి. ఆయన చెప్పిందే చేస్తారు' అని ఇరాన్‌ను హెచ్చరించింది.

ఇజ్రాయెల్‌ను లక్ష్యం చేసుకుంటాం..

ట్రంప్ ప్రకటనపై ఇరాన్ పార్లమెంటు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. 'అమెరికాకు మరణం' అంటూ సభ్యులు నినాదాలు చేశారు. ట్రంప్ వ్యాఖ్యలపై పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బాకర్ గాలిబాఫ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అమెరికా తమపై దాడి చేస్తే తాము ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించారు. పశ్చిమాసియాలోని అమెరికా సైనిక స్థావరాలనూ నాశనం చేస్తామని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలతో ఇజ్రాయెల్ అప్రమత్తమైంది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో సంభాషించారు. ఇరాన్‌లో ప్రజా ఆందోళనలు, సిరియా, గాజాలో పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం.

విదేశాల్లోనూ..: ఇరాన్ ఆందోళనలు విదేశాలకూ వ్యాపించాయి. లండన్‌లో ఇరాన్ రాయబార కార్యాలయం వద్ద నిరసనలు జరిగాయి. ఎంబసీ బాల్కనీపైకి ఎక్కి ఇస్లామిక్ రిపబ్లిక్ జెండాను తొలగించిన ఆందోళనకారులు, దాని స్థానంలో 1979 నాటి దేశ పతాకాన్ని ఎగురవేశారు. పారిస్, బెర్లిన్ సహా ఐరోపాలోని ప్రధాన నగరాల్లో సంఘీభావ ర్యాలీలు జరిగాయి.





సంక్రాంతి సిత్రాలు..!

సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే వారితో విశాఖ రైల్వేస్టేషన్ జనసంద్రాన్ని తలపిస్తోంది. ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ల్లో రద్దీ ఊహించలేనంతగా మారింది. ఆదివారం విశాఖ-విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ఎక్కడానికి ప్లాట్‌ఫామ్‌పైకి వేల మంది ఒకేసారి వచ్చారు. అప్రమత్తమైన రైల్వే పోలీసులు క్యూలైన్లు ఏర్పాటు చేసి వారిని బోగీల్లోకి ఎక్కించారు. మరో వైపు పండక్కి జనాలు గ్రామాలకు భారీగా తరలివెళ్లడంతో విజయవాడ బోసిపోయి కనిపిస్తోంది. నిన్నటి వరకు ట్రాఫిక్‌తో రద్దీగా కనిపించిన కనకదుర్గ పైవంతెన ఆదివారం ఖాళీగా కనిపించింది. – ఈనాడు అమరావతి, విశాఖపట్నం

ఆ శక్తులు ఇప్పటికీ ఉన్నాయి

- అవే సోమనాథ్ చరిత్రను తుడిచేయాలని చూశాయి
- 'సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్'లో ప్రధాని మోదీ

సోమనాథ్: 'చారిత్రక సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని వ్యతిరేకించిన శక్తులు ఇప్పటికీ మనమధ్య క్రియాశీలకంగా ఉన్నాయి. అప్రమత్తంగా, ఐక్యంగా ఉంటూ వాటిని ఓడించండి' అని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. పలుమార్లు ఈ ఆలయంపై దండెత్తినా ప్రతిసారీ పునర్నిర్మాణం జరిగిందని చెప్పారు. మెడపై కత్తి పెట్టి ప్రజల హృదయాలను ఎప్పటికీ గెలుచుకోలేరని స్పష్టంచేశారు. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన సోమనాథ్ ఆలయంపై గజనీ మహమ్మద్ తొలిసారి దాడిచేసి వెయ్యేళ్లయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆయన ఈ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. 'సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్' పేరుతో పెద్దఎత్తున జరిగిన వేడుకను ఉద్దేశించి ప్రసంగించారు. విధ్వంసం, ఓటమి కాకుండా విజయం, పునర్నిర్మాణంతో ఆలయ చరిత్ర ముడిపడి ఉందన్నారు. సోమనాథ్ ఆలయ చరిత్రను తుడిచిపెట్టేందుకు గత ప్రభుత్వాలు ప్రయత్నించాయని, బానిస మనస్తత్వం ఉన్నవారు ఆలయ ప్రాముఖ్యాన్ని విస్మరించారని కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి విమర్శలు చేశారు. స్వాతంత్య్రం వచ్చాక ఆలయాన్ని పునర్నిర్మించడానికి ఉక్కుమనిషి సర్దార్ పటేల్ చేసిన ప్రయత్నాలను కొందరు అడ్డుకున్నారని విమర్శించారు. భారత తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్ ఈ పుణ్యక్షేత్రాన్ని సందర్శించాలని నిర్ణయించుకున్నప్పుడు అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని ధ్వజమెత్తారు.



గుజరాత్‌లోని సోమనాథ్ దేవాలయంలో పూజలు చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

భారత అస్తిత్వానికి ప్రతీక

"1,000 ఏళ్ల క్రితం దురాక్రమణదారులు ఈ ఆలయాన్ని ధ్వంసం చేసి విజయం సాధించామని అనుకున్నారు. వెయ్యేళ్ల తర్వాత కూడా సోమనాథ్ ఆలయంపై జెండా ఎగురుతూనే ఉంది. చరిత్రలో ఇలాంటి ఉదంతం మరొకటి లేదు. భారత అస్తిత్వానికి, గౌరవానికి సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ ప్రతీక. ఒకవేళ ఆలయ సంపద కోసమే అయితే సోమనాథ్‌పై మొదటిసారి జరిగిన దాడి సరిపోయేది. అలా కాకుండా ఆలయంపై పదేపదే దాడులు జరిపి దైవాన్ని అపవిత్రం చేశారు. ద్వేషం, ఆరాచకం, భయపెట్టేయత్నాలపై అసలు నిజాలను దాచిపెట్టి.. సంపద కోసమే సోమనాథ్‌పై దాడి జరిగిందని చిత్రీకరించారు. తమ మతానికి నిజంగా కట్టుబడినవారు ఇలాంటి అతివాద సైద్ధాంతిక ఆలోచనలను ఎప్పుడూ సమర్థించరు. కానీ బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడినవారు మాత్రం అలాంటి అతివాదుల ముందు మోకరిల్లారు. ఆనాడు ఆలయ పునర్నిర్మాణాన్ని వ్యతిరేకించినవారు ఇప్పటికీ ఉంటూ కత్తుల బదులు కుట్రలతో విరుచుకుపడుతున్నారు. ఇలాంటి విభజనశక్తులపై అప్రమత్తంగా ఉండాలి" అని మోదీ పిలుపునిచ్చారు.

వాహనశ్రేణి వెంట 108 అశ్వాలు.. డమరుకం మోగించిన మోదీ

శౌర్యయాత్రలో నిర్వహించిన కార్యక్రమాలు కట్టిపడేశాయి. ఆలయాన్ని రక్షించే క్రమంలో ప్రాణాలు అర్పించిన యోధులకు నివాళిగా ఈ యాత్ర నిర్వహించారు. మోదీ వాహనశ్రేణి వెంట వచ్చిన 108 అశ్వాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పూలతో అలంకరించిన ప్రత్యేక వాహనంలో యాత్రలో పాల్గొన్న ఆయన, మధ్యలో డమరుకం మోగించారు. ఆలయంలో శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. దాదాపు కిలోమీటరు మేర సాగిన ఈ యాత్రలో భక్తులు భారీసంఖ్యలో పాల్గొన్నారు. హరహర మహాదేవ్ నామస్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది.

18, 19న ప్రత్యేక రైళ్లు: ద.మ.రైల్వే

ఈనాడు, హైదరాబాద్: అనకాపల్లి-చర్లపల్లి మధ్యలో ఈ నెల 18, 19 తేదీల్లో అదనంగా మూడు ప్రత్యేక రైళ్లు నడిపించనున్నట్లు ద.మ. రైల్వే తెలిపింది. ఈ రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు, విజయవాడ, రాజమహేంద్రవరం మీదుగా రాకపోకలు సాగిస్తాయి. అనకాపల్లి-చర్లపల్లి ప్రత్యేక రైలు (నం.07479) ఈ నెల 18న రాత్రి 10.30కి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 11.30 గంటలకు గమ్యస్థానం చేరుకుంటుంది. చర్లపల్లి-అనకాపల్లి (నం.07477) 19న అర్ధరాత్రి 12.40 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 9 గంటలకు చేరుకుంటుంది. అనకాపల్లి-చర్లపల్లి (నం.07478) 19న రాత్రి 10.30కి బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11.30కు గమ్యస్థానం చేరుతుంది.

తమిళనాడు వక్ఫ్ బోర్డు కార్యకలాపాలపై మధ్యంతర స్టే

ముస్లిమేతర సభ్యులు లేకపోవడంతో మద్రాసు హైకోర్టు ఉత్తర్వు

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: తమిళనాడు వక్ఫ్ బోర్డులో ఇద్దరు ముస్లిమేతరులను సభ్యులుగా చేర్చకపోవడంతో బోర్డు కార్యకలాపాలపై మధ్యంతర స్టే విధిస్తూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. సవరించిన కొత్త వక్ఫ్ బోర్డు చట్టం ప్రకారం మొత్తం సభ్యుల్లో ఇద్దరు ముస్లిమేతరులు, ఒక బార్ కౌన్సిల్ సభ్యుడు ఉండాలని, తమిళనాడు వక్ఫ్ బోర్డు దీన్ని పాటించలేదని న్యాయవాది షౌకత్ అలీ పిటిషన్ దాఖలు చేశారు. అందుకే బోర్డు కార్యకలాపాలపై నిషేధం విధించాలని కోరారు. ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎం.శ్రీవాస్తవ, జస్టిస్ అరుళ్‌మురుగన్ ధర్మాసనం విచారించింది. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం.. బోర్డు విషయమై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను నిలిపేసి, కార్యకలాపాలపై మధ్యంతర స్టే విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

నిరుద్యోగులకు సైబర్ ఉచ్చు

(మొదటి పేజీ తరువాయి)

భారత్‌లోని లక్షల మందిని బాధితులుగా మార్చి ఏటా రూ.వేల కోట్లు దోచుకుంటోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా తదితర రాష్ట్రాలకు చెందిన వేల మంది యువకులు ఈ ముఠాల గుప్పిట్లో చిక్కుకున్నారు. వీరిలో కొంతమందిని దర్యాప్తు సంస్థలు ఎప్పటికప్పుడు విడిపిస్తున్నప్పటికీ కొత్తగా వందల మంది మళ్లీ ఆ ఉచ్చులో చిక్కుతున్నారు. చైనా సైబర్ నేరాల ముఠాల తరఫున మన దగ్గర పనిచేస్తున్న కొందరు ఆపరేటర్లది ఇందులో కీలక పాత్ర. ఈ నేపథ్యంలోనే నకిలీ ఉద్యోగ ప్రకటనలకు స్పందించే విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

ముందే స్క్రిప్టు అందించి..

- ఉద్యోగాల కోసమంటూ భారత్ నుంచి తీసుకెళ్లిన యువతను తొలుత సైబర్ నేరాల కాంపౌండ్‌ల్లోకి తరలిస్తారు.. అక్కడికి వెళ్లాక వారు బాగా మాట్లాడగలిగే భాషల ఆధారంగా విభజిస్తారు. ఉదాహరణకు ఇంగ్లిష్, హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, ఒరియా.. ఇలా ఒక్కో భాష మాట్లాడగలిగిన వారిని ఒక్కోచోట పెడతారు.
- భారత్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన వ్యక్తులకు వారితో ఫోన్లు చేయిస్తారు. ఎలా మాట్లాడాలి? ఎలా మోసగించాలి? సీబీఐ, ఈడీ, ఐటీ అధికారులమంటూ ఎలా నమ్మించాలి? ఎలా భయపెట్టాలి? అనే అంశాలపై శిక్షణ ఇస్తారు. ఏం మాట్లాడాలో స్క్రిప్టు అందిస్తారు. వారితో డిజిటల్ అరెస్టులు, నకిలీ పెట్టుబడి మోసాలు, హనీట్రాప్, బ్యాంక్ ఎకౌంట్ టేకోవర్, నకిలీ కొరియర్ మోసాలు వంటి నేరాలు చేయిస్తున్నారు.

ఎంత కొల్లగొట్టాలో చెప్పి మరీ దోపిడీ..

- రోజుకు ఎంతమందికి ఫోన్ కాల్స్ చేయాలి? వారిని మోసగించి ఎంత సొత్తు రాబట్టాలి? అనేదానిపై ప్రతి ఒక్కరికీ రోజువారీ లక్ష్యం నిర్దేశిస్తారు. దాన్ని చేరుకోలేకపోయినా, ఈ మోసాలకు పాల్పడలేనంటూ వెనక్కి తగ్గినా చిత్రహింసలకు గురిచేస్తారు.. ఆహారం ఇవ్వరు. గదిలో నిర్బంధించి తీవ్రంగా కొడతారు.
- భారత్ నుంచి తీసుకెళ్లిన యువతకు సంబంధించిన పాస్‌పోర్టులు, వీసాలు, ఇతర గుర్తింపు కార్డులన్నీ సైబర్ నేరాల ముఠాలు తమవద్దే పెట్టుకుంటున్నాయి. దీంతో బాధితులు అక్కడి నుంచి బయటపడే మార్గం లేక నరకం చూస్తున్నారు.
- రోజూ ఉదయం 8 నుంచి రాత్రి 12 వరకూ అంటే దాదాపు 16 గంటల పాటు వీరితో పనిచేయించుకుంటారు. ఆ పనిచేయలేక, అక్కడి నుంచి తప్పించుకోలేక బాధితులు పడే బాధలెన్నో.
- ముఖ్యంగా ఉత్తరాంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు చెందిన అనేకమంది అమాయక యువత వీరి ఉచ్చులోకి చిక్కుతున్నారు.

ఈ కాంపౌండ్‌లే అడ్డాలుగా..

- **కంబోడియా:** పోయ్‌పెట్, కండాల్, షినౌక్ విల్లే, బావెట్, కోహ్‌కాంగ్, పుర్సట్
- **మయన్మార్:** వా స్టేట్, లుక్కాయింగ్, కోకంగ్, మోంగ్లా, తచీలేక్, మయవాడీ, ష్వేకొక్కో
- **లావోస్:** బోకియో

ఇలా చేస్తున్నారంటే అసలు నమ్మొద్దు..

- విదేశాల్లో ఉద్యోగాలంటూ సామాజిక మాధ్యమాలు, ఇతర మార్గాల్లో వచ్చే ప్రకటనల విశ్వసనీయతను ఒకటికి, రెండుసార్లు చెక్ చేసుకోవాలి.
- అపాయింట్‌మెంట్ లెటర్ ఇవ్వకుండానే ఉద్యోగం పేరిట విదేశాలకు తీసుకెళ్తున్నారంటే అది కచ్చితంగా మోసమేనని గుర్తించాలి.
- పాస్‌పోర్టు, గుర్తింపు కార్డులను ముందే స్వాధీనం చేసుకుంటున్నారంటే కచ్చితంగా అనుమానించాల్సిందే..
- తగిన అర్హతలు లేకపోయినా రూ.లక్షల్లో వేతనాలు చెల్లిస్తామని చెబుతున్నారంటే సందేహించాల్సిందే.
- ఉద్యోగం కోసమని చెప్పి పర్యాటక వీసాపై తీసుకెళ్తున్నారంటే తప్పకుండా అనుమానించాలి.



లొంగిపోయిన మావోయిస్టును జనజీవన స్రవంతిలోకి ఆహ్వానిస్తున్న ఓఎస్డీ పంకజ్‌కుమార్ మీనా

మహిళా మావోయిస్టు లొంగుబాటు

ఎటపాక, న్యూస్‌టుడే: మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని పోలవరం జిల్లా రంపచోడవరం ఓఎస్డీ పంకజ్‌కుమార్ మీనా పిలుపునిచ్చారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కిందర్లేపాడ్ గ్రామానికి చెందిన మహిళా మావోయిస్టు మడకం మూడే (25) ఆదివారం ఓఎస్డీ మీనా, ఏఎస్పీ హేమంత్ సమక్షంలో లొంగిపోయారు. ఎటపాక పోలీస్‌స్టేషన్‌లో విలేకర్లకు ఓఎస్డీ ఈ వివరాలు వెల్లడించారు. 2020 జనవరిలో 20 ఏళ్ల వయసులోనే కుంట ఏరియా కమిటీలో చేరిన మాడే.. 2021లో ఛత్తీస్‌గఢ్‌లోని జేగురుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జీరాగూడ వద్ద 31 మంది భద్రతాదళాలను హతమార్చిన ఘటనలో పాల్గొన్నారని తెలిపారు. మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలకు విసిగిపోయిన మాడే.. తాజాగా లొంగిపోయినట్లు వివరించారు.







ఆత్రేయపురంలో సంక్రాంతి సంబరాలను ప్రారంభిస్తున్న ఎస్పీ రాహుల్ మీనా, కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తదితరులు ● ఉత్కంఠగా సాగుతున్న ఈత పోటీలు ● లొల్ల లాకుల వద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్

గోదారి తీరానికి.. సంక్రాంతి

(మొదటి పేజీ తరువాయి)

చేయడం ద్వారా యువతకు ఉపాధి కల్పించేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రంగవల్లులు, ఈత పోటీలు: పోటీల్లో దాదాపు కిలోమీటరు మేర రంగవల్లులు వేశారు. విశాఖపట్నం, విజయవాడ, ఉమ్మడి గోదావరి జిల్లాలు తదితర ప్రాంతాల నుంచి సుమారు 350 మంది మహిళలు ఇందులో పాల్గొన్నారు. ఆత్రేయపురం వంతెన వద్ద నిర్వహించిన ఈత పోటీల్లో 234 మంది పాల్గొన్నారు. విశాఖపట్నం, విజయవాడ, ఉభయగోదావరి జిల్లాల నుంచి చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు ఆయా కేటగిరీల పోటీల్లో పాల్గొన్నారు. లొల్ల లాకుల వద్ద ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. ఆత్రేయపురం పూతరేకులతో పాటు బొబ్బట్లు, మిల్లెట్స్‌తో తయారు చేసిన వంటకాలు, సూప్‌లు, బొమ్మల కొలువులు, చేనేత వస్త్రాల స్టాళ్లు ఏర్పాటు చేశారు. పోటీలకు వచ్చిన వారందరికీ భోజన సదుపాయం కల్పించారు.

నేటి నుంచి డ్రాగన్ పడవల పోటీలు

డ్రాగన్, కయాకింగ్, కనోయింగ్ పడవల పోటీలు సోమవారం ఉదయం ప్రారంభం కానున్నాయి. రెండు రోజుల పాటు జరగనున్నాయి. పోటీల్లో పాల్గొనేందుకు పలు రాష్ట్రాల నుంచి సుమారు 250 మంది వస్తున్నారు.

విపత్తుల నుంచి రక్షణకు గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఏపీ

(మొదటి పేజీ తరువాయి)

చేయనుంది. దీన్ని తీరానికి బయోషీల్డ్‌గా (జీవ రక్షణ కవచం) తీర్చిదిద్దనుంది. మొత్తం మూడు జోన్లతో గ్రేట్ గ్రీన్ వాల్‌ను ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే కార్యాచరణ మొదలైంది.

సముద్రమట్టాల పెరుగుదల.. తీరప్రాంత కోత

- తీరప్రాంతానికి 5 కిలోమీటర్ల పరిధిలో నివసిస్తున్న ప్రజలు తరచూ తుపానులు, సునామీలు, వరదలు, సముద్రమట్టం పెరుగుదల, తీరప్రాంత కోత ప్రమాదాలు ఎదుర్కొంటున్నారు.
- కృష్ణా-గోదావరి డెల్టాల్లోకి ఉప్పు నీరు చొచ్చుకుపోకుండా కాపాడే సహజ రక్షణ కవచాలైన నదీ ముఖద్వారాల పరిసర ప్రాంతాల్లో సముద్రపు కోత తీవ్రంగా ఉంది. దీని వల్ల భూమిని కోల్పోతున్నాం. పర్యావరణ వ్యవస్థలు దెబ్బతింటున్నాయి. వరదలు పెరుగుతున్నాయి.
- తుపానులు, వరదల వల్ల పంటలు, పశుసంపదతో పాటు మత్స్యకార మౌలిక వసతులకు తీవ్రనష్టం వాటిల్లుతోంది. కలుషిత నీరు, క్షీణిస్తున్న వ్యవసాయ భూములు ఆహార సరఫరా వ్యవస్థను దెబ్బతీస్తున్నాయి.
- ఈ తరహా సహజ విపత్తుల నుంచి రక్షించేందుకు 'గ్రేట్ గ్రీన్ వాల్' ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. గ్రేట్ గ్రీన్ వాల్‌ను పూర్తి చేసి దేశంలోనే ఆదర్శంగా రాష్ట్రాన్ని నిలుపుతామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పదే పదే చెబుతున్నారు.

మూడు జోన్లతో ఏర్పాటు

- **జోన్-1: సముద్ర దిశ వైపునున్న అంచు (సీవార్డ్ ఎడ్జ్):** నదీ ముఖద్వారాల వద్ద మడ అడవులు పెంచుతారు. నదీ ముఖం కాని ప్రాంతాల్లో షెల్టర్ బెల్ట్‌లు (చెట్ల వరసలు లేదా పొదల సమూహం) ఏర్పాటు చేస్తారు.
- **జోన్-2: గాలి నిరోధకాలు (విండ్ బ్రేక్స్):** కాలువగట్లపై భారీ ఎత్తున మొక్కలు నాటుతారు. రహదారులకు ఇరువైపులా మొక్కలు పెంచుతారు
- **జోన్-3: కమ్యూనిటీ బఫర్:** ఆగ్రో ఫారెస్ట్రీ కింద సాగు చేయిస్తారు. ప్రజా భాగస్వామ్యంతో వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటుతారు.

తీరప్రాంతానికి పెట్టని కోటలా...

– డా.పీవీ చలపతిరావు, అటవీ దళాల అధిపతి



విపత్తులు, తుపానులు, సునామీల నుంచి రక్షణ, పెనుగాలుల వేగాన్ని నియంత్రించేందుకు, సముద్రమట్టాల పెరుగుదల, తీరప్రాంత కోతను అడ్డుకునేందుకు ఈ గ్రేట్ గ్రీన్ వాల్ ఉపయోగపడుతుంది. ఇప్పటికే 700 హెక్టార్లలో మడ అడవులు పెంచుతున్నాం. ఎకోటూరిజాన్ని ప్రోత్సహిస్తున్నాం. రైతులు, స్వయం సహాయక సంఘాలు, మత్స్యకారులకు ఉపాధి దొరికేలా ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశాం. ప్రాజెక్టు అమలు మొదలైంది. దీన్ని మరింత ఉద్ధృతంగా ముందుకుతీసుకెళ్తాం.

గ్రహం అనుగ్రహం

12-1-2026 సోమవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, పుష్యమాసం, బహుళపక్షం
నవమి: మ. 1-58 తదుపరి దశమి
స్వాతి: రా. 10-35 తదుపరి విశాఖ
వర్జ్యం: తె. 4-45 నుంచి 6-31 వరకు
అమృత ఘడియలు: మ. 12-59 నుంచి 2-44 వరకు
దుర్ముహూర్తం: మ. 12-30 నుంచి 1-14 వరకు తిరిగి 2-42 నుంచి 3-26 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.6.38; సూర్యాస్తమయం: సా.5.39

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	13.0	25.0
హైదరాబాద్	13.1	26.8
శ్రీకాకుళం	17.0	28.0
కర్నూలు	17.2	29.4
తిరుపతి	19.1	24.2
నెల్లూరు	19.7	25.5
కడప	20.0	25.0
తాడేపల్లిగూడెం	20.0	27.0
ఒంగోలు	20.0	28.2
అనంతపురం	20.5	29.1
రాజమహేంద్రవరం	20.5	31.0
విశాఖపట్నం	20.6	27.4
నరసాపురం	20.8	30.6
గుంటూరు	21.0	28.0
విజయవాడ	21.0	28.4


నాటి ఆటలు.. మేటి ఆరోగ్యం!

సంక్రాంతి వేళ సంప్రదాయ క్రీడల నిర్వహణపై దృష్టి సారించిన 'శాప్'

'ఎప్పుడు చూసినా ఆటలే. ఒక్క నిమిషం ఇంట్లో కుదురుగా కూర్చోరు కదా' – ఒకప్పుడు తల్లిదండ్రులు పిల్లలను వారించిన తీరు.

'టీవీ, ఫోన్లతో ఇంట్లో కూర్చోకపోతే వెళ్లి ఆడుకోవచ్చు కదా?' – ఈతరం తల్లిదండ్రులు.

తరతరాల నుంచి వచ్చిన మన సంప్రదాయ క్రీడలను పిల్లలు మరిచిపోయారు. ఇంట్లో తెరలకే అతుక్కుపోతున్నారని తల్లిదండ్రుల మాటల్లోనే తెలుస్తోంది. పోటీతత్వం, ఆరోగ్యం, ఐకమత్యం కలగలిసిన అలనాటి ఆటల్లో ఉన్న మజానే వేరు. ఆదరణ కోల్పోతున్న ఆటలను తిరిగి పరిచయం చేయడానికి. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఈ సంక్రాంతి వేళ సిద్ధమైంది. గ్రామీణ సంప్రదాయ క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టింది. ఆ ఆటల్లో దాగిన సంస్కృతి, ఆరోగ్య రహస్యాలేంటో తెలుసుకుందాం!





తొక్కుడు బిళ్ల: అమ్మాయిలకు ఎంతో ఇష్టమైన ఆట ఇది. నేలపై 8 గదులు గీసి కుండ పెంకునో, రాయి బిళ్లనో బయట నుంచి మొదటి గడిలోకి విసురుతారు. బిళ్ల ఉన్న గడిని వదిలేసి మిగిలిన గదులన్నింటినీ ఒంటి కాలితో దాటాలి. మళ్లీ అలాగే వెనక్కి వచ్చి బిళ్ల ఉన్న గడి వద్ద ఆగి, దాన్ని తీసుకొని బయటకు దూకాలి. మొదటి గడి అయ్యాక, రెండో గడి.. ఇలా అన్ని గదులు పూర్తి చేయాలి. అన్ని దశలూ విజయవంతమైతే వెనక్కి తిరిగి బిళ్లను గదుల వైపు విసిరి, అది ఏ గడిలో పడితే ఆ గడి గెల్చినట్లు 'ఎక్స్' గుర్తు పెడతారు. గడి గెలుచుకున్న వారు అందులో ఒంటికాలితో ఉండాల్సిన అవసరం లేదు. అందులో నిల్చొని విశ్రాంతి తీసుకోవచ్చు. కేవలం కుంటడమే కాకుండా బిళ్లను అరచేతి, మోచేతి, తలపై పెట్టుకొని గదులు దాటే క్లిష్టమైన దశలుంటాయి.

వ్యాయామం: ఈ క్రీడతో కాళ్లు, వెన్నెముక, నడుముకు వ్యాయామం చేసినట్లు అవుతుంది.

ఆరోగ్యం: ఒంటికాలితో ఎగురుతూ గదులు దాటడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగవుతుంది.



ఏడు పెంకులాట: చిన్న వృత్తంలో ఏడు పెంకులను ఒకదానిపై ఒకటి పిరమిడ్‌లా పేర్చాలి. ఆడే సభ్యులు రెండు జట్లుగా విడిపోవాలి. ఒక జట్టు వాళ్లు నిర్ణీత దూరం నుంచి బంతితో పిరమిడ్‌ను పడగొట్టాలి. ఆ తర్వాత ప్రత్యర్థి పడిపోయిన పిరమిడ్‌ను మళ్లీ పేర్చాలి. ఈ క్రమంలో ఎదుటి జట్టు వాళ్లు బంతితో కొట్టాలని చూస్తుంటారు. వారి బంతికి దొరక్కుండా పెంకులను పేర్చి 'డికోరీ' అంటూ అనౌన్స్ చేయాలి.

వ్యాయామం: ఈ ఆటలో క్రీడాకారులు మెరుపు వేగంతో పరుగెత్తాల్సి ఉంటుంది.

ఆరోగ్యం: ప్రత్యర్థి విసిరే బంతిని తప్పించుకుంటూ పిరమిడ్ పేర్చడం ఆటగాడి ఏకాగ్రతను పెంచుతుంది



కర్రా బిళ్ల: దీన్నే కర్రా బిళ్ల, బిళ్లం గోడు, గిల్లి దండ, గోణి బిళ్ల అని ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా పిలుస్తారు. నాలుగు అంగుళాల చిన్న కర్ర ముక్క (బిళ్ల)ను, 2 అడుగుల పొడవున్న పెద్ద కర్రతో దూరంగా కొట్టాలి. చిన్న బిళ్లను పెద్ద కర్రతో ఎన్ని సార్లు గాల్లోకి ఎగరేసి కొడతారో దాన్ని బట్టి ఆ దూరాన్ని కొలుస్తారు. ఒకసారి కొడితే పెద్ద కర్ర, రెండు సార్లు కొడితే కర్ర బిళ్ల, మూడు సార్లు గాల్లో ఎగరేసి కొడితే అగ్గిపుల్లతో, పిన్నీసుతోనూ కొలిచి విజేతను నిర్ణయిస్తారు.

వ్యాయామం: శరీరం మొత్తానికి ఈ ఆట వ్యాయామంలా పని చేస్తుంది.

ఆరోగ్యం: కంటికి, చేతి సమన్వయం అలవడుతుంది.



తాడాట: చేతులతో తాడును పట్టుకొని తల మీదుగా తిప్పుతూ..కాళ్ల వద్దకు వచ్చేసరికి తగలకుండా గెంతుతూ ఉండాలి. ఒకరే కాకుండా, రెండు వైపులా చెరొకరు పట్టుకొని మధ్యలో ఇద్దరు, ముగ్గురు కలిసి జంప్ చేయవచ్చు. నిర్ణీత సమయానికి తాడు కాలికి తగలకుండా ఎన్ని వందల రౌండ్స్ తిప్పుతారని పోటీ పెట్టుకుంటారు.

వ్యాయామం: బరువు తగ్గడానికి ట్రెండింగ్ వ్యాయామం.

ఆరోగ్యం: ఊపిరితిత్తులు, గుండెకు ఎంతో మంచిది.



తాడు లాగుడు: తాడు లాగుడు ఆటను 'టగ్ ఆఫ్ వార్' అంటారు. ఆటగాళ్లను రెండు సమాన జట్లుగా విభజించి తాడు మధ్యలో ఒక రిబ్బన్ కడతారు. ఈ తాడును రెండు వైపులా ఇరు జట్లు పట్టుకొని తమవైపు లాగాలి. తాడుపై రిబ్బను ఎటు వైపు వస్తే... ఆ జట్టు గెలిచినట్లు. తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి, కేరళలో ఓనం పండగలో సంప్రదాయ ఆటగా ఇది ఆడుతారు.

వ్యాయామం: కాళ్లు, చేతుల పట్టును పెంచుకునేందుకు ఉపయోగం.

ఆరోగ్యం: బృంద స్ఫూర్తి, వ్యూహ రచనను నేర్పుతుంది.

– ఈనాడు, విశాఖపట్నం; ఈనాడు డిజిటల్, తిరుపతి

అమ్మ బతికే ఉంది

కర్మకాండలకు సిద్ధమవుతుండగా అందిన క్షేమ సమాచారం



వెంకటలక్ష్మి, ఆమె కుమారుడు గురవయ్య, బంధువులను సత్కరిస్తున్న ఆశ్రమ నిర్వాహకుడు శ్రీనివాసరావు

ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే: రెండున్నరేళ్లుగా అమ్మ తిరిగొస్తుందని ఎదురుచూసిన ఆ కుటుంబం ఇక ఆశలు వదులుకొని సంప్రదాయం ప్రకారం ఆమెకు కర్మకాండలు నిర్వహించేందుకు సిద్ధమైంది. ఇంతలో ఇంట్లో ఫోన్ మోగింది. మీ అమ్మ మా వద్ద క్షేమంగా ఉన్నారు.. వచ్చి తీసుకెళ్లండని అవతలి వ్యక్తి చెప్పడంతో అందరూ సంతోషంలో మునిగిపోయారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా కంభం మండలం ఎల్.కోట గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి(70)కి గుంటూరు ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా.. మానసిక సమస్యలతో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయారు. కుటుంబసభ్యులు ఎంత గాలించినా ఆచూకీ లభించలేదు. ఈ దిగులుతో ఆమె భర్త మూడు రోజులకే చనిపోవడంతో మరింత విషాదంలో మునిగిపోయారు. రెండున్నరేళ్లు గడిచినా వెంకటలక్ష్మి తిరిగి రాకపోవడంతో కర్మకాండలు చేయించాలని ఫొటోఫ్రేమ్ కట్టించి, ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఖమ్మంలోని అన్నం సేవాశ్రమం నిర్వాహకులు ఫోన్ చేసి వెంకటలక్ష్మి మా వద్దే ఉన్నారని చెప్పడంతో ఆమె చిన్నకుమారుడు గురవయ్య, బంధువులు ఆదివారం అక్కడికి చేరుకొన్నారు. తల్లిని పట్టుకుని గురవయ్య కన్నీటిపర్యంతమయ్యారు. ఖమ్మం పరిసరాల్లో తిరుగుతుండటంతో పోలీసులు 2023 జులైలో తమ ఆశ్రమానికి తీసుకొచ్చారని, చికిత్స అందించడంతో కోలుకొని ఆమె వివరాలు చెప్పారని నిర్వాహకుడు అన్నం శ్రీనివాసరావు తెలిపారు. ఆశ్రమం తరఫున గురవయ్య, ఆయన బంధువులను శాలువాతో సత్కరించి వెంకటలక్ష్మిని అప్పగించారు.

అడవితల్లి బాట కింద 40 పనులు పూర్తి

పంచాయతీరాజ్‌శాఖ ఈఎన్‌సీ బాలూనాయక్

పి.గన్నవరం, న్యూస్‌టుడే: పీఎం జన్‌మన్ పథకానికి సంబంధించి రాష్ట్రంలో అడవితల్లి బాట కింద చేపట్టిన రహదారుల పనుల్లో 40 వరకు పూర్తయినట్లు పంచాయతీరాజ్‌శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ బాలూనాయక్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం జి.పెదపూడిలంక వద్ద గోదావరి నదీపాయపై నిర్మిస్తున్న వంతెనను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. అడవితల్లి బాట కింద రూ.555 కోట్లతో 613 కిలోమీటర్ల మేర 206 పనులు చేసేందుకు నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. మార్చి నెలాఖరులోగా 160 పనులు పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటివరకు 40 పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఏఐఐబీ నిధులతో రాష్ట్రవ్యాప్తంగా ఏడు వంతెనలు నిర్మిస్తున్నామని.. వీటిలో జి.పెదపూడిలంక వారధి ఒకటని చెప్పారు. రాష్ట్రానికి సాకీ నిధులు రూ.2,128 కోట్లు మంజూరయ్యాయని, ఈ పనులు త్వరలో మొదలుపెడతామని వివరించారు.



మీరు నియంత్రించగలిగేది మీ జీవితాన్ని మాత్రమే

మీరు ఈ ప్రపంచంలో ఏ ఒక్కరి జీవితాన్నీ నియంత్రించలేరు, ఒక్క మీ జీవితాన్ని తప్ప! నిజం చెప్పాలంటే మీ జీవితాన్ని మార్చుకోవడానికి మీరు మాత్రమే చాలు, ఇంకెవ్వరి సహాయమూ అవసరం లేదు. కాబట్టి ఇతరుల గురించి, వారి అభిప్రాయాల గురించి ఎక్కువగా ఆలోచించకుండా, మిమ్మల్ని మీరు మెరుగుపర్చుకోవడంపైనే దృష్టి పెట్టండి.

– సిద్ధార్థ్, కంటెంట్ స్ట్రాటజిస్ట్

పోలవరం-నల్లమలసాగర్‌పై బలమైన వాదనలు వినిపించండి

- గోదావరి వృథా జలాల్ని వాడుకుంటే తప్పేంటి?
- మంత్రి నిమ్మల రామానాయుడు

ఈనాడు, అమరావతి: పోలవరం-నల్లమలసాగర్ అనుసంధాన ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో ఆంధ్రప్రదేశ్ తరఫున బలమైన వాదనలు వినిపించాలని న్యాయవాదులకు జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సూచించారు. ఈ కేసుకు సంబంధించిన రికార్డులన్నింటినీ న్యాయవాదుల బృందానికి అందించాలని అధికారుల్ని ఆదేశించారు. గోదావరి ప్రవాహానికి దిగువన ఉన్న ఆంధ్రప్రదేశ్.. సముద్రంలో వృథాగా కలిసిపోతున్న 3 వేల టీఎంసీల్లో 200 టీఎంసీల నీటిని వాడుకుంటే తప్పేంటని ఆయన ప్రశ్నించారు. తోటి తెలుగు రాష్ట్రానికి స్నేహహస్తం అందిస్తుంటే వారు ఏపీకి అన్యాయం జరిగేలా కోర్టుకు వెళ్లడం విచారకరమని పేర్కొన్నారు. పోలవరం-బనకచర్ల/నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టుపై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ ఉన్న నేపథ్యంలో మంత్రి రామానాయుడు జలవనరులశాఖ అధికారులు, న్యాయవాదులతో ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'జీడబ్ల్యూడీటీ అవార్డు ప్రకారం మిగులు జలాలను వినియోగించుకునే హక్కు ఏపీకి ఉంది. గోదావరి బేసిన్‌లో ఆంధ్రప్రదేశ్ దిగువ రాష్ట్రం కావడంతో ఇతర రాష్ట్రాల హక్కులకు భంగం కలగకుండా మిగిలిన వరద నీటిని వాడుకోవచ్చు. సముద్రంలోకి వృథాగా పోతున్న నీటిని రాయలసీమకు తరలించి ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం' అని స్పష్టం చేశారు.

అనుమతులన్నీ వచ్చాకే ప్రాజెక్టుపై ముందుకు

'కేంద్రానికి ప్రాజెక్టు ఫీజిబులిటీ రిపోర్ట్ సమర్పించాం. వారి సూచనలతో మార్పులు చేస్తున్నాం. డీపీఆర్ టెండర్లు ముందస్తు సన్నాహక చర్య మాత్రమే. అనుమతులన్నీ వచ్చాకే పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టు చేపడతాం' అని మంత్రి వివరించారు. రాష్ట్రం తరఫున సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, మరో న్యాయవాది జయదీప్ గుప్తా వాదనలు వినిపిస్తున్నారు. కార్యక్రమంలో జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో మారిన వాతావరణం



చెరువులవెనం వ్యూపాయింట్ వద్ద తగ్గిన మంచు ప్రభావం

చింతపల్లి, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా మారింది. మన్యంలోని పలుచోట్ల శనివారం రాత్రి నుంచే చిరుజల్లులు కురిశాయి. నిన్నమొన్నటి వరకు దట్టంగా అలుముకున్న పొగమంచు ప్రభావం తగ్గింది. చలి తీవ్రత యథాతథంగా కొనసాగుతోంది. ఆదివారం ఉదయం జి.మాడుగులలో 12.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ అప్పలస్వామి తెలిపారు. పెదబయలులో 12.9, ముంచంగిపుట్టులో 13, అరకులోయలో 13.5, హుకుంపేటలో 14, చింతపల్లిలో 14.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని పేర్కొన్నారు.

2,801 ఎకరాల్లో 'స్పేస్ సిటీ' మొదటి దశ

ఈనాడు, అమరావతి: అంతరిక్ష సాంకేతికత, సేవలు, తయారీ.. వ్యాపార కార్యకలాపాలకు అనువైన వ్యవస్థను రాష్ట్రంలో అభివృద్ధి చేసేందుకు 15 వేల ఎకరాల్లో 'స్పేస్ సిటీ ఆఫ్ ఇండియా'ను కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేయనుంది. స్టార్టప్‌లు, సంస్థలు, విద్యా సంస్థలతోపాటు ఇక్కడ పరిశోధనలను ప్రోత్సహించాలన్నది ప్రభుత్వ యోచన. ఈ రంగంలో సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా దేశ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అందుకు అనుగుణంగా స్పేస్ పాలసీని ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ పాలసీ ద్వారా రానున్న ఐదేళ్లలో రూ.25 వేల కోట్ల మేర పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు అనుగుణంగా విధానాన్ని రూపొందించింది.

దశలవారీగా...

తిరుపతి జిల్లా బీఎన్ కండ్రిగ మండలం రౌతుసురమాల ప్రాంతాన్ని స్పేస్ సిటీ ఏర్పాటుకు అనువైనదిగా ప్రభుత్వం ఎంపిక చేసింది. దశల వారీగా ఇక్కడ మౌలిక వసతులు కల్పించాలని నిర్ణయించింది. మొదటి దశలో 2,801.43 ఎకరాలను అంతరిక్ష రంగ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సదుపాయాలను అభివృద్ధి చేయాలని భావిస్తోంది. ఈ పరిధిలోని స్టార్టప్ యాక్టివేషన్ ఏరియాగా 571.70 ఎకరాల్లో.. రూ.140.95 కోట్లు ఖర్చుతో సదుపాయాలను కల్పిస్తారు. ఈ రంగంలో పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటు ద్వారా పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షించాలని భావిస్తోంది.

- మౌలిక వసతులతో పాటు పరిపాలనా భవనాలు, ఇంక్యుబేషన్ సెంటర్, కాన్ఫరెన్స్ హాల్ వంటివి స్టార్టప్ యాక్టివేషన్ ప్రాంతంలో నిర్మిస్తారు. ప్రపంచ స్థాయి ప్లగ్ అండ్ ప్లే తరహా వసతులు కల్పించడం ద్వారా సంస్థలను రప్పించాలనేది ప్రభుత్వ ఆలోచన. తిరుపతి సమీపంలో ఇప్పటికే ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు, సెమీకండక్టర్ల తయారీ పరిశ్రమలకు ఇప్పటికే అనుమతులు ఇచ్చింది. వాటికి దగ్గరలోనే స్పేస్ సిటీ ఏర్పాటు కానుంది.

కనెక్టివిటీపై ప్రత్యేక దృష్టి

స్పేస్ సిటీ ఏర్పాటుచేసే ప్రాంతానికి రవాణా సేవలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది. ప్రతిపాదించిన ప్రాంతం జాతీయ, రాష్ట్ర రహదారులు, రైల్వే లైన్‌కు దగ్గరగా ఉంది. జాతీయ రహదారి-71 నుంచి 3.8 కి.మీ., స్టేట్ హైవే-480 నుంచి ఎన్‌హెచ్-16 వరకు కి.మీ., హౌరా-చెన్నై రైల్వే లైన్‌లోని సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ నుంచి 27 కి.మీ., శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్ నుంచి 14 కి.మీ.దూరంలో ఉంది. తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం 30 కి.మీ., నెల్లూరులోని కృష్ణపట్నం పోర్టు 70 కి.మీ. దూరంలో ఉంటుంది. శ్రీహరికోట సతీష్ ధావన్ (షార్) స్పేస్ సెంటర్ నుంచి ప్రతిపాదించిన స్పేస్ సిటీ 50 కి.మీ.దూరంలో ఉంటుంది. ఎగుమతి, దిగుమతులకు వీలుగా కనెక్టివిటీ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

- స్పేస్ సిటీకి 70 కి.మీ. దూరంలో ఉన్న కండలేరు జలాశయం నుంచి నీటిని సరఫరా చేసేలా ప్రతిపాదనను అధికారులు సిద్ధం చేశారు. ఏర్పేడు సమీపంలోని పారిశ్రామిక క్లస్టర్‌కు నీటి సరఫరా కోసం రూ.200 కోట్లతో పైపులైను ఏర్పాటు పనులను ఇప్పటికే చేపట్టారు.
- ఈ ప్రాంతంలో హైస్పీడ్ ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ కూడా సిద్ధంగా ఉంది.

రక్తదానానికి యువత ముందుకు రావాలి: మంత్రి సత్యకుమార్

ఈనాడు, అమరావతి: జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం 40 రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఒక్కో యూనిట్ రక్తం ముగ్గురు ప్రాణాలు కాపాడుతుందని పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 5.34 లక్షల యూనిట్ల రక్తం సేకరించగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు నెలాఖరు నాటికి 7.03 లక్షల యూనిట్లు సేకరించామని చెప్పారు. రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలన్నారు. ఈ మేరకు ఆదివారం పత్రికాప్రకటన విడుదల చేశారు.

బెంగళూరు-విజయవాడ హైవే నిర్మాణంలో గిన్నిస్ రికార్డులు





పుట్టపర్తి వద్ద సాగుతున్న రోడ్డు పనులు ★ గిన్నిస్ రికార్డులు వచ్చిన సందర్భంగా రోడ్డు నిర్మాణ సిబ్బంది, అధికారుల విజయోత్సాహం

- నేడు వర్చువల్‌గా ధ్రువీకరణపత్రాలు అందించనున్న సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

ఈనాడు– దిల్లీ, అమరావతి, పుట్టపర్తి– న్యూస్‌టుడే: బెంగళూరు- విజయవాడ వయా కడప జాతీయ రహదారి నిర్మాణంలో రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ గుత్తేదారు సంస్థ నాలుగు గిన్నిస్ రికార్డులు సృష్టించింది. ఈ నెల 5న శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం సాతర్లపల్లి వద్ద ఈ ప్రయత్నాలను ప్రారంభించింది. ఈ నెల 6 బొంతలపల్లి సమీపంలో 28.89 లేన్ కిలోమీటర్ల పొడవైన రహదారిని 24 గంటల్లోపు పూర్తి చేసి మొదటి రికార్డు సృష్టించింది. అలాగే 24 గంటల్లో అత్యధికంగా 10,655 టన్నుల బిటుమినస్ కాంక్రీట్‌ను నిరంతరం వేసి రెండో రికార్డు సాధించింది. ఈ నెల 11 వరకు 57,500 టన్నుల బిటుమినస్ కాంక్రీట్‌ను నిరంతరంగా వేసి మూడో రికార్డును, మొత్తం 156 లేన్ కిలోమీటర్ల (26 కిలోమీటర్ల మేర 6 వరుసలు) పొడవైన రహదారిని నిరంతరంగా నిర్మించి నాలుగో రికార్డును సృష్టించింది. సోమవారం వర్చువల్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ గిన్నిస్ ధ్రువీకరణ పత్రాలను అందజేయనున్నారు. ఈ రికార్డు నెలకొల్పడాన్ని నితిన్ గడ్కరీ, చంద్రబాబు వేర్వేరుగా ప్రశంసించారు. ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికత్వంలో సాధించిన ఈ విజయాలు ప్రపంచస్థాయి హైవే మౌలిక వసతుల కల్పన, భారీ ప్రాజెక్టుల అమలులో మన సత్తాను చాటిచెప్పాయని గడ్కరీ పేర్కొన్నారు. ఇప్పటికే సాధించిన రికార్డు స్ఫూర్తితో కారిడార్ మిగిలిన పనులూ పూర్తి చేయాలని చంద్రబాబు ఆకాంక్షించారు.

నేడు చేనేత సంఘాల ఖాతాల్లోకి రూ.5 కోట్లు

ఈనాడు, అమరావతి: చేనేత సహకార సంఘాల ఖాతాల్లో సోమవారం రూ.5 కోట్ల బకాయిలు జమ చేయనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. గత నెలలో రూ.2.42 కోట్ల బకాయిలు ఆప్కో ద్వారా చెల్లించినట్లు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. తాజాగా మరో రూ.5 కోట్లు చెల్లించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వం నిర్ణయంపై చేనేత సహకార సంఘాల ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు.

రూ.40 కోట్ల నీరు-చెట్టు బిల్లుల్ని.. వెంటనే చెల్లించండి

మంత్రి పయ్యావుల కేశవ్

ఈనాడు, అమరావతి: నీరు-చెట్టు పథకం కింద 2014-19 మధ్య చేసిన పనులకు రూ.40 కోట్ల బిల్లుల్ని వెంటనే చెల్లించాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అధికారుల్ని ఆదేశించారు. ఆర్థిక, జలవనరుల శాఖ, జీఎస్టీ విభాగాల అధికారులతో ఆదివారం ఆయన సమీక్షించారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు రూ.800 కోట్ల బిల్లుల చెల్లింపు పూర్తయిందన్నారు. వీటికి రూ.40 కోట్లు కలిపితే రూ.840 కోట్లు చెల్లింపులు పూర్తవుతాయని వివరించారు. పెండింగ్‌లో ఉన్న ఇతర బిల్లులనూ త్వరితగతిన చెల్లించేలా చూడాలని ఆదేశించారు.

జీఎస్టీ రిజిస్ట్రేషన్ లేక అప్‌లోడ్ కాని రూ.60 కోట్లు: జీఎస్టీ రిజిస్ట్రేషన్ కాకపోవడంతో సుమారు రూ.60 కోట్ల నీరు-చెట్టు బిల్లులు అప్‌లోడ్ కావడం లేదని అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. అందుకే అవి ఆర్థిక శాఖ వద్దకు రాలేదని చెప్పారు. దీనిపై జీఎస్టీ అధికారులతో మాట్లాడిన మంత్రి.. ప్రతి ఈఈ కార్యాలయంలో జలవనరులు, జీఎస్టీ అధికారులతో కౌంటర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కాంట్రాక్టర్లతో మాట్లాడి దగ్గరుండి జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేయించాలని, ఆ వెంటనే బిల్లులు అప్‌లోడ్ అయ్యేలా చూడాలని ఆదేశించారు.

నేడు నింగిలోకి పీఎస్ఎల్‌వీ-సీ62

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి పీఎస్ఎల్‌వీ-సీ62 రాకెట్‌ను ప్రయోగించడానికి శాస్త్రవేత్తలు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం మధ్యాహ్నం 12.48 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభం కాగా, సోమవారం ఉదయం 10.18కి రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. పీఎస్ఎల్‌వీ-సీ62 రాకెట్ ద్వారా దేశ రక్షణ రంగానికి అత్యంత కీలకమైన "ఈఓఎస్-ఎన్1" ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపనున్నారు.

శాఖాధిపతులు, కార్యదర్శులతో నేడు సీఎం సమావేశం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర మంత్రులు, కార్యదర్శులు, శాఖాధిపతులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం సమీక్షించనున్నారు. సచివాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే కార్యక్రమంలో.. జిల్లాల నుంచి కలెక్టర్లు వర్చువల్‌గా హాజరు కానున్నారు. జీఎస్‌డీపీ, పది సూత్రాలు, ఆదాయార్జన శాఖలు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, రెవెన్యూ దస్త్రాల పరిష్కారం, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ సహా ఆర్టీజీఎస్ శాఖలపై సీఎం దిశానిర్దేశం చేస్తారు. అనంతరం సోమవారం సాయంత్రం తన స్వగ్రామమైన నారావారిపల్లెలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొనేందుకు వెళ్తారు.

'జీ రామ్ జీ' అమలుకు ప్రణాళికలు

ఈనాడు, అమరావతి: 'వికసిత్ భారత్ జీ రామ్ జీ' పథకం ఏప్రిల్ నుంచి అమలుకు యంత్రాంగం తాత్కాలిక ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. శ్రామికులకు ఉపాధి కల్పన, వేతనాల చెల్లింపు, మెటీరియల్ నిధులతో పనుల నిర్వహణ తదితర అంశాలతో సీఎం చంద్రబాబుకు అధికారులు తాజాగా నివేదిక ఇచ్చారు. ఆయన ఆదేశాలతో 'జీ రామ్ జీ' అమలుకు ప్రణాళికలు తయారు చేయనున్నారు. వీటిపై సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల ఆధ్వర్యంలో చర్చిస్తారు.

ఉద్యోగుల హక్కుల సాధనే లక్ష్యం

- ముఖ్యమంత్రి సహకారం మరువలేనిది
- ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న విద్యాసాగర్. పక్కన దస్తగిరిరెడ్డి, రమణ, జగదీశ్వరరావు, భారతీయప్రసాద్ తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగుల హక్కుల సాధనే లక్ష్యంగా పని చేస్తామని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ స్పష్టం చేశారు. ఏడాదిన్నరగా ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేకుండా ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారం మరవలేనిదని, గతంలో ఎప్పుడూ లేనివిధంగా ముఖ్యమంత్రే నేరుగా ఉద్యోగ సంఘాలతో చర్చిస్తున్నారని పేర్కొన్నారు. ఆదివారం విజయవాడలోని ఏపీ ఎన్జీవో భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర కమిటీకి మూడేళ్ల కాల పరిమితి ఈ నెలాఖరులో ముగియనుండడంతో రాష్ట్ర స్థాయి ఎన్నికల పర్యవేక్షణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు విద్యాసాగర్ చెప్పారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోని 27 జిల్లాలు, విజయవాడ నగర శాఖకు ఎన్నికలు సమర్థంగా నిర్వహించినట్లు తెలిపారు. ఏపీఎన్జీవో సంఘం ఏర్పడి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా.. ప్లాటినం జూబ్లీ ఉత్సవాలను త్వరలోనే ఘనంగా నిర్వహిస్తామన్నారు. తమ పోరాటాల వల్లే పీఆర్సీ, ఆరోగ్య కార్డులు తదితర సమస్యలను ప్రభుత్వం పరిష్కరించిందని వివరించారు. ఆరోగ్యకార్డుల సమస్య పరిష్కారమైతే 24 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లు, ఉపాధ్యాయులు లబ్ధి పొందుతారని తెలిపారు. వైకాపా ప్రభుత్వంలో ఉద్యోగులకు రావాల్సిన రూ.14 కోట్ల బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు వి.దస్తగిరిరెడ్డి, ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ, కార్యనిర్వాహక కార్యదర్శి కిలారు జగదీశ్వరరావు, కోశాధికారి ఎన్.భారతీయప్రసాద్, మహిళా విభాగం కన్వీనర్ పి.మాధవి, జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక



వేదికపై పౌర హక్కుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: తిరుపతిలో జరిగిన పౌర హక్కుల సంఘం మహాసభల్లో ఆదివారం రాష్ట్ర నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్ రెండో దఫా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా క్రాంతి చైతన్య, శ్రీమన్నారాయణ, వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులుగా ఆంజనేయులు, పత్తిరి దానేషు, సురేష్, కోశాధికారిగా డాక్టర్ టి.రాజారావు, కార్యవర్గ సభ్యులుగా పి.రాజారావు, చామలపెంట్ల వెంకటేశ్వర్లు వ్యవహరించనున్నారు. రాష్ట్ర మహాసభల్లో చేసిన 16 తీర్మానాలను కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

యూటీఎఫ్‌కు నూతన కార్యవర్గం



వెంకటేశ్వర్లు



ప్రసాద్

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వ బడులను కాపాడుకునేందుకు సామాజిక ఉద్యమం నిర్మించాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) 51వ కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. గుంటూరులో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నక్కా వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్, గౌరవాధ్యక్షులుగా కె.శ్రీనివాసరావు, సహాధ్యక్షులుగా కె.సురేష్‌కుమార్, ఏఎస్ కుసుమకుమారి, కోశాధికారిగా ఆర్.మోహన్‌రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 12వ పీఆర్సీ ఛైర్మన్‌ను సంక్రాంతిలోపు నియమించాలని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డిమాండ్ చేశారు.

ఈనాడు

డిజిటల్ ఇండియాకు ప్రబల శత్రువులు

సామాన్యులే కాకుండా ఉన్నతోద్యోగులు, విశ్రాంత అధికారులు, ప్రజా ప్రతినిధులు అందరినీ సైబర్ నేరగాళ్లు చులాగ్గా బురిడీ కొట్టిస్తున్నారు. ఎప్పటికప్పుడు కొత్త మార్గాల్లో ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ అంటూ హైదరాబాద్‌కు చెందిన విశ్రాంత ఐఏఎస్‌ను సైబరాసురులు మభ్యపెట్టి నిరుడు మేలో రూ.మూడు కోట్లు కొల్లగొట్టారు. లాభాల ఆశజూపి పంజాబ్‌లో ఓ మాజీ ఐపీఎస్ అధికారి నుంచి కిందటి నెలలో రూ.8.10 కోట్లు దోచేశారు. నేరముఠాల నుంచి ప్రజలను అప్రమత్తం చేయాల్సిన మాజీ పోలీసునయ్యుండి తానే మోసపోయాననే అవమానంతో ఆయన ఆత్మహత్య చేసుకున్నారు పాపం! జనాన్ని ఏమార్చడంలో ఆరితేరిన ఆన్‌లైన్ దొంగలు తిరుమలలో వసతి, దర్శనం పేరుచెప్పి రాచకొండ సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌ను ఇటీవల నిలువునా వంచించారు. మనీలాండరింగ్ కేసు కింద డిజిటల్ అరెస్టు చేస్తున్నామంటూ, ఆర్టీఏ బకాయిల చెల్లింపులంటూ ఏపీలో ఇద్దరు ఎమ్మెల్యేల నుంచి రూ. 1.30 కోట్లు కాజేశారు. తాజాగా స్టాక్ మార్కెట్లో పెట్టుబడులంటూ సీబీఐ మాజీ ఉన్నతాధికారి వీవీ లక్ష్మీనారాయణ సతీమణి నుంచి రూ.2.58 కోట్లు స్వాహా చేశారు. దొరికిన వారి నుంచి దొరికినంతగా లూటీ చేస్తున్న సైబర్ బందిపోట్లు డిజిటల్ ఇండియా ప్రగతికి ప్రబల శత్రువులుగా తయారయ్యారు.

భారతీయ సైబర్ నేరాల సమన్వయ కేంద్రం(ఐ4సీ) సమాచారం ప్రకారం ఆన్‌లైన్ మోసాల మూలంగా గడిచిన ఆరేళ్లలో ఇండియా దాదాపు రూ.53వేల కోట్లు నష్టపోయింది. కిందటి సంవత్సరంలోనే సుమారుగా 20వేల కోట్లు కోల్పోయింది. 2025 సంవత్సరాంతానికి సైబర్ మాయగాళ్లు ఏపీ వాసుల నుంచి రూ.751 కోట్లు కాజేస్తే, తెలంగాణలో 2024 జులై నుంచి ఎనిమిది నెలల వ్యవధిలోనే రూ.633 కోట్ల మేర దోచేశారు. సైబర్ నేరాలకు సంబంధించి దేశవ్యాప్తంగా ప్రతి రోజూ సుమారు ఏడు వేల ఫిర్యాదులు అందుతున్నాయి. 35శాతం కేసుల్లో బాధితులు ఒక్కొక్కరు రూ.50 లక్షలకు పైగా పోగొట్టుకుంటున్నారు. ప్రజల కష్టార్జితాలను డిజిటల్ చోరులు ఎలా దిగమింగుతున్నారో ఈ గణాంకాలే కళ్లకు కడుతున్నాయి. దండుకుంటున్న సొమ్మును కేటుగాళ్లు క్షణాల వ్యవధిలో వందల ఖాతాల్లోకి మళ్లిస్తున్నారు. దాంతో ఆ డబ్బును మొత్తంగా వెనక్కితేవడం కష్టతరమవుతోంది. సైబరాసురులు దేశవిదేశాల్లోని మారుమూల ప్రాంతాల్లో నక్కి ఉండి జనంపై మాయవలలు విసురుతుండటంతో కేసుల ఛేదనా యంత్రాంగానికి సవాలుగా మారుతోంది!

ఝార్ఖండ్‌లోని జామ్‌తాడా, రాజస్థాన్‌లోని భరత్‌పుర్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని మథుర, హరియాణాలోని నూహ్‌లతో పాటు మరికొన్ని చిన్నచిన్న ఊళ్లు, పట్టణాలు సైబర్ నేరగాళ్లకు అడ్డాలయ్యాయి. వాటికి తోడు కంబోడియా, లావోస్, వియత్నాంలలో తిష్ఠవేసిన చైనా ముఠాలు ఉద్యోగాల పేరిట భారతీయ యువతను ఆకర్షించి, అక్కడ వారిని బంధించి బలవంతంగా ఆన్‌లైన్ నేరాలు చేయిస్తున్నాయి. ఆ నయవంచకులు దేశవ్యాప్తంగా ఏజెంట్లను నియమించుకుని కమీషన్లు ఎరవేసి ఇతరుల బ్యాంకు ఖాతాలు సేకరిస్తున్నారు. కాజేసిన సొమ్మును వాటిలోకి బదిలీచేసి దర్జాగా ఏటీఎంల నుంచి విత్‌డ్రా చేసుకుంటున్నారు. బ్యాంకుల్లోని ఇంటిదొంగలు సైతం సహకరిస్తుండటంతో ఈ దోపిడీ బృందాలకు పట్టపగ్గాలు లేకుండా పోతున్నాయి. వారి విజృంభణతో వ్యవస్థలపై ప్రజావిశ్వాసం నీరుగారిపోతోంది. కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో వ్యవహరిస్తూ అత్యాధునిక సాంకేతికతలతో సైబర్ చోరులకు సంకెళ్లు వేయగలిగితేనే ప్రజాధనానికి భద్రత లభిస్తుంది. ఆన్‌లైన్ నేరాల తీరుతెన్నులపై గ్రామస్థాయి వరకు అవగాహన పెంచడం అన్నింటికన్నా ముఖ్యం. ప్రజల సొత్తును కాపాడాల్సిన బాధ్యతల్లో ఉండి, సైబర్ బందిపోట్లకు సహకరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడమూ అత్యవసరం.

జీవిత ప్రయాణంలో ప్రతి వ్యక్తికీ ఒక సమయం వస్తుంది. ఆ మలుపు నుంచి వెనక్కి మళ్లలేము, ముందుకూ వెళ్లలేము. అలాంటప్పుడు పరిస్థితిని అర్థం చేసుకుని తదనుగుణంగా తమను తాము మలచుకోవడమే వివేకవంతుల లక్షణం.

– హరుకి మురకామి, ప్రఖ్యాత జపనీస్ రచయిత



సహస్రదళ పద్మం!

రామకృష్ణ పరమహంస ఒకసారి శిష్యుల ఆధ్యాత్మిక పరిణతిని అంచనా వేస్తూ తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పారమార్థిక ప్రగతిని పద్మంతో పోలుస్తూ కొందరిని దశదళ పద్మాల వంటివారని, మరికొందరిని పదహారు దళాలున్న జలజం వాంటివారని పేర్కొన్నారు. ఇంకొందరిని శతదళ నీరజాలన్నారు. వివేకానందుణ్ని మాత్రం సహస్రదళ పద్మమంగా తీర్మానించారు. ఆ వేయి రేకుల రాజీవం వంటి శిష్యుణ్నే తమ బోధనల పరివ్యాప్తికి ప్రధాన సారథిగా చేసుకున్నారు. పరమహంస అస్తమించాక స్వామి వివేకానంద సోదర శిష్యులకు గురుస్థానంలో నిలిచారు. వారికి దిశానిర్దేశం చేయడమే కాదు, రామకృష్ణ సంఘానికీ శ్రీకారం చుట్టారు. అభాగ్యుల సేవలోనూ ఆధ్యాత్మికోన్నతి సాధ్యమని ఆచరణలో చూపారు. స్వామి వివేకానంద దేశభక్తుడే కాదు ధ్యానసిద్ధుడు కూడా! కర్మయోగే కాదు కఠోర సాధకుడు కూడా! ఆయనలో ఒక రుషి, భవిష్యత్తు తెలిసిన ద్రష్ట ఉన్నారు. ఆ యుగపురుషుడి జీవనప్రస్థానం సేవ, సాధనల సమ్మిళితం.



సంపూర్ణ వైరాగ్యం, సామాజిక తత్పరతల మేలుకలయికే స్వామి వివేకానంద. విశాలత్వమే ముఖ్యమని విశ్వసించే ఆ విశ్వనాయకుడు 'సత్యమే నా దైవం, విశ్వమే నా దేశం. నేను ప్రపంచ పౌరుణ్ని' అని నినదించారు. అరణ్యాలకు, మహర్షుల ఆశ్రమాలకు పరిమితమైన వేదాంత సత్యాల్ని జనజీవనంలోకి తీసుకువచ్చారు. ఆ ఉద్యమంలో భాగంగా భారత దేశమంతా దాదాపు ఆరేళ్లు పర్యటించి సంఘంలోని మూఢాచారాలను నిరసిస్తూ ప్రజలను జాగృతపరిచారు. సనాతన ధర్మ వైశిష్ట్యాన్ని చాటిచెప్పారు. తన సత్యాన్వేషణలో భాగంగా పాశ్చాత్య తత్వశాస్త్రాల్నీ ఆపోసన పట్టారు. రుగ్వేదం నుంచి రఘువంశం వరకు స్వామి వివేకానందకు కరతలామలకం.

అంతర్యామి

భగవంతుడి సృష్టిలో లోపాల్ని వెతకని వారే భాగవతోత్తములని స్వామీజీ విశ్వాసం. అందుకే ఆ సత్పురుషుడిలో దోషదర్శనం మచ్చుకైనా కనిపించకపోయేది. ఆయన ఎన్నడూ ఇతరుల్లో తప్పులను గానీ, బలహీనతలను గానీ చూసేవారు కాదు. పైగా ఎదుటివారిలో ఏ కొంచెం మంచితనం ఉన్నా ప్రోత్సహించి, నిగూఢంగా ఉన్న శక్తుల అభివ్యక్తీకరణకు అవసరమైన అనుకూలతలను కల్పించేవారు. వివేకానంద భక్తి, జ్ఞాన ప్రబోధాలు శ్రోతలను సమ్మోహపరిచేవి. అమెరికాలో ఒకసారి స్వామీజీ శ్రీకృష్ణుడి గురించి తన్మయులై ప్రసంగించారు. ఆ భాషణలోని కృష్ణలీలలకు ఆకర్షితురాలైన ఓ సంపన్న యువతి తనకున్న సంపదనంతా త్యజించారు. ఓ ద్వీపంలో ఏకాంతవాసంలో గడుపుతూ శ్రీకృష్ణధ్యానంలో నిమగ్నమైపోయారు.

'ఆధ్యాత్మిక సాధకులైనవారు మూఢభక్తులు, ఉద్రేకపరులు కాకూడదు. నైరాశ్యంలో మగ్గుతూ, నీరసించిన శరీరంతో ఉండేవారు పారమార్థికంగా పురోగమించలేరు. బలవంతులు, సంతుష్టులే ఆ మార్గంలో ముందుకు వెళ్లగలుగుతారు' అనేవారు స్వామీజీ. అభయం, అహింస, అసంగత్వం, ఆనందం... పారమార్థిక పిపాసి ప్రధాన గుణాలంటారు స్వామి వివేకానంద. ఆయన విశాల భావాలు, హేతువాద దృక్పథం, వైజ్ఞానిక దృష్టి ఆదర్శప్రాయమైనవి.

– బి. సైదులు

ప్రగతి విస్తరణకు జల మార్గాలు



జలమార్గాలు అతి ప్రాచీనమైన రవాణా సాధనాలు. రోడ్లు, రైళ్లు, విమానాలు లేని రోజుల్లో మన పూర్వీకుల ప్రయాణాలు, సరకుల రవాణా నదీనదాలు, వాగులు, వంకలు, ఏర్లు, కాలువలు తదితరాల ద్వారా సముద్రానికి అనుసంధానమై సాగేవి. ఆ జల మార్గాలు మన ఆర్థిక వ్యవస్థకు ఆయువుపట్టుగా ఉండేవి. కాలక్రమంలో కనుమరుగైన ఆ వనరులను పునరుద్ధరించుకుంటే సంపద సృష్టికి అవి ఎంతో అక్కరకొస్తాయి.

వివిధ ప్రాంతాల ప్రజల్ని, భిన్న సంస్కృతుల్ని మమేకం చేసి వర్తక, వాణిజ్య, కళాత్మక సంబంధాల్ని విస్తరించుకుంటూ సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని మన పూర్వీకులు సాకారం చేశారు. జల మార్గాల ద్వారా ద్వీపాంతర, ఖండాంతర వలసల్ని ప్రోత్సహించి ఆయా ప్రాంతాల ఆర్థిక పరిపుష్టికి పునాదులు వేశారు. ప్రాచీన రేవుల ప్రస్తావన పరంగా రాష్ట్ర రాజధాని అమరావతికి సమీపంలో 'ధరణికోట' చారిత్రక ప్రసిద్ధి పొందింది. శాతవాహనుల రాజధానిగా విలసిల్లిన పట్టణమది. దీన్ని ధాన్యకటకం అనీ పిలిచేవారు. ధరణికోట ప్రపంచ ప్రముఖ వాణిజ్య, వ్యాపార కేంద్రంగా ప్రాధాన్యం సంతరించుకుంది. రెండువేల సంవత్సరాల క్రితమే ఇక్కడ ఒక ఇన్‌ల్యాండ్ పోర్టు (భూతల రేవు) ఉన్నట్లుగా పురావస్తు సర్వేల్లో బయటపడింది. పెద్ద బండరాయిని తొలచి నిర్మించిన సొరంగం ద్వారా కృష్ణా నదిని కలుపుతూ రవాణా మార్గం ఏర్పాటు చేశారు. నదీ ముఖద్వారం దగ్గర ఈ కాలువకు ఇరువైపులా సరకుల్ని ఎత్తడానికి, దించడానికి అనువుగా కర్రలతో కట్టిన ప్లాట్‌ఫారాలు తవ్వకాల్లో వెలుగుచూశాయి. ఇప్పుడు మనం నదుల్ని అనుసంధానం చేస్తున్నట్లు, ఆ రోజుల్లో కాలువలు, నదులను సముద్రయానానికి అనువుగా ఏకీకృతం చేసినట్లు అవగతమవుతుంది. ఆగ్నేయాసియా, పశ్చిమాసియా దేశాలతో ధరణికోటకు వాణిజ్య సంబంధాలు ఉన్నట్లు రుజువయ్యింది.



సుదూర తీరాల నుంచి...

నేటి మచిలీపట్నం (నాటి మసులా) ముఖద్వారానికి ఆనుకుని ఉన్న 'ఘంటసాల' దగ్గర ప్రవహించే ఉప్పుటేరు ప్రవాహం ఆ గ్రామాన్ని సముద్రానికి కలుపుతూ ఉండేది. అప్పట్లో ఈ ప్రాంతం వస్త్ర పరిశ్రమకు ప్రసిద్ధి. కృష్ణా-గోదావరి మైదాన ప్రాంతాల్లో ధాన్యం విస్తారంగా పండేది. ఘంటసాల ఓడరేవు నుంచి ధాన్యం, వస్త్రాలు ఎగుమతి అయ్యేవి. నౌకా చిత్రాలున్న శాతవాహన నాణేలు, రోమన్ల బంగారు నాణేలు పురాతత్వ తవ్వకాల్లో విరివిగా దొరికాయి. దీన్ని బట్టి ఈ ప్రాంతం ఆ రోజుల్లోనే రోమ్ సామ్రాజ్యంతో వర్తక, వాణిజ్యం జరిపినట్లు రుజువవుతోంది. కాలక్రమేణా సముద్ర మట్టం కుంచించుకుపోవటంతో ఈ ఓడరేవు కనుమరుగైంది. కాకినాడకు సమీపంలోని పిఠాపురంలో జరిపిన తవ్వకాల్లో 'పితుండా' అనే పాత రేవు బయటపడింది. దీన్నుంచి 'చంపా' (నేటి కంపూచియా) దేశంతో వర్తక సంబంధాలు నెరిపినట్లు ఆధారాలు లభిస్తున్నాయి. వస్త్ర పరిశ్రమకు పితుండా ప్రసిద్ధి. కాకతీయ రాజైన గణపతి దేవుడు బాపట్ల సమీపంలోని మోటుపల్లి రేవు ద్వారా సముద్రయానాన్ని బాగా ప్రోత్సహించినట్లు అక్కడి శిలాశాసనమే చెబుతోంది. సరకుల రవాణాతో పాటు సముద్ర ప్రయాణికుల కోసం నౌకలు చైనా నుంచి ఇక్కడికి వచ్చేవని తెలుస్తోంది.

ఒంగోలు సమీపాన ఉన్న 'కొత్తపట్నం' క్రీకు(కయ్య)లో కృత్రిమ రవాణా కాలువ తీర ప్రాంతాన్ని సముద్రంతో కలిపేదని చరిత్ర చెబుతోంది. పెద్ద ఓడలు ఇక్కడికి వచ్చేవట. ఇక 'కోరింగ, తాళ్లరేవు'లు ప్రత్యేకతను సంతరించుకున్న పోర్టు సిటీలు. కాకినాడ రేవు కంటే ముందే ఇక్కడ వాణిజ్యం వెల్లివిరిసినట్లు తెలుస్తోంది. నౌకా నిర్మాణం, మరమ్మతుల సౌకర్యాలతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఈ వాణిజ్య కేంద్రాలు ఇంగ్లాండ్, ఫ్రాన్స్, నెదర్లాండ్స్, పోర్చుగల్ దేశాలతో సంబంధాలు నెరిపాయి. సముద్రయానానికి పనికొచ్చే భారీ తాళ్ల తయారీ కేంద్రంగా 'తాళ్లరేవు' ప్రసిద్ధి చెందింది. కోరింగతో అనుసంధానమై మయన్మార్, కలకత్తా ఓడరేవులతో పోటీపడి వర్తక వాణిజ్యాలు ఇక్కడ సాగేవని సమాచారం. 1839లో వచ్చిన పెను తుపాను ధాటికి ఈ జంట పోర్టులు కొట్టుకుని పోయాయి. 1805లో కోరింగలో ఏర్పాటు చేసిన లైట్‌హౌస్ నేడు శిథిలావస్థలో ఉంది. ఇక ఉత్తరాంధ్ర తీరంలో వంశధార నదీ ముఖద్వారాన ఉన్న 'కళింగపట్నం' ఓడరేవు చెప్పుకోదగ్గ ప్రాచీన వాణిజ్య కేంద్రం. తూర్పు గంగ్గె రాజుల రాజధానిగా, కళింగుల పట్టణంగా అది వినుతికెక్కింది. నాగర్లపేట తవ్వకాల్లో బయటపడ్డ ఆధారాల ప్రకారం 'దంతపుర' అనే మరో పురాతన రేవు ఇప్పటి శ్రీకాకుళం రైల్వేస్టేషన్‌కు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. తామ్రలిప్తి (పశ్చిమ్ బెంగాల్), మయన్మార్, శ్రీలంక, మలేసియా దేశాలతో అక్కడి నుంచి వర్తక, వ్యాపారాలు సాగిన దాఖలాలు ఉన్నాయి. ఇసుక భారీగా మేట వేయడం, నిర్వహణ లోపాలతో కాలక్రమేణా ఈ రేవులు వాడుకలో లేకుండా పోయాయి.

ఎంతో అనుకూలం

భౌగోళికంగా చూస్తే దేశం మూడు వైపులా బంగాళాఖాతం, అరేబియా సముద్రం, ఈ రెండింటిని కలుపుతూ హిందూ మహాసముద్రం వ్యాపించి ఉన్నాయి. 11,098.81 కిలోమీటర్లు పొడవైన సముద్ర తీర ప్రాంతం మనకు ప్రకృతి ప్రసాదించిన వరం. నదులన్నీ తీర మైదాన ప్రాంతాల్లో ప్రవహించి సముద్రాల్లో కలిసిపోతున్నాయి. ఈ తీరం వెంబడి 165కు పైగా చిన్న, మధ్య తరహా ఓడరేవులు ఉన్నాయి. ఏపీకి దాదాపు 1,053.07 కిలోమీటర్లు పొడవైన తీర ప్రాంతం ఉంది. మైదాన ప్రాంతాల్లో ప్రవహిస్తున్న గోదావరి, కృష్ణా, తుంగభద్ర, పెన్నా, వంశధార నదులు జాతీయ, అంతర్జాతీయ జల రవాణాకు, నౌకాయాన పరిశ్రమలకు, ఓడరేవుల నిర్మాణానికి, అంతర్గత జల, తీర ప్రాంత రవాణాకు ఎంతో అనుకూలం. గొలుసుకట్టుగా ఈ జలరవాణా వ్యవస్థను కలుపుతూ పోవాలి. నదుల అనుసంధానానికి అనుబంధంగా కాలువలూ నదుల్ని సముద్రంతో కలుపుతూ నౌకాయానానికీ పెద్దపీట వేయాలి. ఇది రాష్ట్ర, దేశ సర్వతోముఖాభివృద్ధికి విశేషంగా దోహదపడుతుంది. ఈ దిశలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఇప్పటికే వేస్తున్న అడుగులు మరింత వేగవంతం కావాలి.



డాక్టర్ శ్రీనివాసులు దాసరి

విశ్రాంత ఐఏఎస్ అధికారి

పెద్ద చదువు, సాహిత్య పరిజ్ఞానం లేకున్నా సామాజిక పరిశీలనలో కొత్తచూపు ఉంటే కవిత్వం చెప్పవచ్చన్న ధీమానిచ్చింది మినీ కవిత్వం. 'గుడిసెలే మేడల్ని కడతాయి/ అయినా మేడలే గుడిసెల్ని కొడతాయి'- అనేది ఓ మినీ కవిత. ఆర్థిక అసమానతలు, శ్రమ దోపిడీలాంటి తీవ్రమైన సామాజిక సమస్యల్ని సింపుల్‌గా ఏడు పదాల్లో చెప్పేసింది. దాన్ని రాసింది అలిశెట్టి ప్రభాకర్. ఇలాంటి చురకల్లాంటి వందలాది కవితలు ఆయన కలం నుంచి వెలువడ్డాయి. పదో తరగతి, ఇంటర్ పిల్లలకు పాఠ్యాంశాలయ్యాయి.

చిగురించే నెత్తుటి ఊహ



1954 జనవరి 12న జన్మించిన అలిశెట్టి ప్రభాకర్ జీవించింది 39 ఏళ్లే. జగిత్యాల వాసి అయిన ప్రభాకర్‌కు చిన్నప్పటినుంచి చిత్రకళ అంటే ఇష్టం. 'సాహితీ మిత్రదీప్తి' సభ్యులతో ఏర్పడిన సాన్నిహిత్యం ఆయన దృష్టిని కవిత్వంవైపు మళ్లించింది. మెల్లగా కవితలు రాసి పత్రికలకు పంపడం మొదలెట్టారు. ఒక పత్రికలో వచ్చిన ప్రభాకర్ మినీ కవిత 'వేశ్య' ఆయన ప్రతిభకు అద్దం పట్టింది. చిన్న పదాల్లో గుండెను పిండే భావాన్ని గుప్పించిన ఆయన విద్వత్తు అందరినీ అబ్బురపరిచింది. 'తను శవమై/ ఒకరికి వశమై/ తనువు పుండై/ ఒకడికి పండై/ ఎప్పుడూ ఎడారై/ ఎందరికో ఒయాసిస్సై'... అంటూ అక్షరాల్లో అణుశక్తిని కూరినట్లుండే కవిత అది. నాటి ప్రసిద్ధ సాహిత్య మాసపత్రిక 'భారతి' సైతం అలిశెట్టి కవితలను విరివిగా ప్రచురించింది.

ప్రభాకర్ ఆలోచనలెప్పుడూ శ్రమజీవులు, నిరుద్యోగ యువత, అసహాయ మహిళల చుట్టే తిరిగేవి. ఆయన కవిత్వంలో వీరి గురించే వేదన ఎక్కువగా కనిపిస్తుంది. తన రాతల ద్వారా నిర్భాగ్యుల జీవితాలకు కొంతైనా మేలు జరగాలని ఆశించేవారు. స్వయంగా చిత్రకారుడైన ప్రభాకర్ 1980లో తన కవితలకు తానే బొమ్మలు వేసి వాటిని ప్రదర్శనయోగ్యంగా మలిచారు. విద్యార్థులకు సమకాలీన సామాజిక పరిస్థితులు అర్థం కావాలన్న ఆలోచనతో వాటిని కాలేజీల్లో ప్రదర్శించేవారు. కరీంనగర్‌లో మొదలైన ఈ ప్రదర్శన హైదరాబాద్ మీదుగా దిల్లీకి చేరింది. ప్రదర్శనలకు డిమాండ్ పెరగడంతో 1983లో మకాం హైదరాబాద్‌కు మార్చారు. ఫొటో స్టూడియో ప్రభాకర్ జీవనాధారం. భార్య, ఇద్దరు పిల్లలతో నగరానికి వచ్చాక ఆ వ్యాపారం సాగక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయినా కవిత్వం రాయడం మానలేదు. కష్టాలూ కన్నీళ్లూ అన్నీ కవిత్వంతోనే చెప్పుకొన్నారు. 'కడుపు మీద/ తడిసిన అగ్గిపుల్లతో/ గీసినా/ భగ్గున మండితే/ అదేరా ఆకలి...' ఆకలిమీద రాసిన దాదాపు డజను కవితల్లో ఇదొకటి.

ప్రభాకర్‌కు పాతికేళ్ల వయసులోనే క్షయవ్యాధి సోకింది. దాంతో బాధపడుతూనే మరణానికి ముందు రోజుదాకా, సుమారు ఆరున్నరేళ్లు ఓ పత్రికలో 'సిటీలైఫ్' పేరిట కవితా శీర్షిక నిర్వహించారు. ఎర్ర పావురాలు, మంటల జెండాలు, చురకలు, రక్తరేఖ, సిటీ లైఫ్ లాంటి కవితా సంపుటాలు ఆయన జీవించి ఉన్నప్పుడే వెలువడ్డాయి. 2013లో అలిశెట్టి మిత్రులు వాటన్నింటినీ కలిపి 'అలిశెట్టి ప్రభాకర్ కవిత' పేరిట సమగ్ర పుస్తకాన్ని తెచ్చారు. 'నిర్విరామంగా నిత్యనూతనంగా/ కాలం అంచున చిగురించే నెత్తుటి ఊహను నేను/ కలల ఉపరితలం మీద కదలాడే కాంతి పుంజం నేను' అంటూ చివరి రోజుల్లో రాసుకున్న కవిత ద్వారా తాను వెళ్లిపోయినా తన కవిత్వం నిలిచి ఉంటుందనే గట్టి విశ్వాసాన్ని ప్రకటించారు ప్రభాకర్. అది నిజం కూడా!

– బద్రి నర్సన్

వస్తు సంస్కృతే అంతా...

మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యక్తుల ఆహార విహారాలు, వినియోగాల్లో చాలా మార్పులొస్తున్నాయి. 2011-12 జాతీయ నమూనా సర్వే(ఎన్ఎస్ఎస్)తో పోలిస్తే, 2023-24 గృహ వినియోగ వ్యయ సర్వే (హెచ్‌సీఈఎస్)లో గ్రామీణ, పట్టణ ప్రాంతాలు రెండింటిలో ఆహారంపై నెలవారీ తలసరి వ్యయం (ఎంపీసీఈ) తగ్గినట్లు వెల్లడైంది. అదే సమయంలో పానీయాలు, దుస్తులు, పెట్రోలు, శుభ్రపరిచే సామగ్రి వంటి వినియోగ వస్తువులు; ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, వాహనాలు, ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ పరికరాలు తదితర ఎక్కువకాలం వాడే వస్తువులపై ఖర్చు బాగా పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇది మరింత అధికంగా ఉంది. భారతీయ గ్రామాలూ, పట్టణాల్లో ఆయా కాలాల్లో ఆయా వస్తువుల పరంగా ఎంపీసీఈ... (శాతాల్లో)

గ్రామీణం

	2011–12	2023–24
ఆహారం	52.9	47
ఎక్కువకాలం వాడే వస్తువులు	11.9	13.1
వినియోగ వస్తువులు	35.2	39.9

పట్టణ ప్రాంతం

	2011–12	2023–24
ఆహారం	42.6	39.7
ఎక్కువకాలం వాడే వస్తువులు	12	12.5
వినియోగ వస్తువులు	45.4	47.8

ఆధారం: ఎన్ఎస్ఎస్, హెచ్‌సీఈఎస్

భావ విప్లవకారుడు త్రిపురనేని

'ఎన్ని పుట్టువుల్ తొల్లి నేనెత్తినానొ/ యెరుకలేకయున్న దదృష్టగరిమచేత/ అదియె కల్గిన దలిదంద్రులందరకును/ వట్టిపోవుదు దండముల్ పెట్టలేక' అంటూ తన రచనల ద్వారా సమాజంలో సరికొత్త భావవిప్లవాన్ని ప్రవేశ పెట్టేందుకు కృషి చేశారు త్రిపురనేని రామస్వామి. ఆయన కవి, నాటక రచయిత, సామాజిక తత్వవేత్త. జనవరి 15న త్రిపురనేని 139వ జయంతి, 16న ఆయన 83వ వర్ధంతి.

కృష్ణాజిల్లా అంగలూరులో 1887లో జన్మించిన త్రిపురనేని రామస్వామి న్యాయ, రాజకీయ రంగాల్లో పనిచేసినా, ప్రధానంగా రచయిత. 1910-1941 మధ్య ఆయన సమాజానికి షాక్ ట్రీట్మెంట్ ఇచ్చే రచనలు చేశారు. అష్టావధాన, శతావధానాలు చేస్తూ, వాటిని వదిలిపెట్టి కావ్యాలు, నాటకాలు రాయడం ప్రారంభించారు. కవిగా సూతపురాణం, భగవద్గీత, కుప్పుస్వామి శతకం, సూతాశ్రమగీతాలు వంటివి రాశారు. కురుక్షేత్ర సంగ్రామం, శంబుకవధ, ఖూనీ వంటి విప్లవాత్మక నాటకాలు రాశారు. ఆయన హేతువాది, ద్రావిడవాది. ప్రజలను గతానుగతిక మౌఢ్యం నుంచి మేల్కొల్పడానికి రచనలు చేశారు. పెరియార్‌గా ఖ్యాతిపొందిన ఈవీ రామస్వామి, కవిరాజుగా ప్రసిద్ధులైన త్రిపురనేని రామస్వామి సమకాలికులు మాత్రమే కాదు, ఆ ఇద్దరూ సామాజిక విప్లవకారులు.



బలమైన హేతువాదం

రామస్వామి సాహిత్యంలో మూడు పార్శ్వాలు కనిపిస్తాయి. ఒకటి- ఆధిపత్య వాదుల ప్రయోజనాలను కాపాడే గాథలను చారిత్రక, సామాజిక దృక్పథంతో పునర్వ్యాఖ్యానం చేయడం. రెండోది- మధ్యయుగాల తెలుగు జాతి వాస్తవిక పౌరుష గాథలను సాహిత్యంగా మలచడం. మూడు- సమకాలీన సామాజిక వాస్తవికతకు విమర్శనాత్మకంగా సాహిత్య రూపం కలిగించడం. రామస్వామిది గతానుగతిక దృష్టి కాదు. ప్రత్యామ్నాయ దృష్టి. భారతంలో పాండవుల మార్గం పూర్తిగా ధర్మపక్షం కాదని వాదించి చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిని ఒప్పించారు. ధర్మరాజు అయిదూళ్లు ఇవ్వాలని అడగడం వెనక కారణాలను తనదైన శైలిలో విశ్లేషించారు. కురుక్షేత్ర సంగ్రామం నాటకంలో నారాయణశర్మ అనే పాత్రను కల్పించి, మరణానంతర సుఖభోగాల భావనను దెప్పిపొడుస్తారు. శంబూకుణ్ని ఉత్తమ మానవునిగా, వేనరాజును గొప్ప మానవతావాదిగా త్రిపురనేని చిత్రించారు. మతం పేరుతో జరిగే ఘోరాలను ఆయన తీవ్రంగా విమర్శించారు.

ఒక పాత వ్యవస్థలోని కాలం చెల్లిన ధోరణులను పట్టిచూపి, కొత్త వ్యవస్థ ఏర్పడటానికి అవసరమైన భావాలను ప్రచారం చేసేవాళ్లు భావ విప్లవకారులు. త్రిపురనేని అలాంటివారే. తెలుగువారి వాస్తవిక చరిత్ర, తెలుగు భాష, తెలుగు నేల అంటే ఆయనకు పరమ ప్రీతి. పల్నాటి వీరచరిత్రలోని కారెంపూడి యుద్ధం ఆయన దృష్టిలో చాలా ఉదాత్తమైంది. శ్రీకృష్ణుడు అర్జునుడికి భగవద్గీతను బోధించినట్లు బ్రహ్మనాయుడు బాలచంద్రుడికి తనదైన గీతను బోధించినట్లు కల్పించారు. కురుక్షేత్ర యుద్ధం దాయాదుల ఆస్తుల కోసం జరిగితే, కారెంపూడి యుద్ధం దాయాదుల మిషతో, బ్రహ్మనాయుడి సంఘ సంస్కరణాత్మకమైన చాపకూడు (సహపంక్తి భోజనం) కారణంగా జరగడం ఆయన దృష్టిలో ప్రత్యేకమైంది. జ్ఞానం సార్వత్రికం కావాలన్నది త్రిపురనేని ఆకాంక్ష. ఆయన హేతువాద బలమంతా సూతపురాణంలో కనిపిస్తుంది. తన గీతలో మతాలు పుట్టకుండా ఉంటే అన్ని మారణకాండలు జరిగేవి కావని అంటారు. ఆయన సత్యవాది, హేతువాది, శాస్త్రీయవాది.

మంచి సమాజం కోసం...

'శాస్త్రములెల్ల చదివి విజ్ఞాన మెరిగి/ సంశయింపక సర్వదా చర్చజేసి/ నిజమెరుంగవలయునిది నేర్వకున్న/ మూఢవిశ్వాసమున జేటుమూడుచుండు' అని త్రిపురనేని బోధించారు. ఇప్పుడీ మౌఢ్యం వెయ్యి రెట్లు పెరిగిపోవడం విషాదం. కుప్పుస్వామి, ధూర్తమానవ శతకాలను కూడా ఆయన ఆ కాలంనాటి మూఢత్వాన్ని విమర్శించడానికే రాశారు. స్వాతంత్ర్య పూర్వకాలపు భారతీయ జీవితంలోని అనారోగ్యకర ధోరణులను తెలియజెప్పి వాటిని నిర్మూలించి మంచి సమాజ నిర్మాణ ఆవశ్యకతను నొక్కిచెప్పడమే త్రిపురనేని భావవిప్లవోద్దేశం. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆర్థిక రాజకీయ విప్లవాల కన్నా ముందు భారతీయ సమాజంలో సాంఘిక విప్లవం రావాలన్నారు. త్రిపురనేని ఉద్యమం అదే. భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో మన దేశీయుల్లో ఆంతరంగికంగా రావాల్సిన భావ స్వాతంత్ర్యాన్ని ఆయన ప్రచారం చేశారు. అలాగని వలసపాలనకు వ్యతిరేకంగా జరుగుతున్న రాజకీయ ఉద్యమాన్ని త్రిపురనేని వ్యతిరేకించలేదు. సమర్థించారు. 'వీరగంధము తెచ్చినారము/ వీరుడెవ్వడొ తెల్పుడీ/ పూసిపోదుము మెడను వైతుము/ పూలదండలు భక్తితో' అని ఆహ్వానించారు. 1943లో ఆయన తుది శ్వాస విడిచారు. త్రిపురనేని కాలం నాటికి ఆయన సాహిత్యం ఎంత అవసరమో, అనేకరకాలుగా నేడు అంతకన్నా ఎక్కువ అవసరం.



ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత

నిజమైన అబద్ధం..!

రచిత్, త్రినాథ్, పాషా, శ్రీనిత్య ఎనిమిదో తరగతి చదువుతున్నారు. వీళ్లు మంచి స్నేహితులు. చాలా బాగా చదువుతారు కూడా. రచిత్ అప్పుడప్పుడూ అబద్ధాలు చెబుతూ అందరినీ ఆట పట్టిస్తుంటాడు. మిగిలిన వాళ్లు కూడా తన మాటలను సరదాగా తీసుకుంటారు. ఒకరోజు స్కూల్లో ఆటలపోటీలు జరుగుతున్నాయి. కొంతమంది పిల్లలు క్రికెట్ ప్రాక్టీస్ చేస్తున్నారు. అందులో రచిత్ ఫీల్డింగ్ చేస్తున్నాడు. చెట్ల మధ్యలో పడిన బంతిని తీసి విసిరాడు. తరవాత.. 'నా చేతికేదో కుట్టింది. చాలా మంటగా ఉంది!' అని గట్టిగా అరిచాడు. 'తన మాటలేం నమ్మకండి. నిన్న కూడా ఇలాగే చేశాడు. అందరం దగ్గరికి వెళ్లగానే నవ్వేశాడు' అన్నారు క్రికెట్ ఆడుతున్న మిగతా విద్యార్థులు. దాంతో మళ్లీ ఆట ఆడటం మొదలుపెట్టారు. అదంతా చూస్తున్న శ్రీనిత్య, పాషా, త్రినాథ్ పరిగెత్తుకుంటూ వచ్చారు. విషయం తెలుసుకుని పి.టి. సర్ సాయంతో ఆసుపత్రికి తీసుకెళ్లారు. రచిత్‌కు తేలు కుట్టిందని చెప్పి.. నొప్పి తగ్గేలా ఇంజక్షన్ ఇచ్చారు.



కాసేపు విశ్రాంతి తీసుకోమని చెప్పారు. రచిత్‌కు కాస్త తగ్గే వరకూ ఫ్రెండ్స్ అంతా అక్కడే ఉన్నారు. రచిత్ నిద్ర లేచాక.. 'మీకు చాలా థాంక్స్! అందరూ ఎప్పట్లాగే సరదాగా అంటున్నాను అనుకున్నారు. కానీ మీరు నేను చెప్పింది నమ్మి హాస్పిటల్‌కి తీసుకొచ్చారు. లేకపోతే చాలా ఇబ్బంది పడేవాణ్ని' అని ఏడుస్తూ అన్నాడు. 'మనం మంచి ఫ్రెండ్స్ కదా! నువ్వు ఎప్పుడు ఎలా మాట్లాడతావో మాకు తెలుసు! కానీ అందరికీ అలా తెలియదు' అన్నాడు పాషా. 'ఇదంతా చూస్తుంటే టీచర్ చెప్పిన నాన్నా, పులి కథ గుర్తొస్తుంది. సరదాగా అబద్ధం చెబితే బాగుంటుంది అనిపిస్తుంది. మనం చెప్పేది నిజమైనా, ఎవరూ నమ్మని పరిస్థితి వస్తేనే ఇబ్బందుల్లో పడతాం. ఈరోజు అదే జరిగింది. ఇంకోసారి ఎప్పుడూ అలా ప్రవర్తించకు' అని అన్నారు త్రినాథ్, శ్రీనిత్య. అలాగేనంటూ బదులిచ్చాడు రచిత్. ఇక అందరూ కలిసి మళ్లీ స్కూల్‌కి బయలుదేరారు.

– సయ్యద్ షఫీ

అవునా? కాదా?

ఇక్కడ ఇచ్చిన వాక్యాలను చదివి అవునో, కాదో చెప్పండి చూద్దాం.

1. లీప్ ఇయర్‌లో 367 రోజులు ఉంటాయి.
2. నిమ్మకాయలో విటమిన్ 'సి' ఉంటుంది.
3. పట్టణాల కంటే నగరాలు పెద్దవి.
4. మొసలికి పది దంతాలు మాత్రమే ఉంటాయి.

జవాబు: 1.తప్పు 2.ఒప్పు 3.ఒప్పు 4.తప్పు




స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని బీజేవైఎం ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో 5 కి.మీ. మారథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు. రాఘవయ్య పార్కు వద్ద స్వామి వివేకానంద విగ్రహానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించి, మారథాన్‌లో భాగస్వాములయ్యారు. - ఈనాడు, అమరావతి

పండగ ప్రభావం.. అంతా ట్రాఫిక్‌మయం..

సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ప్రాంతాల నుంచి భారీగా కార్లు, ఇతర వాహనాల్లో ప్రయాణికులు తమ స్వగ్రామాలకు వెళ్తున్నారు. షాపింగ్, వివిధ పనుల నిమిత్తం స్థానికులు కూడా తమ వాహనాలపై నగరంలోకి రాకపోకలు సాగిస్తున్నారు. ఆ క్రమంలో విజయవాడ బెంజ్ సర్కిల్ మొదలుకొని రేడియో స్టేషన్ వరకు బందరు రోడ్డుపై ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. - ఈనాడు, అమరావతి



యువ సంకల్పం.. శుభ సంకేతం..



నేడు జాతీయ యువజన దినోత్సవం

కెరటం నాకు ఆదర్శం..
లేచి పడుతున్నందుకు కాదు...
పడినా.. తిరిగి లేస్తున్నందుకు..

'లక్ష్యం కోసం అలుపెరగక శ్రమిస్తుంటే.. నేడు కాకపోయినా రేపైనా విజయం సాధ్యమవుతుంది'..

స్వామి వివేకానంద మాటలను నేటి యువత అక్షరాలా నిజం చేస్తోంది. నిరంతర కృషితో అద్వితీయ విజయాలు సాధిస్తున్నారు. ఒక్కో రంగంలో తమదైన ముద్ర వేస్తున్నారు. చిన్న ఊరి నుంచి ప్రయాణం మొదలుపెట్టి అంతర్జాతీయ వేదికలపై దేశం గర్వించేలా చేస్తున్నారు.

అనర్గళ ప్రసంగం.. ఆమె సొంతం

సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో ఫార్మాడీ చదువుతున్న నాయుడు తేజస్విని ఏ అంశంపైనైనా అనర్గళంగా ప్రసంగిస్తూ బహుమతులు సాధిస్తోంది. ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులోని చేబ్రోలు హనుమయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలో ప్రథమ, హైదరాబాద్‌లోని విష్ణు ఇన్‌స్టిట్యూట్‌లో ఆఫ్ ఫార్మాస్యూటికల్‌లో నిర్వహించిన దక్షిణ భారత స్థాయి పోటీలో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జాతీయ స్థాయిలో నిర్వహించిన వక్తృత్వం పోటీలో ప్రత్యేక బహుమతి సాధించింది. విజయవాడలో స్టెప్ ఎహెడ్ ఫర్ ఈక్వాలిటీ సంస్థ ఆధ్వర్యంలో మహిళా - లింగ సమానత్వం అనే అంశంపై, సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉపన్యాస పోటీలో ప్రథమ స్థానాలు కైవసం చేసుకుంది. పరిశోధనలు కూడా చేస్తోంది. శాస్త్రవేత్త కావాలనేది తన లక్ష్యమని చెబుతోంది.



అలపై ఈత.. ఇలపై ఘనత..

విజయవాడ (సూర్యారావుపేట), న్యూస్‌టుడే

కనుచూపు మేరలో అఖండమైన జలసిరి, కనిపించని నేల, ఉవ్వెత్తున ఎగిసే అలలతో నిండిన సముద్రాలను చూస్తే ఎంతటి ఈతగాడికైనా ఒళ్లు జలదరిస్తుంది. అలాంటి సముద్రాలను అవలీలగా ఈదేస్తున్నారు విజయవాడకు చెందిన హెడ్ కానిస్టేబుల్ మోతుకూరి తులసీ చైతన్య.



రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకుంటున్న తులసీ చైతన్య

ఇక ఇంగ్లిష్ ఛానల్, కేటలీనా ఛానల్, 20 బ్రిడ్జెస్‌ను ఈదేసి ట్రిపుల్ క్రౌన్ సంపాదించడమే అంటే చాలా గొప్పే. అరుదైన ఈ రికార్డులను సొంతం చేసుకుని భారతదేశానికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చారు. ప్రపంచ పోలీస్ క్రీడల్లో 14 పతకాలు సాధించడమే కాకుండా జాతీయ స్థాయి పోలీసు క్రీడాపోటీల్లో పాల్గొని 24 బంగారు పతకాలు, 23 వెండి, 9 కాంస్య పతకాలు పొందారు. **ఐపీఎస్‌ల ప్రోత్సాహంతో..** 2012లో కానిస్టేబుల్‌గా చేరారు. ఆయన ప్రతిభను గుర్తించిన ఐపీఎస్ అధికారి రాజీవ్‌త్రివేది అండగా నిలిచారు. పలువురు ఐపీఎస్ అధికారుల ప్రోత్సాహంతో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని ప్రపంచ పోలీస్ క్రీడల్లో భారత్ సత్తా చాటారు. జాతీయ పోలీస్ క్రీడల్లో ఏపీ తరఫున పతకాలు గెలిచారు. **రాష్ట్రపతి నుంచి అవార్డు:** సముద్రాల్లో ఐదు ఛానల్స్‌ను ఈదిన ఏకైక వ్యక్తిగా తులసీ చైతన్య అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు. ఆయన్ని భారత ప్రభుత్వం 2024లో టెన్జింగ్ నార్కే నేషనల్ ఎడ్వెంచర్ అవార్డుకు ఎంపిక చేసింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డు అందుకున్నారు. విజయవాడ పోలీస్‌శాఖ కీర్తిప్రతిష్ఠలు జాతీయ స్థాయికి తీసుకెళ్లారు.

మైలురాళ్లు.. కి.మీ.లలో

- ఇంగ్లిష్ ఛానల్ (ఇంగ్లండ్ - ఫ్రాన్స్) 35
- జిబ్రాల్టర్ జలసంధి (స్పెయిన్-మొరాకో) 15
- నార్త్ ఛానల్ (ఐర్లాండ్- స్కాట్‌లాండ్) 35
- కేటలీనా ఛానల్ (కేటలీనా దీవి- కాలిఫోర్నియా) 35
- న్యూజిలాండ్ కుక్ జలసంధి (నార్త్-సౌత్ ఐలాండ్ వరకు) 24
- మన్‌హట్టన్‌లోని 20 వంతెనలు 48

పరిశోధనలు చేస్తూ... బహుమతులు సాధిస్తూ...

విజయవాడ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల విద్యార్థినులు వి.తేజశ్రీ, ఎస్.శివశ్రీ, టి.భార్గవి కృష్ణ, వై.షారన్ సాత్విక ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో పరిశోధనలు చేశారు. ★ మధుమేహం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవాలంటే తప్పకుండా రక్త పరీక్ష కేంద్రానికి వెళ్లి పరీక్ష చేయించుకోవాలి. అలా వెళ్లకుండా ఏఐ పరిజ్ఞానంతో మొబైల్‌లోనే హెచ్చుతగ్గులు తెలుసుకునేలా యాప్ రూపొందించారు. ★ తక్కువ పరిమాణంలో మాత్రలు తయారు చేశారు. ఫలితంగా తక్కువ డోస్‌లోనే వ్యాధి నుంచి ఉపశమనం కలిగేలా చేశారు. ★ దీర్ఘకాల వ్యాధిగ్రస్థులు రోజూ మాత్రలు వేసుకోకుండా వారానికి ఒక్కసారి వేసుకుంటే సరిపోయేలా మరో పరిశోధన చేశారు. ★ కొన్నిసార్లు యాంటీబయోటిక్స్ వాడినా బ్యాక్టీరియా తగ్గదు. అలాంటి బ్యాక్టీరియాని ఏఐ పరిజ్ఞానంతో తగ్గించేలా చర్యలు తీసుకున్నారు. ★ జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సోకకుండా ముందస్తు హెచ్చరికలు జారీ చేసే యాప్ రూపొందించారు. ఈ పరిశోధనలపై పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు చేశారు. ★ ఇటీవల ముంబయి, విశాఖపట్నంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఆర్టికల్ రైటింగ్, తమిళనాడులోని పెరియార్, గుంటూరులోని చలపతి కళాశాలల్లో జరిగిన అంతర్జాతీయ సదస్సుల్లో తమ పరిశోధనను ప్రదర్శించి బహుమతులు సాధించారు. నూతన ఆవిష్కరణలు సమాజానికి అందించాలనేది తమ లక్ష్యమని చెబుతున్నారు. విజయవాడ సిటీ, ఉయ్యూరు రూరల్- న్యూస్‌టుడే



కండలు తిరిగిన కొండలు



న్యూస్‌టుడే, విజయవాడ క్రీడలు

ఒక వైపు జిమ్‌లో పలువురికి శిక్షణఇస్తూ.. మరో వైపు తానూ సాధన చేస్తూ బాడీ బిల్డింగ్‌లో ప్రతిభచాటుతున్నారో ఓ యువకుడు. గుడ్లవల్లేరు మండలం వెణుతిరిమిల్లికి చెందిన నరసింహారావు, రమాదేవి దంపతుల కుమారుడు కొప్పినేని కొండలు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా డిగ్రీ మధ్యలోనే ఆపేశారు. ఉద్యోగం కోసమని పొట్ట చేతపట్టుకొని 2013లో విజయవాడ నగరానికి వచ్చారు. యనమలకుదురులో ఉంటూ కృష్ణానదీ తీరంలో ఇసుక లోడ్ చేయడానికి కూలీగా పనిచేశారు. కానిస్టేబుల్ ఉద్యోగం కోసం ఐజీఎంసీ స్టేడియంలో సాధన చేశారు. కానూరులో రోజూ జిమ్ చేసేవారు. ఎత్తు 5.10 అడుగులు, బరువు 75 కేజీలతో మంచి దేహదారుఢ్యం కలిగి ఉండేవారు. శిక్షకుడు అశోక్ సూచనలతో బాడీ బిల్డింగ్ పోటీలకు సన్నద్ధమయ్యారు. 2014లో రాజమహేంద్రవరంలో రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలో తలపడి రజత పతకం కైవసం చేసుకున్నారు. అప్పటి నుంచి పలు జిల్లా, రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో పతకాలు గెలిచారు. తలపడిన ప్రతి టోర్నీలోనూ పతకం పట్టారు. ఇటీవల మహారాష్ట్ర శిర్డీలో నిర్వహించిన మిస్టర్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీల్లో కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. ఇప్పటికి రాష్ట్ర స్థాయిలో 11, జాతీయ స్థాయిలో రెండు పతకాలు గెలుపొందారు. 2021లో వివాహం చేసుకున్నారు. ఇద్దరు పిల్లలు. అంతర్జాతీయ బాడీ బిల్డింగ్ పోటీల్లో దేశానికి పతకం తీసుకు రావాలనే లక్ష్యంతో సాధన చేస్తున్నారు.

ఎలక్ట్రిక్ కారు దగ్ధం

పటమట: ఎలక్ట్రిక్ కారు దగ్ధమైన ఘటన ఆదివారం విజయవాడలో చోటుచేసుకుంది. కానూరుకు చెందిన వైద్యుడు గౌతమ్‌రాజ్ ఎలక్ట్రిక్ కారులో ఆదివారం తాడేపల్లి వెళ్లి తిరిగి వస్తున్నారు. రాత్రి 8 గంటల సమయంలో బెంజ్ సర్కిల్ సిగ్నల్ దాటిన తర్వాత కారు ఇంజిన్ నుంచి పొగలు రావడాన్ని గమనించి సర్వోత్తమ గ్రంథాలయం సమీపంలోని బస్టాప్ వద్ద కారు ఆపి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఇంతలో కారు దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు.



'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్ : జిల్లాలో 12వ తేదీ సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/నగరపాలక సంస్థ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌లో వినతి పత్రాలు స్వీకరించనున్నట్టు వివరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్ అందుబాటులో ఉంటుందని వివరించారు.

వెబ్‌సైట్‌లోనూ: అర్జీలను మీకోసం వెబ్‌సైట్ Meekosam.ap.gov.in లోనూ దాఖలు చేసుకోవచ్చని సూచించారు. అర్జీల స్థితి, సంబంధిత సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నంబరుకు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ వివరించారు.

ర్యాలీ కాదు.. ఖాళీ..

ఇదేంటి వాహనాలన్నీ రహదారిపై ర్యాలీగా వెళుతున్నాయి అనుకుంటున్నారా.. అదేమిలేదండీ. ఈ ఏడాది సంక్రాంతికి నగరవాసులంతా పల్లెలకు వెళ్లిపోయారు. దీంతో ప్రైవేటు ట్రావెల్స్ వాహనదారులు విజయవాడ రామవరప్పాడు రింగు వద్ద ఇలా ఖాళీగా ఉన్నారు. - ఈనాడు అమరావతి



పుస్తక మహోత్సవానికి.. పోటెత్తారు



ఈనాడు, అమరావతి

36వ విజయవాడ పుస్తక మహోత్సవం నేటితో ముగుస్తుంది. జనవరి 2 నుంచి ఆరంభమైన ప్రదర్శన.. 12 వరకు మొత్తం 11 రోజులు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకూ మొత్తం ఆరు లక్షల మందికి పైగా పుస్తక మహోత్సవాన్ని సందర్శించినట్టు నిర్వాహకులు తెలిపారు. సుమారు రూ.7కోట్లకు పైగా పుస్తకాల విక్రయాలు జరిగి ఉంటాయని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి భారీ స్పందన వచ్చింది. పుస్తక ప్రియులు నిత్యం పెద్దఎత్తున తరలివచ్చారని విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం(వీబీఎఫ్ఎస్) అధ్యక్షుడు టి.మనోహర్‌నాయుడు తెలిపారు. * మహోత్సవం 10వ రోజు ఆదివారం కూడా చిన్నాపెద్ద అంతా కలిసి మధ్యాహ్నం ఒంటి గంట నుంచే తండోపతండాలుగా వచ్చారు. రాత్రి 9గంటల వరకూ ప్రదర్శన కిక్కిరిసిపోయింది. పార్కింగ్ కూడా ఆదివారం స్తంభించిపోయింది. విజయవాడ నగరం మధ్యలో ఉన్న ఇందిరా గాంధీ స్టేడియం వేదికగా దొరకడంతో పుస్తకప్రియులు వచ్చి వెళ్లేందుకు మరింత అనువుగా మారింది. ఆఖరి రోజు కూడా పెద్దసంఖ్యలో సాహిత్య అభిమానులు, పుస్తక ప్రియులు తరలిరానున్నారు.

నేడు ముగింపు సభ..

సోమవారం సాయంత్రం 6గంటలకు పుస్తక మహోత్సవం ముగింపు సభ జరుగుతుంది. అతిథులుగా కలెక్టర్ జి.లక్ష్మీశ, ఐపీఎస్ అధికారి ఎ.రవికృష్ణ, అధికార భాషా సంఘం అధ్యక్షులు త్రివిక్రమరావు, తెదేపా నాలెడ్జ్ సెంటర్ ఛైర్మన్ గురజాల మాల్యాద్రి పాల్గొంటారు. సభా సమన్వయకర్తగా వీబీఎఫ్ఎస్ అధ్యక్షుడు టి.మనోహర్‌నాయుడు వ్యవహరిస్తారు.

పెద్ద పండక్కి.. ప్రయాణ కష్టాలు

★ బస్సుల్లేక..ఛార్జీల భారం మోయలేక బండిబాట

★ విజయవాడ-హైదరాబాద్ ఎన్‌హెచ్‌పై ప్రమాదకర ప్రయాణం



❖ ఈయన పేరు సూర్య. హైదరాబాద్‌లో చెల్లితో కలిసి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. 'ఆర్టీసీ బస్సుల్లో టిక్కెట్లు దొరకలేదు. ప్రైవేటు ట్రావెల్స్‌లో చూస్తే ఇద్దరికీ కలిపి రూ.7వేల వరకు ఖర్చవుతోంది. అంత డబ్బులు పెట్టలేక, పైగా ట్రాఫిక్ సమస్య కూడా ఉండదని బండిపైనే వస్తున్నామని' తెలిపారు.



❖ విజయవాడకు చెందిన సందీప్ హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. ఆయన స్నేహితుడిని పండగకు తీసుకువెళ్లాలని బస్సు టికెట్ల కోసం ప్రయత్నించగా ఖాళీలు లేవు. దీంతో ఇద్దరూ కలిసి ఇలా బండిపై వస్తున్నారు.

పెద్ద పండగకు హైదరాబాద్ నుంచి వచ్చే వారిని ప్రయాణ కష్టాలు వెంటాడుతున్నాయి. అరకొరగా బస్సులు నడపడం..ప్రైవేటు ట్రావెల్స్‌లో అడ్డగోలుగా రేట్లు పెట్టడంతో ఆ భారం తట్టుకోలేక ద్విచక్ర వాహనాల పైనే హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వస్తున్నారు. ఓ వైపు చలి..విపరీతమైన ట్రాఫిక్‌లో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు.

అడుగడుగునా ప్రమాదమే..

★ కొందరు భార్య, పిల్లలను సైతం ద్విచక్ర వాహనాలపై తీసుకొస్తున్నారు. వీరిలో చాలా మంది హెల్మెట్ కూడా లేకుండా నిర్లక్ష్యంగా వస్తున్నారు. ★ ప్రమాదాల నివారణలో ఈ ఏడాది సైతం ఆర్టీసీ, రవాణాశాఖ, ఎన్‌హెచ్ ఇలా అన్ని శాఖలు విఫలమయ్యాయి. హైదరాబాద్ నుంచి విజయవాడకు పీఎన్‌బీఎస్ కేవలం 24 ప్రత్యేక బస్సులు మాత్రమే కేటాయించింది. సంక్రాంతికి వేలాదిగా తరలివచ్చే ప్రయాణికులకు ఇవి ఏమాత్రం చాలవు. ★ ఇదే అదునుగా ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు అడ్డంగా రేట్లు పెంచేశారు. ఒక్కో టికెట్ రూ.3వేలకు పైగా అమ్ముతున్నారంటే దోపిడీ ఏ స్థాయిలో ఉందో తెలుస్తోంది. అయినా రవాణాశాఖ కన్నెత్తి చూడడం లేదు. ఈ ఎన్‌హెచ్‌లో నందిగామ వైజంక్షన్ నిర్మాణం పూర్తి చేయకపోవడంతో గత రెండు రోజులుగా అక్కడ భారీగా ట్రాఫిక్ నిలిచిపోతోంది. రాత్రుళ్లు ఇక్కడ ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ★ ఆర్టీసీలో టికెట్లు లేక, ప్రైవేటు దందా తట్టుకోలేక ద్విచక్రవాహనాలపై భారీగా వస్తున్నారు. రోజుకు దాదాపు 50వేల వాహనాలు ప్రయాణిస్తుంటే అందులో 10 నుంచి 15శాతం ద్విచక్ర వాహనాలే. ఇందులో ఎక్కువ హార్స్ పవర్ ఉన్న వాహనాలే అధికం. గంటకు 100 కి.మీ వేగంతో వెళ్తున్నారు. ఒక్కో వాహనంపై ఇద్దరు, లగేజ్ బ్యాగులు వేసుకుని, మంచులో వాహనాలు నడుపుతున్నారు.

– ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే-నందిగామ, కంచికచర్ల

బాంద్రా నుంచి... బంగాళాఖాతం తీరానికి..



సంక్రాంతికి సొంతూరికి కార్లలో, బస్సుల్లో, రైళ్లల్లో లేదంటే ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారుంటారు. కానీ పశ్చిమ గోదావరి జిల్లా గొల్లపాలేనికి చెందిన 48 ఏళ్ల ముదునూరి ఆంజనేయ వర్మ పర్యావరణ హితం, వ్యక్తిగత ఆరోగ్య ప్రాముఖ్యాన్ని చాటిచెప్పేలా సైకిల్ ప్రయాణం చేపట్టారు. ముంబయి బాంద్రాలో నావల్ డాక్‌యార్డులో ఉద్యోగం చేస్తున్న ఆయన ఈ నెల 2న సైకిల్ ప్రయాణాన్ని ప్రారంభించారు. దాదాపు 1200 కి.మీ దూరాన్ని రోజూ 100 కిమీ మేర ప్రయాణం చేస్తూ, రాత్రి వేళ దగ్గరలోని హోటళ్లలో బస చేస్తూ వస్తున్నారు. జాతీయ రహదారిపై వెళ్తూ ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో ఆదివారం కొద్దిసేపు ఆగిన ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. తన ప్రయాణంలో మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలను దాటుకుంటూ వచ్చానని, ఈ నెల 13 లోగా తన స్వగ్రామానికి చేరుకుంటానని తెలిపారు. నేటి యువత శారీరక శ్రమకు దూరమవుతున్నారని, మంచి ఆరోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు సైక్లింగ్ చాలా మంచిదని చెప్పారు. - న్యూస్‌టుడే, కంచికచర్ల

సిద్ధమవుతున్న కోడి పందేల శిబిరాలు



కేసరపల్లిలో..

ఏటా బాపులపాడు మండలం అంపాపురంలో నిర్వహించే నియోజకవర్గ స్థాయి శిబిరాన్ని తాజాగా రామవరప్పాడు, కేసరపల్లికి మార్చారు. అసాంఘిక క్రీడల నిర్వహణలో పట్టున్న బెంగళూరుకు చెందిన వ్యక్తిని రంగంలోకి దించి ప్రత్యేకంగా క్యాసినో తరహా ఏర్పాట్లు చేస్తుండడం గమనార్హం.

–ఈనాడు, అమరావతి, గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే

మద్యం మత్తులో.. రౌడీషీటర్ల బీభత్సం

బబ్బూరి గ్రౌండ్స్‌లో నలుగురిపైకి దూసుకెళ్లిన కారు ★ బాలుడి పరిస్థితి విషమం

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - భవానీపురం: అసలే కరుడుగట్టిన రౌడీషీటర్లు.. ఆపై మద్యం మత్తులో తూగుతున్నారు.. దీనికి తోడు కారు ఎక్కి నానా బీభత్సం సృష్టించారు. నగరంలో రౌడీషీటర్లు మరోసారి రెచ్చిపోయారు. మద్యం మత్తులో బబ్బూరి గ్రౌండ్స్ వద్ద కారును నిర్లక్ష్యంగా, అతివేగంగా నడిపి బీభత్సం సృష్టించారు. నలుగురి పైకి కారును ఎక్కించారు. వీరిలో తీవ్రంగా గాయపడిన బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. రౌడీషీటర్లను వెంటాడి పోలీసులు గుంటూరు జిల్లా తాడేపల్లి వద్ద ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి..



బబ్బూరి గ్రౌండ్స్‌లో వేగంగా వెళ్తున్న కారు



గాయపడిన వారిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న స్థానికులు

అదేమని అడిగితే.. ఢీకొట్టి వెళ్లారు: ఆదివారం సాయంత్రం రౌడీషీటర్లు పెద్ద చిచ్చా, చిన్న చిచ్చా, దినేష్‌లతో పాటు స్నేహితులు భార్గవ్, మహేష్‌లతో కలిసి ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ కారులో పున్నమిఘాట్ సమీపంలో రహదారిపైకి వచ్చారు. ఐదుగురు కలిసి కారులో అతివేగంగా రౌండ్లు వేస్తున్నారు. దీనిని గమనించిన స్థానికులు వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న పిల్లలు తిరుగుతున్న ప్రదేశంలో అతివేగంగా రౌండ్లు వేయడం ఏమిటని నిలదీశారు. అంతలో కారులో నుంచి చిన్న చిచ్చా దిగి అక్కడ ఉన్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నేనెవరినో తెలుసా..? రౌడీషీటర్‌ను అంటూ బెదిరించాడు. ఆపై కారులో ఉన్న పెద్ద చిచ్చా కారును వేగంగా ముందుకు పోనిచ్చాడు. దీంతో రహదారిపై కారు పఠాన్ రిహాన్‌ఖాన్(10), మీడియా విలేకరి నాగేంద్ర, మరో ఇద్దరు గాయపడ్డారు. రిహాన్‌ఖాన్ స్థానికంగా ఉన్న పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. ఐస్‌క్రీం తినేందుకు పున్నమి ఘాట్ వద్దకు తండ్రితో కలిసి వచ్చాడు. అదే సమయంలో కారు వేగంగా దూసుకుని వచ్చింది.



చికిత్స పొందుతున్న బాలుడు రిహాన్‌ఖాన్

✪ రహదారి వెంబడి నిలబడి ఉన్న వారందరిని కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో పోలీసులకు స్థానికులు సమాచారం ఇవ్వగా వారొచ్చి విచారణ చేపట్టారు. తీవ్రంగా గాయపడిన రిహాన్‌ఖాన్‌ను గొల్లపూడిలోని ఆంధ్రా ఆసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతున్నాడు. పోలీసులు సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా కారు వివరాలను సేకరించారు. కారు రామవరప్పాడుకు చెందిన రాజేష్‌కు చెందిన వాహనంగా గుర్తించారు. పెద్ద చిచ్చా, చిన్న చిచ్చాలపై రెండో పట్టణ స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. దినేష్‌పై భవానీపురం పీఎస్‌లో రౌడీషీట్ ఉంది. పెద్ద చిచ్చాకు ఒళ్లంతా బ్లేడ్ గాట్లు, టాటూలతో ఇన్‌స్టాగ్రాంలో రోజూ రీల్స్ చేస్తుంటాడు. భయపెట్టే విధంగా డైలాగ్‌లతో అతను రీల్స్ చేస్తుంటాడు. గతంలో కూడా పోలీసులను ఉద్దేశిస్తూ రీల్స్ చేశాడు.

తాడేపల్లిలో దొరికారు.. సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు.. కారు వారధి మీదుగా గుంటూరు జిల్లాలోకి వెళ్లినట్లు గుర్తించారు. ఎట్టకేలకు కారును రాత్రి 11 గంటల సమయంలో తాడేపల్లిలో గుర్తించారు. చిన్న చిచ్చా, భార్గవ్‌లను అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన ముగ్గురు పారిపోయినట్లు తెలిసింది. వారి కోసం టాస్క్‌ఫోర్స్ పోలీసులు గాలిస్తున్నారు. కారును వీరు ఎందుకు వినియోగిస్తున్నారు అన్న విషయాన్ని పోలీసులు ఆరా తీస్తున్నారు.

సుదూరాల నుంచి.. పుస్తకాన్ని వెతుక్కుంటూ..!

భారీగా తరలివస్తున్న సందర్శకులు

ఈనాడు డిజిటల్, అమరావతి

విజయవాడ పుస్తక మహోత్సవానికి సుదూర ప్రాంతాల నుంచి కూడా పెద్దసంఖ్యలో సాహితీ అభిమానులు తరలివచ్చారు. చివరి రెండు రోజులు మరింత భారీగా పెరిగారు. పుస్తక ప్రియులతో ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానం కళకళలాడింది. సంక్రాంతి సెలవులకు ఇతర నగరాలు, రాష్ట్రాల నుంచి వచ్చినోళ్లు కూడా తరలివస్తున్నారు. తమకు నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేసి వెళుతున్నారు.



కేమన్ ద్వీపం నుంచి వచ్చాను: చంద్రశేఖర్



నేను క్యూబా సమీపంలోని కేమన్ ద్వీపంలో ఉంటాను. అక్కడ వైద్యుడిగా పని చేస్తున్నాను. పనిమీద విజయవాడ రావడంతో.. ఇక్కడ పుస్తక మహోత్సవం జరుగుతోందని తెలుసుకొని వచ్చాను. ఈ పుస్తకాలను చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. మా అమ్మ కోసం శబ్దరత్నాకరం, శంకరనారాయణ నిఘంటువు తీసుకున్నాను.

ఇన్ని పుస్తకాలు ఒకేచోటా: రామారావు



మాది విజయవాడ. పుస్తక మహోత్సవానికి ఇంతమంది తరలిరావడం ఆనందంగా ఉంది. మా పిల్లలు పక్క రాష్ట్రంలో స్థిరపడ్డారు. వారు ఇక్కడ ఉంటే వారినీ పుస్తక మహోత్సవానికి తీసుకువచ్చాను. ఇక్కడ ఎన్నెన్నో పుస్తకాలు లభిస్తున్నాయి. నేను భక్తి పుస్తకాలను కొనుగోలు చేశా.

రోజూ తప్పకుండా రావాల్సిందే: ప్రసూన

పుస్తక మహోత్సవం మొదలైన రోజు నుంచీ ఇక్కడికి వస్తున్నాను. ప్రతి స్టాల్‌లో ఉన్న పుస్తకాలను పరిశీలించి పిల్లల, ఫిక్షన్ పుస్తకాలను కొనుగోలు చేశాను. ఇక్కడ జరుగుతున్న వివిధ కార్యక్రమాలకు హాజరవుతున్నా. ఎంతో మంది పెద్దవారు వచ్చి ఇక్కడ ప్రసంగాలు ఇస్తుండడంతో ప్రతి ఒక్కరూ శ్రద్ధగా వింటున్నారు.

విలువైన సమయం ఆదా : అరుణకుమారి



పుస్తక మహోత్సవం జరుగుతోందని తెలిసి. . రాజమహేంద్రవరం నుంచి వచ్చా. అన్ని స్టాల్స్ వీక్షించి.. కావాల్సిన పుస్తకాలు కొనుగోలు చేశా. సాధారణంగా బయట షాపుల్లో పరిమితంగా పుస్తకాలు ఉంటాయి. ఒకే దగ్గర అన్ని రకాల పుస్తకాలు లభించడం వల్ల సమయం ఆదా అవుతుంది.

ముఖ్యమంత్రుల్లో ఎన్టీఆర్‌ది ప్రత్యేక స్థానం

అమరావతి ఉద్యమంలో కమ్మ మహిళలది కీలకపాత్ర ● రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి



నూతన సంవత్సర క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న అతిథులు



ఆకట్టుకున్న గరగ నృత్యం

పోరంకి, న్యూస్‌టుడే : ఎంత మంది ముఖ్యమంత్రులొచ్చినా.. ఎన్టీఆర్‌ది ప్రత్యేక స్థానమంటూ రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి కొనియాడారు. కేవలం తొమ్మిది నెలల్లో పార్టీని అధికారంలోకి తెచ్చిన ఘనత ఆయనదన్నారు. తాను ఎన్టీఆర్ చైతన్య రథానికి క్లీనర్‌గా పనిచేశానని గర్వంగా చెబుతానన్నారు. రాజకీయాలలో డబ్బుకు లాలూచీ పడని వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్టీఆరే తనకు రాజకీయ ప్రవేశం కల్పించి ప్రోత్సహించారంటూ గుర్తుచేసుకున్నారు. కృష్ణా జిల్లా పోరంకి మురళీరిసార్ట్సులో జరిగిన కమ్మవారి సంక్రాంతి సంబరాల్లో ఆమె ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అమరావతి ఉద్యమంలో కమ్మ మహిళలు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అమరావతి కాదు కమ్మరావతి అని కొంత మంది ప్రచారం చేశారన్నారు. వారికి దమ్ముంటే అదే పేరు పెట్టాలని అప్పటి పాలకులకు స్పష్టం చేశానన్నారు. 'సామాజిక సమానత్వం కోసం పోరాడిన చరిత్ర మనది. వ్యవసాయ, వైద్య రంగం అభివృద్ధికి కృషి చేసిన వారు మనవారిలో చాలామంది ఉన్నారు. గత ప్రభుత్వం అవసరానికి కరెంటు కూడా ఇచ్చేది కాదు. ఎన్నికల రోజే వైకాపా ఓడిపోతుందని కచ్చితంగా చెప్పాను. అదే జరిగింది. రాజ్యాంగం ఇచ్చిన హక్కు రాజకీయం, మన సత్తా ఇక్కడా నిరూపించుకోవాలి. నేను 13 సంవత్సరాల వయస్సులోనే ట్రాక్టర్, కారు డ్రైవ్ చేశాను. నా తల్లిదండ్రులు నన్నెంతో ప్రోత్సహించారు. వారిలాగే అందరూ వారి బిడ్డలను ప్రోత్సహించండి. మన కులం ఒక్క పార్టీకి చెందినది కాదు.' అని రేణుకాచౌదరి స్పష్టం చేశారు.

ఘనంగా వేడుకలు.. వివిధ రంగాలలో ప్రముఖ స్థానాల్లో ఉన్న పలువురిని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా డప్పులు, కళాకారుల నృత్యాలతో మురళీరిసార్ట్స్ ప్రాంగణం మొత్తం మార్మోగింది. గంగిరెద్దులు, మేళతాళాల సందడి, రంగవల్లుల మెరుపులతో పండగ వాతావరణం నెలకొంది. ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, అంతర్జాతీయ చెస్ క్రీడాకారిణి కోనేరు హంపి, దుర్గగుడి ఛైర్మన్ బొర్రా గాంధీ, విజయడెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, దొడ్డపనేని బాబూరావు, మండవ మురళీకృష్ణ, ముత్తవరపు మురళీకృష్ణ, కె.సత్యనారాయణ, సుబ్రమణ్యం, అక్కినేని మణి పాల్గొన్నారు.

అమెరికా అహంకారంపై కవుల ఆగ్రహం



మాట్లాడుతున్న విజయరావు. వేదికపై వొరప్రసాద్, సుబ్బారావు తదితరులు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : ప్రపంచ దేశాలపై ఆధిపత్యం చెలాయించాలనే అమెరికా అహంకార ధోరణిపై కవులు ధిక్కార స్వరాలు వినిపించారు. 36వ విజయవాడ పుస్తక మహోత్సవంలో పదో రోజు ఆదివారం బీవీ పట్టాభిరామ్ సాహిత్య వేదికపై మొదటి కార్యక్రమంగా నిర్వహించిన 'జన కవనం' కవితా సదస్సులో ఈ స్వరం గట్టిగా వినిపించింది. సాహితీ స్రవంతి, మిత్ర సాహిత్య సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి.. వొరప్రసాద్, తంగిరాల సోని ప్రయోక్తలుగా వ్యవహరించారు. గద్దం విజయరావు, సింగంపల్లి అశోక్‌కుమార్, ఇంద్రవల్లి రమేష్, లెనిన్ ధనిశెట్టి, సత్యాజీ, గుండు నారాయణరావు, చలపాక ప్రకాష్, నేలపూరి రత్నాజీ, అజయ్ కుమార్ తదితరులు తమ కవితా సందేశాలతో శ్రోతలను ఆకట్టుకున్నారు. మందరపు హైమావతి ప్రారంభ కవితను చదవగా.. శిఖా ఆకాష్, వైష్ణవిశ్రీ, అనిల్ డ్యానీ, బంగారురాజు కంఠ, డా.జడా సుబ్బారావు తదితరులు అమెరికా దౌష్ట్యాన్ని ఖండిస్తూ కవితాగానం చేశారు. రంగం రాజేష్ బృందం ప్రత్యేక గేయాలాపనతో కార్యక్రమాన్ని మరింత ఆకట్టుకుంది.

సునిశిత విమర్శకు నిలయం.. మంచికంటి కథలు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : నూతన సహస్రాబ్దంలో సామాన్యుల జీవితాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలను సునిశితంగా గమనించి, వాటిలోని మంచి చెడులను సున్నితంగా పాఠకుల దృష్టికి తేవడంలో కథకుడిగా మంచికంటి



పుస్తకావిష్కరణలో రాజగోపాల్, విశ్వేశ్వరరావు, త్రిమూర్తులు తదితరులు

విజయవంతమయ్యారని చినుకు సంపాదకులు నండూరి రాజగోపాల్ అన్నారు. 36వ విజయవాడ పుస్తక మహోత్సవంలో ఆదివారం బీవీ పట్టాభిరామ్ సాహిత్య వేదికపై రెండో కార్యక్రమంగా 'అంబేడ్కర్ మనవాడు' పేరుతో మంచికంటి రాసిన కథా సంకలనాన్ని శ్రీశ్రీ ప్రింటర్స్ విశ్వేశ్వరరావు ఆవిష్కరించారు. మరో గ్రంథాలయ ఉద్యమ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభకు కాట్రగడ్డ దయానంద్ అధ్యక్షత వహించారు. మన్నం త్రిమూర్తులు తొలి ప్రతిని స్వీకరించారు. నండూరి రాజగోపాల్ పుస్తక సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో కస్తూరి ప్రభాకర్, కందుకూరి రాము, కాసుల రవికుమార్, బండారు విజయ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర కమిటీలో జిల్లా సభ్యులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : గుంటూరులో ఆదివారం నిర్వహించిన యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో ఎన్టీఆర్ జిల్లా నుంచి ముగ్గురు ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు.. రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అలాగే ఎ.సుందరయ్య, పి.లీల రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. జిల్లా నుంచి రాష్ట్ర కమిటీకి ప్రాతినిధ్యం పెరగడంపై నాయకులు ఎం.కృష్ణయ్య, పి.భవానీ, కె.గంగరాజు, జె.సుదానంద్, ఎన్.వెంకటేశ్వర్లు, గోపాలకృష్ణ, ముత్తయ్య, జె.రామకృష్ణ, మచ్చా శ్రీనివాస్, రవీంద్ర తదితరులు వారిని అభినందించారు.



శ్రీనివాసరావు, సుందరయ్య, లీలతో జిల్లా నాయకులు

పవన్‌కల్యాణ్ పర్యటన వాయిదా

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మునగచర్ల పర్యటన రద్దయింది. గ్రామంలో వీబీ జీ రామ్ జీ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన సామూహిక పశువుల వసతిగృహ ప్రారంభోత్సవానికి సోమవారం డిప్యూటీ సీఎం వస్తున్నారని ప్రభుత్వ విప్ సౌమ్య, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తంబళ్లపల్లి రమాదేవి ఏర్పాట్లు చేశారు. అనివార్య కారణాలవల్ల పవన్‌కల్యాణ్ పర్యటన రద్దయిందని ప్రకటించారు. ఆయన రాకపోవడంపై జనసైనికులు, ఆయన అభిమానులు నిరుత్సాహానికి గురయ్యారు.

బ్రాండెడ్ దుస్తుల ప్రదర్శనకు స్పందన

పటమట, న్యూస్‌టుడే: భారతీ నగర్‌లోని నోవాటెల్ హోటల్‌లో ఏర్పాటు చేసిన బ్రాండెడ్ దుస్తుల ప్రదర్శనకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. పేరొందిన ప్రముఖ దుస్తుల బ్రాండ్లు ఒకే వేదికపై అందుబాటులోకి ఉండడంతో కొనుగోలుదారులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. పురుషులు, మహిళలు, చిన్నారుల కోసం ఆధునిక డిజైన్లతో కూడిన డ్రెస్‌లతో పాటు సంప్రదాయ దుస్తులు కూడా అందుబాటులో ఉంచారు. దుస్తులు, షూలకు దాదాపు 80 శాతం డిస్కౌంట్ ఉండడంతో కొనుగోలుదారులు పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. ఈ ప్రదర్శనలో ఈఎఫ్ఎం 91.9 ఆర్జే లహరి లైవ్ షో నిర్వహించి కొనుగోలుదారులను ఉత్సాహపరిచారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. ప్రదర్శనకు ప్రజల నుంచి మంచి స్పందన రావడం ఆనందంగా ఉందన్నారు. 13వ తేదీ వరకు ప్రదర్శన కొనసాగుతుందని తెలిపారు. ప్రవేశం ఉచితమని, డిజిటల్, క్రెడిట్, డెబిట్ కార్డు చెల్లింపులకు అవకాశం కల్పించామని, ప్రజలు సందర్శించాలని కోరారు.



వస్త్రాలు పరిశీలిస్తున్న వినియోగదారులు

యువ శక్తే నవ భారత నిర్మాణానికి పునాది

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: యువ శక్తే నవ భారత నిర్మాణానికి పునాది అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా బీజేవైఎం ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ రాఘవయ్య పార్కు వద్ద నిర్వహించిన 5 కి.మీ. మారథాన్‌ని మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా పార్కు వద్ద గల స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, మారథాన్‌లో భాగస్వాములయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అత్యంత పిన్న వయస్కుల జనాభా కలిగిన దేశం మనదని, మన జనాభాలో సుమారు 65 శాతం మంది 35 ఏళ్లలోపు యువతేనని గుర్తు చేశారు. యువ శక్తిని నమ్ముకొనే ప్రధాని మోదీ దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. యువతలోని నైపుణ్యాన్ని గుర్తించి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి పథకాలు అమలు చేస్తోందని వివరించారు. ఫలితంగా నేడు దేశ వ్యాప్తంగా సుమారు లక్షన్నర స్టార్టప్‌లు ఏర్పడి, వాటిలో 25 నుంచి 30 యూనికార్న్ కంపెనీలుగా నిలిచాయంటే, అది భారత యువత ప్రతిభకు నిదర్శనమన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత దేశాన్ని 11 నుంచి 4వ స్థానానికి తీసుకురావడంలో యువత పాత్ర అమోఘమని అన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించి, దేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక శక్తిగా నిలబెట్టాలన్నదే ప్రధాని మోదీ సంకల్పమని వివరించారు. విజేతలకు మంత్రి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భాజపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, నాయకులు దొడ్డపనేని కల్యాణ్‌కృష్ణ, వైవీ గోపి, శివకృష్ణారెడ్డి, పిట్టల గోవింద, తూములూరి కృష్ణచైతన్య, సయ్యద్ బాషా తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి 5కే మారథాన్ ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

స్వామి వివేకానంద బోధనలు ఆదర్శనీయం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : 'ప్రయత్నం చేసి ఓడిపో గానీ.. ప్రయత్నం చేయడంలో మాత్రం ఓడిపోకు' అనే స్వామి వివేకానంద మాటలు నేటి యువతకు ఆదర్శనీయమని ఏపీ ప్రభుత్వ ఉన్నత అమెరికా ప్రతినిధి కోమటి జయరామ్ అన్నారు. స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని పాన్ ఇండియా సోషియో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి ప్రతిభా పురస్కారాల వేడుకకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. [illegible] స్వామి వివేకానంద అని కొనియాడారు. ప్రపంచంలోని తెలుగు ప్రజలందరి సంక్షేమానికి ఏపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. యువతలో స్ఫూర్తి నింపేలా వివేకానంద చెప్పిన సూక్తులు అందరికీ ఆచరణీయమన్నారు. రామకృష్ణ మఠాన్ని స్థాపించడం ద్వారా భారతదేశ యువతకు దిశానిర్దేశం చేశారని చెప్పారు. తెలంగాణ యువజన సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కూన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ.. . జీవుడే దేవుడు అని చెప్పిన రామకృష్ణ పరమహంస సూత్రాన్ని పాటించారని పేర్కొన్నారు. ఎన్ఆర్ఐ తెదేపా సెల్ కోఆర్డినేటర్ [illegible] మాట్లాడుతూ.. [illegible] వివిధ రంగాల్లో సేవలు అందించిన 18 మందిని జయరామ్‌తో పాటు నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు అద్దంకి రాజా, కళారత్న కత్తిమండ ప్రతాప్, ఈగల్ సెల్ ఎన్టీఆర్ జిల్లా ఎస్సై ఎస్.ఐ.ఎం.వీరాంజనేయులు, కె.జె.రాజు, మిరియాల వెంకట రమణయ్య, కె.ఆర్.జి.శేషుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సత్కార గ్రహీతలతో జయరామ్, రాజా, ప్రతాప్, వీరాంజనేయులు తదితరులు

కారు బోల్తా.. ఒకరి మృతి

సీపీఆర్ చేసినా దక్కని ప్రాణం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: వేదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని తిరిగి వెళ్తుండగా కారు చెరువు అలుగు నీళ్లల్లో బోల్తా పడింది. ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో నలుగురు క్షేమంగా బయట పడ్డారు. [illegible] నీలకంఠేశ్వరరావు(45) [illegible] సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న [illegible] కారులో నుంచి అతన్ని బయటికి తీసి ప్రాణాలు [illegible] డాపోయింది. మృతదేహాన్ని జగ్గయ్యపేట [illegible] కకు చెందిన చెకూరి రమేష్, హైదరాబాద్‌కు [illegible] పవన్‌కుమార్‌రెడ్డిలను క్షేమంగా బయటికి [illegible] ఎస్సై అర్జున్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సీపీఆర్ చేస్తున్న ఎస్సై


జగన్మాత సేవలో హైకోర్టు న్యాయమూర్తి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈఈ కోటేశ్వరరావు, ఏఈవో వెంకటరెడ్డి వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.



జస్టిస్ మల్లికార్జునరావుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో వెంకటరెడ్డి

జూదం ఆడుతూ పట్టుబడిన వైకాపా నాయకులు



పోలీసులకు చిక్కిన జూదరులు

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు మండలంలో జూదం ఆడుతూ పలువురు వైకాపా నాయకులు పోలీసులకు పట్టుపడ్డారు. పోలీసుల సమాచారం మేరకు.. చిట్యాల రైతు సేవా కేంద్రం సమీపంలో అదే గ్రామానికి చెందిన తుమ్మలపల్లి శ్రీనివాసరావు ఇంటిలో జూద శిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి జూదానికి ఉపయోగించిన కార్డులు, ఇతర సామగ్రితో పాటు నగదును స్వాధీనం చేసుకున్నారు. శిబిరం నిర్వహిస్తున్న వారి వివరాలు సేకరించి, వారి మీద ఆదివారం కేసు నమోదు చేసి స్టేషన్‌కు తరలించారు. పోలీసులు పట్టుకున్న వారిలో తంగిరాల వెంకటరెడ్డి(వైకాపా కౌన్సిలర్), శీలం నాగిరెడ్డి, ఏరువ ప్రకాష్ రెడ్డి, గంధ్ర చంద్రరావు, ప్రసాద్‌రావు, జిన్నా(వైకాపా నాయకులు), తుమ్మలపల్లి శ్రీనివాసరావు(చిట్యాల సర్పంచి), తిరువూరు మున్సిపల్ ఛైర్మన్ భర్త కొలికపోగు తిరుపతిరావు(చంటి) ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జూదం వల్ల యువత తప్పుదారి పడుతున్నారని, ఇలాంటి కార్యకలాపాలు కొనసాగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తిరువూరు సెక్టార్- 1 ఎస్సై శాతకర్ణి హెచ్చరించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ఆ రూ.లలో)

నెక్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -152 రిటైల్ ధర 179 చికెన్ విత్ స్కిన్ - 260, చికెన్ స్కిన్‌లెస్ - 295.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 175, 184, 195 చికెన్ విత్ స్కిన్ - 340 చికెన్ స్కిన్‌లెస్ - 350.

అల్లుడి చేతిలో అత్త హతం

న్యూరాజరాజేశ్వరిపేటలో కలకలం

మధురానగర్, న్యూస్‌టుడే : తమ సంసారంలో గొడవలకు అత్తే కారణమని భావించిన అల్లుడు.. విచక్షణారహితంగా కత్తితో పొడిచి ఆమెను హతమార్చిన ఘటన ఆదివారం రాత్రి అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. న్యూరాజరాజేశ్వరిపేటకు చెందిన కొమ్మూరు నాగసాయి, దుర్గాభవానీలు భార్యాభర్తలు. భర్త గాంధీనగర్‌లోని ఒక దుస్తుల దుకాణంలో పని చేస్తుంటాడు. కొద్ది రోజులుగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీనికి అత్త కోలా దుర్గ (46) కారణమంటూ నాగసాయి కొద్ది రోజులుగా ఆమెపై ఆగ్రహంతో ఉన్నాడు. ఆదివారం రాత్రి 9.45 గంటల సమయంలో న్యూరాజరాజేశ్వరిపేటలోనే ఉంటున్న ఆమె ఇంటికి వచ్చి గొడవ పడ్డాడని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ క్రమంలో కత్తి తీసుకుని విచక్షణారహితంగా ఆమెపై దాడి చేసి.. ఆరు చోట్ల పొడిచాడు. దుర్గ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు హుటాహుటిన వచ్చారు. వారిని చూసిన నాగసాయి.. పారిపోయాడు. రక్తపు మడుగులో పడి ఉన్న ఆమెను చూసి స్థానికులు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. 108 వాహన సిబ్బంది వచ్చి అపస్మారక స్థితిలో ఉన్న దుర్గను అంబులెన్స్‌లోకి ఎక్కించారు. ఈలోగా ప్రాణం పోవడంతో మృతదేహాన్ని కిందకు దించారు. హత్య సమాచారం తెలియగానే.. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రత్యక్ష సాక్షులతో పాటు మృతురాలి కుమార్తె దుర్గాభవాని నుంచి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

నీటిలో మునిగి విద్యార్థి దుర్మరణం

తునికిపాడు(గంపలగూడెం), న్యూస్‌టుడే : తోటి బాలురతో కలిసి ఆటలాడేందుకు వెళ్లిన విద్యార్థి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి దుర్మరణం చెందిన సంఘటన మండలంలోని తునికిపాడు శివారు భగవానుపురంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్థుల సమాచారం మేరకు.. చిర్రా మాధవ్(13) తునికిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం తన తోటి బాలురతో కలిసి గ్రామ సమీపంలో గాలిపటాలు ఎగరవేసేందుకు వెళ్లాడు. [illegible] వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి పైకి రాడకపోవడంతో [illegible] దుకు వెళ్లిన బాలురు గమనించి సమాచారం ఇవ్వడంతో తునికిపాడు, భగవానుపురం గ్రామస్థులు బావి వద్దకు చేరుకున్నారు. [illegible] వెతకగా మాధవ్ మృతదేహం లభించింది. సంఘటన బాలుడి కుటుంబానికి తీరని విషాదం మిగిల్చింది. తండ్రి నాగరాజును పలువురు పరామర్శించి ఓదార్చారు. పలువురు ఉపాధ్యాయులు బాలుడి మృతదేహాన్ని సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు లేదు.

కోడి పందేల బరులు ధ్వంసం

నున్న, న్యూస్‌టుడే: నున్న వికాస్ కళాశాల రోడ్డులో మామిడితోటల్లో సంక్రాంతి సంబరాల పేరిట కొందరు భారీ కోడి పందేల బరులు ఏర్పాటు చేశారు. వీటిని అనుమతి లేకుండా ఏర్పాటు చేసినట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో విజయవాడ నార్త్ ఏసీపీ స్రవంతిరాయ్, నున్న సీఐ కృష్ణమోహన్‌లు ఆదివారం సాయంత్రం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ చేస్తున్న ఏర్పాట్లను నిలిపివేయించి బరులను ధ్వంసం చేశారు. వారు మాట్లాడుతూ ఇక్కడ భారీ కోడి పందేల బరులకు సిద్ధమవుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, అందుకే వాటిని తొలగించినట్టు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బరులు ధ్వంసం చేసిన ప్రాంతం వద్ద పోలీస్ పహారా ఏర్పాటు చేశారు. అనంతరం పోలీసులు కోడి పందేలు నిర్వహించడం చట్టరీత్యా నేరమనే బ్యానర్లు ఏర్పాటు చేశారు.



మామిడితోటలో బ్యానర్ ఏర్పాటు చేస్తున్న పోలీసులు

తిరువూరు

• తిరువూరు • మైలవరం

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



కవులూరులో వైద్య సేవలందిస్తున్న వైద్యులు ఈశ్వర్, పవన్

జి.కొండూరు, న్యూస్‌టుడే : కవులూరులో ధన్వంతరి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండో ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. శిబిరంలో 97 మంది రోగులకు వైద్యులు ఈశ్వర్, పవన్ పరీక్షలు చేశారు. ట్రస్టీ జువ్వా వెంకటేశ్వర రావు రోగులకు నెల రోజులకు మందులు అందజేశారు.

★ వెల్లటూరులో పురుషోత్తమ భారతీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా వైద్యురాలు యోగిత పాల్గొని 120 మంది రోగులకు వైద్య సేవలందించారు.

విశ్వవిద్యాలయ ఛాంపియన్ ఎల్‌హెచ్‌ఆర్ కళాశాల జట్టు

మైలవరం, న్యూస్‌టుడే: కృష్ణా విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు స్వర్ణం గెలిచి విశ్వవిద్యాలయ ఛాంపియన్‌షిప్ కప్‌ను సాధించినట్లు కళాశాల పీడీ మన్నే స్వామి తెలిపారు. గత రెండ్రోజులుగా విజయవాడలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు అన్ని మ్యాచుల్లోనూ గెలవడంతో పతకం సాధించారని వివరించారు.

సమన్వయంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలి



అధికారులతో చర్చిస్తున్న డీసీపీ షిరీనాబేగం

కొండపల్లి, న్యూస్‌టుడే: ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించుకోవాలని ట్రాఫిక్ డీసీపీ షిరీనా బేగం పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం రింగుకూడలి వద్ద ట్రాఫిక్ పరిస్థితులను ఆమె ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఏసీపీ రామచంద్ర రావు, సీఐ చంద్రశేఖర్, ట్రాఫిక్ ఎస్సై కృష్ణ, ఆర్ ఎస్సై లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

చిరుజల్లులతో రైతుల్లో ఆందోళన



కల్లంలో ఆరబెట్టిన మిరపకాయలు

గంపలగూడెం : వాతావరణంలో మార్పులు మిరప రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. వాయుగుండం ప్రభావంతో శని, ఆదివారం గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లో చిరుజల్లులు కురిశాయి.

రెడ్డిగూడెం : రెడ్డిగూడెం ప్రాంతంలో చిరుజల్లులు పడి వాతావరణ చల్లగా మారడంతో మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. పూత దశలో ఉన్న మామిడి వర్షం పడితే తోటల్లో తెగుళ్లు, పురుగుల బెడద ఎక్కువై పిందె కట్టుతుందో లేదోనని కలవర పడుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? పినపాక గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లకు అంచులు సరి చేయకుండా వదిలి వేశారు. దీంతో ప్రమాదాలకు గురవుతున్నాం. **- శ్రీనివాసరావు గ్రామస్థుడు.**

✔ సమస్య తెలిసింది. సీసీ రోడ్ల అంచులు సరి చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. **- సాంబశివరావు పీఆర్ ఏఈ.** - న్యూస్‌టుడే, జి.కొండూరు

స్పందన: ★ మండల కేంద్రంలోని నూజివీడు రోడ్డులో చెత్త పేరుకుందని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను అధికారులకు తెలిపారు. ఈవో కేశవ హరికృష్ణ కుమార్ స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, విస్సన్నపేట

గ్రంథాలయానికి సామగ్రి వితరణ

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణంలోని గ్రంథాలయానికి బెంగళూరుకు చెందిన శిక్షణ ప్రాజెక్టు మేనేజర్ స్వాతి సాయంతో రెండు కంప్యూటర్లు, ఒక టెలివిజన్, ఒక చరవాణిని ఆదివారం వితరణ చేశారు. గ్రంథాలయాధికారిణి కె.పద్మావతి, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నాడు ఆహ్లాదం.. నేడు అధ్వానం

కొండపల్లి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

పవిత్ర సంగమం ప్రాంతం అపవిత్రంగా మారింది. గతంలో పుణ్యకార్యాలకు వేదికగా విలసిల్లిన ప్రాంతం పర్యవేక్షణ లేక అసాంఘిక కార్యక్రమాలకు నిలయమైంది. భక్తులు, నగరవాసులు, పర్యాటకులతో నిత్యం కిటకిటలాడే ప్రాంతం ప్రస్తుతం బోసిపోవడం, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించే వారికి అడ్డాగా మారింది. మందుబాబులతో పాటు గంజాయి తాగే వారు తమ కార్యకలాపాలకు దీన్ని ల్యాండ్ మార్క్‌గా ఎంచుకున్నారు. దీనికి తోడు కొత్తగా గంజాయి అమ్మకం దారులకు కూడా ఆ ప్రాంతం అడ్డాగా మారడం సోచనీయం.

అనేక సంఘటనలు

గత నెలలో కంచికచర్లకు చెందిన గంజాయి అమ్మకందారులను ఇబ్రహీంపట్నం పోలీసులు సంగమం ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. అంతకు ముందు మద్యం తాగుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న ఇద్దరిని, ఓ హత్య కేసులో ఉన్న మరో ఇద్దరిని పోలీసులు అక్కడే పట్టుకున్నారు. దీనికి తోడు ఆకతాయిల హడావుడి అంతా ఇంతా కాదు. ద్విచక్ర వాహనాలతో హల్‌చల్ చేస్తూ నానా హంగామా చేస్తు రెచ్చిపోతున్నారు. రాత్రి వేళ వీరి కార్యకలాపాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఈ వ్యవహారాలను కట్టడి చేసేందుకు గతంలో ఒక చెక్‌పోస్టును పోలీసులు ఏర్పాటు చేశారు. అయితే దాన్ని ద్వారా కొన్ని రోజులు మాత్రమే పర్యాటకులకు సేవలు అందాయి. ప్రస్తుతం దాన్ని మూసేశారు.



మూసేసిన పోలీసు చెక్‌పోస్టు

మందగించిన వ్యాపారాలు

ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించే సమయంలో భక్తులు, పర్యాటకుల అధికంగా ఇక్కడికి వస్తుండేవారు. దీని వల్ల తోపుడు బండ్ల వ్యాపారాలు పుష్కలంగా జరిగేవి. వ్యాపారస్థులు అధికంగా ఉండటంతో పర్యాటకులు సైతం కాసేపు సేద తీరుదామని ప్రతి రోజూ సాయంత్రం సంగమానికి వెళ్లేవారు. కొంత కాలంగా పర్యవేక్షణ కొరవడిన నేపథ్యంలో పర్యాటకుల్లో భయం నెలకొని సంగమానికి వారి రాక తగ్గింది. దీంతో ఒక్కొక్కటిగా చిరు వ్యాపారాలు తగ్గుతూ వస్తున్నాయి.

పర్యవేక్షణ చేస్తాం

సంగమం వద్ద గంజాయి అమ్మకాలు చేస్తున్న వారిని గతంలో అదుపులోకి తీసుకున్నాం. కొందరు మద్యం తాగుతున్నా వారికి హెచ్చరిక చేశాం. బీట్ సిబ్బంది రోజూ రౌండ్స్ వేస్తున్నారు. దీనికి తోడు రాత్రి సమయాల్లో పోలీసు జీబు కూడా వెళ్తోంది. **- చంద్రశేఖర్, సీఐ**

మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్

మైలవరం, న్యూస్‌టుడే : నియోజకవర్గంలోని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.6 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పంచాయతీలోని పలు సీసీ రహదారులు, వెల్నెస్ కేంద్రాల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి పల్లెను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. స్థానిక దేవునిచెరువులో నూరు శాతం సీసీ రహదారులుగా అభివృద్ధి చేసినట్లు చెప్పారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి.. సామాజిక సేవే లక్ష్యం

విస్సన్నపేట, న్యూస్‌టుడే



పేదలకు నిత్యవసర వస్తువులు ఇస్తున్న శివ సత్యనారాయణ

విస్సన్నపేట మండలం కొండపర్వ గ్రామానికి చెందిన బొట్ల శివ సత్యనారాయణ అనే యువకుడు 15 సంవత్సరాలుగా సామాజిక సేవలో నిమగ్నమై ముందుకు కొనసాగుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. మొదటిగా 2011లో తమ స్వగ్రామంలో ప్రగతిశీల యువజన సమాఖ్య అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి ప్రజలను చైతన్య పరచడం, గ్రామస్థులకు విద్య, వైద్య అవగాహన సదస్సులు, మహిళా సాధికారత సభలు ఏర్పాటు, ఉచిత వైద్య శిబిరాలు, సంక్రాంతి పండగ సమయంలో యువతులకు, మహిళలకు ముగ్గుల పోటీలు, విద్యార్థులకు క్విజ్ పోటీలు, అదే విధంగా గ్రామ స్థాయిలో పదో తరగతి, ఇంటర్ చదువుచున్న విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందించాడు. సమైక్యాంధ్ర ఉద్యమం, తర్వాత గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో ఎవరికి ఏ సమస్య వచ్చినా దాని మీద ముందుకొచ్చి మాట్లాడటం, అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లడం, పరిష్కరించడం, ముఖ్యంగా వితంతువులకు, దివ్యాంగులకు పింఛను మంజూరు చేయించడం, అవినీతి అక్రమాల విషయంలో ఉచితంగా పోరాటం చేయడం, ప్రజలకు ఏ సమయంలోనైనా తన సేవలను అందిస్తున్నాడు. తనకు చేతనైన సహాయం చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నాడు.

ఆత్మీయ కలయిక.. ఆనందం నిండుగా..



గంపలగూడెంలో..



పెనుగొలను జడ్పీ ఉన్నత పాఠశాలలో..

తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లోని పలు పాఠశాలల్లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఆయా బడుల్లో కలిసి చదువుకున్న వారంతా తమ కుటుంబాలతో కలిసి పాల్గొన్నారు. ఆనాడు విద్యాబోధన చేసిన గురువులను సత్కరించారు. భౌతికంగా దూరమైన తమ సహాధ్యాయులు, గురువులకు మౌనం పాటించి నివాళులర్పించారు. **- న్యూస్‌టుడే, బృందం**



పుల్లూరు: హాజరైన పూర్వ విద్యార్థులు



గొల్లపూడిలో..



ఊటుకూరులో గోదాదేవికి సారె తీసుకొస్తున్న భక్తులు

ఘనంగా కూడారై మహోత్సవం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, గొల్లపూడి, తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే : ధనుర్మాసం సందర్భంగా పలు ఆలయాల్లో ఆదివారం కూడారై మహోత్సవం నిర్వహించారు. ఆయా ఆలయ ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై అలంకరించిన గోదా రంగనాథుల విగ్రహాలకు పూజలు చేశారు.



ఎన్టీటీపీఎస్ ఏ కాలనీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో..



మైలవరంలో..



గొల్లపూడిలో..

లాల్‌బహదూర్ శాస్త్రి సేవలు మరువలేనివి



పెనుగొలనులో..



లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఉమా

గొల్లపూడి, న్యూస్‌టుడే: దేశానికి నిజమైన సేవకుడిగా మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి చరిత్రలో నిలిచిపోతారని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిమాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గొల్లపూడిలోని ఆయన కార్యాలయంలో లాల్‌బహదూర్ శాస్త్రి వర్ధంతిని ఆదివారం నిర్వహించారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని పెనుగొలనులో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామస్థులు లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



కొండపర్వ కోట మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న కేఎస్ జవహర్, రాజా, చంటి



కొండపల్లి పాఠశాలలో చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న విద్యార్థినులు



మైలవరంలో కేఎల్ రావు విగ్రహ సర్కిల్‌లో చేసిన అలంకరణలు

గ్రామాల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విస్సన్నపేట మండలం కొండపర్వలో ఊరు పొలిమేర వద్ద ఉన్న కోట మహాలక్ష్మి అమ్మవారిని రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్‌పర్సన్, మాజీ మంత్రి కేఎస్ జవహర్, తెదేపా నాయకుడు కవులూరి రాజాతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సంక్రాంతి సంబరాల్లో భాగంగా మహిళా కళాకారులచే కోలాటం ప్రదర్శించారు. రాజా వితరణతో 1000 మందికి అన్నదానం చేశారు.

గంపలగూడెం,: మండల పరిధిలోని గ్రామాల్లో సంక్రాంతి సందడి మొదలైంది. ఇంటింటా హరిదాసులు కానుకల స్వీకరణ, గంగిరెద్దుల ఆటలతో పండగ వాతావరణం నెలకొంది. మహిళలు రంగవల్లులు తీర్చిదిద్దడంతో నిమగ్నమయ్యారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే : ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో విస్సన్నపేట కొత్తపేటలో ముగ్గులు, లెమన్ స్పూన్ పోటీలు నిర్వహించారు. వీటిల్లో పెద్దగౌండ్ల అలేఖ్య, బోనాం యషిక, గంటల పన్యశ్రీ వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. కోటపాటి సుశీల, వినుకొండ రంగారాణి, నాగరాజు, నిమ్మల సత్యనారాయణ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

మైలవరం: స్థానిక పంచాయతీలో స్వచ్ఛ సంక్రాంతి, స్వచ్ఛ మైలవరం కార్యక్రమంలో భాగంగా పల్లె వాతావరణం, సంక్రాంతి పండగ శోభ కార్యక్రమాలను నిర్వహించారు. కేఎల్ రావు విగ్రహ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సంబరాలను ఆదివారం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ప్రారంభించారు.



గంపలగూడెంలో గంగిరెద్దులాట

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి పురపాలిక పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఆదివారం నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయ దుస్తులతో రంగవల్లులు వేశారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి

స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. **- న్యూస్‌టుడే, బృందం**



తిరువూరులో.. నివాళులర్పిస్తున్న కూటమి నాయకులు



జి.కొండూరులో..

ఎన్డీయే పాలనలో కుంటుపడిన సంక్షేమం

ఎ.కొండూరు: రాష్ట్రంలో ఎన్డీయే పాలనలో సంక్షేమం కుంటుపడిందని వైకాపా జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. రేపూడిలో నూతనంగా నిర్మించిన గుడిలో తాను అందించిన శ్రీకృష్ణుని విగ్రహం ప్రతిష్ఠ, గ్రామ పెద్దలు నిర్మించిన కళావేదిక ప్రారంభోత్సవంలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు.

మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : గ్రామీణ యువత సంప్రదాయ ఆటల పోటీల్లో చురుగ్గా పాల్గొనాలని తిరువూరు సీఐ కె.గిరిబాబు, ఎస్సై గంధం మహాలక్ష్మణుడు కోరారు. సంక్రాంతి సందర్భంగా ఎస్సై మహాలక్ష్మణుడు ఆధ్వర్యంలో కంభంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో అయిదు రోజుల పాటు జరిగే మండల స్థాయి క్రికెట్ పోటీలను సీఐ ఆదివారం ప్రారంభించారు.



బ్యాటింగ్ చేస్తున్న సీఐ గిరిబాబు

కబడ్డీ.. రెడ్డిగూడెం: మండల కేంద్రంలో ఎంఎన్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను తెదేపా మండల అధ్యక్షుడు జానలపాటి వేణుగోపాలరెడ్డి ఆదివారం ప్రారంభించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న వేణుగోపాలరెడ్డి, నాయకులు

గండికోటకు పండగశోభ


ఉత్సవాల ప్రారంభోత్సవంలో మంత్రులు దుర్గేష్, సవిత తదితరులు

ఈనాడు, కడప; న్యూస్‌టుడే, జమ్మలమడుగు: వైఎస్సార్ కడప జిల్లా పర్యాటక ప్రాంతం గండికోటలో 'వారసత్వ ఉత్సవాలు' ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పర్యాటకులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు వేడుకలు ప్రారంభించారు. సంప్రదాయ నృత్యాలు, జానపద గీతాలు, వివిధ కళా ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గండికోటను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మంత్రులు తెలిపారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు 3 రోజుల పాటు కొనసాగనున్నాయి. తొలిరోజు ఆదివారం సాయంత్రం గండికోట సాంస్కృతిక, చారిత్రక కళా వైభవాన్ని చాటేలా శోభాయాత్ర నిర్వహించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సి.ఆదినారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ఉరకలెత్తిన ఉత్సాహం

పిఠాపురంలో ముగిసిన సంక్రాంతి మహోత్సవం




తప్పెటగుళ్ల ప్రదర్శన తిలకిస్తున్న ప్రజలు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురంలో మూడు రోజులపాటు ఉత్సాహంగా సాగిన 'పీఠికాపుర సంక్రాంతి సంబరాలు' ఆదివారం ముగిశాయి. చివరి రోజు సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించేందుకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. స్థానిక ఆర్ఆర్‌బీహెచ్ఆర్ క్రీడా మైదానం కిక్కిరిసిపోయింది. ఆర్కెస్ట్రా సంగీతానికి యువత స్టెప్పులు వేసింది. సినీ కళాకారులు నృత్యాలు, ప్రదర్శనలతో ఉర్రూతలూగించారు. సినీ దర్శకుడు హరీశ్ శంకర్, నటుడు నవీన్ పొలిశెట్టి ప్రజల్లో ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో ఉత్సవాల ఇన్‌ఛార్జి జడ్పీ సీఈవో, ఇన్‌ఛార్జి పర్యాటక అధికారి లక్ష్మణరావు, పాడా పీడీ శ్రీనివాసరావు, జిల్లా రెవెన్యూ అధికారి జి.వెంకటరావు, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణాను అడ్డుకున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ


వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అఖిలప్రియ, భూమా విఖ్యాత్‌రెడ్డి


కంటెయినర్‌లో కుక్కిన పశువులు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పరిధిలోని 40వ జాతీయ రహదారిపై పశువుల అక్రమ రవాణాను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అడ్డుకున్నారు. పశువుల అక్రమ రవాణాపై సమాచారం అందుకున్న అఖిలప్రియ, తెదేపా నాయకుడు భూమా విఖ్యాత్‌రెడ్డి తదితరులు శనివారం అర్ధరాత్రి దాటాక చాగలమర్రి టోల్‌ప్లాజా వద్దకు చేరుకున్నారు. అక్కడ పశువులతో వెళ్తున్న కంటెయినర్లను అడ్డుకొని, ఆళ్లగడ్డ పోలీసులకు సమాచారమిచ్చారు. డీఎస్పీ కె.ప్రమోద్‌కుమార్, ఎస్సై వరప్రసాద్ అక్కడికి చేరుకుని.. ఐదు కంటెయినర్లను గ్రామీణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. పశువులను నందికొట్కూరులోని గోశాలకు పంపించారు. కేసు నమోదు చేసి బాధ్యులను అదుపులోకి తీసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఒక్కో కంటెయినర్‌లో 40-50 పశువులను తరలిస్తున్నారు. వీటిని తెలంగాణలోని పెబ్బేరు నుంచి కడపకు తరలిస్తున్నట్లు సమాచారం.

గ్రామాల్లోనూ రయ్ రయ్!

- పల్లెల్లో 10 వేల కిలోమీటర్ల మేర రహదారుల పనులు
- పల్లెపండగ 2.0లో రోడ్లకు రూ.5,837 కోట్ల కేటాయింపు
- మినీ గోకులాలు, మ్యాజిక్ డ్రెయిన్లు, పంచాయతీ భవనాలు కూడా..




అల్లూరి జిల్లా సలమరంగి-వల్లాయి మధ్య నిర్మించిన తారురోడ్డు ★ నెల్లూరు జిల్లాలో మినీ గోకులం

ఈనాడు, అమరావతి: పాత రోడ్లకు మరమ్మతులు, కొత్త రహదారులు, మినీ గోకులాలు, మ్యాజిక్ డ్రెయిన్లు, ఇతర అభివృద్ధి పనులతో గ్రామాలు కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. రూ.6,638 కోట్ల అంచనాలతో 53 వేలకు పైగా పనులతో రెండు నెలల క్రితం పల్లెపండగ 2.0ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. వీటిలో 12 వేలకు పైగా రహదారుల పనులే ఉన్నాయి. వీటికి రూ.5,837 కోట్లు కేటాయించారు. మార్చి నెలాఖరుకు ఈ పనులు పూర్తి చేయనున్నారు.

వైకాపా హయాంలో రాష్ట్రవ్యాప్తంగా రోడ్లన్నీ గోతుల మయమయ్యాయి. ఈ సమస్యకు పరిష్కారంగా కూటమి ప్రభుత్వం గతేడాది సంక్రాంతి నాటికి పూర్తయ్యేలా పల్లెపండగ 1.0 కింద 4,300 కి.మీ. మేర రహదారులు పనులు చేపట్టింది. వాటికి ఉపాధి హామీ పథకంలో రూ.2 వేల కోట్ల మెటీరియల్ నిధులు ఖర్చుచేశారు. మరో 15 వేల కి.మీ. రోడ్లు బాగు చేయాల్సి ఉండటంతో ఉపాధి పథకంతో పాటు ఇతర కార్యక్రమాలనూ అనుసంధానించి పల్లెపండగ 2.0ని ఇటీవల ప్రారంభించారు. ఇందులో 10 వేల కి.మీ. రోడ్ల పనులు చేపడుతున్నారు. మరో 5 వేల కి.మీ. పనులు వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రతిపాదించనున్నారు. 2028 మార్చి నాటికి అన్ని గ్రామాల్లో రహదారులు మెరుగుపరచాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఈసారి నిధులూ, పనులూ ఎక్కువే

◆ పల్లెపండగ 2.0కి గతేడాది కంటే ఎక్కువ నిధులను ప్రభుత్వం కేటాయించింది. మొత్తం 12,297 రోడ్ల పనులు చేపట్టనున్నారు. ఉపాధి హామీ నిధులతో పాటు నాబార్డ్, ఏఐఐబీ రుణం, పీఎంజీఎస్‌వై, సాస్కీ, 15వ ఆర్థిక సంఘం నిధులతో పనులు చేస్తున్నారు.

◆ రైతులకు రూ.375 కోట్లతో 25వేల మినీ గోకులాలు మంజూరు చేశారు. రైతులు తమ సొంత స్థలాల్లో వీటిని నిర్మించుకోవచ్చు. ఉపాధి హామీ పథకంలో నిర్మాణ విస్తీర్ణం బట్టి రూ.1.15 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఆర్థిక సాయం అందిస్తారు.

◆ ఎన్టీఆర్ జిల్లాలో ప్రయోగాత్మకంగా చేపట్టిన మ్యాజిక్ డ్రెయిన్లు విజయవంతం కావడంతో అన్ని జిల్లాల్లో చేపట్టేలా ప్రభుత్వం రూ.4 కోట్లు కేటాయించింది. జిల్లాకో పంచాయతీని ఎంపికచేసి వాటిలో 58 కి.మీ. పొడవునా మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించనున్నారు.

◆ రాష్ట్రీయ గ్రామస్వరాజ్ యోజన, ఉపాధిహామీ పథకంలో కలిపి 609 పంచాయతీ భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఇప్పటికీ పంచాయతీ భవనం లేని చోట్ల, బాగా పాడైనవాటి స్థానంలో కొత్తవి నిర్మిస్తున్నారు. ఒక్కో భవనానికి రూ.32 లక్షలు ఖర్చుచేస్తారు.

మౌలిక సదుపాయాలకు రూ.406 కోట్లు

◆ గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.406 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులతో 15 వేల పనులు చేపట్టనున్నారు. ఇందులో బస్ షెల్టర్లు, దుకాణ ప్రాంగణాలు, కాలువలు, సామాజిక మరుగుదొడ్లు, గ్రామాల ముందు స్వాగత ద్వారాలు, రక్షిత తాగునీటి పథకాలకు మరమ్మతులు వంటి పనులు మంజూరుచేశారు.

పల్లెపండగ 2.0లో గ్రామాల్లో ప్రారంభించిన రోడ్ల పనులు, ఇప్పటివరకు పూర్తయినవి

విభాగం	పనుల సంఖ్య	కేటాయించిన నిధులు (రూ.కోట్లలో)	పొడవు (కిలోమీటర్లలో)	పూర్తయినవి (కిలోమీటర్లలో)
అంతర్గత రోడ్లు (నరేగా)	4,796	809	2,635	1,100
పునర్నిర్మిస్తున్న రోడ్లు (నాబార్డ్, సాస్కీ)	1,701	2,680	5,210	325
కొత్త రోడ్లు (ఏఐఐబీ, పీఎంజీఎస్‌వై)	750	2,247	1,940	379
అనుసంధాన రోడ్లు	5,050	101	222	0
మొత్తం	12,297	5,837	10,007	1,804

కల్మషం లేని నటుడు కృష్ణ


మాట్లాడుతున్న ఉపసభాపతి రఘురామకృష్ణరాజు. వేదికపై బుద్దా వెంకన్న, బొండా ఉమామహేశ్వరరావు, కేశినేని శివనాథ్, కొల్లు రవీంద్ర, ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, జయకృష్ణ, గద్దె రామ్మోహన్ తదితరులు

- ఉపసభాపతి రఘురామకృష్ణరాజు
- విజయవాడలో కృష్ణ విగ్రహం ఆవిష్కరించిన ఆయన మనవడు జయకృష్ణ

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: 'సినీనటుడు కృష్ణకు కల్మషం లేదు. ఎప్పుడూ చిరునవ్వుతో ఉండేవారు' అని ఉప సభాపతి రఘురామకృష్ణరాజు స్మరించుకున్నారు. ఆదివారం విజయవాడ లెనిన్‌సెంటర్‌లో కృష్ణ విగ్రహావిష్కరణలో పాల్గొని, ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కృష్ణ 9 ఏళ్లలో వంద సినిమాల్లో నటించి.. ఆ తర్వాత వంద సినిమాలు 8 ఏళ్లలోనే పూర్తిచేయడం విశేషమన్నారు. ఆయన చిత్రాలన్నీ అభిమానులకు చిరకాలం గుర్తుండిపోతాయని తెలిపారు. ఆయన వంశంలో మూడో తరం నటుడు జయకృష్ణ సినిమాల్లోకి వస్తున్నారని, ఆశీర్వదించాలని కోరారు. అంతకుముందు కృష్ణ మనవడు జయకృష్ణ.. నిర్మాతలు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, అశ్వనీదత్, డైరెక్టర్ అజయ్‌భూపతి తదితరులతో కలిసి కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించారు. జయకృష్ణ మాట్లాడుతూ తాత ఘట్టమనేని కృష్ణ పేరు నిలబెట్టడమే తన లక్ష్యమని, మంచి సినిమాలతో అందరూ గర్వపడేలా చేస్తానని చెప్పారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ కృష్ణ లెనిన్‌సెంటరులో తీసిన 'ఈనాడు' సినిమా రాజకీయంగా పెనుసంచలనం సృష్టించిందని, అందులోని పాత్రనే ఇక్కడ విగ్రహంగా రూపొందించారని వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు పేరు చెబితే గుర్తుకొచ్చేది కృష్ణ మాత్రమేనని మంత్రి కొల్లు రవీంద్ర కొనియాడారు. కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, విగ్రహ కమిటీ సభ్యుడు మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

◆ 'సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్' రాష్ట్ర అధ్యక్షుడు సుధాస్వామి రూపొందించిన కృష్ణ జీవిత చరిత్ర పుస్తకాన్ని జయకృష్ణ ఆవిష్కరించారు. కృష్ణ అభిమానులతో లెనిన్‌సెంటర్ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

సాక్షుల వాంగ్మూలంతో ముందుకు

కల్తీ నెయ్యి కేసులో సంక్రాంతి తర్వాత ఛార్జిషీట్

ఈనాడు, తిరుపతి - న్యూస్‌టుడే, తిరుపతి(నేరవిభాగం): తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా కేసులో ఫిర్యాదుదారుడైన ప్రళయకావేరి మురళీకృష్ణ(ఏ30) నిందితుడిగా మారిన నేపథ్యంలో సాక్షుల వాంగ్మూలం ఆధారంగానే కేసు దర్యాప్తు, న్యాయ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని సీబీఐ నేతృత్వంలోని సిట్ బృందం నిర్ణయానికి వచ్చింది. ఈ కేసు విచారణలో కీలకంగా వ్యవహరించిన అధికారులకు ఇదే విషయమై సీబీఐ జేడీ వీరేశ్‌ప్రభు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. 2024 నవంబరులో నమోదైన కల్తీ నెయ్యి కేసు విచారణ, దర్యాప్తులో సేకరించిన ఆధారాలను సమగ్రంగా పరిశీలించి ఛార్జిషీట్ దాఖలుకు అనుమతించినట్లు సమాచారం. మరో పది రోజుల్లో నెల్లూరు ఏసీబీ కోర్టులో ఛార్జిషీట్ వేయనున్నారు. శనివారం తిరుపతిలోని సిట్ కార్యాలయంలో సీబీఐ జేడీ వీరేశ్ ప్రభు, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టీ, సీబీఐ డీఐజీ మురళి రాంబా, ఎఫ్ఎస్ఎస్ఏఐ సలహాదారు డాక్టర్ సత్యేన్ కుమార్ పాండా.. కేసుపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఆదివారం ఉదయం తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకుని తర్వాత విమానాశ్రయం చేరుకున్నారు.

ఆవిరి బియ్యం.. అందరికీ అనుకూలం

- పేదలకు, మధ్యాహ్న భోజనానికి వినియోగిస్తే మేలు
- ఆంగ్రూ శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడి

ఈనాడు, అమరావతి: ఇంతకుముందు వరి కోసి.. పనలు ఆరబెట్టి.. కుప్పలుగా వేసి.. రెండు, మూడు నెలలు మాగిన తర్వాత నూర్పిడి చేసి.. మరపట్టించి బియ్యం వండి తినేవారు. కూలీల సమస్య, పంటల సరళిలో మార్పుల వల్ల యంత్రాలతో కోసి.. అధిక తేమ శాతంతో ఉన్న ధాన్యాన్ని తక్కువ రోజులే నిల్వ ఉంచి మర పట్టించడంతో బియ్యం నాణ్యత కోల్పోతున్నాయి. వడ్లు వెంటనే మిల్లింగ్ చేయడంతో అన్నం ముద్దవుతోంది. దీన్ని అధిగమించడానికే ఆవిరి ద్వారా ధాన్యాన్ని ఉడికించి బియ్యం తయారీ విధానం అందుబాటులోకి వచ్చింది. మధ్యస్థ, సన్నరకాల్లో కూడా తక్కువ రోజులు నిల్వ ఉన్న వడ్లను ఆడించి బియ్యంగా ఇచ్చినప్పుడు అన్నం ముద్దవుతుంది. ఆవిరి ద్వారా ఉడికించిన బియ్యమే దీనికి పరిష్కారమని ఆంగ్రూ శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడైంది.

ఆవిరితో ధాన్యాన్ని ఉడికించి..

వరి కోసిన వెంటనే ధాన్యాన్ని ఆవిరితో ఉడికించిన తర్వాత చల్లబరిచి మర పట్టిస్తే నిల్వ ఉంచకపోయినా అన్నం తినడానికి అనువుగా ఉంటుంది. ధాన్యం పొట్టు, తవుడులో ఉన్న పోషకాలు బియ్యపు గింజలోకి చేరతాయి. పచ్చిబియ్యంతో పోలిస్తే ఎక్కువ ఫైబర్, విటమిన్లు ఉంటాయి. గ్లైసెమిక్ ఇండెక్స్(జీఐ) తక్కువ. ఈ ప్రక్రియలో రైతులకు ధాన్యం ఆరబెట్టడం, నిల్వచేయడం అక్కర్లేదు.

ఎన్నో సమస్యలకు పరిష్కారం



రాష్ట్రంలోని మధ్యాహ్న భోజనం, పీడీఎస్, ఇతర సంక్షేమ పథకాలకు ఆవిరితో తయారైన బియ్యం అనుకూలం. సాధారణ బియ్యంతో పోలిస్తే పోషకాలు, మెరుగ్గా జీర్ణం కావడం, నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు అనేక ప్రయోజనాలున్నాయి. రాష్ట్రంలో పండించే అన్ని రకాల ధాన్యం ఈ విధానంలో బియ్యం తయారీకి అనువైనవే. అధిక తేమతో కూడిన ధాన్యాన్ని సులభంగా బియ్యంగా మార్చవచ్చు.

-డాక్టర్ పాలడుగు సత్యనారాయణ, పరిశోధన సంచాలకుడు, ఆంగ్రూ

బియ్యంలో పోషకాలు	పచ్చిబియ్యంతో పోలిస్తే ఆవిరి బియ్యంలో ఇలా..
థయమిన్(విటమిన్-బి)	3 రెట్లు ఎక్కువ
నయాసిన్(విటమిన్-బి3)	5-6 రెట్లు ఎక్కువ
ఇనుము	2 రెట్లు ఎక్కువ
మెగ్నీషియం(ఎంజీ)	ఎక్కువ
ఫైబర్	2 రెట్లు ఎక్కువ
ఫైటిక్ యాసిడ్	తక్కువ కలిగి పోషకాలు శరీరానికి అందుతాయి

ప్రయోజనాలు ఇవీ..

- అన్నం పొడిగా ఉండి ముద్దగా మారదు.
- 3-4 గంటల వరకు అన్నం రుచి, నాణ్యత బాగుంటుంది. అన్నం గట్టిపడదు, నీరు కారదు, చెడిపోదు.
- అమైలోజ్ శాతం ఎక్కువ. దీనివల్ల రక్తహీనత, విటమిన్ 'బి' లోపం తగ్గి పిల్లల్లో ఆరోగ్యం మెరుగుపడడానికి సహాయపడుతుంది.
- పాలిషింగ్ సమయంలో సూక్ష్మపోషకాల నష్టం తక్కువ.

తుపాకీతో కాల్చేయత్నం కేసులో... ముగ్గురి అరెస్టు

నిందితుల్లో వైకాపా నాయకుడు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ రైల్వేకాలనీ బైకు పార్కింగ్ స్థలంలో తుపాకీతో బెదిరించి, దాడికి యత్నించిన కేసులో వైకాపా నాయకుడు, పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ ఉపాధ్యక్షుడు మీసాల సురేష్‌బాబును పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఈ మేరకు డీఎస్పీ షేక్ షహబాజ్ అహ్మద్ వివరాలు వెల్లడించారు. రైల్వేకాలనీలో పార్కింగ్ స్థలం కాంట్రాక్టును టెండర్ ద్వారా ఒడిశాలోని ఖుర్దాకు చెందిన కె.జగన్నాథరావు దక్కించుకున్నారు. ఈ నెల 10 నుంచి ఆయన పార్కింగ్‌ను నిర్వహించాల్సి ఉంది. 9న రాత్రి 12 గంటల తర్వాత జగన్నాథరావు తన వారితో కలిసి స్థలం వద్దకు వెళ్లారు. టెండర్ తమకు వచ్చిందని స్థలం అప్పగించాలని కోరారు. అప్పటి వరకు పార్కింగ్‌ను నిర్వహిస్తున్న మీసాల సురేష్‌బాబుతో పాటు చిన్నారావు, మోహనరావు, మున్నా ఎలియాస్ సందీప్‌లు సబ్ కాంట్రాక్టు పొందాలనే ఉద్దేశంతో జగన్నాథరావును తుపాకీ, మారణాయుధాలతో బెదిరించారు. దాడి చేయబోయారు. తుపాకీతో కాల్చేందుకు చిన్నారావు ప్రయత్నించాడు. ఈ మేరకు జగన్నాథరావు ఫిర్యాదు ఇవ్వడంతో సురేష్‌బాబుతోపాటు చిన్నారావు, మోహనరావులను ఆదివారం కోసంగిపురం కూడలి వద్ద పోలీసులు అరెస్టుచేశారు. తపంచా(తుపాకీ), 4 రౌండ్ల బులెట్లు, మారణాయుధాలు, ద్విచక్ర వాహనం, మూడు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మున్నాను అరెస్టు చేయాల్సి ఉందని, గతంలో సురేష్‌బాబుపై 4 కేసులు, చిన్నారావు, మోహనరావులపై 8 చొప్పున కేసులు ఉన్నాయని డీఎస్పీ పేర్కొన్నారు. చిన్నారావు, మోహనరావులు సురేష్‌బాబుకు చిన్నాన్నలు.

కాంతి.. చామంతి!



పగలు సమయం తక్కువగా ఉండే నవంబర్-ఫిబ్రవరి మధ్య సమయం చామంతి పంటకు అన్‌సీజన్. ఈ వాతావరణంలోనూ పంట దిగుబడిని పెంచడానికి చిత్తూరు జిల్లా వి.కోట మండలం మద్దిరాళ్లకు చెందిన రైతు కుమార్‌రెడ్డి వినూత్నంగా ఆలోచించారు. రాత్రి వేళ కూడా పంటకు వెలుగులందేలా ఇలా విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు.

– న్యూస్‌టుడే, వి.కోట

మాస్టారు.. మీరే మా స్టారు!



ప్రకాశం జిల్లా ఒంగోలులోని పిశుపాటి వెంకట రంగయ్య (పీవీఆర్) మున్సిపల్ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా ఆదివారం పూర్వ విద్యార్థులంతా కలిసి నాటి ప్రధానోపాధ్యాయుడు కొప్పోలు హనుమంతరావు(95)ను గుర్రపు బగ్గీపై ఊరేగించారు. మరికొందరు విశ్రాంత ఉపాధ్యాయులను కార్లలో వేదిక వద్దకు తీసుకొచ్చారు.

– ఈనాడు-ఒంగోలు; న్యూస్‌టుడే-ఒంగోలు నగరం

నేటి నుంచి శ్రీశైలంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి 18 వరకు నిర్వహించనున్నట్లు ఆదివారం దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఉదయం 9.15 గంటలకు ఉత్సవ ప్రారంభ పూజలు, రాత్రి 7 గంటలకు ప్రధాన ధ్వజావిష్కరణ కార్యక్రమాలతో శాస్త్రోక్తంగా ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నట్లు ఈవో చెప్పారు. 13 నుంచి స్వామి, అమ్మవార్లకు వాహన సేవలు, గ్రామోత్సవాలు జరుగుతాయన్నారు. 15న సంక్రాంతి పర్వదినం రోజు శ్రీపార్వతీ సమేత మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవ కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో రుద్ర, మృత్యుంజయ, గణపతి హోమాలు, స్వామి, అమ్మవార్ల లీలా కల్యాణం, సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని నిలిపివేసినట్లు వెల్లడించారు.

అల్మాంట్-కిడ్ సిరప్ సరఫరా కాలేదు

ఈనాడు, అమరావతి: చిన్నారుల్లో జలుబు తగ్గించటం కోసమంటూ వాడే అల్మాంట్-కిడ్ సిరప్ రాష్ట్రానికి సరఫరా కాలేదని ఔషధ నియంత్రణ మండలి ఓ ప్రకటనలో తెలిపింది. 'బిహార్‌కు చెందిన ట్రిడస్ రెమెడీస్ సంస్థ తయారు చేసిన ఏఎల్-24002 బ్యాచ్ సిరప్‌లో మోతాదుకు మించి ఇథిలీన్ గ్లైకాల్ ఉన్నట్లు కోల్‌కతాలో నిర్వహించిన పరీక్షల్లో తేలింది. ఈ నేపథ్యంలో ఏపీ వ్యాప్తంగా అన్ని దుకాణాల్లో తనిఖీలు చేపట్టాం. ఈ సిరప్ రాష్ట్రానికి దిగుమతే కాలేదు' అని స్పష్టం చేసింది.



మనసారా నవ్వండి.. కంటి నిండా నిద్రపోండి

మనసారా నవ్వడం, కంటి నిండా నిద్రపోవడం.. ఈ రెండూ ఎన్నో జబ్బులను నివారించే దివ్యౌషధాలు. సరిగా నిద్రపోకపోతే గుండె సంబంధ వ్యాధులు, మధుమేహం, ఊబకాయం, దీర్ఘకాలిక జబ్బుల బారినపడే ముప్పుంది. అందుకే నిద్రను నిర్లక్ష్యం చేయకండి.

– శ్రేయా షా, న్యూట్రిషనిస్ట్

అమరావతిపై విషం కక్కితే.. ప్రజలు రాజకీయంగా సమాధి కడతారు

- జగన్‌పై మండిపడ్డ విశ్రాంత డీజీ ఏబీ వెంకటేశ్వరరావు


సమావేశంలో విశ్రాంత డీజీ ఏబీ వెంకటేశ్వరరావు, అమరావతి ఐకాస నాయకులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: ప్రతిపక్ష హోదా కూడా లేని వైకాపా అధినేత జగన్‌కు అమరావతిపై మాట్లాడే అర్హత లేదని రాజధాని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. అమరావతిపై విషం కక్కితే రానున్న రోజుల్లో ప్రజలు వైకాపాకు రాజకీయంగా సమాధి కడతారని హెచ్చరించారు. ఆదివారం రాజధాని గ్రామం మందడం రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి విశ్రాంత డీజీ ఏబీ వెంకటేశ్వరరావు, రాజధాని రైతులు, మహిళలు, అమరావతి ఐకాస నాయకులు హాజరయ్యారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 'జగన్ మాటలను పట్టించుకోవడం వల్ల సమయం వృథా తప్ప ఒరిగేది ఏమీ లేదు. అమరావతికి శంకుస్థాపనకు ఆహ్వానం పంపిన రోజు తాను రానంటూ జగన్ లేఖ రాశారు. అసెంబ్లీలో అమరావతిని రాజధానిగా ప్రకటించిన నాడు ఆయన మొహం చూస్తేనే అతని వైఖరి అర్థమవుతుంది. ఆయన మానసిక వ్యాధితో బాధపడుతున్నారు. ఆయన్ను చూసి ఈ ప్రభుత్వం భయపడుతోందనే అనుమానం కలుగుతుంది. రాజధాని కోసం రెండో విడత భూములు తీసుకుని ఏం చేస్తారు? విధి విధానాలను రైతులు ప్రభుత్వాన్ని అడిగి తెలుసుకోవాలి' అని సూచించారు.

◆ రాజధాని మహిళలు మాట్లాడుతూ 'వైకాపా పాలనలో జగన్‌కు ఎక్కడ కూర్చొని పాలన చేశారో తెలియడం లేదా? జగన్ కట్టుకున్న ఇల్లు కూడా అమరావతిలోనే ఉంది. ఆయన ఇన్నాళ్లూ నీటిలో నివాసం ఉన్నారా? ఆయన మానసిక స్థితి సరిగా లేదు' అంటూ మండిపడ్డారు. ఐకాస నాయకుడు వెలగపూడి గోపాలకృష్ణ మాట్లాడుతూ జగన్ ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజధాని ఐకాస నాయకులు బెల్లంకొండ నరసింహారావు, కిరణ్, మాదిగ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ శిరీష, కళ్ళం రాజశేఖరరెడ్డి, కొమ్మినేని వరలక్ష్మి, మందడం ఫార్మర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కట్టా రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

త్వరలో రాజకీయ పార్టీ పెడతాం

ఏబీ వెంకటేశ్వరరావు

ఈనాడు, అమరావతి: 'రాష్ట్ర పురోగతి కోసం నా ఆలోచనలకు తగ్గట్టుగా ఉండే వారితో కలిసి త్వరలోనే ఓ రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తాను. గత ఏప్రిల్ 13న రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నట్టు ప్రకటించాను. అప్పటి నుంచి అదే పనిమీద ఉన్నా. అందుకు తగిన ఆర్థిక శక్తిని సమకూర్చుకుని.. త్వరలోనే పార్టీని పెడతాను' అని విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ప్రకటించారు. స్వేచ్ఛగా అభిప్రాయాలు, ఆలోచనలు, భావాలను చెప్పేందుకు విజయవాడలో ఓ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. విజయవాడలోని సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సంక్రాంతి ఆత్మీయ కలయికలో వెంకటేశ్వరరావు మాట్లాడారు. అమెరికా లాంటి దేశాలు చిన్న దేశాలపై దాడులు చేస్తున్న ఈ సమయంలో భారతదేశం బలంగా నిలబడాలన్నారు. దేశాభివృద్ధి అంటే కార్పొరేట్ శక్తులు అభివృద్ధి చెందడం కాదని, ప్రజలందరూ అభివృద్ధి చెందాలని అభిప్రాయపడ్డారు.

సాహసం... వీళ్ల మారుపేరు!


'మందిలో ఒక్కరిలా కాదు... వందలో ఒక్కరుగా నిలవాలి' అన్న వివేకానంద మాటని వీళ్లు తు.చ. తప్పకుండా పాటిస్తున్నారు. కాబట్టే, తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. తమని తాము తీర్చిదిద్దుకుంటూ గెలుపు మార్గంలో దూసుకెళ్తున్నారు... ఈ యువ కెరటాలు! వీళ్లని మీరూ కలుసుకోండి.

ఒక్కటే మిగిలింది..



ఎక్స్‌ప్లోరర్స్ గ్రాండ్ స్లామ్... ఏడు ఖండాల్లోని ఏడు ఎత్తయిన శిఖరాలను అధిరోహించడంతోపాటు ఉత్తర, దక్షిణ ధ్రువాలకూ చేరుకోవడంతో పూర్తయ్యే సాహస యాత్ర. ఈ సాహసాన్ని లక్ష్యంగా పెట్టుకుంది 18ఏళ్ల **కామ్య కార్తికేయన్.** ఈ క్రమంలో ఏడు శిఖరాలు ఆమెకు తలవంచాయి. ఇటీవలే దక్షిణ ధ్రువాన్నీ చేరుకుని... ఆ ఘనత సాధించిన అతి పిన్న భారతీయురాలిగా నిలిచింది. ప్రపంచంలో రెండో స్థానం. కామ్యది వైజాగ్. తండ్రి నేవీ ఆఫీసర్. ఆయనతో కలిసి మూడేళ్ల వయసు నుంచే పర్వతారోహణకు వెళ్లేది. అలా ఆమెకూ ఆసక్తి కలిగింది. స్కీయింగ్‌నీ చేస్తుంది. ఎవరెస్ట్ బేస్ క్యాంప్, కేదార్‌కాంతా, రూప్‌కుండ్ సరస్సు... వంటివి అధిరోహించాక '7 సమ్మిట్ ఛాలెంజ్'... ఏడు ఖండాల్లో 7 ఎత్తయిన శిఖరాలను అధిరోహించాలని లక్ష్యంగా పెట్టుకుంది. నాలుగేళ్లలోనే పూర్తిచేసి, ప్రపంచంలోనే ఆ ఘనత సాధించిన పిన్న అమ్మాయిగా చరిత్రకెక్కింది. 'ధైర్యం, ఓర్పు, సహనం వంటివి జీవితానికి చాలా అవసరం. ఈ పాఠాలన్నీ పర్వతారోహణ నాకు నేర్పింది. భూమిపై అత్యంత అద్భుతమైన ప్రదేశమేదంటే పర్వతాలనే చెబుతా' అనే కామ్య... తన తరవాతి లక్ష్యంగా ఉత్తర, దక్షిణ ధ్రువాలను పెట్టుకుంది. -30 డిగ్రీల చలి వాతావరణం, ఈదురు గాలుల మధ్య 115కి.మీ. నడిచి దక్షిణ ధ్రువాన్ని పూర్తిచేసింది. అదీ కిలోల కొద్దీ బరువును లాగుతూ! త్వరలోనే ఉత్తర ధ్రువాన్నీ చేరుకుంటానంటోంది.

వ్యాధి ఆపలేకపోయింది!



2024 నవంబరు... జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలు. ట్రాక్‌పై అథ్లెట్లు పరుగెడుతున్నారు. కానీ **దేవకి ధర్** పరుగు ఆగిపోయింది. 'నన్ను పరీక్షించిన వైద్యులు మూర్ఛ అని నిర్ధారించారు. అప్పుడు నా ముందు 'ఇక నేను పరుగెత్తలేనా? శిక్షణ, పోటీలనుంచి విరామం తీసుకోవాలా? జీవితాంతం మందులు మింగాల్సిందేనా?' అంటూ బోలెడు సందేహాలు. మెల్లగా వ్యాధి లక్షణాలు బయట పడ్డాయి. రెండునెలల్లోనే ఆరు కిలోల బరువు తగ్గాను. బలహీనత, ఆకలి లేదు, నిద్రలేమి. ఒక క్రీడాకారిణికి ఇంతకంటే మరో శిక్ష ఉండదు' అంటుంది 19ఏళ్ల దేవకి. కానీ తను ఓటమిని అంగీకరించలేదు. ఈమెది దిల్లీ. మాజీ స్ప్రింటర్ బిందు రాణి గౌడ దగ్గర శిక్షణలో చేరింది. ఆరోగ్యం, విశ్రాంతికి సమయమిస్తూనే శిక్షణ కొనసాగించింది. 'ముందు నా జీవితంలో వచ్చిన మార్పుని అంగీకరించా. లేదంటే కోలుకోలేను అనిపించింది. తరవాతే శిక్షణకు సిద్ధమయ్యా' అనే దేవకి తాజాగా దిల్లీ స్టేట్ అథ్లెటిక్స్ మీట్‌లో రజత పతకాన్ని గెలుచుకుంది. 'ఆ గెలుపు 'నీ పరుగు ఆగిపోలేదు' అని చెప్పినట్లు అనిపించింది. నా కలకి చేరువలో ఉన్నానని గుర్తు చేసింది' అంటోంది. ఆ ఉత్సాహంతో త్వరలో జరగబోయే ఇండోర్ నేషనల్స్, ఏషియన్ ఇండోర్ ఛాంపియన్‌షిప్, ఆసియా గేమ్స్‌కి సిద్ధమవుతోంది. 'అనారోగ్యాలు మన కలల్ని ఆపలేవు' అని యువతకి సందేశాన్నీ ఇస్తోంది.

సచిన్ తరవాత తనే!

'నాన్నా నాకు స్కేటింగ్ షూ కొనివ్వవా?' 8ఏళ్ల వయసులో **జాన్వీ జిందాల్** కోరిన కోరికను కాదనలేక కొనిచ్చాడు తండ్రి. కొనగానే సరా? వాడటమూ రావాలిగా! అందుకే ఆయనే యూట్యూబ్ ట్యుటోరియల్స్ చూసి నేర్పారు. అలా మొదలుపెట్టిన జాన్వీ సరదాకే పరిమితం కాలేదు. దాంతో ఏదైనా సాధించాలనుకుంది. ఈమెది ఛండీగఢ్. 'దగ్గర్లోని మార్కెట్ నా ప్రాక్టీసు స్థలం. మొదట్లో నాన్న నేర్పినా తరవాత నేనే యూట్యూబ్ చూసి సాధన మొదలుపెట్టా. రోలర్, ఇన్‌లైన్ ఫ్రీస్టైల్ స్కేటింగ్‌లతో పతకాలు సాధించొచ్చు అని తెలిశాక సీరియస్‌గా తీసుకున్నా. యోగా, జిమ్నాస్టిక్స్‌నీ సాధన చేశా. తొలిరోజుల్లో 40-50సార్లు పడేదాన్ని అయినా పట్టు వదల్లేదు' అనే జిందాల్ జాతీయస్థాయిలో పతకాలెన్నో సాధించింది. ఆ ఉత్సాహంతో రికార్డుల మీద కన్నేసింది. 'తొలి రికార్డు సాధించానని మెయిల్ వచ్చినప్పుడు నమ్మలేకపోయా. కానీ అది మరిన్ని సాధించాలన్న కలని తెచ్చింది. ఆక్సిజన్ స్థాయులు తక్కువ ఉండే ఖార్దుంగ్లా పాస్ మీద నిమిషానికి 54 స్పిన్స్ చేయడం నేను చేసిన అత్యంత కష్టమైన ఫీట్' అనే 18ఏళ్ల జాన్వీ ఏకంగా 11 గిన్నిస్ రికార్డులు సాధించింది. దేశంనుంచి అత్యంత ఎక్కువ గిన్నిస్ రికార్డులు సాధించిన అమ్మాయి. మొత్తంగా అయితే సచిన్ తరవాత రెండోస్థానం. ఈ క్రమంలో గాయాలెన్నో అయ్యాయి. అయినా ఏదైనా సాధించే క్రమంలో ఇవన్నీ చిన్న అవరోధాలే అంటుందీమె.



మమ్మల్ని కాపాడండి..!

కాపాడండి... మునిగిపోతున్నాం... అంటూ పిల్లలు, పెద్దల కేకలు, ఏడుపులతో మారుమోగింది దేవభూమి. భారీ శబ్దాలతో భవనాలు కూలి, నీట కొట్టుకుపోయాయి. 2013 కేదార్‌నాథ్‌లో జరిగిన వరద బీభత్సమిది. ఇవన్నీ టీవీలో లైవ్ చూస్తున్న **రిధిమా పాండే** మనసును కలచివేశాయి. అప్పటికి ఆమెకు ఐదేళ్లే. దీనికి కారణం ఏమిటని తండ్రిని అడిగితే... గ్లోబల్ వార్మింగ్ అన్నారట. అది మొదలు దీనిపై పోరాటం మొదలుపెట్టింది రిధిమా. ఈమెది ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్. అమ్మానాన్నలు ఇద్దరూ ప్రకృతి రక్షణకు పాటుపడేవాళ్లే. ఆ వారసత్వాన్నే పుణికి పుచ్చుకుందీమె. తొమ్మిదేళ్ల వయసులోనే... కర్బన ఉద్గారాల్ని నిర్మూలించడంలో విఫలమైన ప్రభుత్వానికి వ్యతిరేకంగా గ్రీన్ ట్రైబ్యునల్‌లో పిటిషన్ దాఖలు చేసింది. స్కూల్, చుట్టుపక్కల ప్రాంతాల వరకే పరిమితమైన రిధిమా గళం దేశవ్యాప్తంగా వినిపించింది అప్పుడే. ఈ యువ పర్యావరణ ఉద్యమకారిణి చేసిన నిరసనలు, రాసిన లేఖలు అన్నీ ప్రకృతి రక్షణకు అద్దం పట్టేవే. పదకొండేళ్ల వయసులో ఐక్యరాజ్య సమితి సమ్మిట్‌లో పాల్గొని వాతావరణ మార్పులు చిన్నారులపై చూపిస్తున్న ప్రభావంపై మాట్లాడిందీమె. మదర్ థెరిస్సా మెమోరియల్ అవార్డ్, నిక్‌లోడియన్ కిడ్స్ ఛాయిస్ అవార్డులు ఈమెను వరించాయి.



నేషనల్ యూత్ డే

వసుంధర

vasundhara@eenadu.in

సంక్రాంతి ముచ్చట్లు

అదో అరిసెల పురాణం!

సంక్రాంతి అంటే అరిసెలు తప్పనిసరి కదా! మా చిన్నప్పుడు కొలతలకు ఉపయోగించే సోల, తవ్వ, శేరు, గిద్ద వంటివాటితోపాటు వండటానికీ, చేసినవి పెట్టడానికీ అవసరమైన ఇత్తడి, కంచు పాత్రలు, గరిటెలు, కజ్జికాయ అచ్చులు, మురుకుల చిట్టి అన్నింటినీ బుధ, గురువారాల్లో అటక మీదనుంచి కిందకి తీయించేవారు. వాటిని సెనగపిండి, చింతపండు, ఇటుకపొడితో శుభ్రం చేయాల్సిన పని మాదే. బాండీలు, అరిసెల చెక్కలు, గరిటెలకు ఆ సమయంలో మహా డిమాండ్. మనం చేయడానికి ఇంకా సమయం ఉందిలే అని ఎవరికైనా ఇచ్చామో... అవి అక్కడ్నుంచి ఎన్ని ఇళ్లు మారతాయో! మనవి మనం తిరిగి తెచ్చుకోవడం కూడా ప్రహసనమే. అదో అరిసెల పురాణం. అంతేనా, పిండి పట్టించడానికీ పిల్లలే క్యూలో ఉండాలి. ఇక అమ్మావాళ్లు వండుతోంటే పీటలు సహా కావాల్సినవన్నీ మేమే అందించాలి. కొత్త గడ్డి తెప్పించి, వాటిమీద పేర్చడం, ఆపై బిందెల్లో సర్దడం భలే సరదా పని. సంక్రాంతి నాటికి పంపకాలన్నీ అయిపోయేవి. పోస్ట్‌మ్యాన్, వీధి చిమ్మేవారు, కరెంటు బిల్లు అతను... ఇలా ఎంతమందికి వాటాలు ఉండేవని? అదంతా ఎన్నెన్నో నేర్పేవి. ఇక సంక్రాంతికి మా ప్రాంతంలో సమాధుల పండుగ ఉంటుంది. పూర్వికుల సమాధుల్ని శుభ్రం చేసి, సాయంత్రం పెద్దలకు కొబ్బరికాయ, పిండి వంటలు నైవేద్యం పెడతాం.

– ఎం.వి. ఉమాదేవి, నెల్లూరు



పండుగ పరమార్థం అదే!

ప్రకృతికి మనిషి చెప్పే కృతజ్ఞతే సంక్రాంతి. ఇది మన పురాతన పండుగ. సూర్యుడిని ఆరాధించడం, రైతుని గౌరవించడం, పశువులనీ కుటుంబ సభ్యుల్లా చూడటం వంటివి దీనిలో కనిపిస్తాయి. ముంగిళ్లన్నీ రంగుల ముగ్గులతో శోభిస్తోంటే బంధుమిత్రులంతా ఒకచోట కలిసి గృహాలన్నీ ఆనందంతో నిండిపోయేవి. హరిదాసు గీతాలు, గంగిరెద్దుల ఆటలు, ఆడపిల్లల గొబ్బిపాటలు, బొమ్మల కొలువులు మన జీవన సౌందర్యాన్ని ఆవిష్కరిస్తాయి. కానీ పండుగ తీరు మారుతోంది. పర్యావరణానికి హాని కలిగిస్తూ, కాలుష్యాలు పెంచే కృత్రిమ పదార్థాలకు దూరంగా ఉండాలి. ప్రకృతిని పూజిస్తూ, ఆనందాల్ని నలుగురితో పంచుకుంటూ ప్రాచీన సంప్రదాయాల పునరుద్ధరణ జరగాలి. నిజానికి అదే పండుగ పరమార్థం కూడా. దాన్ని భావితరాలకు అందిద్దాం.

– బందా లక్ష్మి, బెంగళూరు



ఆత్మీయ అనుబంధం!

పండుగంటే పల్లె వైపే మనసు లాగుతుంది. అదీకాక సంక్రాంతికి చుట్టాలతో మా ఇల్లు కళకళలాడేది. మా ఊరు రావాలంటే కిలోమీటరు దూరంలోని చెరువు గట్టు దగ్గరే దిగాలి. అక్కణ్నుంచి నడిచొస్తోంటే ఓ పక్క పెద్ద చెరువు, ఒడ్డున శివాలయం. మరోపక్క రామాలయం కనిపిస్తాయి. ఆ చల్లగాలిని పీలుస్తూ, పచ్చదనాన్ని ఆస్వాదిస్తూ వస్తోంటే మనసంతా ఆనందంతో నిండిపోతుంది. పట్టు పరికిణీ, తలనిండా పూలని అలంకరించుకుని నానమ్మ పక్కన చేరిపోయేవాళ్లం. పండుగ సంస్కృతి, దాని చుట్టూ ముడిపడ్డ కథలు, తన చిన్ననాటి సంగతులు అన్నీ చెబుతోంటే శ్రద్ధగా వినేవాళ్లం. ఈ సమయంలో వరికుప్పల నూర్పులు జరిగి వడ్లు ఇంటికి వచ్చేవి. కనుమరోజున పనివాళ్లందరికీ బియ్యం, దుస్తులు పంచేవాళ్లం. ఇది మాకు వేడుక కాదు... ఆత్మీయ అనుబంధం.

– డాక్టర్ బొబ్బా మాధురి, యలవర్రు గ్రామం, బాపట్ల



ఆ ప్రశ్న వేసుకోండి!

ప్రేరణ

ఆమె సీఏ చేశారు. కెరియర్‌లో ఒక్కో అడుగు పైకెళ్తూ నేడు హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్‌కి ఎండీ, సీఈఓగా ఉన్నారు. దేశంలో అత్యంత శక్తిమంతమైన మహిళల్లో ఒకరిగా గుర్తింపు సాధించారు **విభా పడల్కర్.** కెరియర్ విషయంలో ఆమె ఇచ్చే సలహాలివి...



- కెరియర్‌లో దీర్ఘకాల ప్రణాళికతో ఉండండి. హోదాల కోసం పరుగెత్తకండి. పనితనం విలువని పెంచేలా ఉండాలి. మీ బలాలను ప్రదర్శించే దారుల్ని వెతకండి. సీనియర్ల గైడెన్స్, మెంటార్‌షిప్‌ను తీసుకోండి. చాలా సంస్థలు మహిళలకు అనుకూలమైన సదుపాయాలు కల్పిస్తున్నాయి. వాటిని తెలివిగా వాడుకోండి.
- సోమవారం ఆఫీసుకి వెళ్లడానికి ఉత్సాహంగా ఉంటే ఆ ఉద్యోగంలో కొనసాగండి. అక్కడ కొత్త అవకాశాల కోసమూ ప్రయత్నించండి. ఉద్యోగం మారడానికి జీతం పెరగడం ఒక్కటే కాకుండా ఇంకేదైనా మంచి కారణం ఉండాలి. అలాగని తరచూ కంపెనీలు మారినా ఏమీ నేర్చుకోలేరు. నాకు ఛాలెంజింగ్‌గా లేని రోజున కంపెనీలు మారాను. ప్రస్తుత కంపెనీలో ప్రజా ప్రయోజనం ఉండటంతో ఒక సంతృప్తి ఉంది. 17 ఏళ్లుగా దీన్లో కొనసాగుతున్నా.
- ప్రతి పనిలోనూ ముందుచూపు ఉండాలి. దశాబ్దం కిందటే కంపెనీని డిజిటల్ దిశగా నడిపించా. కొవిడ్ సమయంలో.. పెద్ద సంఖ్యలో క్లెయిమ్‌లు నమోదయ్యాయి. టెక్నాలజీలో అప్పటికే ముందు ఉండటంతో క్లెయిమ్‌ల ప్రాసెస్‌ని వేగవంతంగా చేయగలిగాం. ఆ వేగం, విజయవంతమైన క్లెయిమ్‌ల శాతం కంపెనీపైన విశ్వాసాన్ని పెంచాయి.
- మగవాళ్లతో పోల్చితే కెరియర్ ప్రారంభంలో మహిళల పురోగతి నెమ్మదిగా ఉండొచ్చు. అది కొన్నిరోజులే. చివరకు ప్రతిభనుబట్టే ఎవరైనా పైపైకి వెళ్తారు. మహిళల విజయగాథలు పదిమందికీ తెలియాలి. అవి మరింత మంది ప్రయాణాన్ని కొనసాగించేందుకు స్ఫూర్తినిస్తాయి. తరచూ అలాంటివి చదవండి.

మంచివాడే కానీ..?

నా స్నేహితురాలికి పెళ్లయ్యి ఇద్దరు పిల్లలు. ఓ సంస్థలో పనిచేస్తోంది. పనిచేసే చోట ఓ వ్యక్తి తనను ఇష్టపడుతున్నాడు. ఆయనకు భార్య చనిపోయింది. ఇది తప్పని తనెంత చెప్పినా వినడం లేదు. పైగా తననే కన్విన్స్ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. తను చాలా కష్టాల్లో ఉంది. ఉద్యోగం వదిలేసి ఇంకో దగ్గరికి వెళ్లలేదు. అలాగని ఈ పరిస్థితిని ఇంట్లోనూ చెప్పలేదు. ఆ వ్యక్తి, ఆమె భర్తకీ సుపరిచితుడే. దాంతో భర్తతో చెప్పలేక, ఇటు ఆ వ్యక్తిని ఖండించలేక ఇబ్బంది పడుతోంది. కఠినంగా నడుచుకుందాం అంటే ఆ వ్యక్తి చెడ్డవాడూ కాదు. తనని ఈ సమస్య నుంచి బయటపడేసేదెలా?

-ఓ సోదరి

మీ స్నేహితురాలు భర్త, పిల్లలతో స్థిరమైన వివాహ బంధంలో ఉంది. అవసరం మేరకు ఉద్యోగం చేస్తోంది. పనిచేసే చోట ఇలాంటి సమస్యలు వస్తూ ఉంటాయి. కానీ... ఆమె పరిస్థితి, భర్త, పిల్లలు అన్ని విషయాలూ తెలిసి... అతను మీ స్నేహితురాలిపై ఇలాంటి అభిప్రాయాన్ని వ్యక్తపరచడం సబబు కాదు. ఆమెపై ఒత్తిడి తేవడం మంచిదీ కాదు. ఆమె ఎంత చెబుతున్నా తీరు మార్చుకోవట్లేదంటే ఆయన మానసిక పరిస్థితి సరిగా లేనట్లు అర్థమవుతోంది. భార్య స్థానాన్ని భర్తీ చేయడానికి ప్రయత్నిస్తున్నాడే తప్ప... అవతలి వ్యక్తి కుటుంబం గురించి ఆలోచించే పరిస్థితుల్లో అతను లేడని తెలుస్తోంది. అనవసరమైన పరిణామాలు చోటుచేసుకోక ముందే... విషయాన్ని ఇంట్లో చెప్పమని మీ స్నేహితురాలికి ధైర్యం చెప్పండి. తన భర్త బాధపడతారనో, తర్వాత వచ్చే సమస్యల గురించి ఆలోచించో ఆమె ఇప్పుడు చెప్పడానికి సంశయిస్తే... దీన్ని ఆమె బలహీనతగా భావించే అవకాశం ఉంది. పైగా సంస్థలో, ఇంట్లో ఆమెపై చెడుగానూ అనుకుంటారు. కాబట్టి, పరిణామాల గురించి ఆలోచిస్తూ కూర్చోకుండా సమస్యను ఇంట్లో వాళ్లకి చెప్పటమే మంచిది. అతను ఎలానూ ఆమె భర్తకు తెలిసిన వాడు, మంచి వాడు అంటున్నారు కాబట్టి... తరవాత ఏం చేయాలనేది భార్యాభర్తలు కలిసి నిర్ణయం తీసుకోవచ్చు.

డియర్ వసుంధర



డా. మండాది గౌరీదేవి
మానసిక నిపుణురాలు

కొంచెంగా ఎక్కువసార్లు తినండి!

చలికాలం వేడివేడిగా ఏదైనా తాగాలనో తినాలనో అనిపిస్తుంటుంది. కానీ తీరిక లేకనో తమమీద శ్రద్ధ లేకనో మహిళలు టీ, కాఫీలనే ఎక్కువగా ఆశ్రయిస్తుంటారు. దాంతో అలసట, డీహైడ్రేషన్ బారినపడుతుంటారు. చర్మం పొడిబారుతుంది. అందుకే ఈ కాలంలోనే పోషకాహారం మరింత ముఖ్యం.



- రోగనిరోధక శక్తిని పెంచే విటమిన్-సి ఎక్కువగా ఉండే సీజనల్ పండ్లు ఏవైనా తినొచ్చు. వీటితోపాటు తులసి, అల్లం, పసుపు, దాల్చినచెక్క, మిరియాలు వంటివి వాడితే శ్వాసకోశ సమస్యలు రాకుండా ఉంటాయి. ఇవి వేడిని కలిగించడంతోపాటు గ్యాస్ సమస్యల్నీ నియంత్రిస్తాయి.
- కండరబలంకోసం గుడ్లు, పనీర్, గింజలు... వంటి ప్రొటీన్ ఆహారాన్నీ తప్పక తీసుకోవాలి.
- తృణధాన్యాలు, కూరగాయలు, పండ్లు... వంటి వాటిని ఆహారంలో విధిగా చేర్చుకోవాలి. ఇవి తక్షణ శక్తిని అందిస్తాయి.
- వీలైనంతవరకూ స్వీట్లు తగ్గించండి. తినాలనిపిస్తే ఇంట్లో చేసిన నువ్వులు, పల్లీ లడ్డూలు తినండి.
- తక్కువ పరిమాణంలో ఎక్కువసార్లు తింటే రక్తంలో చక్కెరస్థాయులు నియంత్రణలో ఉండి, క్రేవింగ్స్ కూడా తగ్గుతాయి.




ప్లాస్టిక్‌ని అంతం చేయాలనుకున్నారు వారంతా. అంతేనా, పర్యావరణంపై అవగాహన కల్పిస్తూనే సాధికారతనూ పెంచుకున్నారు. అందుకు యూవీ ఆటోల్లో క్లాత్ సంచులతో పండ్లు, కాయగూరలు అమ్ముతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

చెన్నై... చేతిసంచీ!

చెన్నై అనగానే గుర్తొచ్చేది... సాంబార్ ఇడ్లీ, ఫిల్టర్ కాఫీ, మెరీనా బీచ్ కదా! ఇకపై ఈ ఆలోచనను మార్చాలనుకున్నారీ మహిళలు. అందుకు ఏం చేస్తున్నారంటే... ఈవీ (ఎలక్ట్రానిక్) ఆటోల్లో మొబైల్ దుకాణాలను ఏర్పాటుచేశారు. పండ్లు, కాయగూరలను తీసుకెళ్లే సంచులనూ పర్యావరణ హితమైనవే ఎంచుకున్నారు. తమిళనాడు ప్రభుత్వం మూడేళ్ల క్రితం ప్లాస్టిక్‌ని తగ్గించాలంటూ 'మీండుం మంజపై' (చేతిసంచీని తిరిగొచ్చింది)ని తీసుకొచ్చింది. దీని కోసం చెన్నై సహా నలభైచోట్ల వెండింగ్ మెషీన్లనూ ఏర్పాటుచేసింది. ఆ ఆలోచనని ప్రజల్లోకి తీసుకెళ్లాలనుకున్నారు పొదుపు సంఘ మహిళలు. ప్రభుత్వ రుణాలతో ఈవీ ఆటోలను కొనుగోలు చేసుకున్నారు. చెన్నై పరిసర ప్రాంతాల్లో ఇలా మొబైల్ మార్కెట్లు నిర్వహిస్తున్నారు. పేరుకి వ్యాపారమైనా వాళ్ల ఆటోలో సరకుల కంటే ప్రచార సామగ్రే ఎక్కువ ఉంటుందట. 'కాయగూరలతోపాటు చిన్న మైక్ సెట్లను తీసుకెళతాం. 'ప్లాస్టిక్ సంచులకి బదులు వస్త్ర బ్యాగులనే వాడాలి. పెట్రోల్‌కి బదులు ఈవీ వాహనాలు ఎంచుకోవాలి' అంటూ ప్రచారం చేస్తాం. ఒకప్పుడు ఎక్కడికెళ్లినా చేతి సంచీ తీసుకెళ్లేవాళ్లం. రానురానూ ప్లాస్టిక్ కవర్లకి అలవాటు పడ్డాం. తిరిగి ఆ పాత సంప్రదాయ పద్ధతినే నేటి తరాలకి అలవాటు చేయాలనే ఉద్దేశంతో దీన్ని మొదలుపెట్టాం' అంటున్న వీళ్ల ఆలోచన అభినందించదగినదే కదా!

రంగవల్లిక



బి. సంధ్య, చెన్నూర్ — 24 చుక్కలు, 2 వరుసలు, 2 వచ్చేవరకూ సరి చుక్క



ఎం. శ్రీక, హైదరాబాద్ — 16 చుక్కలు, 2 వరుసలు, 2 వచ్చేవరకూ



జీవన స్రవంతి, హైదరాబాద్ — 15 చుక్కలు, 15 వరుసలు

ఈ జంతువులు ఇంట్లో పెరుగుతాయి..!

స్వీట్ హోమ్



చిట్టి కుందేలు, బుల్లి ఏనుగు, చిన్ని ఎలుగుబంటి... జూలో ఉండాల్సిన జంతువుల జాబితాను చదువుతున్నట్లు ఉంది కదా! కానీ ఇవన్నీ ఇంట్లో మొక్కల్ని పెంచుకునే 'కోకో కాయిర్ ప్లాంటర్ పాట్స్'. ఈ రోజుల్లో ప్రతి వస్తువూ పర్యావరణహితంగా ఉండాలనుకునే ఇంటీరియర్ ప్రేమికులకోసం ప్రత్యేకంగా వీటిని చేతితో తయారుచేస్తున్నారు తయారీదారులు. ముందు లోపల చిన్న మట్టి కుండీని పెడతారు. తర్వాత కొబ్బరి పీచుని కావాల్సిన ఆకృతిలో మలిచి చింతగింజల గ్లూతో అతికించి, సహజ రంగులు వేసి ఈ ఎకో ఫ్రెండ్లీ పాట్స్‌ని తయారుచేస్తారు. ప్లాస్టిక్ పాట్స్‌కి ప్రత్యామ్నాయంగా వీటిని ఇండోర్, బాల్కనీ, కిచెన్ గార్డెన్, ఆఫీస్ డెస్కుల్లోనూ ఉపయోగించుకోవచ్చు. మొక్కలకు నీటిని పోసినప్పుడు టేబుల్‌పై పడకుండా పీల్చుకోవడంతోపాటు మొక్క ఆరోగ్యంగా ఎదిగేందుకు తోడ్పడతాయి. వేర్లకు సహజంగా గాలి సరఫరా అయ్యేలా చేయడంతోపాటు మట్టి తేమను కోల్పోకుండా కాపాడతాయి. మరి ఆత్మీయుల పుట్టినరోజు, పెళ్లిరోజులకు బహుమతిగా ఇచ్చేయండి.



'స్వామి' స్ఫూర్తితో దేశసేవకి అంకితమై..!

సిస్టర్ నివేదిత... స్వామి వివేకానంద శిష్యురాలిగా సుపరిచితమే. ఈమె అసలు పేరు మార్గరెట్ ఎలిజబెత్ నోబెల్. ప్రపంచవ్యాప్తంగా వివేకానంద ప్రసంగాలకి ప్రభావితమై అభిమానులుగా మారడమే కాదు, బ్రహ్మచర్యాన్నీ పాటించిన పాశ్చాత్య మహిళా శిష్యులెందరో. వాళ్లలో ఒకరీమె. ఐర్లాండ్‌లో జన్మించిన ఈమె 1895లో లండన్‌లో తొలిసారిగా వివేకానందను కలిశారు. అప్పటికే ఉపాధ్యాయవృత్తిలో ఉన్న ఆమె, తరవాత 1898లో భారతావనికి వచ్చి దీక్ష తీసుకొన్నారు. అప్పుడే వివేకానంద ఆమెకు నివేదిత అన్న పేరు పెట్టారు. మహిళలు, బాలికల విద్యకీ సామాజిక సేవకీ అంకితమయ్యారీమె. భారత స్వాతంత్ర్యోద్యమంలోనూ పాల్గొన్నారు. తొలినాటి జాతీయ జెండాకీ రూపకల్పన చేశారు. ద మాస్టర్ యాజ్ ఐ సా హిమ్ (వివేకానంద జీవితచరిత్ర), ది వెబ్ ఆఫ్ ఇండియన్ లైఫ్, క్రేడల్ టేల్స్ ఆఫ్ హిందూయిజం... వంటి ఎన్నో పుస్తకాల్ని రచించి, 43 ఏళ్ల వయసులోనే డార్జిలింగ్‌లో మరణించారు. ఆమె గుర్తుగా అక్కడ నిర్మించిన స్మారకచిహ్నంపై 'భారతదేశానికి సర్వస్వాన్ని ఇచ్చిన సిస్టర్ నివేదిత ఇక్కడ విశ్రాంతి తీసుకుంటోంది' అని రాసి ఉంటుంది.



సాఫ్ట్‌వేర్ కొలువు వదిలేసి.. సలాడ్ ఆకు సాగుతో రూ.కోట్లు

హరియాణాలోని కురుక్షేత్రకు చెందిన వినీత్ సింగ్‌కు సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో ఏడాదికి రూ.18 లక్షల జీతం వస్తున్నా.. సొంతూరిపై ఉన్న మక్కువతో ఆ ఉద్యోగం వదులుకొని 2003లో స్వగ్రామానికి వచ్చేశారు. వ్యవసాయంలో ఏముంది అని తండ్రి వారించినా.. చైనా, జపాన్ వంటి దేశాల్లో అధ్యయనం చేసి మరీ సాగుకు శ్రీకారం చుట్టారు. అప్పుడే భారత్‌లో విస్తరిస్తున్న మెక్‌డొనాల్డ్స్ కంపెనీకి 'ఐస్‌బర్గ్ లెట్యూస్' అనే సలాడ్ ఆకుకూర అవసరమని గ్రహించి, ఒప్పందం కుదుర్చుకున్నారు. చూడటానికి క్యాబేజీలా ఉండే ఈ ఆకులను సలాడ్లు, శాండ్‌విచ్‌లు, బర్గర్లలో విరివిగా వాడుతారు. 80 ఎకరాల్లో ఈ ఆకుకూరను ఆయన సాగు చేస్తున్నారు. ఎకరాకు 9 టన్నుల దిగుబడితో సుమారు రూ.2.5 లక్షల లాభం ఉంటుందని వినీత్ తెలిపారు. పొలంలో ఏర్పాటుచేసిన వ్యాక్యూమ్ ప్రీ కూలింగ్ సదుపాయంతో కోసిన 20 నిమిషాల్లోనే ఆకు కూరల ఉష్ణోగ్రత 4 డిగ్రీలకు చేరి పాడవకుండా తాజాగా ఉంటాయి. ఈ సాగుతో 40 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు.



కేరళలో కళ్లు చెదిరే సీతాకోకచిలుకల అభయారణ్యం

కేరళలోని కన్నూర్ జిల్లా ఆరళంలో ఉన్న దేశంలోనే తొలి సీతాకోకచిలుకల అభయారణ్యం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. గతేడాది కేంద్ర ప్రభుత్వం ఆరళం అభయారణ్యాన్ని సీతాకోకచిలుకల పెంపకం, వలసలకు ముఖ్యమైన ప్రదేశంగా గుర్తించాలని ప్రకటించింది. వలస జీవులైన ఆల్బాట్రాస్ సీతాకోకచిలుకలు పశ్చిమ కనుమల నుంచి ఆరళం ప్రాంతానికి వేలల్లో తరలివస్తాయి. తేమతో కూడిన నేల లేదా నది ఒడ్డున ఉన్న బురద నుంచి ఖనిజాలు, లవణాలను గ్రహించడానికి వేలల్లో సీతాకోకచిలుకలు ఒకే ప్రదేశానికి వస్తాయి. దీన్నే 'సాయిల్ పడలింగ్' అంటారు. ఆ సమయంలో ఆయా ప్రాంతాలు తెల్లని పట్టుతో కప్పినట్లు కనిపిస్తాయి. ఆల్బాట్రాస్‌తో పాటు బ్లూ టైగర్, డార్క్ బ్లూ టైగర్, ఐలి యాండర్, అరాలి, మిల్క్‌వీడ్ వంటి దాదాపు 300 రకాల సీతాకోకచిలుకలను ఆరళం వన్య ప్రాణుల అభయారణ్యంలో చూడొచ్చు.



ఆసుపత్రి నుంచి సోనియా డిశ్చార్జి

దిల్లీ: ఛాతీలో ఇన్‌ఫెక్షన్ కారణంగా వారం క్రితం దిల్లీలోని గంగారాం ఆసుపత్రిలో చేరిన కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ ఆదివారం డిశ్చార్జ్ అయ్యారు. చికిత్సకు ఆమె మెరుగ్గా స్పందించారని, అందుకే తొందరగా కోలుకున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. తదుపరి చికిత్సను ఆమె నివాసంలో కొనసాగించనున్నట్లు ఆసుపత్రికి చెందిన ఓ సీనియర్ వైద్యుడు పేర్కొన్నారు.

'గ్రోక్' అసభ్య సమాచారం వ్యవహారం.. 600 ఖాతాల తొలగింపు

దిల్లీ: 'ఎక్స్'లోని ఏఐ ప్లాట్‌ఫామ్ గ్రోక్‌ను వాడి సృష్టిస్తున్న అసభ్యకర, అశ్లీల సమాచారాన్ని తక్షణమే తొలగించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ఆ సంస్థ చర్యలు చేపట్టింది. తమ పొరపాటును అంగీకరించి 3,500 పోస్టులను బ్లాక్ చేయడంతో పాటు 600 ఖాతాలను తొలగించింది. ఈ మేరకు ఆదివారం కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అలాగే తమ వేదికపై అసభ్యతకు తావివ్వబోమని, భారత ప్రభుత్వ నిబంధనలను పాటిస్తామని 'ఎక్స్' హామీ ఇచ్చిందని పేర్కొన్నాయి.



వేడినీటితో బరువు తగ్గరు

వేడినీరు తాగితే బరువు తగ్గొచ్చన్నది అపోహ మాత్రమే. వేడినీరు జీర్ణక్రియకు దోహదపడుతుంది కానీ, అదొక్కటే బరువును తగ్గించలేదు. సరైన ఆహారం, చురుకైన జీవనశైలి, రోజువారీ ఆరోగ్యకరమైన అలవాట్లను కొనసాగిస్తేనే బరువు తగ్గడం సాధ్యమవుతుంది. ఆ ప్రక్రియకు వేడి నీరు దోహదం చేస్తుంది తప్ప దానికి ప్రత్యామ్నాయంగా పనిచేయదు.

– వి.మోహన్, వైద్య నిపుణులు

హరహర మహాదేవ

- సోమనాథ్‌లో ప్రతిధ్వనించిన శివనామ స్మరణ



సోమనాథ్ దేవాలయం ముందు ప్రధాని మోదీ

సోమనాథ్: ప్రాచీన జ్యోతిర్లింగ క్షేత్రమైన సోమనాథ్‌కు భక్తులు కనీ వినీ ఎరుగని రీతిలో పోటెత్తారు. గజగజవణికిస్తున్న చలిని ఏమాత్రం లెక్క చేయకుండా శనివారం అర్ధరాత్రి నుంచి మొదలైన తాకిడి ఆదివారమంతా కొనసాగింది. కళ్లుమిరుమిట్లు గొలిపేలా బాణసంచా వెలుగులు, పుష్పాలతో చేసిన అలంకరణ, డ్రోన్ల ప్రదర్శన ఆ ప్రాంగణమంతటినీ భక్తిప్రపత్తులతో నింపేసింది. ప్రధాని నరేంద్రమోదీ ఈ ఆలయాన్ని సందర్శించిన తర్వాత స్థానికులే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి కూడా పెద్దసంఖ్యలో వచ్చిన పరమశివుడిని దర్శించుకున్నారు. వీరిలో చాలామంది శౌర్య యాత్రలో పాల్గొన్నారు. ఆలయానికి దారి తీసే రోడ్లన్నీ పూలదండలతో నిండిపోయాయి. త్రిశూలం, డమరుకం, ఓం ఆకారాల్లో విద్యుద్దీపాలంకరణలు చేశారు. పువ్వులతో శివలింగాలు తయారుచేశారు. 'అఖండ సోమనాథ్.. అఖండ్ భారత్' నినాదాలు ప్రతిచోటా కనిపించాయి. పావుగంటసేపు కొనసాగిన డ్రోన్ షోలో భారీ స్థాయి శివుడు, శివలింగం, త్రీడీలో సోమనాథ్ ఆలయం వంటివి భక్తులను కట్టిపడేశాయి. శతాబ్దాల క్రితం ఈ ఆలయంపై జరిగిన దాడి, అనంతర పునర్నిర్మాణ తీరుతెన్నుల్ని వివరించేలా కొన్ని ఆకృతుల్ని తీర్చిదిద్దారు.

శోభాయమానంగా శౌర్యయాత్ర

శౌర్యయాత్ర పేరిట నిర్వహించిన కార్యక్రమం శోభాయమానంగా కొనసాగింది. జ్యోతిర్లింగ క్షేత్రం వరకు దాదాపు కి.మీ. మేర ఈ యాత్ర చేపట్టారు. ఓపెన్ టాప్ వాహనంలో ప్రధాని మోదీ అందరికీ అభివాదం చేశారు. కథక్, భరతనాట్యం, మణిపురి వంటి నృత్యాలు ప్రదర్శించడానికి ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేశారు. కార్యక్రమం అనంతరం అహ్మదాబాద్- గాంధీనగర్‌లను అనుసంధానం చేసే అహ్మదాబాద్ మెట్రో రెండో దశను ప్రధాని ప్రారంభించారు. ఆ మార్గంలో తొలి మెట్రోరైలుకు పచ్చజెండా ఊపారు.

సిరియాలో ఐసిస్‌పై విరుచుకుపడ్డ అమెరికా

వాషింగ్టన్: సిరియాలోని ఐసిస్ ఉగ్రవాద స్థావరాలపై అమెరికా మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. గత నెలలో ఐసిస్ దాడుల్లో ఇద్దరు అమెరికా సైనికులు, ఓ అమెరికా పౌరుడు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి 'ఆపరేషన్ హాక్‌ఐ స్ట్రైక్' పేరుతో అగ్రరాజ్య సైన్యం దాడులు నిర్వహిస్తోంది. అందులో భాగంగానే శనివారం సిరియా వ్యాప్తంగా ఐసిస్‌కు చెందిన ఆయుధ నిల్వలు, కమాండ్ కేంద్రాలు, శిక్షణ శిబిరాలు లక్ష్యంగా దాడులు జరిగాయి. ఈ ఆపరేషన్‌లో తాము కూడా పాల్గొన్నామని జోర్డాన్ సైన్యం తెలిపింది.

అలెప్పో (సిరియా): ఉత్తర సిరియాలోని అలెప్పో నగరం నుంచి కుర్దిష్ దళాలు నిష్క్రమించాయి. దీంతో ప్రభుత్వ దళాలు.. కుర్దుల నేతృత్వంలోని సిరియన్ డెమోక్రటిక్ దళాల (ఎస్డీఎఫ్) మధ్య గత కొన్ని రోజులుగా జరుగుతున్న పోరాటం ముగిసే అవకాశం ఉంది. ఈ మేరకు రెండు వర్గాల మధ్య అమెరికా, ఐరోపా దేశాల మధ్యవర్తిత్వంతో ఒప్పందం కుదిరింది. ఈ విషయాన్ని అలెప్పో గవర్నర్ ఆదివారం ప్రకటించారు. ఎస్డీఎఫ్ అధీనంలోని ప్రాంతాలను సిరియా ప్రభుత్వ దళాలు నియంత్రణలోకి తీసుకున్నట్లు తెలిపారు. ఇటీవల రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణల్లో 24 మంది పౌరులు గాయపడ్డారు. 129 మందికి గాయాలయ్యాయి.

చేజారిపోయేలోపు ఒప్పందానికి రండి

క్యూబాను హెచ్చరించిన ట్రంప్

వెస్ట్ పామ్‌బీచ్: కాలాతీతం కాకముందే తమతో ఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం క్యూబాను హెచ్చరించారు. వెనెజువెలాకు సన్నిహిత దేశమైన క్యూబా ఆ దేశం నుంచి చమురును పెద్దఎత్తున కొనుగోలు చేస్తోంది. వెనెజువెలా చమురు ట్యాంకర్లను అమెరికా సేనలు స్వాధీనం చేసుకుంటున్న విషయం తెలిసిందే. "వెనెజువెలా చమురు, డబ్బుపై క్యూబా చాలాకాలం నుంచి ఆధారపడి ఉంది. దానికి బదులుగా ఆ దేశానికి భద్రతపరమైన



హామీని ఇస్తూ వచ్చింది. ఇది ఇక సాగదు. ఇప్పుడు క్యూబాకు ఇంధనం గానీ, డబ్బుగానీ వెళ్లవు" అని సామాజిక మాధ్యమ వేదికగా ట్రంప్ స్పష్టంచేశారు. సత్వరం ఒప్పందం చేసుకోవడమే క్యూబాకు మంచిదన్నారు. అది ఏమిటనేది స్పష్టంచేయలేదు. వెనెజువెలా నుంచి మదురోను అమెరికా బంధించి తీసుకువెళ్తున్నప్పుడు తమ సైనిక సిబ్బందిలో 32 మంది ప్రాణాలు కోల్పోయారని క్యూబా సర్కారు తెలిపింది. దీనిని ట్రంప్ మరోసారి పరోక్షంగా ప్రస్తావించారు. "వెనెజువెలాకు ఇప్పుడు దోపిడీదారుల రక్షణ అవసరంలేదు. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సైన్యం ఉన్న అమెరికా రక్షణలో ఇప్పుడు ఆ దేశం ఉంది" అని చెప్పారు.

మార్కో రుబియో క్యూబాకు అధ్యక్షుడవుతారు

సామాజిక మాధ్యమాల్లో వచ్చిన మరో వ్యాఖ్యపై ట్రంప్ స్పందిస్తూ- తమ విదేశాంగ మంత్రి మార్కో రుబియో.. క్యూబాకు అధ్యక్షుడు అవుతారని, అది తనకెంతో వినసొంపుగా ఉందని అన్నారు.

సైబర్ కేటుగాళ్ల వలలో వృద్ధ దంపతులు

- 17 రోజులపాటు డిజిటల్ అరెస్టు.. రూ.15 కోట్లు స్వాహా

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో ఓ వృద్ధ దంపతులు సైబర్ మాయగాళ్ల వలలో చిక్కారు. 17 రోజులపాటు డిజిటల్ అరెస్టులో ఉండి.. జీవితకాలం దాచుకున్న దాదాపు రూ.15 కోట్లను పోగొట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ ఓం తనేజా, ఆయన భార్య డాక్టర్ ఇందిరా తనేజాలు 48 ఏళ్లపాటు ఐక్యరాజ్యసమితిలో సేవలందించారు. పదవీ విరమణ అనంతరం 2016లో వీరు భారత్‌కు తిరిగొచ్చారు. ప్రస్తుతం దక్షిణ దిల్లీలోని గ్రేటర్ కైలాశ్‌లో నివాసముంటున్న ఆ దంపతులకు గత డిసెంబరు 24న.. పోలీసు అధికారులమంటూ సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్ వచ్చింది. మీపై పలు క్రిమినల్ కేసులు నమోదయ్యాయని, అరెస్టు వారెంట్లతో వారిని బెదిరించారు. డిసెంబరు 24 నుంచి జనవరి 9 వరకు డిజిటల్ అరెస్టు చేసి.. ఆ సమయంలో వారి నుంచి రూ.14.85 కోట్లను కాజేశారు. అనంతరం సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదిస్తే ఆర్బీఐ ఆదేశాల మేరకు డబ్బులు తిరిగి వస్తాయని వారికి సూచించారు. దీంతో వృద్ధ దంపతులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా.. అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

■ మహారాష్ట్రలోని ఠాణెలో సైతం సైబర్ మోసగాళ్ల వలలో చిక్కి ఓ బయోటెక్ కంపెనీలో ఫైనాన్స్ మేనేజర్‌గా పనిచేస్తున్న వ్యక్తి రూ.27 లక్షలు కోల్పోయారు. నీటి సరఫరాకు సంబంధించి వివరాలను అప్‌డేట్ చేసుకోవాలంటూ మహారాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పేరుతో వచ్చిన నకిలీ వాట్సప్ మెసేజ్‌పై క్లిక్ చేయడంతో రెండు గంటల్లోనే రూ.27.70 లక్షలను కోల్పోయినట్లు బాధితుడు వాపోయాడు. ఈ ఘటన జనవరి 8న చోటుచేసుకోగా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ముక్కు నుంచి రక్తం.. వాంతులు

- మదురో కస్టడీవేళ అమెరికా ప్రయోగించిన ఆయుధంపై కలవరం

వాషింగ్టన్: వెనెజువెలా నాయకుడు నికోలస్ మదురోను అమెరికా నిర్బంధంలోకి తీసుకోవడం ప్రపంచాన్ని నివ్వెరపర్చింది. ఆయన్ను కస్టడీలోకి తీసుకునేందుకు నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో యూఎస్ అత్యంత శక్తిమంతమైన ఆయుధాన్ని వాడిందట. అతి తక్కువ సమయంలోనే రక్షణ సిబ్బంది పోరాట సామర్థ్యాన్ని దెబ్బతీసిందని మదురోకు అత్యంత సన్నిహితంగా పనిచేసిన గార్డ్ చెప్పిన వివరాలు ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తున్నాయి. "మేం నికోలస్‌కు రక్షణగా విధుల్లో ఉన్నాం. అకస్మాత్తుగా మా రాడార్ వ్యవస్థలు పనిచేయడం ఆగిపోయాయి. ఏం జరిగిందో మాకు అర్థమయ్యేలోపే డ్రోన్ల దండు దూసుకొచ్చింది. మా దగ్గరకు వచ్చేసింది. వాటిపై ఎలా స్పందించాలో అర్థం కాలేదు. తర్వాత 20 మంది సైనికులతో 8 హెలికాప్టర్లు వచ్చాయి. సంఖ్య తక్కువే అయినా.. వెంటనే మొత్తం తమ నియంత్రణలోకి తెచ్చుకున్నారు. ఇంతకుముందు చూడని పోరాట పద్ధతులను ఉపయోగించారు. అమెరికా శక్తి ముందు వెనెజువెలా సైన్యం తేలిపోయింది. మేం వందల సంఖ్యలో ఉన్నా ఉపయోగం లేకపోయింది. ఒక దశలో వారు ఏదో ప్రయోగించారు. అది తీవ్రమైన ధ్వని తరంగంలాంటిది. నా తల లోపలి నుంచి పేలిపోతున్నట్లు అనిపించింది. మా ముక్కుల నుంచి రక్తం కారడం మొదలైంది. కొందరు వాంతులు చేసుకున్నారు. ఇంకొందరు నేలపై పడిపోయారు. మేం నిల్చోలేకపోయాం. అగ్రరాజ్యంతో పోరాడగలమని ఎవరైనా అనుకుంటే అది భ్రమే అవుతుంది" అని ఆ సెక్యూరిటీ గార్డ్ వెల్లడించిన వివరాలను న్యూయార్క్ పోస్ట్ ప్రచురించింది. గార్డ్ చెప్పిన మాటలను శ్వేతసౌధం పత్రికా కార్యదర్శి షేర్ చేశారు. గార్డ్ చెప్పినదానిని బట్టి అమెరికా లక్ష్యాలను నిర్వీర్యం చేయడానికి మైక్రోవేవ్స్, లేజర్స్ వంటి వాటిని వాడి ఉండొచ్చని అమెరికా నిఘా విభాగంలో పనిచేసిన అధికారి ఒకరు వెల్లడించారు. 2020లో గల్వాన్ ఘర్షణలో భారత సైనికులపై చైనా మైక్రోవేవ్ ఆయుధం వాడిందనే ఆరోపణలు వినిపించాయి. వీటిని ఆ దేశం తోసిపుచ్చింది.

కేరళలో భాజపా ప్రభుత్వ ఏర్పాటే అంతిమ లక్ష్యం: అమిత్ షా



కేరళ సంప్రదాయ దుస్తుల్లో అమిత్ షా

తిరువనంతపురం: కేరళలో భారతీయ జనతా పార్టీ(భాజపా) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే తమ అంతిమ లక్ష్యమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. నూతనంగా ఎన్నికైన భాజపా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో ఆదివారం ఏర్పాటుచేసిన సభలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. వచ్చే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం చేపట్టిన 'మిషన్ 2026' కార్యక్రమాన్ని అమిత్ షా ప్రారంభించారు. "కేరళలో భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి, అభివృద్ధి చెందిన రాష్ట్రంగా చేయడమే మన లక్ష్యం. దేశ వ్యతిరేక శక్తుల నుంచి కేరళను రక్షించడంతో పాటు శతాబ్దాలుగా రాష్ట్రంలో ఉన్న నమ్మకాల్ని కాపాడేందుకు కృషిచేయాలి. ఈ మూడింటిని యూడీఎఫ్, ఎల్డీఎఫ్‌లు పూర్తి చేయలేవని, నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయేతోనే ఇది సాధ్యం" అని అమిత్ షా పేర్కొన్నారు.

తటస్థ దర్యాప్తు సంస్థతో విచారణ చేపట్టాలి..

శబరిమల బంగారం తాపడాల కేసు విషయంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై అమిత్ షా తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఈ కేసు విచారణను తటస్థ దర్యాప్తు సంస్థ చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శబరిమల ఆలయంలోని ఆస్తులను కాపాడడంలో విఫలమైన వారు ప్రజల నమ్మకాన్ని ఎలా కాపాడతారని ప్రశ్నించారు. "శబరిమల బంగారం చోరీ సమస్య కేవలం కేరళ ప్రజలది మాత్రమే కాదు. దేశవ్యాప్తంగా ఉన్న భక్తులందరిది. ఈ కేసులో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను గమనిస్తే.. నిందితులను రక్షించేందుకే రూపొందించినట్లుగా ఉంది. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టడమే కాదు. ఇంటింటికీ ప్రచార కార్యక్రమాలు చేపడతాం" అని అమిత్ షా మండిపడ్డారు. రాష్ట్రంలోని శాంతి భద్రతలు ప్రస్తుతం ప్రశాంతంగా కనిపించొచ్చు కానీ, భవిష్యత్తులో ప్రమాదకరంగా మారే పలు సంఘటనలు బయటపడుతున్నాయని ఆయన హెచ్చరించారు.

అరుణాచల్‌ప్రదేశ్‌లో రెండు కొత్తరకం కప్పలు



ఇటానగర్: అరుణాచల్‌ప్రదేశ్‌లో రెండు కొత్తరకం కప్పలను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. వీటిని జీనస్ లెప్టోబ్రాచియం జాతికి చెందిన సోమని, మెచుకాగా గుర్తించారు. ప్రపంచవ్యాప్తంగా ఈ జాతి కప్పలు 39 ఉండగా, వాటిలో నాలుగు భారత్‌లోనే ఉన్నాయి. దిల్లీ విశ్వవిద్యాలయం, పర్యావరణ విద్య విభాగం, హార్వర్డ్ యూనివర్సిటీలోని మ్యూజియం ఆఫ్ కంపారిటివ్ జువాలజీలకు చెందిన పరిశోధకులు వీటిని కనుగొన్నారు. ఈ పరిశోధన గర్వకారణమని, రాష్ట్రంలో ఉన్న జీవవైవిధ్యానికి అద్దం పడుతోందని ఉప ముఖ్యమంత్రి చౌనా మీన్ వ్యాఖ్యానించారు.

శ్రీలంకలో భారత్ నిర్మించిన బెయిలీ వంతెన ప్రారంభం



కొలంబో: భారత సహకారంతో శ్రీలంకలో నిర్మించిన మొదటి బెయిలీ వంతెన(తాత్కాలిక వంతెన)ను ఆదివారం ప్రారంభించారు. సెంట్రల్ ప్రావిన్స్-ఉవా ప్రావిన్స్ మధ్య రాకపోకలకు కీలకంగా ఉన్న రహదారి అనుసంధానం గతేడాది నవంబరులో వచ్చిన దిత్వా తుపానుతో ధ్వంసమైంది. అనంతర కాలంలో శ్రీలంకలో పర్యటించిన భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ అక్కడ దెబ్బతిన్న రోడ్లు, రైల్వే లైన్ల పునరుద్ధరణకు 'ఆపరేషన్ సాగర బంధు' పేరుతో రూ.45 కోట్లు ఆర్థిక సహాయాన్ని అందించనున్నట్లు ప్రకటించారు. దీని కింద భారత సైన్యం నిర్మించిన ఈ బెయిలీ వంతెనను శ్రీలంకలోని భారత హైకమిషనర్ సంతోష్ ఝాతో కలిసి ఆ దేశ మంత్రులు ప్రసన్న గుణసేన, మధుర సేనవిరత్నే ఆదివారం ప్రారంభించారు.

భారత్‌పై దాడికి వేల మంది సిద్ధంగా ఉన్నారు..

మసూద్ అజార్ ఆడియో లీక్

దిల్లీ: భారత్‌పై ఏ క్షణమైనా భారీ ఎత్తున ఆత్మాహుతి దాడులు జరగొచ్చని నిషేధిత జైషే మహమ్మద్ ఉగ్ర సంస్థ చీఫ్ మసూద్ అజార్ గొంతుతో ఉన్న ఓ ఆడియో బయటకొచ్చింది. దీని ప్రకారం...భారత్‌లోకి చొరబడి ఆత్మాహుతి దాడులకు పాల్పడటానికి వెయ్యి మందికి పైగా సిద్ధంగా ఉన్నారని, ఇందుకోసం అనుమతినివ్వాలని వారు తనపై ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆడియోలో మసూద్ మాట్లాడుతున్నట్లు ఉంది. "ఒకరు కాదు, ఇద్దరు కాదు. వందమంది, వెయ్యిమంది కూడా కాదు. అసలు సంఖ్య ఎంతో చెప్తే రేపు అంతర్జాతీయ మీడియాలో కల్లోలం మొదలవుతుంది. వీరంతా భౌతిక బహుమతులు, వ్యక్తిగత లాభాలు, వీసాలు వంటివి కోరుకోరు. వీరు నమ్మినదల్లా అమరత్వమే" అని మసూద్ అందులో పేర్కొన్నారు. కాగా ఈ ఆడియో ప్రామాణికతను ధ్రువీకరించలేదు.

రూ. 100 కోట్ల క్రిప్టోకరెన్సీ మోసం.. ఇద్దరి అరెస్ట్

ఆగ్రా: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రాలో రూ.100 కోట్ల క్రిప్టోకరెన్సీ మోసానికి సూత్రధారులైన ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. నాలుగు రాష్ట్రాల్లోని వేల సంఖ్యలో ప్రజలను వారు మోసగించినట్లు గుర్తించారు. బాగ్‌పత్‌కు చెందిన వినోద్, లఖ్‌నవూకు చెందిన వినయ్‌లు నకిలీ క్రిప్టోకరెన్సీ వెబ్‌సైట్‌ను సృష్టించినట్లు అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆదిత్య వెల్లడించారు. 2019 నుంచి 2021 వరకు ప్రముఖ హోటళ్లలో సెమినార్లు నిర్వహించి క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని ప్రజలను నమ్మించారని పేర్కొన్నారు. కేవలం ఆగ్రాలోనే 1,500 మంది మోసపోయారని.. ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో కలిపితే ఆ సంఖ్య వేలల్లో ఉందని ఆదిత్య తెలిపారు.

నేడు అహ్మదాబాద్‌లో మోదీతో జర్మనీ ఛాన్స్‌లర్ భేటీ

దిల్లీ: ప్రపంచ రాజకీయాలు క్షణక్షణం మారిపోతున్న వేళ ప్రధాని మోదీ, జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ మధ్య భేటీ జరగనుంది. సోమవారం అహ్మదాబాద్‌లో జరగనున్న ఈ సమావేశంలో ద్వైపాక్షిక సంబంధాలు, పెట్టుబడులు, కీలక సాంకేతికత, రక్షణ తదితర అంశాలు చర్చకు రానున్నాయి. జర్మనీ ఛాన్స్‌లర్ హోదాలో మొదటిసారి ఆసియాలో పర్యటిస్తున్న ఫ్రెడ్రిక్.. అహ్మదాబాద్ కార్యక్రమాల అనంతరం బెంగళూరు వెళ్లనున్నారు. ఆయన పర్యటన తర్వాత ఈయూ నేతలు భారత్‌కు వస్తారు. వారితో తుది చర్చల అనంతరం భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశముంది.

ఉత్తరాదిన ఊహుహుహు..

- గడ్డకట్టించే చలితో ఉక్కిరిబిక్కిరి



శ్రీనగర్‌లో గడ్డకట్టిన దాల్ సరస్సు

దిల్లీ: చలిగాలులు ఉత్తరాదిని గడగడలాడిస్తున్నాయి. అనేకచోట్ల సున్నా కంటే తక్కువ డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదివారం ఈ పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. రాజస్థాన్, జమ్మూ-కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల్లో అనేక ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీల్లో ఉంటున్నాయి. ప్రతాప్‌గఢ్ (రాజస్థాన్)లో ఇది మైనస్ 2 డిగ్రీలకు, బాడ్‌మేడ్‌లో మైనస్ ఒక డిగ్రీకి పడిపోయింది. అదే రాష్ట్రంలోని పిలానీ (1.2), సీకర్ (1.7), బీకానేర్ (1.9), చురు (2 డిగ్రీల సెల్సియస్) వంటివి వణికిపోతున్నాయి. పంజాబ్, హరియాణాల్లోనూ అనేకచోట్ల ఇది సున్నాగా ఉంది. దిల్లీలో ఈ ఏడాదిలో తొలిసారిగా 2.9 డిగ్రీల సెల్సియస్ అత్యల్ప ఉష్ణోగ్రత రికార్డయింది. అత్యంత చలి, పొగమంచు వల్ల నొయిడాలోని పాఠశాలలకు ఈ నెల 15 వరకు సెలవులు ప్రకటించారు. కశ్మీర్‌లో అత్యంత చలికాలం మొదలైంది. శ్రీనగర్‌లో మైనస్ 5.2 డిగ్రీల ఉష్ణోగ్రత నెలకొంది. మైనస్ 8.6 డిగ్రీల సెల్సియస్‌తో లోయలోనే అత్యంత శీతల ప్రాంతంగా శోపియాన్ నిలిచింది.

ఆరెస్సెస్ మరింత విస్తరిస్తోంది: మోహన్ భాగవత్



శతక్ చిత్ర పాటల విడుదల కార్యక్రమంలో ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్, కార్యనిర్వాహణాధికారి భయ్యాజీ జోషి

దిల్లీ: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆరెస్సెస్) మారడం లేదని, కాలక్రమేణా అభివృద్ధి చెందుతూ మరింత విస్తరిస్తోందని అధ్యక్షుడు మోహన్ భాగవత్ వ్యాఖ్యానించారు. వంద సంవత్సరాల ఆరెస్సెస్ ప్రయాణాన్ని వివరించేలా రాబోతున్న 'శతక్' చిత్రంలోని పాటలను విడుదల చేసేందుకు ఆదివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. దీనికి గాయకుడు సుఖ్వీందర్ సింగ్, దర్శకుడు ఆశీష్ మాల్, సహ నిర్మాత ఆశీష్ తివారీ, ఆరెస్సెస్ కార్యనిర్వాహణాధికారి భయ్యాజీ జోషి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత ప్రయోజనాల కోసం

మౌలిక వసతుల అభివృద్ధిని వ్యతిరేకించొద్దు

- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ హితవు
- అస్సాంలో సమీకృత జ్యుడీషియల్ కోర్టు సముదాయం నిర్మాణానికి శంకుస్థాపన

గువాహటి: నూతన మౌలిక వసతుల అభివృద్ధిని వ్యక్తిగత ప్రయోజనాల కోసం వ్యతిరేకించడం సరికాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ హితవు పలికారు. అస్సాం కామ్‌రూప్ జిల్లాలోని ఉత్తర గువాహటిలో రంగ్‌మహల్ వద్ద నిర్మించనున్న సమీకృత జ్యుడీషియల్ కోర్టు సముదాయానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. భవిష్యత్ ఆకాంక్షలకు ఈ సముదాయం సరితూగుతుందన్నారు. గువాహటి హైకోర్టు బార్ అసోసియేషన్ (జీహెచ్‌సీబీఏ) ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తుండటంపై సీజేఐ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సరైన సమాచారం అందకపోవడం వల్లో, బార్‌లోని కొత్త సభ్యుల అవసరాలను అర్థం చేసుకోకపోవడం వల్లో కొత్త కోర్టు సముదాయం నిర్మాణాన్ని జీహెచ్‌సీబీఏ వ్యతిరేకిస్తుండొచ్చని అభిప్రాయపడ్డారు. నూతన సముదాయం వ్యూహాత్మక స్థానంలో ఉందని, అది అన్ని సదుపాయాలనూ ఒకే గొడుకు కిందకు తీసుకొస్తుందని పేర్కొన్నారు. ఆధునిక జ్యుడీషియల్ నగరంగా నిలుస్తుందని చెబుతున్న ఈ సముదాయాన్ని 49 ఎకరాల్లో నిర్మిస్తున్నారు. అస్సాంతో పాటు అరుణాచల్ ప్రదేశ్, మిజోరం, నాగాలాండ్‌ల హైకోర్టుగా సేవలందించే గువాహటి ఉన్నత న్యాయస్థానం ఇందులోనే ఉంటుంది. హైకోర్టు సముదాయాన్ని గువాహటి నగరం నడిబొడ్డు నుంచి బ్రహ్మపుత్ర ఉత్తర ఒడ్డుకు మారుస్తుండటాన్ని జీహెచ్‌సీబీఏ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. నూతన ప్రాజెక్టు ప్రారంభాన్ని నిరసిస్తూ గురు, శుక్రవారాల్లోలాగే ఆదివారం కూడా ఆ సంఘం సభ్యులు నాలుగు గంటల పాటు నిరాహార దీక్ష చేపట్టారు. శంకుస్థాపన కార్యక్రమాన్ని బాయ్‌కాట్ చేశారు.

ఫోన్, ఇంటర్నెట్ వాడను

స్వయంగా వెల్లడించిన అజీత్ డోభాల్

దిల్లీ: తాను ఫోన్, ఇంటర్నెట్ వాడనని.. తన రోజువారీ కార్యకలాపాల్లో వాటికి చోటివ్వనని జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్ పేర్కొన్నారు. దిల్లీలో జరిగిన వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్‌లో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. 'నేను ఇంటర్నెట్ ఉపయోగించనన్నది మాట నిజమే. ఫోన్ కూడా వాడను. కుటుంబ సభ్యులు, ఇతర దేశాల్లోని ప్రజలతో మాట్లాడేందుకు కొన్ని సందర్భాల్లో మాత్రమే ఉపయోగిస్తాను. అది కూడా అవసరం అనుకుంటేనే. అవి రెండూ లేకుండా విధులు నిర్వర్తించేలా ప్లాన్ చేసుకుంటాను. కమ్యూనికేషన్‌కు చాలా మార్గాలు ఉన్నాయి. అందులో ప్రజలకు తెలియనివి ఎన్నో ఉన్నాయి. వాటిని కూడా పరిచయం చేయాలి" అని డోభాల్ ఈ సందర్భంగా సూచించారు.

భారత సంతతి గణిత శాస్త్రవేత్త నళినీ జోషికి ప్రతిష్ఠాత్మక పురస్కారం



దిల్లీ: భారత సంతతికి చెందిన ప్రముఖ గణిత శాస్త్రవేత్త, ప్రొఫెసర్ నళినీ జోషికి అరుదైన గౌరవం దక్కింది. ఆస్ట్రేలియాలో 2025కుగాను ప్రతిష్ఠాత్మక 'న్యూ సౌత్‌వేల్స్ (ఎన్ఎస్‌డబ్ల్యూ) సైంటిస్ట్ ఆఫ్ ది ఇయర్' పురస్కారం ఆమెను వరించింది. ఈ అవార్డుకు ఎంపికైన తొలి గణిత శాస్త్రవేత్త నళినీయే. ఆమె సిడ్నీ విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేషన్, ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలో డాక్టరేట్ పూర్తిచేశారు. సిడ్నీలో గణిత శాస్త్ర ప్రొఫెసర్‌గా నియమితులైన తొలి మహిళగా గుర్తింపు పొందారు. ఇంటిగ్రబుల్ సిస్టమ్స్‌పై విశేష పరిశోధనలు చేశారు. 2016లో ఆమె ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఆస్ట్రేలియా పురస్కారం అందుకున్నారు.

స్టీల్, ప్రీకాస్ట్ నిర్మాణాలతో కాలుష్యానికి అడ్డుకట్ట

ముంబయి: భవన నిర్మాణ సమయంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రీకాస్ట్, స్టీల్ నిర్మాణ పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. నిర్మాణ సమయంలో వెలువడే దుమ్ము కాలుష్యానికి దారితీస్తుందన్నారు. వీటిని నగరం బయటకు తరలించాల్సిన అవసరం ఉందన్నారు. 'ప్రపంచవ్యాప్తంగా స్టీల్, ప్రీకాస్ట్ నిర్మాణాలే ఉంటాయి. కొంచెం ఖరీదు ఎక్కువ. వీటికి రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వగలమా అని మహారాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించాలని అనుకుంటున్నా" అని గోయల్ పేర్కొన్నారు.

చాంపియన్



గిల్ 56

కొన్నేళ్ల పాటు ఫామ్‌తో తంటాలు పడ్డాడు.. ఆత్మవిశ్వాసం సన్నగిల్లింది.. దూకుడు తగ్గింది.. టీ20ల నుంచి రిటైరయ్యాడు.. టెస్టులకూ టాటా చెప్పేశాడు.. ఇక వన్డేలకు కూడా గుడ్‌బై చెప్పడమే తరువాయి అనుకుంటున్న తరుణంలో ఈ ఫార్మాట్లో అనూహ్యంగా చెలరేగిపోతున్నాడు విరాట్ కోహ్లి. గత ఏడాది ఆస్ట్రేలియా పర్యటనలో మొదలైన అతడి పరుగుల ప్రవాహం నిరాటంకంగా సాగుతోంది. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో మూడు మ్యాచ్‌ల్లోనే మూడొందల పరుగులు సాధించిన కింగ్.. ఇప్పుడు న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో సెంచరీకి చేరువగా వెళ్లాడు. కోహ్లి మెరుపులకు శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, హర్షిత్ రాణాల సమయోచిత ఇన్నింగ్స్‌లూ తోడవడంతో తొలి వన్డేలో నెగ్గి, మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది భారత్.

ఇక్కడా విరాటే..



కోహ్లి 93 91 బంతుల్లో 8×4, 1×6

కివీస్‌పైనా కొనసాగిన జోరు

మెరిసిన శుభ్‌మన్, శ్రేయస్ ● తొలి వన్డేలో భారత్ విజయం

వడోదర

న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో టీమ్‌ఇండియా శుభారంభం చేసింది. ఆదివారం తొలి వన్డేలో శుభ్‌మన్ సేన 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట డరెల్ మిచెల్ (84; 71 బంతుల్లో 5×4, 3×6), హెన్రీ నికోల్స్ (62; 69 బంతుల్లో 8×4), డెవాన్ కాన్వే (56; 67 బంతుల్లో 6×4, 1×6) రాణించడంతో కివీస్ 8 వికెట్లకు 300 పరుగులు చేసింది. భారత బౌలర్లలో మహ్మద్ సిరాజ్ (2/40) సత్తా చాటాడు. హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' విరాట్ కోహ్లి (93; 91 బంతుల్లో 8×4, 1×6) సూపర్ ఇన్నింగ్స్‌తో భారత్ లక్ష్యాన్ని 49 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. శుభ్‌మన్ గిల్ (56; 71 బంతుల్లో 3×4, 2×6), శ్రేయస్ అయ్యర్ (49; 47 బంతుల్లో 4×4, 1×6) రాణించారు. కోహ్లి ఉన్నంతసేపు సాఫీగా సాగుతున్న ఛేదన, అతడి నిష్క్రమణతో కాస్త ఇబ్బందిగా మారినప్పటికీ.. కేఎల్ రాహుల్ (29 నాటౌట్; 21 బంతుల్లో 2×4, 1×6), హర్షిత్ రాణా (29; 23 బంతుల్లో 2×4, 1×6) మెరుపులతో భారత్ గెలిచింది. కివీస్ పేసర్ కైల్ జేమీసన్ (10-1-41-4) గొప్పగా బౌలింగ్ చేశాడు. రెండో వన్డే బుధవారం రాజ్‌కోట్‌లో జరుగుతుంది.



జేమీసన్ 4/41

కోహ్లి ఇరుసులా..: భారత్ ఛేదన కొంచెం నెమ్మదిగానే ఆరంభమైంది. జేమీసన్, ఫౌక్స్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో 5 ఓవర్లలో టీమ్ ఇండియా 15 పరుగులే చేసింది. కానీ తర్వాతి ఓవర్లో రోహిత్ (26; 29 బంతుల్లో 3×4, 2×6) సిక్సర్ బాది స్కోరు బోర్డును కదిలించాడు. జేమీసన్ వేసిన తర్వాతి ఓవర్లోనూ రోహిత్ సిక్సర్, ఫోర్ కొట్టాడు. అయితే ఊపుమీదున్న అతణ్ని 8వ ఓవర్లో జేమీసన్ ఔట్ చేశాడు. అయినా భారత్‌కు ఇబ్బంది లేకపోయింది. శుభ్‌మన్‌కు జత కలిసిన కోహ్లి.. ఆరంభం నుంచే చెలరేగి ఆడాడు. గిల్ ఆచితూచి ఆడుతుంటే.. కోహ్లి అలవోకగా బౌండరీలు కొడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. తొలి 20 బంతుల్లోనే అతను ఆరు ఫోర్లు కొట్టాడు. కుదురుకున్నాక గిల్ కూడా షాట్లకు దిగడంతో ఇన్నింగ్స్ సాఫీగా సాగిపోయింది. ముందుగా కోహ్లినే అర్ధశతకం సాధించగా.. తర్వాత గిల్ అతణ్ని అనుసరించాడు. కానీ 50 దాటగానే శుభ్‌మన్.. స్పిన్నర్ అశోక్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. గిల్‌తో రెండో వికెట్‌కు 118 పరుగులు జోడించిన విరాట్.. తర్వాత శ్రేయస్‌తో మూడో వికెట్‌కు 77 పరుగుల భాగస్వామ్యంతో జట్టును విజయానికి చేరువ చేశాడు. గాయం కారణంగా రెండు నెలలకు పైగా ఆటకు దూరంగా ఉన్న శ్రేయస్.. ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేశాడు. కోహ్లి చకచకా సెంచరీకి చేరువయ్యాడు. 39 ఓవర్లకు 234/2తో భారత్ పటిష్ఠ స్థితికి చేరుకుంది. అప్పటికి కోహ్లి స్కోరు 93. సెంచరీ లాంఛనమే అనుకున్న దశలో అతను.. జేమీసన్ బౌలింగ్‌లో అనవసర షాట్‌కు ప్రయత్నించి ఔటయ్యాడు. లాంగాఫ్‌లో కెప్టెన్ బ్రేస్‌వెల్ చక్కటి డైవ్ క్యాచ్ అందుకోవడంతో స్టేడియాన్ని నిశ్శబ్దం ఆవహించింది. కోహ్లి వికెట్‌తో ఇన్నింగ్స్ ఒక్కసారిగా కుదుపునకు లోనైంది. అదే ఓవర్లో జడేజా (4)ను కూడా జేమీసన్ ఔట్ చేశాడు. తన తర్వాతి ఓవర్లో జేమీసన్.. శ్రేయస్‌ను బౌల్డ్ చేసి భారత్‌కు మరో షాకిచ్చాడు. వికెట్లు పడడం, పరుగుల వేగం తగ్గడంతో భారత్ ఒత్తిడిలో పడింది. 6 ఓవర్లలో 44 పరుగులు చేయాల్సిన స్థితిలో కివీస్‌కూ గెలుపుపై ఆశలు రేగాయి. అయితే సుందర్ గాయపడడంతో ముందు బ్యాటింగ్‌కు వచ్చిన హర్షిత్ రాణా కొన్ని షాట్లు ఆడి భారత్‌పై ఒత్తిడి తగ్గించగా.. అతను ఔటయ్యాక రాహుల్ అందుకున్నాడు. క్లార్క్ వేసిన 49వ ఓవర్లో వరుసగా 4, 4, 6తో అతను మ్యాచ్‌ను ముగించాడు.

మెరిసిన ఆ ముగ్గురూ..: మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన కివీస్.. బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై ఇన్నింగ్స్‌ను ఆరంభించిన తీరు చూస్తే 330-340 స్కోరు చేసేలా కనిపించింది. అయితే మధ్య ఓవర్లలో భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడమే కాక, కీలక వికెట్లు పడగొట్టడంతో స్కోరు వేగం తగ్గింది. అయితే ఇన్నింగ్స్‌కు వెన్నెముకలా నిలిచిన డరెల్ మిచెల్.. భారత బౌలర్లకు పైచేయి సాధించే అవకాశమివ్వలేదు. ఓపెనర్లు హెన్రీ నికోల్స్, డెవాన్ కాన్వే పట్టుదలతో క్రీజులో నిలవడంతో తొలి వికెట్ కోసం భారత్ చాలాసేపు ఎదురు చూడాల్సి వచ్చింది. కొత్త బంతితో మహ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా పొదుపుగా బౌలింగ్ చేయడంతో 9 ఓవర్లకు కివీస్ 40 పరుగులే చేయగలిగింది. అయితే అప్పటికే క్రీజులో కుదురుకున్న ఓపెనర్లు.. తర్వాత బ్యాట్లు ఝళిపించారు. చేంజ్ బౌలర్‌గా వచ్చిన ప్రసిద్ధ్ వారిని ఇబ్బంది పెట్టలేకపోయాడు. నికోల్స్, కాన్వే.. సుందర్ వేసిన 20వ ఓవర్లో వరుస బంతుల్లో అర్ధశతకాలు పూర్తి చేశారు. అప్పటికే జట్టు స్కోరు 100 దాటింది. హర్షిత్ రాణా వరుస ఓవర్లలో కివీస్ ఓపెనర్లను ఔట్ చేయడంతో భారత్ పోటీలోకి వచ్చింది. విల్ యంగ్ (12)ను సిరాజ్, ఫిలిప్స్ (12)ను కుల్‌దీప్ పెవిలియన్ చేర్చడం.. మధ్య ఓవర్లలో స్కోరు వేగం కూడా పడిపోవడంతో కివీస్ ఇబ్బందుల్లో పడింది. 36 ఓవర్లకు స్కోరు 186/4. అయితే అప్పటికే క్రీజులో పాతుకుపోయిన మిచెల్.. భారీ షాట్లకు దిగడంతో స్కోరు వేగం పెరిగింది. మరో ఎండ్‌లో వికెట్లు పడుతున్నా అతను మాత్రం ఆగలేదు. ప్రసిద్ధ్ వేసిన 48వ ఓవర్లో 4, 6, 4 బాదిన మిచెల్.. సెంచరీకి చేరువగా వచ్చాడు. జట్టు స్కోరునూ 300కు దగ్గర చేశాడు. అయితే తర్వాతి బంతికి ప్రసిద్ధ్.. వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. క్రిస్టియన్ క్లార్క్ (24 నాటౌట్) పోరాటంతో కివీస్ 300 మార్కును అందుకుంది. 8 ఓవర్లలో 40 పరుగులే ఇచ్చి 2 వికెట్లు తీసిన సిరాజ్‌తో కెప్టెన్ శుభ్‌మన్ పూర్తి కోటా వేయించకపోవడం ఆశ్చర్యం కలిగించింది. హర్షిత్, ప్రసిద్ధ్ కూడా తలో రెండు వికెట్లు తీసినా.. ఎక్కువ పరుగులిచ్చేశారు.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: డెవాన్ కాన్వే (బి) హర్షిత్ రాణా 56; హెన్రీ నికోల్స్ (సి) రాహుల్ (బి) హర్షిత్ రాణా 62; విల్ యంగ్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 12; డరెల్ మిచెల్ ఎల్బీ (బి) ప్రసిద్ధ్ కృష్ణ 84; గ్లెన్ ఫిలిప్స్ (సి) అయ్యర్ (బి) కుల్‌దీప్ యాదవ్ 12; మిచెల్ హే (బి) ప్రసిద్ధ్ కృష్ణ 18; బ్రేస్‌వెల్ రనౌట్ 16; జాక్ ఫౌక్స్ (బి) సిరాజ్ 1; క్రిస్టియన్ క్లార్క్ నాటౌట్ 24; కైల్ జేమీసన్ నాటౌట్ 8; ఎక్స్‌ట్రాలు 7 **మొత్తం:** (50 ఓవర్లలో 8 వికెట్లకు) **300; వికెట్ల పతనం:** 1-117, 2-126, 3-146, 4-170, 5-198, 6-237, 7-239, 8-281; **బౌలింగ్:** సిరాజ్ 8-0-40-2; హర్షిత్ రాణా 10-0-65-2; సుందర్ 5-0-27-0; ప్రసిద్ధ్ కృష్ణ 9-0-60-2; కుల్‌దీప్ యాదవ్ 9-0-52-1; జడేజా 9-0-56-0

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) బ్రేస్‌వెల్ (బి) జేమీసన్ 26; శుభ్‌మన్ గిల్ (సి) ఫిలిప్స్ (బి) అశోక్ 56; విరాట్ కోహ్లి (సి) బ్రేస్‌వెల్ (బి) జేమీసన్ 93; శ్రేయస్ అయ్యర్ (బి) జేమీసన్ 49; రవీంద్ర జడేజా (సి) క్లార్క్ (బి) జేమీసన్ 4; రాహుల్ నాటౌట్ 29; హర్షిత్ రాణా (సి) మిచెల్ హే (బి) క్లార్క్ 29; వాషింగ్టన్ సుందర్ నాటౌట్ 7; ఎక్స్‌ట్రాలు 13 **మొత్తం:** (49 ఓవర్లలో 6 వికెట్లకు) **306; వికెట్ల పతనం:** 1-39, 2-157, 3-234, 4-239, 5-242, 6-279; **బౌలింగ్:** జేమీసన్ 10-1-41-4, జాక్ ఫౌక్స్ 10-0-49-0, ఆదిత్య 6-0-55-1, క్రిస్టియన్ క్లార్క్ 10-0-73-1, బ్రేస్‌వెల్ 8-0-56-0, ఫిలిప్స్ 4-0-21-0, మిచెల్ 1-0-7-0

సుందర్ వెళ్లి.. వచ్చాడు..

న్యూజిలాండ్‌తో వన్డేల ముంగిట ప్రాక్టీస్‌లో గాయపడి వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ సిరీస్ మొత్తానికి దూరం కాగా.. తొలి వన్డే మధ్యలో వాషింగ్టన్ సుందర్ మైదానాన్ని వీడాడు. ఈ మ్యాచ్‌లో పొదుపుగా బౌలింగ్ చేసిన సుందర్.. 5 ఓవర్లలో 27 పరుగులే ఇచ్చాడు. అయితే అయిదో ఓవర్ అనంతరం వెన్ను నొప్పితో ఇబ్బంది పడ్డాడు. నొప్పి ఎక్కువగా ఉండడంతో అతను తర్వాత మైదానాన్ని వీడాడు. మళ్లీ తిరిగి రాలేదు. అతడి స్థానంలో నితీశ్ కుమార్ రెడ్డి ఫీల్డింగ్ చేశాడు. అయితే బ్యాటింగ్‌లో తన అవసరం పడడంతో సుందర్ ఆరో వికెట్ పడ్డాక క్రీజులోకి వచ్చాడు. ఇబ్బంది పడుతూనే బ్యాటింగ్ చేశాడు. రాహుల్‌కు అండగా నిలిచి జట్టు విజయాన్ని పూర్తి చేశాడు.



సుందర్

పంత్ స్థానంలో జురెల్

న్యూజిలాండ్‌తో తొలి వన్డేకు ముందు ప్రాక్టీస్ చేస్తుండగా గాయపడి సిరీస్ మొత్తానికి దూరమైన వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ స్థానంలో.. ధ్రువ్ జురెల్ భారత జట్టులోకి వచ్చాడు. విజయ్ హజారే ట్రోఫీలో జురెల్ భీకర ఫామ్‌లో ఉన్నాడు. ఆరు మ్యాచ్‌ల్లో నాలుగు అర్ధసెంచరీలు, రెండు శతకాలు బాదాడు.

కోహ్లి వేగంగా..

అంతర్జాతీయ క్రికెట్లో అన్ని ఫార్మాట్లలో కలిపి అత్యంత వేగంగా 28 వేల పరుగులు చేసిన బ్యాటర్‌గా విరాట్ కోహ్లి ఘనత సాధించాడు. న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో స్పిన్నర్ ఆదిత్య అశోక్ బౌలింగ్‌లో బౌండరీతో అతడు ఈ మైలురాయిని అందుకున్నాడు. రికార్డుకు 25 పరుగుల దూరంలో ఉండగా క్రీజులోకి వచ్చిన కోహ్లి.. అలవోకగా పని పూర్తి చేశాడు. కెరీర్‌లో అతడికి ఇది 624వ ఇన్నింగ్స్. సచిన్ 644 ఇన్నింగ్స్‌లో 28 వేల పరుగులు పూర్తి చేశాడు. కోహ్లి, సచిన్ కాకుండా శ్రీలంక దిగ్గజం సంగక్కర మాత్రమే అంతర్జాతీయ క్రికెట్లో (666 ఇన్నింగ్స్) ఆ మైలురాయిని అందుకున్నాడు. అన్ని ఫార్మాట్లలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో సచిన్ (34,357) తర్వాత కోహ్లి (28,068) రెండో స్థానంలో ఉన్నాడు. సంగక్కర (28,016)ది మూడో స్థానం.

డబ్ల్యూపీఎల్‌లో ఈనాడు

బెంగళూరు × యూపీ

వేదిక: ముంబయి, రా. 7.30



సోఫీ డివైన్ 95

బాదుడు పోటీలో గుజరాత్ టైటాన్స్ నిలిచింది. సోఫీ డివైన్ ఆల్‌రౌండ్ జోరుతో అదరగొట్టిన వేళ.. ఉత్కంఠభరిత పోరులో దిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. గెలుపు ముంగిట దిల్లీ తడబడింది. ఆ జట్టుకిది వరుసగా రెండో ఓటమి. వరుసగా రెండు విజయాలతో పాయింట్ల పట్టికలో టైటాన్స్ అగ్రస్థానంలో ఉంది.

డివైన్ దంచేసింది..

ఉత్కంఠపోరులో దిల్లీపై గుజరాత్ విజయం

నవీ ముంబయి

గుజరాత్ టైటాన్స్ అదరగొట్టింది. ఆదివారం భారీ స్కోర్ల మ్యాచ్‌లో ఆ జట్టు 4 పరుగుల తేడాతో దిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. సోఫీ డివైన్ (95; 42 బంతుల్లో 7×4, 8×6) రెచ్చిపోవడంతో మొదట గుజరాత్ భారీ స్కోరు సాధించింది. 20 ఓవర్లలో 209 పరుగులకు ఆలౌటైంది. గార్డ్‌నర్ (49) రాణించింది. నందని శర్మ (5/33) హ్యాట్రిక్ సాధించింది. ఛేదనలో దిల్లీ 5 వికెట్లకు 205 పరుగులే చేయగలిగింది. లిజెలీ లీ (86; 54 బంతుల్లో 12×4, 3×6), వోల్వార్ట్ (77; 38 బంతుల్లో 9×4, 3×6)ల శ్రమ వృథా అయింది. డివైన్ (2/21) ఆఖర్లో అద్భుత బౌలింగ్‌తో దిల్లీ ఆశలపై నీళ్లు చల్లింది.



లిజెలీ లీ 86

లిజెలీ, వోల్వార్ట్ పోరాడినా..: లక్ష్యం చాలా పెద్దదే. కానీ ఓపెనర్ లిజెలీ లీ విరుచుకుపడడంతో ఛేదనలో వడివడిగా లక్ష్యం దిశగా సాగింది దిల్లీ క్యాపిటల్స్. రేణుక సింగ్ వేసిన ఇన్నింగ్స్ మొదటి ఓవర్లో ఫోర్, సిక్స్ బాదాక లిజెలీ కాస్త సమయం తీసుకుంది. పవర్‌ప్లే ముగిసేసరికి షెఫాలి (14) వికెట్ కోల్పోయిన దిల్లీ.. 47/1తో నిలిచింది. ఆ తర్వాత లిజెలీ చెలరేగిపోయింది. వేర్‌హామ్ బౌలింగ్‌లో వరుసగా 4, 4, 6 కొట్టిన ఆమె, 33 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసింది. అయితే మరోవైపు వోల్వార్ట్ అంత దూకుడుగా ఆడలేకపోవడంతో సాధించాల్సిన రన్‌రేట్ క్రమంగా పెరిగింది. 15వ ఓవర్లో లిజెలీని కష్వీ ఔట్ చేసేటప్పటికి దిల్లీ స్కోరు 131. లిజెలీ.. వోల్వార్ట్‌తో రెండో వికెట్‌కు 90 పరుగులు జోడించింది. ఆఖరి అయిదు ఓవర్లలో దిల్లీకి 77 పరుగులు అవసరమయ్యాయి. కానీ షినెలీ ఔటైనా.. వోల్వార్ట్ విధ్వంసంతో 19 ఓవర్లలో 203/3తో నిలిచింది దిల్లీ. 18వ ఓవర్లో 19.. 19వ ఓవర్లో 22 పరుగులు వచ్చాయి. వోల్వార్ట్‌తో పాటు జెమీమా (15) క్రీజులో ఉండగా.. ఆఖరి ఓవర్లో కేవలం 7 పరుగులు చేయాల్సిన స్థితిలో దిల్లీ గెలుపు ఖాయమనిపించింది. కానీ సోఫీ డివైన్ (2/21) బంతితోనూ గొప్పగా రాణించింది. 20వ ఓవర్లో అద్భుతంగా బౌలింగ్ చేసింది. కేవలం 2 పరుగులే ఇచ్చిన ఆమె.. జెమీమా, వోల్వార్ట్‌లను ఔట్ చేయడం ద్వారా గుజరాత్‌కు అనూహ్య విజయాన్నందించింది.

ఆమె దూకుడు: గుజరాత్ మొదట అంత పెద్ద స్కోరు చేసిందంటే కారణం ఓపెనర్ సోఫీ డివైన్ విధ్వంసమే. చెలరేగి ఆడిన ఆమె.. సిక్స్‌లు, ఫోర్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. బెత్ మూనీ (19)తో తొలి వికెట్‌కు 94, ఆష్లీ గార్డ్‌నర్ (49; 26 బంతుల్లో 4×4, 3×6)తో రెండో వికెట్‌కు 32 పరుగులు జోడించి ఔటైంది. డివైన్ నిష్క్రమించాక గుజరాత్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయినప్పటికీ.. గార్డ్‌నర్ చెలరేగడంతో స్కోరు 200 దాటింది.



నందని 5/33

స్నేహ్ ఓవర్లో 32

దిల్లీ స్పిన్నర్ స్నేహ్ రాణా కోరుకోని రికార్డును సొంతం చేసుకుంది. డబ్ల్యూపీఎల్ చరిత్రలో ఒక ఓవర్లో అత్యధిక పరుగులిచ్చిన బౌలర్‌గా ఆమె నిలిచింది. గుజరాత్ ఇన్నింగ్స్ ఆరో ఓవర్లో ఆమె ఏకంగా 32 పరుగులు సమర్పించుకుంది. స్నేహ్ బౌలింగ్‌లో.. సోఫీ డివైన్ వరుసగా 4, 4, 6, 6, 6, 6 దంచేసింది. ఇప్పటివరకు దీప్తి శర్మ (28) ఒక ఓవర్లో అత్యధిక పరుగులిచ్చిన బౌలర్‌గా ఉంది.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: బెత్ మూనీ (సి) అండ్ (బి) శ్రీచరణి 19; సోఫీ డివైన్ (సి) శ్రీచరణి (బి) నందని 95; గార్డ్‌నర్ (సి) వోల్వార్ట్ (బి) షినెలీ 49; వేర్‌హామ్ (సి) జెమీమా (బి) శ్రీచరణి 3; అనుష్క శర్మ (సి) నందని (బి) షెఫాలి వర్మ 13; భార్తీ ఫుల్మాలి (సి) వోల్వార్ట్ (బి) హెన్రీ 3; కష్వీ గౌతమ్ (సి) షినెలీ (బి) నందని 14; కనిక (స్టంప్డ్) లీ (బి) నందని 4; తనూజ కన్వర్ నాటౌట్ 1; రాజేశ్వరి (బి) నందని 0; రేణుక (బి) నందని 0; ఎక్స్‌ట్రాలు 8 **మొత్తం:** (20 ఓవర్లలో ఆలౌట్) **209; వికెట్ల పతనం:** 1-94, 2-126, 3-129, 4-151, 5-165, 6-201, 7-208, 8-209, 9-209; **బౌలింగ్:** మరిజేన్ కాప్ 4-0-25-0; షినెలీ 4-0-43-2; నందని శర్మ 4-0-33-5; స్నేహ్ 1-0-32-0; శ్రీచరణి 4-0-42-2; షెఫాలి 2-0-21-1; మిన్ను మణి 1-0-13-0.

దిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: లిజెలీ లీ (సి) డివైన్ (బి) కష్వీ 86; షెఫాలి వర్మ (బి) రాజేశ్వరి 14; లారా వోల్వార్ట్ (సి) వేర్‌హామ్ (బి) డివైన్ 77; షినెల్ హెన్రీ (సి) గార్డ్‌నర్ (బి) రాజేశ్వరి 7; జెమీమా (సి) మూనీ (బి) డివైన్ 15; కాప్ నాటౌట్ 1; స్నేహ్ రాణా నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 5 **మొత్తం:** (20 ఓవర్లలో 5 వికెట్లకు) **205; వికెట్ల పతనం:** 1-41, 2-131, 3-146, 4-204, 5-205; **బౌలింగ్:** రేణుక సింగ్ 2-0-17-0; కష్వీ 4-0-48-1; సోఫీ డివైన్ 3-0-21-2; రాజేశ్వరి 4-0-34-2; వేర్‌హామ్ 2-0-30-0; తనూజ 3-0-27-0; గార్డ్‌నర్ 2-0-28-0

అర్జున్‌కు కాంస్యం

నిహాల్, వంతికలకు రజతాలు



అర్జున్

కోల్‌కతా: టాటా స్టీల్ చెస్ టోర్నీ బ్లిట్జ్ విభాగంలో తెలుగు కుర్రాడు అర్జున్ ఇరిగేశి కాంస్యం సాధించాడు. ర్యాపిడ్‌లో కాంస్యం గెలిచిన నిహాల్ సరీన్.. బ్లిట్జ్‌లో మరింత మెరుగైన ప్రదర్శనతో రజతం సాధించాడు. నిహాల్, అర్జున్ 18 రౌండ్లలో 11 పాయింట్లతో సమమైనప్పటికీ.. టైబ్రేక్‌లో మెరుగైన స్కోరుతో నిహాల్ రెండో స్థానంలో నిలిచాడు. అమెరికా క్రీడాకారుడు వెస్లీ సో (12 పాయింట్లు) టైటిల్ దక్కించుకున్నాడు. ప్రజ్ఞానంద (9.5 పాయింట్లు) 6.. దిగ్గజ ఆటగాడు విశ్వనాథన్ ఆనంద్ (8 పాయింట్లు) 8 స్థానాలతో సరిపెట్టుకున్నారు. ఉత్కంఠగా సాగిన మహిళల పోరులో కరిస్సా యిప్ (10.5 పాయింట్లు) టైటిల్ గెలవగా.. వంతిక అగర్వాల్ (10.5 పాయింట్లు) రజతం సాధించింది. వైశాలి (9.5 పాయింట్లు), దివ్య దేశ్‌ముఖ్ (8.5 పాయింట్లు) వరుసగా 5, 8 స్థానాల్లో నిలిచారు.

'ఆదివారం సైకిల్‌పై' గోపీచంద్, పేస్



సైకిల్ ర్యాలీలో మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, లియాండర్ పేస్, గోపీచంద్

దిల్లీ: ప్రజలకు ఫిట్‌నెస్ ప్రాధాన్యం తెలియజేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'ఆదివారం సైకిల్‌పై' కార్యక్రమంలో భారత బ్యాడ్మింటన్ దిగ్గజం పుల్లెల గోపీచంద్, టెన్నిస్ గ్రేట్ లియాండర్ పేస్ పాల్గొన్నారు. ఆదివారం దిల్లీలో జరిగిన భారీ సైకిల్ ర్యాలీకి వీళ్లిద్దరూ హాజరయ్యారు. దిల్లీలో ఆదివారం చేపట్టిన ఈ భారీ సైకిల్ ర్యాలీలో కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ సహా వివిధ రాష్ట్రాలకు చెందిన 500 మంది రాజకీయ నాయకులు, ఇంకో 500 మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. మంత్రితో కలిసి గోపీచంద్, పేస్ సైకిల్ తొక్కారు. దేశవ్యాప్తంగా సుమారు 15 వేలకు పైగా ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు.

కళ్లన్నీ పడిక్కల్, సర్ఫరాజ్‌లపైనే



పడిక్కల్



సర్ఫరాజ్

నేటి నుంచే విజయ్ హజారే క్వార్టర్స్

బెంగళూరు: జోరుమీదున్న బ్యాటర్లు సర్ఫరాజ్ ఖాన్, దేవదత్ పడిక్కల్ విజయ్ హజారే ట్రోఫీ క్వార్టర్స్‌లోనూ ఫామ్‌ను కొనసాగించాలనే పట్టుదలతో ఉన్నారు. దేశవాళీలో మేటి జట్లు ముంబయి, కర్ణాటక మధ్య సోమవారం జరిగే క్వార్టర్స్‌లో కళ్లన్నీ వీళ్లపైనే నిలుస్తాయనడంలో సందేహం లేదు. కర్ణాటకకు పడిక్కల్.. ముంబయికి సర్ఫరాజ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఏడు ఇన్నింగ్స్‌ల్లో 640 పరుగులతో పడిక్కల్ టోర్నీ టాప్‌స్కోరర్‌గా ఉన్నాడు. అతడు జోరు కొనసాగిస్తే.. సెలక్టర్లు భారత జట్టులో చోటివ్వక తప్పదు. సర్ఫరాజ్ కూడా అదిరే బ్యాటింగ్‌తో సెలక్షన్ కమిటీ దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ముస్తాక్ అలీ టీ20 టోర్నీలోనూ అదరగొట్టిన అతడు.. విజయ్ హజారేలో ఇప్పటివరకు 5 ఇన్నింగ్స్‌ల్లో 75.75 సగటుతో 303 పరుగులు చేశాడు. సోమవారం మరో క్వార్టర్స్‌లో ఉత్తర్‌ప్రదేశ్‌ను సౌరాష్ట్ర ఢీకొంటుంది. ఈ రెండు మ్యాచ్‌లతో పాటు మంగళవారం పంజాబ్-మధ్యప్రదేశ్, దిల్లీ-విదర్భ మధ్య జరిగే క్వార్టర్స్‌కు కూడా బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆతిథ్యమివ్వనుంది.

ఏ పాము కరిచిందో తెలియక..
3 కోబ్రాలతో ఆస్పత్రికి...



ఈటీవీ భారత్: బిహార్‌లోని రోహ్‌తాస్ జిల్లా రాజ్‌పుర్‌కు చెందిన గౌతమ్‌కుమార్ అనే పాములు పట్టే నిపుణుడు తాను పట్టుకున్న మూడు నాగుపాములను శనివారం అడవికి తరలిస్తుండగా.. అందులోంచి ఓ పాము కరిచింది. మూడింటిలో ఏది కరిచిందో తెలియని గౌతమ్‌కు ఓ బీమా కంపెనీ ప్రకటనలో చూపినట్టు అనుమానం వచ్చింది. వైద్యులకు చూపేందుకు ఆ మూడు విషసర్పాలతో నేరుగా సాసారాం జిల్లా ఆసుపత్రికి వచ్చాడు. ఆస్పత్రి ప్రాంగణంలో పాములను చూసిన రోగులు, వైద్యసిబ్బంది భయపడి పరుగులు తీయడంతో గందరగోళ వాతావరణం నెలకొంది. వైద్యులు వెంటనే చికిత్స ప్రారంభించి గౌతమ్ ప్రాణాలు కాపాడారు. విష సర్పాలు కరిచినపుడు కంగారుపడితే విషం తొందరగా శరీరమంతా వ్యాపిస్తుందని, గౌతమ్ ఎక్కువగా ఆందోళన చెందకపోవడమే ఆయనకు మేలు చేసిందని డాక్టర్లు వివరించారు. పాములను ఇలా తీసుకురావడం ప్రమాదకరమని, దాని ఫొటో తీయడం లేదా అది ఏ రకమో చెబితే సరిపోతుందని గౌతమ్‌కు సూచించారు. వైద్యుల సమాచారంతో అటవీశాఖ అధికారులు పాములను స్వాధీనం చేసుకున్నారు.

చూసుకుని... ఊరెళ్లండి!



సంక్రాంతి పండగ కదా... ఊరెళ్లి తీరాల్సిందే. కాకపోతే తిరిగొచ్చాక ఇంటి తలుపు తెరిస్తే అంతా గజిబిజి. చిన్న తప్పిదాలు పెద్ద ప్రమాదాలకు కారణమవుతాయి కూడా. ఆ పరిస్థితి రాకూడదంటే కొన్ని జాగ్రత్తలు పాటించాలని నిపుణులు చెబుతున్నారు.

- ఎక్కడికెళ్లినా సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేస్తున్నాం. వాటివల్ల ఇంట్లో ఎవరూ లేరనే సంకేతం బయటకు వెళుతుంది. కాబట్టి సమాచారం గోప్యంగా ఉంచడం మంచిది.
- ఊరెళ్లినప్పుడు అనుకున్న రోజు రావడం ఒక్కోసారి ఆలస్యమవుతుంది. ఇంట్లోని నగదు, బంగారం బ్యాంకులోనో, నమ్మకమైన వారి దగ్గరో ఉంచడం మంచిది.
- ఎవరూలేని సమయంలో విద్యుదాఘాత ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అలా కాకుండా బయటకు వెళ్లే ముందు టీవీలు, కంప్యూటర్లు, ఇతర విద్యుత్తు ఉపకరణాలను అన్‌ప్లగ్ చేయాలి. అవసరమైతే మైక్రో సర్క్యూట్ బ్రేకర్ (మినియేచర్ సర్క్యూట్ బ్రేకర్) వేయించుకోవడం మంచిది. ఇది విద్యుత్తు ఓవర్‌లోడ్ లేదా షార్ట్ సర్క్యూట్ కాకుండా నియంత్రిస్తుంది.
- సీసీ కెమెరాలు మెయిన్ డోర్, గేటు వైపు ఫోకస్ చేయాలి. మొబైల్ నోటిఫికేషన్స్ ఆన్‌లో ఉంచాలి.
- వాటర్ ట్యాంక్ మోటర్ ఆఫ్ చేయాలి. గ్యాస్ సిలిండర్ నాబ్ పూర్తిగా మూసేయాలి.
- ఇంటికి రోజూ వచ్చేవారు అంటే వార్తాపత్రికలు, పాలు, కూరగాయలు అందించే వారికి, ఇరుగుపొరుగు వారిని మీ ఇంటిని గమనిస్తూ ఉండమని సమాచారం ఇవ్వండి. అనుమానాస్పదంగా ఎవరైనా ఇంటి వద్ద తిరిగితే వెంటనే తెలియజేయాలని సూచించండి.
- ఫర్నిచర్, అలంకరణ వస్తువులపై వస్త్రం లేదా వార్తాపత్రికలు కప్పండి. దుమ్ము, ధూళి, కీటకాలు లోపలకు రాకుండా కిటికీలన్నీ మూసివేయాలి. వంట గదిలో కిటికీలు తెరిచి ఉంచితే పురుగులు చేరి పదార్థాలను కలుషితం చేస్తాయి.
- ఇంట్లోని చెత్తబుట్ట ఖాళీ చేయాలి. పాడయ్యే కూరగాయలు, మిగిలిపోయిన ఆహార పదార్థాలను బయట పడేయాలి. ఫ్రిడ్జ్‌లో పాడయ్యే ఆహార పదార్థాలుంటే తీసేయాలి. ఒకవేళ నిల్వ ఉంచినట్లయితే అవి దుర్వాసన వస్తాయి. సోఫా, ఇతర ప్రాంతాల్లో నాఫ్తలిన్ గోళీలు ఉంచినట్లయితే చెడు వాసన రాదు.
- వర్షం వచ్చే అవకాశాలుంటే టెర్రస్ డ్రెయినేజీ ముందుగానే శుభ్రం చేసుకోవాలి.
- మొక్కలుంటే రెండు రోజులకోసారి నీరు పోసేలా ఎవరికైనా చెప్పండి. లేకపోతే నీరు నిల్వ ఉండే బాటిల్ పద్ధతి ఉపయోగించడం మేలు. పెంపుడు జంతువులుంటే బాధ్యతగా చూసుకునే వ్యక్తికి అప్పగించాలి.
- ప్రయాణం చేసి వచ్చాక ఎక్కడపడితే అక్కడ బ్యాగ్‌లు పడేయకండి. ఇళ్లంతా ఒకేసారి సర్దడం కంటే గదులవారీగా శుభ్రం చేయడం మంచిది. ఫ్రిడ్జ్‌లో కొత్త కూరగాయలు పెట్టే ముందు ఒకసారి శుభ్రం చేయడం మంచిది.

వెళ్లే ముందు గ్యాస్, మోటర్, మెయిన్ స్విచ్, తాళాలు, చెత్త, కుళాయిలు స్వయంగా పరిశీలించుకోవడం మేలు.

- ఈనాడు డిజిటల్, భీమవరం

అందాల పోటీలో..
పొట్టిమేక, చిట్టి ఆవు



సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకమైన పోటీలు జరుగుతుంటాయి. కృష్ణా జిల్లా గన్నవరంలో మేకపోతు, గోవుల అందాల పోటీలు నిర్వహిస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలోని కేశనపల్లెకు చెందిన అడబాల లక్ష్మీనారాయణ ఇక్కడికి జింగ్ జాతికి చెందిన పొట్టి మేకపోతును, ఒంగోలు, పుంగనూరు, కపిల గోవులను తీసుకువచ్చారు. జింగ్ జాతి పొట్టి మేకపోతు సింహంలా జూలు. . వంపులు తిరిగిన కొమ్ములతో సందర్శకులను ఆకట్టుకుంది. దీన్ని ప్రత్యేకంగా నేపాల్ నుంచి విమానంలో తీసుకొచ్చానని, దీని ఖరీదు రూ.లక్ష అని లక్ష్మీనారాయణ వెల్లడించారు. గన్నవరంలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి గోవుల అందాల పోటీల్లో.. పాలపళ్ల విభాగంలో లక్ష్మీనారాయణకు చెందిన ముప్పై నెలల పుంగనూరు గోవు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. – ఈనాడు, అమరావతి; గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే

మా మెదడే జీపీఎస్



చేతిలో సెల్‌ఫోన్.. అందులో గూగుల్ మ్యాప్స్ ఉన్నా.. ఓ దారిలో వెళ్తుంటే ఇక్కడే తిరగాలా, తర్వాతి సందు తిరగాలా అన్న సందేహం మనల్ని తొలుస్తూ ఉంటుంది. కానీ, ఈ పక్షులు మాత్రం ఏ జీపీఎస్ పరికరాలూ అక్కర్లేకుండా వేల మైళ్లు ఝామ్మని వెళ్లిపోతున్నాయి. వీటి మెదడే ఒక అద్భుతమైన దిక్సూచి. ముందున్న పక్షి రెక్కలు ఆడించినపుడు దాని వెనుక గాలిలో ఒత్తిడి ఏర్పడుతుంది. దానివల్ల వెనకొచ్చే పక్షికి శ్రమ తగ్గుతుంది. ముందున్న దానికి ఎదురుగాలి వల్ల అలసట వస్తే.. మరొకటి ఆ పైలట్ బాధ్యత తీసుకుంటుంది. భూ అయస్కాంత క్షేత్రాలను, సూర్యచంద్రుల గమనాన్ని బట్టి ఇవి దారిని వెతుక్కుంటాయి. వందల పక్షుల్లో ఏ ఒక్కటి దారితప్పినా మిగిలినవి దానికోసం ఆగుతాయి. ముందున్న పక్షిని ఢీకొట్టకుండా, గాలి దిశను బట్టి చాలా జాగ్రత్తగా వెళ్తాయి. నేలకు దిగేటప్పుడు ఎంతో ఒద్దికగా చేరతాయి. గాలి స్పర్శ ఆధారంగానే ఇవి పయనిస్తాయి. తిరుపతి జిల్లా నేలపట్టులో జరుగుతున్న ఫ్లెమింగో ఉత్సవంలో కనిపించిన విహంగాల గమనమిది. – ఈనాడు, తిరుపతి

సంక్రాంతి పొంగళ్లు.. నలభీముల సందళ్లు



సంక్రాంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడులోని కొన్ని గ్రామాలు వినూత్న ఆచారాలు పాటిస్తున్నాయి. ఇక్కడ పురుషులే పొంగళ్లు పెడతారు. తిరుపతి జిల్లా పుల్లంపేట మండలంలోని తిప్పాయపల్లెలో ఆదివారం సంజీవరాయస్వామికి పురుషులే పొంగళ్లు వండి నైవేద్యంగా సమర్పించారు. సాధారణంగా మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పిస్తారు. కానీ, ఇక్కడ పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాన్ని ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. మహిళలు ఆలయం వెలుపల నుంచే స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఏటా సంక్రాంతి ముందు వచ్చే ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తిరుచ్చి జిల్లా తురైయూర్ పంచాయతీ పరిధిలోని కొన్ని గ్రామాల్లోనూ సంక్రాంతి రోజు సాయంత్రం ఇంటి ముందు కట్టెల పొయ్యి ఏర్పాటు చేసి పురుషులే పొంగల్ వండి సూర్య దేవుడికి సమర్పిస్తారు. విలుపురం జిల్లా నైనార్‌మండం గ్రామంలో సంక్రాంతి రోజు అక్కడి పురుషులంతా కలిసి ఊరేగింపుగా చెరువు వద్దకు వెళ్తారు. అక్కడి నుంచి కొత్తకుండలో నీళ్లు తీసుకొచ్చి వెళ్లతాంగి వీరనార్ ఆలయంలో పొంగల్ వండి సమర్పిస్తారు.

– పుల్లంపేట, ఆర్కేనగర్ (చెన్నై)

సంపాదన పెరగ్గానే ఆర్భాటపు జీవనశైలి ఎందుకు?



చాలా మంది తమ సంపాదన పెరగ్గానే ఆర్భాటంగా జీవించడం మొదలుపెడతారు. అందుకోసం విపరీతంగా ఖర్చు చేస్తుంటారు. జీవనశైలి అనేది సంపదకు అనుగుణంగా ఉండాలి తప్ప సంపాదనను బట్టి మారకూడదు. ఆదాయాన్ని పొదుపు చేసుకొని సంపదగా మార్చుకుంటే, అది మీరు మెరుగైన జీవనశైలిని కొనసాగించేందుకు దోహదం చేస్తుంది. కానీ ఆదాయం మీద ఆధారపడిన జీవనశైలి మాత్రం ఆదాయం ఉన్నంత కాలమే కొనసాగుతుంది. – ముత్తుకృష్ణన్ దండపాణి, ఇన్వెస్టర్

నోటికాడి చేప.. నీటిలోకి జారె

హైదరాబాద్ శివారు తుర్కయంజాల్‌లోని మాసాబ్ చెరువు.. క్షుద్బాధతో ఉన్న ఓ నీటి బాతు ఆహారం కోసం అన్వేషిస్తోంది. తీక్షణంగా చూస్తూ ముందుకు వెళ్తుండగా ఓ చేప కనిపించడంతో నోటకరిచింది. బాతు దాన్ని గాల్లోకి ఎగరేసి మింగాలనుకుంది. ఈ క్రమంలో మీనం పట్టుతప్పి నీళ్లలో పడిపోయింది. ఎలా తప్పించుకోవాలా అని చూస్తున్న మీనం ఇదే అవకాశంగా భావించి జారుకుంది. – ఈనాడు, హైదరాబాద్



భలే దొరికావ్.. నా ఆకలి తీరినట్టే.. | ఇలా ఎగరేసి.. అలా మింగేద్దాం.. | అయ్యయ్యో.. జారిపోతోందే.. | ఛ.. ఎంతపనైంది..

అయ్యారే.. మత్స్యారే!

● చేపల చర్మంతోనూ ఉత్పత్తులు ● 'మంగళూరు' కళాశాల పరిశోధన



శుద్ధీకరించిన వివిధ రకాల చేపల చర్మాలు

ఈనాడు, బెంగళూరు: వివిధ జంతువుల చర్మాలతో తయారయ్యే ఉత్పత్తులకు దేశ, విదేశీ మార్కెట్లలో మంచి డిమాండ్ ఉంది. కాలుష్య నియంత్రణ మండలి, సీఎల్ఈ (లెదర్ ఎక్స్‌పోర్ట్ కౌన్సిల్) నిబంధనల ప్రకారం.. ప్రస్తుతం ఆవులు, గొర్రెలు, ఒంటెలు, మొసళ్ల చర్మాలతో మాత్రమే పలు ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. ఇకపై చేపల చర్మంతోనూ తయారు చేయొచ్చని కర్ణాటకలోని మంగళూరు కాలేజ్ ఆఫ్ ఫిషరీస్ అనుబంధ ఫిష్ ప్రాసెసింగ్ టెక్నాలజీ విభాగం నిరూపించింది. ఈ విభాగాధిపతి డాక్టర్ బి.మంజునాయక్ నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం ఐదేళ్లుగా భారతీయ మత్స్యజాతుల్లో 15 రకాల చేపల చర్మాలు వాణిజ్య ఉత్పత్తులకు అనువుగా ఉన్నాయని తెలిపింది. ఇందుకోసం ప్యూరిఫైయింగ్ ఎనలిటికల్ ఆటోమేషన్ సాంకేతికత ద్వారా విశ్లేషించింది. వీరి అధ్యయనం బెర్లిన్, లండన్, న్యూయార్క్‌ల నుంచి ప్రచురితమయ్యే 'స్ప్రింగర్ నేచర్' జర్నల్‌లో 'వేలోరైజేషన్ ఆఫ్ మలబార్ గ్రూపర్ ఫిష్ స్కిన్ ఇన్ టూ క్వాలిటీ లెదర్' పేరిట ప్రచురితమైంది.

సాంకేతికత ఇదీ..

పశువుల చర్మాన్ని వాణిజ్య ఉత్పత్తులకు అనుగుణంగా మార్చేందుకు విషపూరిత రసాయనాలు వాడతారు. ఈ ఉత్పత్తులు మానవ చర్మానికి హాని కలుగజేయడంతో పాటు పర్యావరణాన్ని కాలుష్యమయం చేస్తాయి. ఇందుకు భిన్నంగా చేపల చర్మంలో అధికంగా ఉండే కొల్లాజెన్ పోషక పదార్థమే చర్మ ఉత్పత్తులకు ఉపయోగపడుతుందని డాక్టర్ మంజునాయక్ పేర్కొన్నారు. 'కొల్లాజెన్‌ను ప్యూరిఫైయింగ్ ఎనలిటికల్ ఆటోమేషన్ ద్వారా శుద్ధీకరించాం. కాల్షియం కార్బొనేట్, సోడియం హైడ్రాక్సైడ్‌తో శుభ్రపరిచాం. దీంతో చర్మం ఉత్పత్తుల తయారీకి అనువుగా సిద్ధమవుతుంది' అని ఆయన వివరించారు. వీటిని విష, కాలుష్య రహితంగా తయారు చేసే వీలుందన్నారు. చేపలో 65 శాతం మాత్రమే తినేందుకు ఉపయోగించగా మిగిలిన 35 శాతం వ్యర్థంగా పడేస్తుంటారు. వీటిలో చర్మమే ఎక్కువగా ఉంటుంది. ఈ సాంకేతికతతో మలబార్ గ్రూపర్, కోబియా, క్యాట్‌ఫిష్, సైనిక్ గ్రూపర్ వంటి 15 రకాల దేశీయ చేపల చర్మాన్ని వాణిజ్య ఉత్పత్తులకు ఉపయోగించే వీలుందని, తద్వారా మత్స్యకారులకు అదనపు ఆదాయం చేకూరతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



మంగళూరులోని కాలేజ్ ఆఫ్ ఫిషరీస్



కాలిపోయిన బ్లోఅవుట్ ప్రివెంటర్‌ను పరిశీలిస్తున్న ఓఎన్జీసీ అధికారులు

బ్లోఅవుట్‌పై విచారణ చేపట్టిన మైన్స్, ఓఎన్జీసీ విభాగాలు

మలికిపురం, పి.గన్నవరం, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండ వద్ద ఈ నెల 5న జరిగిన బ్లోఅవుట్ ఘటనపై విచారణలు మొదలయ్యాయి. ఈ విపత్తుకు దారితీసిన బ్లోఅవుట్‌పై కేంద్ర ప్రభుత్వానికి చెందిన డీజీఎంఎస్ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ) అధికారులు విచారణ ప్రారంభించారు. మూడు రోజుల క్రితమే ఆ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారని ఓఎన్జీసీకి చెందిన అధికారి వెల్లడించారు. మరోవైపు ఓఎన్జీసీ ఇప్పటికే విచారణ మొదలుపెట్టిందని ఆ సంస్థ ఈడీ శాంతన్‌దాస్ తెలిపారు. విచారణలు పూర్తయ్యాక బ్లోఅవుట్‌కు కారణాలపై స్పష్టత రానుంది.

✦ ఓఎన్జీసీ బృందం ఐదు రోజులు శ్రమించి బ్లోఅవుట్‌లో మంటలు అదుపు చేసి, శనివారం బావిని మూసివేసిన విషయం తెలిసిందే. ఈ 5 రోజుల్లో చుట్టుపక్కల ప్రజలు కంటిమీద కునుకులేకుండా గడిపారు. ఆక్వా చెరువులతోపాటు పంటలూ దెబ్బతిన్నాయి. డ్రిల్లింగ్ సైట్‌లో రూ.కోట్ల విలువైన యంత్రాలు కాలి బూడిదయ్యాయి. సుమారు 4 లక్షల క్యూబిక్ మీటర్ల గ్యాస్ దగ్ధమైంది.

✦ మరోవైపు బ్లోఅవుట్‌ను అరికట్టేందుకు ఓఎన్జీసీ నరసాపురం యార్డ్ నుంచి ఇక్కడికి తరలించిన మడ్ పంపింగ్ యూనిట్, డోజర్, బీవోపీ, బీవోపీ కంట్రోల్ యూనిట్, వాటర్ మానిటర్స్ తదితర భారీ పరికరాలను తిరిగి నరసాపురం తరలించారు.



బరిలోకి పుంజులను వదిలిన అంబటి, రోజా

గోరంట్ల, న్యూస్‌టుడే: గుంటూరు నగరంలో వైకాపా జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి పోటీలు నిర్వహించారు. మాజీ మంత్రి రోజా పాల్గొన్నారు. మహిళల ముగ్గుల పోటీల్లో మొదటి విజేతకు రూ.లక్ష, రెండో విజేతకు రూ.50 వేల చొప్పున బహుమతులు అందించారు. అనంతరం కోడి పందేలు నిర్వహించగా.. రాంబాబు, రోజా కోడి పుంజులను బరిలోకి వదిలారు. తాను ఏటా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నానని, గతంలో సత్తెనపల్లిలోనూ ఈ పోటీలు జరిగినట్లు అంబటి రాంబాబు తెలిపారు. రాష్ట్రంలో రాంబాబు అంటే సంక్రాంతి.. సంక్రాంతి అంటే రాంబాబు అంటూ అంబటికి రోజా కితాబిచ్చారు.

కాలుష్యంపై కత్తికట్టి... పాతికేళ్ల పరిశోధన!

- 71 ఏళ్ల వయసులో పేటెంట్ సాధన
- వాహనాల్లో పొగను తగ్గించే పరికరం తయారీ
- విశ్రాంత ఇంజినీర్ రామారావు స్ఫూర్తి

ఈనాడు, విశాఖపట్నం: విశాఖకు చెందిన మార్గాన రామారావు 71 ఏళ్ల వయసులో స్ఫూర్తిని పంచారు. వాహనాల నుంచి వెలువడే వాయు కాలుష్య నియంత్రణకు ప్రత్యేక పరికరం రూపొందించి అబ్బుర పరిచారు. దీని తయారీకి 25 ఏళ్లపాటు వ్యయప్రయాసలకోర్చి శ్రమించిన ఆయన.. పేటెంట్(మేధో) హక్కులు దక్కించుకున్నారు. పరికరాన్ని కార్లు మినహా మిగిలిన వాహనాల్లో అమర్చితే కాలుష్య తీవ్రతను సగానికిపైగా తగ్గించొచ్చని చెబుతున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే...

మాది విశాఖపట్నం. మెరైన్ ఇంజినీరింగ్ చదివా. డాక్‌యార్డులోని ట్రాన్స్‌పోర్టు విభాగంలో మెకానికల్ సూపర్‌వైజర్‌గా పనిచేశా. కొత్త ప్రయోగాలు చేయాలని, అవి దేశానికి ఉపయోగపడాలని తపించేవాడిని. వాహనాల నుంచి వచ్చే వాయు కాలుష్య సమస్యను పరిష్కరించాలని 2001లో కసరత్తు మొదలెట్టా. కాలుష్య కారకాలను ఎలా తగ్గించాలో నాలుగేళ్లపాటు పరిశోధన



వాయు కాలుష్య నియంత్రణ పరికరంతో రామారావు

చేశా. 2004కు ఒక రూపునకు రావడంతో అప్పట్లో నౌకాదళం.. నేవల్ కమాండ్ అవార్డుతో సత్కరించింది. 2015లో పదవీ విరమణ చేసినప్పటికీ పరికరం తయారీ ప్రయోగాలు ఆపలేదు. ఏయూ, గీతం విశ్వవిద్యాలయాల్లోని మెకానికల్, పర్యావరణ విభాగ నిపుణులతో దానిని పరిశీలింపజేసి సామర్థ్యాన్ని మరింత పెంచా. 'ఇంజిన్ ఎగ్జాస్ట్ ఎమిషన్స్ రెడ్యూసర్' పేరుతో పేటెంట్‌కు దరఖాస్తు చేయగా ఆరు నెలల కిందట ధ్రువీకరణ లభించింది.

ఎలా పని చేస్తుందంటే..

జీఐ షీట్‌తో బాక్సును చేసి కొన్ని సాంకేతిక పరికరాలు, బెండ్లు ఉంచా. ఇది పనిచేయడానికి లోపల పలు రసాయనాలు, నీరు అవసరం. వాహనాల సామర్థ్యం ఆధారంగా సైలెన్సర్ల వద్ద ఈ పరికరాన్ని అమర్చుతాం. బయటకు విడుదలయ్యే పొగను అది పీల్చుకుంటుంది. కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్, ధూళి కణాలు.. ఇతర కాలుష్య కారకాలను గ్రహించి వాటి తీవ్రతను తగ్గించేస్తుంది. ఇంజిన్ వద్ద మండేటప్పుడు 700 డిగ్రీల వేడితో కాలుష్య కారకాలు విడుదలవుతాయి. అవి పొగ గొట్టం ద్వారా బయటకు వచ్చేటప్పుడు వేడి 400 డిగ్రీలుంటుంది. ఈ పరికరం వాటిని పీల్చుకొని వేడిని 70 డిగ్రీలకు తగ్గిస్తుంది. ఫలితంగా బయటకొచ్చే కాలుష్యం సగానికి పైగా తగ్గుతుంది.

పరీక్షలో విజయం

ఈ పరికరాన్ని ఆటో, బొలెరో, టిప్పర్‌లకు ఏర్పాటు చేశాం. ఇది ఉంటే ఎంత కాలుష్యం విడుదలవుతోంది. . లేకపోతే ఎంత అనే అంశాన్ని రవాణాశాఖ తనిఖీ చేసి ధ్రువీకరణ పత్రం అందించింది. పరికరం లేని టిప్పరు నుంచి వచ్చే ఉద్గారాల్లో ధూళి, కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ వాయువులు 70.63 శాతం ఉంటే పరికరం అమర్చాక 31.30 శాతంగా కనిపించాయి.

కుక్కల బెడద నివారణకు చర్యలు

ఈనాడు, అమరావతి: సుప్రీంకోర్టు ఆదేశాలతో గ్రామాల్లో వీధి కుక్కల బెడదపై రాష్ట్ర ప్రభుత్వం నివారణ చర్యలు చేపడుతోంది. వివిధ ప్రభుత్వశాఖల భాగస్వామ్యంతో విద్యా సంస్థలు, ఆసుపత్రులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల వద్ద సమస్య పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. దీనికి రాష్ట్ర పశుసంవర్ధక శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. కుక్కల దాడులతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అనేకమంది పలుచోట్ల తీవ్రంగా గాయపడుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. రేబిస్‌తో అక్కడక్కడ మృతి చెందుతున్న ఉదంతాలూ ఉన్నాయి. సమస్య తీవ్రతను గుర్తించిన సుప్రీంకోర్టు.. వీధి కుక్కల బెడద నివారణకు తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలను ఆదేశించడంతో ప్రభుత్వశాఖలు సన్నద్ధమవుతున్నాయి.

ప్రణాళిక ఇలా..

✦ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 29,406 విద్యా సంస్థలు, 1,646 ఆసుపత్రులు, వైద్య కళాశాలలు, 34 క్రీడా ప్రాంగణాలు, 573 బస్టాండ్లు, డిపోలు, 177 రైల్వే స్టేషన్లలోకి కుక్కలు ప్రవేశించకుండా సరిహద్దు గోడలు, ఫెన్సింగ్, గేట్ల ఏర్పాటు, అవసరమైన ఇతర చర్యలు చేపట్టనున్నారు.

✦ సంబంధిత సంస్థలు, ప్రభుత్వశాఖల ఆధ్వర్యంలో నోడల్ అధికారులను ఏర్పాటు చేయనున్నారు. వీరు ప్రతి మూడు నెలలకోసారి తనిఖీలు చేయాలి.

✦ సంస్థల ప్రాంగణాల్లో కనిపించే కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేశారా? లేదా అన్నది పరిశీలించి తగిన చర్యలు చేపడతారు.

✦ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖతో పాటు రోడ్లు, భవనాలు, వైద్య ఆరోగ్య, క్రీడలు, విద్య, రవాణా శాఖలతోపాటు రైల్వేని కుక్కల బెడద నివారణ కార్యక్రమంలో భాగస్వాములను చేశారు.

భారతీయ ఆచార్యులారా.. ఐఐటీలకు రండి

● విదేశాల్లోని నైపుణ్యమున్న ప్రొఫెసర్లకు కేంద్రం ఆహ్వానం ● త్వరలో ప్రైమ్ మినిస్టర్ రీసెర్చ్ ఛైర్ పథకానికి శ్రీకారం

ఈనాడు, హైదరాబాద్: దేశంలో ఉన్నత విద్య, పరిశోధన రంగాలను బలోపేతం చేసేందుకు ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తున్న ప్రముఖ భారతీయ ఆచార్యులు, శాస్త్రవేత్తలను స్వదేశానికి రప్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వారు ఇక్కడి ఐఐటీల్లో పనిచేసేందుకు ప్రైమ్ మినిస్టర్ రీసెర్చ్ ఛైర్(పీఎంఆర్‌సీ) పేరిట ఓ కొత్త పథకాన్ని త్వరలో ప్రారంభించనుంది. ఇప్పటికే వివిధ రంగాల్లో ప్రపంచస్థాయి నిపుణులుగా ఎదిగిన భారతీయుల ద్వారా విద్య, పరిశోధన వ్యవస్థలను సంస్థాగతంగా అభివృద్ధి పరచాలన్నది లక్ష్యం.

3 కేటగిరీల్లో నియామకం

తొలివిడత 120 మంది భారతీయ మూలాలున్న(ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా- ఓసీఐ) వారిని నియమించుకుంటారు. ఆయా రంగాల్లో ఉన్న అనుభవం ఆధారంగా యంగ్ రీసెర్చ్ ఫెలోస్, సీనియర్ రీసెర్చ్ ఫెలోస్, రీసెర్చ్ ఛైర్స్ పేరిట అయిదేళ్లపాటు నియమిస్తారు. ఇందుకు నియమ నిబంధనలను త్వరగా రూపొందించాలని కేంద్ర విద్యాశాఖ ఐఐటీలను ఆదేశించించింది. ఈ పథకం కింద సెమీకండక్టర్లు, కృత్రిమ మేధ, కాలుష్య రహిత విద్యుత్(క్లీన్ ఎనర్జీ), అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, డేటా ఎనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ తదితర 14 రంగాల నిపుణులకు ప్రాధాన్యమిస్తారు.

ఐఐటీల ప్రపంచ ర్యాంకింగ్ పెరిగేందుకు దోహదం

✦ ప్రపంచ దేశాలు ఉన్నత విద్య, పరిశోధన రంగాల అభివృద్ధికి పాటిస్తున్న ఉత్తమ విధానాలను భారత్‌లో అమలు చేయడంతో పాటు.. ఐఐటీల్లో సంస్థాగతంగా మార్పులు చేస్తారు. వచ్చిన ఫలితాల ఆధారంగా ఇతర జాతీయ విద్యాసంస్థలైన ఎన్ఐటీలు, ట్రిపుల్‌ఐటీలు, ఐసర్లు తదితరాల్లో అమలు చేస్తారు.

✦ దేశవ్యాప్తంగా 23 ఐఐటీలు ఉండగా.. ఏ ఒక్కటీ క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్‌లో 100లోపు చోటు సాధించలేకపోతున్నాయి. ఐఐటీ దిల్లీ 123వ ర్యాంకు, బాంబే 129వ ర్యాంకులో నిలిచాయి. మరికొంత కష్టపడితే 100 లోపు ర్యాంకింగ్ సాధించడం సాధ్యమని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఉత్తమ ర్యాంకింగ్ సాధిస్తే విదేశీ విద్యార్థుల ప్రవేశాలు పెరుగుతాయి.

✦ ఐఐటీ దిల్లీలో 816 మంది ఆచార్యులుంటే.. వారిలో 3 శాతమే విదేశీ ఆచార్యులున్నారు. ఐఐటీ బాంబేలో 772 మందికి 4 శాతం పనిచేస్తున్నారు. అందుకే ఈసారి భారతీయ మూలాలున్న వారిపై కేంద్రం దృష్టి సారించింది.

EENADU Vol: 52, Issue: 153 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు సినిమా


'ది రాజాసాబ్'


'మన శంకరవర ప్రసాద్‌గారు'

సంక్రాంతి అంటే సినిమాకీ పెద్ద పండగే. వారం నుంచి పది రోజుల వరకూ కిక్కిరిసిపోయే ప్రేక్షకులతో థియేటర్లు జాతరని తలపిస్తుంటాయి. వసూళ్లతో బాక్సాఫీస్ కళకళలాడుతుంది. బరిలోని కోళ్లని తలపించేలా కొత్త చిత్రాలు పోటాపోటీగా విడుదలవుతాయి. ఇక చిత్ర పరిశ్రమలో అయితే నెల రోజుల ముందు నుంచే వ్యాపారం ఊపందుకుంటుంది. 2026 సంక్రాంతి కూడా అదే జోష్‌తోనే మొదలైంది. ఈసారి విడుదలవుతున్న సినిమాల సంఖ్య ఇంకా ఎక్కువ కావడంతో వ్యాపారం పరంగా ఇది అతి పెద్ద సినీ సంక్రాంతి కానుందని వ్యాపార వర్గాలు అంచనా వేశాయి. ఇప్పటికే విడుదలైన సినిమాల ప్రారంభ వసూళ్ల సరళి అంచనాలకి దీటుగానే కనిపిస్తోంది.

థియేటర్ల దగ్గర సందడే సందడి

బాక్సాఫీస్‌కి సంక్రాంతి జోష్

అంచనాలకి దీటుగా ప్రారంభ వసూళ్లు

సంక్రాంతి పండగకు వచ్చే ప్రతి సినిమానీ ప్రేక్షకులు ఆదరిస్తారనే ఓ భరోసా పరిశ్రమలో కనిపిస్తుంటుంది. అందుకే పండగే లక్ష్యంగా పలు సినిమాలు తెరకెక్కుతూ ప్రేక్షకుల ముందుకొస్తుంటాయి. ఈసారి పండగకు ప్రేక్షకుల ముందుకొస్తున్న తెలుగు సినిమాలు... ఐదు. వాటిలో అగ్ర కథానాయకుల సినిమాలున్నాయి, యువ తారల సినిమాలూ ఉన్నాయి. వీటన్నిటి థియేట్రికల్ వ్యాపార లావాదేవీల విలువ రూ.600 కోట్లు పైమాటే అనేది పరిశ్రమ వర్గాల లెక్క. ఇదివరకు ఏ సీజన్‌లోనూ ఇంత భారీ స్థాయిలో లావాదేవీలు జరగలేదు మరి! ఈమధ్య సినిమాలు సాధించే వసూళ్లకు ఆకాశమే హద్దు. బాగుందనే మాట వినిపించిందంటే చాలు... రూ.వేల కోట్లు కట్టబెడుతుంటారు ప్రేక్షకులు. మరి ఈ సినీ సంక్రాంతి ఎంత తిరిగి రాబట్టుకుంటుందో కానీ... ప్రేక్షకుల్లో ఉత్సాహం మాత్రం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

ఘనమైన ప్రారంభమే

ప్రభాస్ 'ది రాజాసాబ్', చిరంజీవి కథానాయకుడిగా నటించిన 'మన శంకరవరప్రసాద్‌గారు' చిత్రాలు ఇప్పటికే ప్రేక్షకుల ముందుకొచ్చాయి. తెలంగాణలో ముందస్తు ప్రదర్శనలు లేకపోయినా, తొలి ఆట తర్వాత మిశ్రమ స్పందన వచ్చినా 'ది రాజాసాబ్' తొలి రోజు వసూళ్లు అదిరిపోయాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రభాస్ మేనియాకి తగ్గట్టుగానే తొలి రోజూ రూ.112 కోట్లు వసూళ్లు వచ్చాయని నిర్మాత తెలిపారు. రెండో రోజూ స్థిరమైన వసూళ్లతో సినిమా థియేటర్లని కళకళలాడించింది. సినిమాకి మిశ్రమ స్పందన లభించిన తర్వాత చిత్రబృందం వెంటనే స్పందించి, కొన్ని కొత్త సన్నివేశాల్ని జోడిస్తూ అనవసరమైన సన్నివేశాల్ని తొలగించి సినిమాకి వేగం పెరిగేలా చేసింది. అమెరికా మార్కెట్‌లో ఈ సినిమా ఇప్పటికే 2 మిలియన్ డాలర్ల మార్క్‌ని అధిగమించింది. ఆదివారం రాత్రి ప్రత్యేక ప్రదర్శనలతోనే విడుదలైన చిరంజీవి 'మన శంకరవరప్రసాద్‌గారు' సినిమాకీ అదిరిపోయే ప్రారంభం దక్కింది. అమెరికాలో ప్రీమియర్ షోలతోనే ఈ సినిమా మిలియన్ డాలర్ మార్క్‌కి చేరువైపోయింది. అగ్ర కథానాయకులు చిరంజీవి, వెంకటేశ్ కలిసి నటించిన సినిమా కావడం, విజయాలకి కేరాఫ్‌గా నిలుస్తున్న అనిల్ రావిపూడి దర్శకత్వం వహించడంతో ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. అందుకు దీటైన ప్రారంభ వసూళ్లతోనే ఈ సినిమా ప్రదర్శితమవుతోంది.


'అనగనగా ఒక రాజు'

వరుసగా వస్తున్నాయి...

ఈసారి విడుదలవుతున్న ప్రతి సినిమా కూడా వినోదానికి గ్యారెంటీ అన్నట్టుగా ఊరించాయి. అన్ని సినిమాలూ కుటుంబ వినోదంతో రూపొందిన సినిమాలు కావడమే అందుకు కారణం. పండగకు ఇలాంటి సినిమాల్నే ప్రేక్షకులు కోరుకుంటారని దర్శకుడు అనిల్ రావిపూడి అంటారు. 'మన శంకరవరప్రసాద్ గారు'తో మొదలైన సినిమాల మారథాన్ రెండు రోజుల పాటు కొనసాగనుంది. 13న రవితేజ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి', 14న నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒక రాజు', అదే రోజున శర్వానంద్ 'నారీ నారీ నడుమ మురారి' చిత్రాలు విడుదలవుతున్నాయి. వీటి ప్రచార చిత్రాలు వినోదంతో ఊరిస్తున్నాయి. మిగతా సినిమాలతో పోలిస్తే, ఈ మూడు సినిమాలు పరిమిత వ్యయంతో రూపొందినవే. అయితే పండుగ సందర్భంగా ఇంటిల్లిపాదినీ అలరించే వినోదంతో వచ్చిన చిన్న సినిమాలూ గతంలో ఘన విజయాల్ని అందుకున్నాయి. అందుకే చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి పండగ సినిమాపైనా ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన అంచనాలు ఉంటాయి.


'భర్త మహాశయులకు విజ్ఞప్తి'

మన ఐదు చిత్రాలకి తోడు, ఈసారి తమిళం నుంచి రెండు అనువాద చిత్రాలు విడుదలకు సిద్ధమైనా, ఆఖరి నిమిషంలో అవి రాలేకపోయాయి. దాంతో మన సినిమాలే వసూళ్లని పంచుకునే అవకాశం దక్కినట్టైంది. ఈ సంక్రాంతి మన తెలుగు సినిమా మార్కెట్ పరిధి ఎంతో చాటుతుందని, ఈసారి జరిగే వ్యాపారం ఇకపై వచ్చే సంక్రాంతి సీజన్లని ప్రభావితం చేస్తుందనేది సినీ వర్గాలు చెప్పే మాట.

ఇష్యూ లేని చోట లవ్ ఉండదు!


'నారీ నారీ నడుమ మురారి'

"నువ్వు చేసిన పని నిత్యాకి చెప్పేస్తా" నంటూ ఓవైపు మాజీ ప్రేయసి బెదిరిస్తుంటే. . "నా దగ్గర నిజం ఎందుకు దాచావ"ని ఇంకోవైపు పెళ్లికి సిద్ధమైన ప్రియురాలు నిలదీస్తోంది. మరి ఈ ఇద్దరి మధ్య నలిగిపోతున్న ఆ కుర్రాడి కథేంటో తెలియాలంటే 'నారీ నారీ నడుమ మురారి' సినిమా చూడాల్సిందే. శర్వానంద్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రాన్ని రామ్ అబ్బరాజు తెరకెక్కించారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. సంయుక్తా మేనన్, సాక్షి వైద్య కథానాయికలు. ఈ సినిమా ఈనెల 14న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం ఆత్రేయపురంలో నిర్వహించిన ప్రీరిలీజ్ వేడుకలో ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. మాజీ ప్రేయసికి.. పెళ్లికి సిద్ధమవుతున్న ప్రియురాలికి మధ్య నలిగిపోయే కుర్రాడి కథ ఇది. లవకుశగా సత్య కామెడీ ట్రాక్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం వినోదాత్మకంగా సాగింది. గౌతమ్‌గా శర్వా పరిచయ సన్నివేశాలు.. ఇద్దరమ్మాయిల మధ్య ఇరుక్కుని తను పడే తిప్పలు అన్నీ నవ్వులు పూయించాయి. "నా లైఫ్.. నా వైఫ్ నీ చేతుల్లో ఉంది" అంటూ హీరో, మాజీ ప్రేయసిని బతిమలాడటం ఆసక్తిరేకెత్తించింది. "ఇష్యూ లేని చోట లవ్ ఉండదు" అంటూ ట్రైలర్‌లో వినిపించిన డైలాగ్ ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమాలో నరేశ్, సునీల్, సుదర్శన్, రఘుబాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, ఛాయాగ్రహణం: జ్ఞానశేఖర్ వీఎస్, యువరాజ్.

పవన్ కల్యాణ్.. టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్



ప్రముఖ సినీ నటుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని అందుకున్నారు. మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యులైన ఆయనకు.. ప్రాచీన జపనీస్ కత్తిసాము కళ కెంజుట్సులో అధికారిక ప్రవేశం లభించింది. మూడు దశాబ్దాలకు పైగా మార్షల్ ఆర్ట్స్‌లో ఆయన కొనసాగిస్తున్న సాధన, పరిశోధన, అంకితభావాన్ని గుర్తిస్తూ ఈ అరుదైన ప్రపంచ స్థాయి గుర్తింపు దక్కింది. దీంతో జపాన్ వెలుపల ఈస్థాయి గుర్తింపు పొందిన అతికొద్ది మంది భారతీయుల్లో పవన్ ఒకరిగా నిలిచారు. అలాగే జపాన్ సంప్రదాయ యుద్ధకళల్లో అత్యంత గౌరవనీయమైన సంస్థల్లో ఒకటైన 'సాగో బుడో కన్‌రికై' నుంచి ఆయనకు ఫిఫ్త్ డాన్ పురస్కారం లభించింది. జపాన్ వెలుపల 'సోకే మురమత్సు సెన్సై'లోని 'టకెడా షింగెన్ క్లాన్'లో ప్రవేశం పొందిన తొలి తెలుగు వ్యక్తిగా ఆయన నిలిచారు. దీనితో పాటు గోల్డెన్ డ్రాగన్స్ సంస్థ పవన్‌ని 'టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్' అనే విశిష్ట బిరుదుతో సత్కరించింది. సినిమాల్లోకి రాకముందు నుంచే కరాటే, ఇతర యుద్ధకళల్లో కఠిన శిక్షణ పొందిన పవన్.. కేవలం శారీరక సాధనకే పరిమితం కాకుండా జపనీస్ సమురాయ్ సంప్రదాయాలపై లోతైన అధ్యయనం చేశారు. ప్రముఖ బుడో నిపుణుడు హాన్షి ప్రొఫెసర్ డాక్టర్ సిద్ధిక్ మహ్మాదీ మార్గ దర్శకత్వంలో 'కెండో'లో సమగ్ర శిక్షణ పొంది, ఉన్నత స్థాయి సాంకేతిక నైపుణ్యాన్ని, తాత్విక అవగాహనను పెంపొందించుకున్నారు. ఈ యుద్ధ కళలకు 'తమ్ముడు', 'ఖుషి', 'అన్నవరం', 'ఓజీ' తదితర చిత్రాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించారు. ఇక ప్రస్తుతం ఆయన నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' విడుదలకు సిద్ధమవుతుండగా.. త్వరలో సురేందర్ రెడ్డి దర్శకత్వంలో ఓ కొత్త చిత్రాన్ని పట్టాలెక్కించనున్నారు.

బేబీ గర్ల్ వస్తోంది


నివిన్ పౌలీ

'సర్వం మాయ'తో గతేడాది బ్లాక్‌బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్నాడు మలయాళ హీరో నివిన్ పౌలీ. ఓ వైపు ఈ సినిమా విజయాన్ని ఆస్వాదిస్తూనే.. రాబోయే ప్రాజెక్టుల కోసం సన్నద్ధమవుతున్నాడు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'బేబీ గర్ల్'. అరుణ్ వర్మ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రాబోతుందని తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది చిత్రబృందం. ఈ పోస్టర్‌లో నర్సు వేషంలో చేతిలో పాపతో సరికొత్త అవతారంలో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు నివిన్. మెడికల్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో సంగీత్ ప్రతాప్, లిజోమోల్, అభిమన్యు తిలకన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. లిస్టిన్ స్టీఫెన్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నివిన్ జాబితాలో 'డియర్ స్టూడెంట్స్', 'బెంజ్' లాంటి పలు చిత్రాలున్నాయి.

లోకల్ గ్యాంగ్‌స్టర్‌గా మమ్ముట్టి?



ప్రయోగాత్మక చిత్రాలతో ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు మలయాళ అగ్రహీరో మమ్ముట్టి. 'కలాంకావల్'తో గతేడాది మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ఆయన.. ఈ ఏడాది వరుస ప్రాజెక్టులతో అలరించడానికి సన్నద్ధమవుతున్నారు. దర్శకుడు నితీశ్ సహదేవ్‌తో ఆయన ఓ సినిమా కోసం చేతులు కలిపినట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమా చిత్రీకరణను మే నెలలో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. "మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దుతున్నారు. ఈ నెల 14నుంచి ప్రీ-ప్రొడక్షన్ పనులు మొదలు కానున్నాయి. ఇందులో లోకల్ గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు మమ్ముట్టి. వేసవిలో ఈ చిత్రాన్ని పట్టాలెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు మమ్ముట్టి నిర్మాణ సంస్థలో వచ్చిన మునుపటి చిత్రాల కన్నా భారీగా ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దుతున్నార"ని మమ్ముట్టి సన్నిహిత వర్గాలు తెలిపాయి.

ఆ విషయంలో నాది అత్యాశే!

మంచి స్క్రిప్ట్ ఉంటే భాష ఏదైనా సరే.. అది తనకు కావాలని అంటోంది మలయాళ నాయిక కల్యాణి ప్రియదర్శన్. 'లోక చాప్టర్ 1: చంద్ర' విజయం తర్వాత కథల ఎంపికలో ఆచితూచి అడుగులేస్తోందీ తార. ఇందులో భాగంగానే ఈమె.. రణ్‌వీర్ సింగ్ నటిస్తోన్న 'ప్రలే' సినిమాతో హిందీలో అడుగుపెట్టనున్నట్లు వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కల్యాణి.. దీనిపై స్పందిస్తూ.. "నేను హిందీ సినిమాలు కూడా చేయాలనుకుంటున్నా. కానీ మంచి కథలు దొరికితేనే ముందడుగు వేస్తా. కథలు చెప్పే విషయంలో భాషను ఎప్పుడూ అడ్డంకిగా చూడలేదు. భావోద్వేగమే ముఖ్యమని నమ్ముతా. ప్రస్తుతం పాన్ ఇండియా కథల వల్ల ప్రేక్షకులు పలు భాషల సినిమాలపై ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో పాటు భాష ఏదైనప్పటికీ మంచి కథలు ఎప్పుడూ నన్ను వెతుక్కుంటూ వస్తాయని నమ్ముతుంటా. స్క్రిప్ట్ విషయంలో నాకు అత్యాశ ఎక్కువ" అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె ఖాతాలో 'జెనీ', 'మార్షల్' లాంటి తదితర చిత్రాలున్నాయి.


కల్యాణి ప్రియదర్శన్

తొలిరోజే సెట్‌లో ఏడ్చేశా..


మీనాక్షి చౌదరి

"'గతేడాది 'సంక్రాంతికి వస్తున్నాం'తో మరిచిపోలేని పండగ విజయాన్ని అందుకున్నా. ఇప్పుడు 'అనగనగా ఒక రాజు'తో మరోసారి ప్రేక్షకుల మనసుల్ని దోచుకుంటాననే నమ్మకముంది" అంటోంది నటి మీనాక్షి చౌదరి. నవీన్ పొలిశెట్టి హీరోగా నటించిన ఈ చిత్రాన్ని మారి తెరకెక్కించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ సినిమా ఈనెల 14న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించింది మీనాక్షి చౌదరి. ఆ విశేషాలివి..

"ఆద్యంతం వినోదాత్మకంగా సాగే ఆసక్తికర కథతో రూపొందిన చిత్రమిది. దీంట్లో నా పాత్ర పేరు చారులత. సంపన్న కుటుంబంలో పుట్టిన గారాల పట్టి లాంటి పాత్ర. తను చాలా మంచి అమ్మాయి. అమాయకంగా, సున్నితమైన మనసు కలిగి ఉంటుంది. ఇంట్లో యువరాణిలా పెరుగుతుంది. తను చేసే పనులు ఫన్నీగా ఉంటాయి. నేనిలాంటి పూర్తిస్థాయి కామెడీ పాత్ర చేయడం ఇదే తొలిసారి. నా గత సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం' కామెడీగా ఉన్నా.. నా పాత్ర కాస్త సీరియస్‌గానే ఉంటుంది. కానీ, ఈ చిత్రంలో నాది పూర్తిగా వినోదాత్మక పాత్రే. నేనిప్పటి వరకు చేసిన పాత్రల్లో నాకు ఎక్కువ సవాల్‌గా అనిపించిన పాత్రిదే. ఎందుకంటే కామెడీ పండించడం చాలా కష్టం. పైగా ఇందులో కామెడీ కొత్తగా ఉంటుంది. టైమింగ్ చాలా కీలకంగా నిలుస్తుంది. పంచ్ డైలాగ్ కరెక్ట్ టైమింగ్‌తో చెప్పడం.. అవతలి వాళ్లు చెప్పినప్పుడు అదే టైమింగ్‌తో రియాక్షన్ ఇవ్వడం ఛాలెంజింగ్‌గా అనిపించింది. అందులో నవీన్ పొలిశెట్టి లాంటి నటుడితో కలిసి కామెడీ చేయడం ఇంకాస్త సవాల్. ఎందుకంటే తన టైమింగ్ మరోస్థాయిలో ఉంటుంది".


☛ "నటిగా నేను తొలిసారి సెట్‌లోకి అడుగు పెట్టింది 'అవుట్ ఆఫ్ లవ్' సిరీస్ కోసమే. తిగ్మాన్షు ధులియా దర్శకత్వం వహించారు. ఆయన సెట్‌లో చాలా స్ట్రిక్ట్‌గా ఉంటారు. నేను చిత్రీకరణలో పాల్గొన్న తొలిరోజే సెట్‌లో ఏడ్చేశాను. మా మేనేజర్‌కు ఫోన్ చేసి.. నా వల్ల కాదు, నేను చేయలేనని చెప్పేశా. కానీ, తను 'నువ్వలా చేయకు.. మనం కాంట్రాక్ట్ మీద సంతకాలు చేసేశామ'ని చెప్పి కన్విన్స్ చేశాడు. లేదంటే సెట్‌లోకి అడుగు పెట్టిన తొలిరోజే సినిమాలు, నటన వదిలేసేదాన్ని. ఆ సిరీస్ నుంచి మెల్లగా నటనపై అవగాహన పెంచుకుని.. తర్వాత ఒక్కో ప్రాజెక్ట్ చేసుకుంటూ నటిగా ఈరోజు స్థాయికి వచ్చా".

◆ "చిత్ర పరిశ్రమలో మనం స్థిరపడిపోయాం అని అనుకోవడానికి ఏం ఉండదు. నా దృష్టిలో సినీ ప్రయాణం అనేది ముగింపు లేని పరుగు పందెమే. ఈ రేస్‌లోకి ఎప్పటికప్పుడు కొత్తవాళ్లు వస్తూనే ఉంటారు. ఇక్కడ మనం స్థిరపడిపోయామని సంతృప్తి పడ్డామంటే అక్కడితో ఆగిపోయినట్లే. వెనక వచ్చే కొత్తవాళ్లు మన స్థానాన్ని దాటుకుని ముందుకెళ్లిపోతారు. అందుకే నేనెప్పుడూ సెటిల్ అయిపోయాను.. ఫలానా స్థానానికి చేరుకున్నాను లాంటి లెక్కలేం వేసుకోను. చేతిలో నిత్యం పని ఉండాలంటే విభిన్న పాత్రలు చేస్తూ నిర్విరామంగా పరిగెడుతూనే ఉండాలి. ఇంతమంది ఉన్న ఈ పరిశ్రమలో మనకే అవకాశాలు రావాలంటే.. వాళ్ల చిత్రాలకు మనం ఉండటం వల్ల ఏదోక ఉపయోగం ఉంటుందని దర్శక నిర్మాతలు నమ్మగలగాలి. దీనికోసం నటిగా నేను వందశాతం కష్టపడుతుంటా. క్రమశిక్షణగా ఉంటా".

◆ "ఈ సినిమా చేయడం వల్ల నటిగా నేను మరింత ఓపెన్ అయ్యాను. 'లక్కీ భాస్కర్'లోని సుమతి పాత్రకు దీంట్లో చేసిన చారులత పాత్ర పూర్తి భిన్నంగా ఉంటుంది. ఇందులో నా నుంచి అద్భుతమైన కామెడీ టైమింగ్‌ను చూస్తారు. స్వతహాగా నేను డ్యాన్స్ చేయడానికి కాస్త సిగ్గుపడుతుంటాను. కానీ, ఈ సినిమాలో నాకు అలాంటి ఇబ్బంది కలగలేదు. 'భీమవరం బాల్మా', 'రాజు గారి పెళ్లిరో' లాంటి క్యూట్ డ్యాన్స్ నంబర్స్ ఉన్నాయి. ఈ సినిమా కోసం గోదావరి ప్రాంతంలో చిత్రీకరణ చేయడాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. అక్కడి ప్రజలు బాగా చూసుకున్నారు. చుట్టుపక్కల ఉన్న ఆలయాలు, సందర్శనీయ ప్రదేశాల్ని చూశా. అక్కడి ప్రజలు సినిమా అంటే ప్రత్యేక అభిమానం చూపిస్తుంటారు. నాకది చాలా నచ్చింది".

◆ "నా దృష్టిలో కథే హీరో. కథ ఎలా ఉంది.. దర్శకుడు దాన్ని ఎలా చెప్తాడు.. దాంట్లోని పాత్రల్ని ఎలా చూపిస్తాడు అనేది ఆలోచిస్తాను. నేను చేయబోయే పాత్ర నా కెరీర్‌కు ఎలా ఉపయోగపడుతుందనేది చూస్తాను. అంతే తప్ప దాంట్లో హీరో ఎవరనేది పట్టించుకోను. ప్రస్తుతం సినిమాల్లో కథానాయికల పాత్రలకు ఎంతో ప్రాధాన్యత పెరిగింది. ప్రతిఒక్కరికీ అలాంటి ప్రాధాన్యత పాత్రలు లభించడం సంతోషాన్నిస్తోంది. ఈమధ్య సమంత 'మా ఇంటి బంగారం' చిత్ర టీజర్ చూశా. నాకు చాలా నచ్చింది. అందులో సామ్ చేసిన లాంటి యాక్షన్ పాత్ర నాకూ చేయాలని ఉంది. ప్రస్తుతం నాగచైతన్యతో 'వృషకర్మ' సినిమా చేస్తున్నా. మరి కొన్ని సినిమాలు ఓకే చేశా. ఆ చిత్ర వివరాల్ని నిర్మాణ సంస్థలు త్వరలో ప్రకటిస్తాయి".

రేటింగ్స్ నిలిపివేతతో ఉపశమనం: విజయ్ దేవరకొండ



న్యాయస్థానం ఆదేశాల మేరకు 'మన శంకరవరప్రసాద్‌గారు' సినిమాకి ఆన్‌లైన్ టికెటింగ్ వేదిక బుక్ మై షో తన వెబ్‌సైట్‌లో సమీక్షల్ని, రేటింగ్స్‌ని నిలిపి వేయడంపై యువ కథానాయకుడు విజయ్ దేవరకొండ స్పందించారు. ఈ చర్యతో ఎంతోమంది కష్టాన్ని, కలల్ని, డబ్బుని కాపాడుకునేందుకు దారి చూపించినట్లయిందని తన అభిప్రాయాన్ని ఎక్స్ వేదికగా పంచుకున్నారు. ఈ వేదికల్లో ఇదివరకు ఉన్న సమీక్షలు రాసే వెసులుబాటుని ఉపయోగించుకుంటూ, కొంతమంది పనిగట్టుకుని సినిమాలకి వ్యతిరేక సమీక్షలు, రేటింగ్స్ ఇస్తూ వాటిని సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్ చేస్తుండడంపై సినీ పరిశ్రమ వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. 'మన శంకరవరప్రసాద్‌గారు' బృందం ఇటీవల న్యాయస్థానాన్ని ఆశ్రయించి సమీక్షల్ని నిలిపివేయాలని కోరడంతో, అనుకూలంగా తీర్పు వచ్చింది. దాంతో బుక్‌మై షో సంస్థ వెంటనే చర్యల్ని చేపట్టింది. దీనిపై విజయ్ దేవరకొండ స్పందించారు. "అందరూ కలిసి ఎదగాలనే భావన లేకుండా మన సొంతవాళ్లే ఇలాంటి వ్యతిరేక సమీక్షలతో సమస్యల్ని సృష్టిస్తుంటారు. ఎందుకోసం ఇదంతా చేస్తున్నారని ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపా. 'డియర్ కామ్రేడ్' సమయంలోనే ఇలాంటి వ్యవస్థీకృతమైన దాడిని చూసి నేను షాకయ్యా. నా కలల్ని కాపాడుకునేందుకు వీళ్లతో ఎలా పోరాటం చేయాలా? అనుకునే వాణ్ని. ఇన్నాళ్లకు ఈ విషయం బహిర్గతం కావడం సంతోషం. మెగాస్టార్‌లాంటి అగ్ర హీరో సినిమాకీ వ్యతిరేక సమీక్షల ముప్పు ఉందని న్యాయస్థానం గుర్తించినందుకు ఆనందంగా ఉంది. దీంతో ఉపశమనమైతే లభిస్తుంది" అంటూ ఎక్స్‌లో వ్యాఖ్య చేశారు.

ప్రేమ పరవశం


కావ్య

చేతన్, కావ్య, రాజీవ్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'వశం'. కోన రమేశ్ దర్శకుడు. ఆయనే యెన్నంశెట్టి ఆంజనేయులుతో కలిసి నిర్మించారు. తెలుగు, కన్నడ భాషల్లో వచ్చే నెలలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకనిర్మాత మాట్లాడుతూ ''గిరిజన ప్రాంతం నేపథ్యంలో సాగే కథ ఇది. నగరంలో పుట్టి పెరిగిన ఓ యువకుడు, గిరిజన ప్రాంతానికి చెందిన ఓ అమ్మాయి మధ్య ప్రేమ ఎలా చిగురించింది? వాళ్ల పెళ్లి ఎలా జరిగిందన్నది ఈ కథలో ఆసక్తికరం. పేరుకి తగ్గట్టుగానే ఇందులోని ప్రతీ సన్నివేశం పరవశం కలిగిస్తుంది. హైదరాబాద్, బెంగళూరుతోపాటు పలు గిరిజన ప్రాంతాల్లో ఈ సినిమాని తెరకెక్కించాం" అన్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: శంకర, సంగీతం: కిరణ్ తోటంబ్లే, కళ: మంజుల.

మేలో బసిల్ యాక్షన్ కామెడీ?


బసిల్ జోసెఫ్

బసిల్ జోసెఫ్, టొవినో థామస్, వినీత్ శ్రీనివాసన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'అతిరథి'. యాక్షన్ కామెడీగా రూపొందుతున్న ఈ చిత్రానికి అరుణ్ అనిరుధన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాని డాక్టర్ అనంతు.ఎస్, బసిల్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా టైటిల్ టీజర్‌ను అధికారికంగా విడుదల చేసింది చిత్రబృందం. ఆ తర్వాత ఈ సినిమాలోని బసిల్ పాత్రని సామ్ కుట్టిగా పరిచయం చేస్తూ.. ఓనం పండుగ సందర్భంగా దీనిని విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ ఇంకో వారంలో పూర్తవుతుందని సమాచారం. దాంతో నిర్మాణసంస్థ ఈ చిత్రాన్ని మే నెలలో ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సినిమా కాలేజీ క్యాంపస్ కథా నేపథ్యంతో రూపొందుతోందని సన్నిహితవర్గాల సమాచారం. ప్రస్తుతం బసిల్.. శివ కార్తికేయన్, శ్రీలీల జంటగా నటించిన 'పరాశక్తి' సినిమాలో అతిథి పాత్రలో థియేటర్లో ప్రేక్షకుల్ని అలరిస్తున్నాడు.

7 కంపెనీలు.. రూ.3,63,412 కోట్ల సంపద నష్టం

దిల్లీ: అమెరికా అధ్యక్షుడు రష్యా చమురు కొనుగోలు చేసే దేశాలపై 500% సుంకాలను విధించే దిశగా అడుగులు వేస్తుండడంతో గత వారం మార్కెట్ నష్టాల పాలైంది. బీఎస్ఈ సెన్సెక్స్ 2,185.77 పాయింట్లు (2.54%)ను కోల్పోయింది. ఈ ప్రభావం అగ్రగామి 10 కంపెనీల పైనా కనిపించింది. వీటిలో ఏడు కంపెనీల మార్కెట్ విలువ ఏకంగా రూ.3,63,412.18 కోట్ల మేర క్షీణించింది. అత్యధికంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.1,58,532.91 కోట్లను నష్టపోయింది. మూడు కంపెనీలు మాత్రం మార్కెట్ విలువను పెంచుకోగలిగాయి. పెరుగుతున్న ప్రపంచ అనిశ్చితి ఈ పరిస్థితులకు కారణమని ఎన్రిచ్ మనీ సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) ఆర్.పొన్ముడి తెలిపారు.

ఈనాడు బిజినెస్

అనిశ్చితిలోనూ అనూహ్య స్థిరత్వం

- అదీ భారత్ ప్రత్యేకత
- పెట్టుబడుల అవకాశాలను వినియోగించుకోండి
- 'వైబ్రెంట్ గుజరాత్ ప్రాంతీయ సదస్సు'లో మోదీ పిలుపు



రాజ్‌కోట్: ప్రపంచమంతటా ఎంతో అనిశ్చితి నెలకొన్నా భారత్‌లో మాత్రం మునుపెన్నడూ లేనంత స్థిరత్వం కనిపిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. రాజకీయ స్థిరత్వమే కాకుండా విధానాల కొనసాగింపును దేశం చూస్తోందని, దేశంలో ఉన్న వివిధ అవకాశాలను పెట్టుబడిదారులు ఉపయోగించుకోవాలని కోరారు. సౌరాష్ట్ర, కచ్ ప్రాంతంలో పెట్టుబడుల కోసం ఆదివారం రాజ్‌కోట్‌లో నిర్వహించిన 'వైబ్రెంట్ గుజరాత్ ప్రాంతీయ సదస్సు'లో ఆయన పాల్గొని ప్రసంగించారు. 'ప్రపంచంలోనే వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థ మనది. త్వరలోనే మూడోస్థానాన్ని చేరుకోనున్నాం. వివిధ గణాంకాల్ని పరిశీలిస్తే.. ప్రపంచం మన నుంచి ఆశిస్తున్నది నిరంతరం పెరుగుతోందని స్పష్టమవుతోంది. విస్తరిస్తున్న మధ్యతరగతి వర్గం, వారికి ఉన్న కొనుగోలుశక్తి వంటివి మన దేశాన్ని అపార అవకాశాలకు గనిగా మార్చాయి. ప్రపంచంలో అత్యధిక టీకాలను ఉత్పత్తి చేస్తున్నది మనమే. మొబైల్ డేటా వినియోగం, యూపీఐ లావాదేవీల్లో ప్రపంచంలోనే మనం అగ్రస్థానంలో ఉన్నాం. సౌర విద్యుదుత్పత్తి, మెట్రో నెట్‌వర్క్‌లలోనూ విస్తరిస్తున్నాం. దేశంలోని ప్రతి పెట్టుబడిదారుడు, ప్రపంచం కూడా ఇలాంటివి అందిపుచ్చుకునేందుకు ముందుకు రావాలి' అని ప్రధాని పిలుపునిచ్చారు. వాణిజ్య ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. సదస్సులో 16 దేశాలకు చెందిన వ్యాపారవేత్తలతో 1,500 అవగాహన ఒప్పందాలు కుదిరే అవకాశం ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, అదానీ, ఎస్సార్, నయారా ఎనర్జీ వంటి సంస్థలు పాల్గొంటున్నాయి.

- రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన కంపెనీలు వచ్చే అయిదేళ్లలో గుజరాత్‌లో రూ.7 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ముకేశ్ అంబానీ తెలిపారు. గత అయిదేళ్లలో పెట్టిన రూ.3.5 లక్షల కోట్లతో పోలిస్తే ఇవి రెట్టింపని వివరించారు.

కొత్త డీమ్యాట్ ఖాతాల కళ తగ్గింది

2025లో ఆరేళ్ల కనిష్ఠానికి

ఈనాడు, హైదరాబాద్: కరోనా తర్వాత స్టాక్ మార్కెట్లో మొదలైన కొత్త డీమ్యాట్ ఖాతాల ప్రవాహానికి 2025లో అడ్డుకట్ట పడింది. గత కొన్నేళ్లుగా రికార్డు స్థాయిలో నమోదైన ఖాతాల వృద్ధి రేటు ఇప్పుడు నెమ్మదించింది. గడిచిన కొత్త డీమ్యాట్ ఖాతాల వృద్ధి రేటు గత ఆరేళ్లలో ఎన్నడూ లేనంత కనిష్ఠానికి పడిపోయింది. మార్కెట్లో మదుపర్ల లావాదేవీలు జరిపే వారి సంఖ్య కూడా క్రమంగా తగ్గుముఖం పడుతున్నట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి.

పసిడి, వెండి వైపు..: భారత ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి, కొత్త మదుపరులపై ప్రభావం చూపుతోంది. మరోవైపు బంగారం, వెండి మిలమిలా మెరుస్తూ లాభాలను పంచాయి. దీంతో మదుపరులు గోల్డ్ ఈటీఎఫ్‌లలో మదుపు చేసేందుకు ప్రాధాన్యం ఇచ్చారని యాంఫీ తాజా నివేదిక స్పష్టం



చేసింది. వీటిన్నింటి ప్రభావంతో కొత్తగా ప్రారంభమయ్యే డీమ్యాట్ ఖాతాల వృద్ధి రేటు 2024తో పోలిస్తే 2025లో సగానికి పైగా పడిపోయింది.

కొత్తవి 3 కోట్లే..: డిపాజిటరీల గణాంకాల ప్రకారం 2024లో దేశ వ్యాప్తంగా 4.60 కోట్ల కొత్త డీమ్యాట్ ఖాతాలు ప్రారంభం అయ్యాయి. 2025లో ఈ సంఖ్య కేవలం 3.06 కోట్లకు పరిమితమైంది. డిసెంబరు 31 నాటికి మొత్తం డీమ్యాట్ ఖాతాల సంఖ్య 21.6 కోట్లకు చేరుకుంది. వాస్తవానికి కరోనా తర్వాత స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరగడం, ఖాతా ప్రారంభ ప్రక్రియ సులభతరం కావడంతో గడిచిన అయిదేళ్లలో డీమ్యాట్ ఖాతాలు నాలుగు రెట్లు పెరిగాయి. 2020లో డీమ్యాట్ ఖాతాల సంఖ్య సుమారు 5 కోట్లే కావడం గమనార్హం.

మార్కెట్లో ప్రతికూలతలు: గతేడాది భారత ఈక్విటీ మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గులను చూశాయి. ముఖ్యంగా భారత్‌పై అమెరికా సుంకాలను విధించడంతో వాణిజ్య పరంగా ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనికి తోడు కంపెనీల ఆదాయాలూ ఆశించిన స్థాయిలో లేవు. గణాంకాల ప్రకారం 2025లో సెన్సెక్స్ 9.06 శాతం, నిఫ్టీ 10.5 శాతం మేరకు లాభాలు ఇచ్చాయి. చిన్న, మధ్య తరహా షేర్లలో పరిస్థితి భిన్నంగా ఉంది. నిఫ్టీ మిడ్‌క్యాప్-100 సూచీ 5.7 శాతం పెరగ్గా, నిఫ్టీ స్మాల్‌క్యాప్-100 5.62 శాతం నష్టపోయింది. మార్కెట్‌లోని అగ్రశ్రేణి సంస్థల్లో దాదాపు 60 శాతం షేర్లు మదుపరులకు నష్టాన్నే మిగిల్చాయి.

అటూఇటూ మారుతున్నారు

మార్కెట్లో ఒడుదొడుకులు కనిపించడం, మదుపరులు ఒక బ్రోకరు నుంచి మరో బ్రోకరుకు మారడంలాంటి కారణాలు డీమ్యాట్ వృద్ధిని దెబ్బతీశాయని నిపుణులు పేర్కొంటున్నారు. మార్కెట్ల సంతృప్త స్థాయిని చేరుకుందని, ఈ నేపథ్యంలో కొత్త మదుపరులను ఆకర్షించేందుకు బ్రోకర్లకు అయ్యే వ్యయం పెరుగుతోందని పేర్కొంటున్నారు. మార్కెట్లపై మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ.. ఎఫ్ అండ్ ఓ నిబంధనలను కఠినతరం చేయడమూ కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. వాస్తవానికి అవగాహన లేకుండా మార్కెట్లోకి వచ్చి, నష్టపోయే వారి సంఖ్యకు అడ్డుకట్ట వేయడం అని పేర్కొంటున్నారు.

ఐపీఓలతో..: మార్కెట్లోకి వస్తున్న కొత్త ఐపీఓలతో కొత్త డీమ్యాట్ ఖాతాలకు కారణం అవుతున్నాయి. ఐపీఓ కేటాయింపుల్లో పేర్లు దక్కే అవకాశాలను పెంచుకునేందుకు చాలా మంది తమ కుటుంబ సభ్యుల పేరుతో కొత్తగా డీమ్యాట్ ఖాతాలను ప్రారంభించారని నివేదికలు పేర్కొంటున్నాయి.

ఎన్‌టీపీసీ రూ.10,000 కోట్ల పెట్టుబడులు



దిల్లీ: ఛత్తీస్‌గఢ్‌లోని తలాయ్‌పల్లిలో బొగ్గు నుంచి సింథటిక్ నేచురల్ గ్యాస్ తయారు చేసే కేంద్రాన్ని రూ.10,000 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేయనున్నట్లు ఎన్‌టీపీసీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. సింథటిక్ నేచురల్ గ్యాస్ (ఎస్ఎన్‌జీ) ఉత్పత్తి కోసం అవసరమైన బొగ్గు బెనిఫిషియేషన్, గ్యాసిఫికేషన్ వంటి ప్రక్రియలకు సాంకేతిక భాగస్వామ్యాల కోసం కంపెనీ చూస్తున్నట్లు వెల్లడించారు. ఒక్కో మిలియన్ బ్రిటిష్ థర్మల్ యూనిట్ (ఎంఎంబీటీయూ)కు దాదాపు 12 డాలర్ల ఖర్చుతో ఎస్ఎన్‌జీని ఉత్పత్తి చేయాలని ఎన్‌టీపీసీ భావిస్తోంది. ఎస్ఎన్‌జీ కేంద్రాన్ని అభివృద్ధి చేయడానికి ఇంజినీర్స్ ఇండియాతో గతేడాది అక్టోబరులో ఎన్‌టీపీసీ ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ఎస్ఎన్‌జీ ప్లాంట్ ఏర్పాటు చేయబోయే ప్రాంతం వివరాలను కంపెనీ ప్రకటించలేదు. తమ క్యాప్టివ్ గనుల నుంచి అధిక బూడిద కలిగిన బొగ్గును ఈ ప్లాంట్ కోసం వినియోగించనున్నట్లు తెలిపింది. తలాయ్‌పల్లిలో 150 ఎకరాల విస్తీర్ణంలో 5 లక్షల టన్నుల వార్షిక సామర్థ్యంతో ఎస్ఎన్‌జీ ప్రాజెక్టును ఏర్పాటు చేసే అవకాశం ఉంది. 2025-26 చివరి త్రైమాసికంలో ప్రాజెక్టు టెక్నాలజీ అంశాలను ఖరారు చేయనున్నారు. పలు అంతర్జాతీయ భాగస్వామ్యాల కోసం తుది దశ చర్చల్లో ఎన్‌టీపీసీ ఉంది.

ఔషధ కంపెనీలకు ఊరట

- చిన్న ఉల్లంఘనలకు కోర్టులకు హాజరు కానక్కర్లేదు!
- డ్రగ్స్ అండ్ కాస్మటిక్స్ చట్టానికి సవరణలు



దిల్లీ: 'కొన్ని చిన్న ఉల్లంఘనల' విషయంలో ఫార్మాస్యూటికల్ కంపెనీలు ఇకపై కోర్టులకు హాజరు కానవసరం లేదని తాజాగా సవరించిన మార్గదర్శకాలను ఉటంకిస్తూ విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. దీనికి బదులు వారు షరతులకు లోబడి నగదు జరిమానా చెల్లించవచ్చు. అలాగే స్వీయ దిద్దుబాటు చర్యలు తీసుకోవచ్చు. 1940 నాటి డ్రగ్స్ అండ్ కాస్మటిక్స్ చట్టంతో పాటు వివిధ చట్టాల్లోని చిన్న నేరాలను డీక్రిమినలైజ్ చేశారు. వ్యాపారాన్ని సులభతరం చేయడం లక్ష్యంగా పెట్టుకున్న జన్ విశ్వాస్ చట్టం కింద ప్రవేశపెట్టిన డ్రగ్స్ అండ్ కాస్మటిక్స్ (కాంపౌండింగ్ ఆఫ్ అఫెన్సెస్) 2025 ద్వారా మార్గదర్శకాల్లో మార్పులు తెచ్చారు. ఈ చట్టం దేశంలో మందులు, కాస్మటిక్స్, వైద్య పరికరాల భద్రత, సామర్థ్యం, నాణ్యతను నిర్ధారిస్తుంది. ఈ చట్టాన్ని సక్రమంగా పాటించకపోతే విచారణకు దారి తీయవచ్చు. అయితే న్యాయ వ్యవస్థపై ఎక్కువ భారం పడకుండా చిన్న, సాంకేతిక ఉల్లంఘనలను పరిష్కరించాల్సిన అవసరాన్ని గుర్తించి, నేరాలను సమ్మిళితం చేయడానికి సెక్షన్ 32బి ప్రవేశపెట్టారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కింద పని చేస్తున్న సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ) 'నేరాల సమ్మేళనం' అనే కొత్త ప్రక్రియను వివరిస్తూ, డ్రగ్స్ అండ్ కాస్మటిక్స్ (నేరాల సమ్మేళనం) నిబంధనలు 2025ను రూపొందించింది. అయితే వీటిల్లో జరిమానా మొత్తం ఎంతనేది పేర్కొనలేదు. అలాగే నేరాలను కూడా వెల్లడించలేదు.

భారత్‌లో క్రిప్టో నిబంధనలు మరింత కఠినం



దిల్లీ: డిజిటల్ ఆస్తుల మార్కెట్‌లో చట్ట విరుద్ధ కార్యకలాపాలను తొలగించే ప్రయత్నంలో భాగంగా, భారతదేశ ఆర్థిక నిఘా విభాగం (ఎఫ్ఐయూ) క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజీల కోసం కఠినమైన కొత్త యాంటీ-మనీ లాండరింగ్ (ఏఎంఎల్), నో యువర్ కస్టమర్ (కేవైసీ) ప్రోటోకాల్‌లను ఆవిష్కరించింది. వీటిలో ఆన్‌బోర్డింగ్ ప్రక్రియ సమయంలో తప్పనిసరి లైవ్‌నెస్ డిటెక్షన్ (లైవ్ సెల్ఫీలు), భౌగోళిక ట్రాకింగ్ (జియో ట్యాగింగ్) వంటివి ఉన్నాయి. ఈ నెల 8న జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం, క్రిప్టో ఎక్స్ఛేంజీలను వర్చువల్ డిజిటల్ అసెట్ (వీడీఏ) సర్వీస్ ప్రొవైడర్లుగా వర్గీకరించారు. ఇప్పుడు వీడీఏలు సాధారణ డాక్యుమెంట్ అప్‌లోడ్‌లను అనుమతించడంతో పాటు మరిన్ని పనులు చేయాల్సి ఉంటుంది.

- కొత్త నిబంధనల ప్రకారం, వినియోగదారులు తమ ఉనికిని ధ్రువీకరించే 'లైవ్ సెల్ఫీ' తీసుకోవాలి. సాధారణంగా కళ్లు రెప్ప వేయడం లేదా తల కదలిక ద్వారా ఈ చర్య స్టాటిక్ ఫొటోలు లేదా డీప్‌ఫేక్‌ల వాడకాన్ని నిరోధించడంలో సాయపడుతుంది. వినియోగదారు ఖాతాను సృష్టించడం ప్రారంభించిన కచ్చితమైన అక్షాంశం, రేఖాంశం, తేదీ, సమయ ముద్ర; ఐపీ చిరునామాను ఎక్స్ఛేంజీలు నమోదు చేయాల్సి ఉంటుంది. 'పెన్నీ-డ్రాప్' పద్ధతి అవసరం. దీనిలో బ్యాంక్ ఖాతా యాక్టివ్‌గా ఉందని, రిజిస్ట్రెంట్‌కు చెందినదని నిర్ధారించడానికి నామమాత్రపు రూపాయి లావాదేవీని ప్రాసెస్ చేస్తారు. పాన్ (శాశ్వత ఖాతా సంఖ్య)తో పాటు వినియోగదారులు పాస్‌పోర్ట్, ఆధార్ లేదా ఓటరు ఐడీ వంటి సెకండరీ ఐడీని, ఇ-మెయిల్ ఐడీ, ఫోన్ నంబరు కోసం ఓటీపీ ధ్రువీకరణను అందించాలి.

భవిష్యత్‌లో పూర్తిగా విద్యుత్ కార్లే

వోల్వో ఇండియా ఎండీ జ్యోతి మల్హోత్రా



దిల్లీ: భవిష్యత్‌లో పూర్తిగా విద్యుత్ కార్లు తీసుకొచ్చేందుకు కట్టుబడి ఉన్నామని, ప్రస్తుతం భారత్‌లో విక్రయిస్తున్న ప్రతి నాలుగు కార్లలో ఒక విద్యుత్ కారు (ఈవీ) ఉంటోందని వోల్వో కార్ ఇండియా ఎండీ జ్యోతి మల్హోత్రా పేర్కొన్నారు. జీఎస్‌టీ 2.0 వల్ల తమ మైల్డ్ హైబ్రిడ్ ఎస్‌యూవీలు కొనుగోలుదార్లకు మరింత చేరువయ్యాయని అన్నారు. పన్ను రేట్లలో మార్పులు తీసుకురావడంతో విలాస విభాగంలో మార్పులు వచ్చాయని, మొత్తం వాహన పరిశ్రమపై సానుకూల ప్రభావం చూపినట్లు వెల్లడించారు. ఈవీ కార్లపై జీఎస్‌టీ 2.0 ప్రభావంపై మాట్లాడుతూ, కంపెనీ పోర్ట్‌ఫోలియో మిశ్రమంగా ఉందని, ప్రతి 4 విక్రయాల్లో ఒక ఈవీ ఉంటోందని వివరించారు. కొత్త ఈఎక్స్30 మోడల్ విజయవంతం కావడం, కాంపాక్ట్ మాడ్యులర్ ఆర్కిటెక్చర్ (సీఎంఏ) లభ్యత వంటివి ఇందుకు కారణాలుగా తెలిపారు. భవిష్యత్‌లో మొత్తం విద్యుత్ కార్లకు కట్టుబడి ఉన్నామని, 2026లో మరిన్ని ఈవీ కార్లను తీసుకొస్తామని స్పష్టం చేశారు. ఎక్స్‌సీ 90, ఎక్స్‌సీ60 మోడళ్ల నెలవారీ విక్రయాల్లో రెండంకెల వృద్ధి ఉంటోందన్నారు.

ఎంఎస్‌ఎంఈలకిచ్చిన రుణాల్లో రెట్టింపు వృద్ధి

- 17.7 శాతం నుంచి 32.5 శాతానికి..
- 2025 జనవరి-అక్టోబరుపై క్రిసిల్ ఇంటెలిజెన్స్ నివేదిక

ముంబయి: గత ఏడాది జనవరి-అక్టోబరు మధ్య సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థ (ఎస్ఎస్ఎంఈ)లకు పంపిణీ చేసిన రుణాల వాటా దాదాపు రెట్టింపు కావడానికి ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీల) రుణాలు సాయపడ్డాయని క్రిసిల్ ఇంటెలిజెన్స్ నివేదిక వెల్లడించింది. అంత క్రితం ఏడాది ఇదే కాలంలో 17.7 శాతంగా ఉన్న ఎంఎస్ఎంఈ రుణాల వాటా ఈ ఏడాది అక్టోబరు వరకు 32.5 శాతానికి పెరిగిందని తెలిపింది. మొత్తం ఎంఎస్ఎంఈ రుణాల్లో చిన్న-పరిమాణం, హామీలేని రుణాల్లో ఒత్తిడి సంకేతాలు కనిపించాయని పేర్కొంది. అయితే ఎంఎస్ఎంఈల పోర్ట్‌ఫోలియోలో ఆస్తుల నాణ్యత సంతృప్తికరంగానే ఉందని వెల్లడించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆర్థిక స్థిరత్వ నివేదికలోని ఫలితాలను క్రిసిల్ నివేదిక కూడా ప్రస్తావించింది. పీఎస్‌బీలు సబ్‌ప్రైమ్ ఎంఎస్ఎంఈ రుణ గ్రహీతలకు గణనీయ స్థాయిలో రుణాలు పంపిణీ చేశాయని పేర్కొంది.



బ్యాంకు రుణాల్లో 12.6 శాతం అమెరికా సుంకాలకు సరిపోతున్నాయని, అందులో 43 శాతానికి పైగా వస్త్ర రంగం ద్వారానే ఉన్నాయని వెల్లడించింది. హామీ ఉన్న రిటెయిల్ రుణాల వాటా కూడా పెరిగిందని, అంత క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది 24.5 శాతం ఉండగా, గత ఏడాది 31.3 శాతానికి పెరిగిందని నివేదిక పేర్కొంది. ఇందులో సుమారు 50 శాతం గృహ రుణాలు కాగా, మూడో వంతు కంటే ఎక్కువగా పసిడి రుణాలు ఉన్నాయని తెలిపింది.

కోడి గుడ్లు


12న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	540	తూ/ప గోదావరి	550
వరంగల్	542	విశాఖపట్నం	550
విజయవాడ	575	చిత్తూరు	603

పసిడికి ఉద్రిక్తతల అండ!

కమొడిటీస్ ఈ వారం

పసిడి




పసిడి జనవరి కాంట్రాక్టు గత మూడు వారాలుగా రూ.1,40,400 స్థాయిని పరీక్షించి వెనకకు వస్తోంది. సాంకేతికంగా దిద్దుబాటు కావాల్సి ఉన్నప్పటికీ.. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పసిడికి అండగా నిలుస్తున్నాయి. ఈ అనిశ్చితులు ఇలాగే కొనసాగినా లేదంటే మరింత తీవ్రమైనా.. పసిడి కాంట్రాక్టుకు సానుకూల ధోరణి కొనసాగే అవకాశం ఉంటుంది. రూ.1,40,146 కంటే పైకి వెళితేనే లాంగ్ పొజిషన్లను కొనసాగించాలి. ఒకవేళ కిందకు వస్తే రూ.1,38,223 వద్ద మద్దతు లభించే అవకాశం ఉంటుంది. ఈ స్థాయిని కూడా కోల్పోతే రూ.1,36,896; ఆ తర్వాత రూ.1,34,973 వరకు దిగివస్తుందని అనుకోవచ్చు.

వెండి



వెండి మార్చి కాంట్రాక్టు ఈవారం రూ.2,38,800 కంటే కిందకు రాకుంటే మరింతగా పెరగొచ్చు. ఒకవేళ ఈ స్థాయి కంటే కిందకు వస్తే దిద్దుబాటుకు ఆస్కారం ఉంటుంది.

ప్రాథమిక లోహాలు



- రాగి జనవరి కాంట్రాక్టు ఈవారం రూ.1,339.15 కంటే పైన చలిస్తే రూ.1,436.95; రూ.1,450.85 వరకు పెరిగే అవకాశం ఉంటుంది. రూ.1,227.45 కంటే దిగువన కదలాడితే రూ.1,173.55; రూ.1,115 వరకు దిగిరావచ్చు.
- సీసం జనవరి కాంట్రాక్టును ఈవారం రూ.187.25 లక్ష్యంతో రూ.202.25 సమీపంలో షార్ట్ సెల్ చేయడం మంచి వ్యూహం అవుతుంది.
- జింక్ జనవరి కాంట్రాక్టు ఈవారం రూ.317.85 కంటే ఎగువన కదలాడకుంటే షార్ట్ సెల్ పొజిషన్ల వైపు మొగ్గు చూపొచ్చు. అయితే రూ.303.15 వద్ద మద్దతు లభించొచ్చనే విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి.
- అల్యూమినియం జనవరి కాంట్రాక్టు ఈవారం రూ.307.40 కంటే కిందకు వస్తే రూ.297; రూ.291.70 వరకు దిగిరావచ్చు. ఒకవేళ రూ.323.10 ఎగువకు వెళ్తే రూ.328.40; రూ.338.70 వరకు పెరుగుతుందని అనుకోవచ్చు.

ఇంధన రంగం



- ముడి చమురు ఫిబ్రవరి కాంట్రాక్టు ఈవారం రూ.5,185 కంటే దిగువన ట్రేడయితే దిద్దుబాటుకు ఆస్కారం ఉంటుంది. ఒకవేళ రూ.5,498 కంటే పైకి వెళితే రూ.5,631; రూ.5,854 వరకు పెరగొచ్చు.
- సహజవాయువు జనవరి కాంట్రాక్టు ఈవారం రూ.309.80 కంటే ఎగువన కదలాడకుంటే.. మరింతగా కిందకు దిగిరావచ్చు. అయితే రూ.279.80 వద్ద మద్దతు లభించవచ్చు. ఈ స్థాయిని కూడా కోల్పోతే రూ.267.60; రూ.243.70 వరకు దిద్దుబాటు అయ్యే అవకాశం ఉంది.

వ్యవసాయ ఉత్పత్తులు



- పసుపు ఏప్రిల్ కాంట్రాక్టుకు ఈవారం రూ.18,885 ఎగువన మాత్రమే లాంగ్ పొజిషన్లను అట్టే పెట్టుకోవాలి. లేకుంటే లాభాలను స్వీకరించడం మంచిది. అదే విధంగా రూ.16,559 కంటే కిందకు వస్తే రూ.15,478; రూ.14,233 వరకు దిద్దుబాటు అయ్యే అవకాశం ఉంటుంది.
- జీలకర్ర జనవరి కాంట్రాక్టుకు ఈవారం రూ.22,812 వద్ద స్టాప్‌లాస్‌ను పరిగణిస్తూ షార్ట్ సెల్ పొజిషన్లను కొనసాగించడం మేలే.

- ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం	ముగింపు	వృద్ధి/క్షీణత
	(రూ.లలో)		(శాతంలో)
పసిడి (ఫిబ్రవరి)	1,36,300	1,38,819	1.85
వెండి (మార్చి)	2,44,000	2,52,002	3.28
రాగి (జనవరి)	1,309.90	1,281.40	(2.18)
జింక్ (జనవరి)	310.30	309.20	(0.35)
అల్యూమినియం (జనవరి)	307.60	317.80	3.32
ముడి చమురు (ఫిబ్రవరి)	5,188	5,366	3.43
సహజ వాయువు (జనవరి)	327.60	292	(10.87)
పసుపు (ఏప్రిల్)	18,578	17,640	(5.05)
జీలకర్ర (జనవరి)	22,930	21,700	(5.36)

విక్రయాల ఒత్తిడి తప్పదా?

స్టాక్ మార్కెట్ ఈ వారం

- నేడు టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్ ఫలితాలు
- బ్యాంకింగ్, వాహన షేర్లు రాణించొచ్చు
- విశ్లేషకుల అంచనాలు



వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	187.76	194.30	180.60
బజాజ్ ఆటో	9562.50	9935.50	9351.50
ఐషర్ మోటార్స్	7507.00	7633.00	7408.00
హీరో మోటోకార్ప్	5773.00	5945.00	5665.00
ఎం అండ్ ఎం	3677.30	3779.00	3616.20
మారుతీ	16501.00	16827.70	16253.70
టీవీఎస్ మోటార్	3759.20	3883.80	3689.00

ఎఫ్ఎమ్‌సీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	5977.50	6181.20	5828.20
కోల్గేట్ పామోలివ్	2056.00	2102.50	2018.50
డాబర్ ఇండియా	522.40	530.80	511.90
ఇమామీ	510.00	526.00	498.00
హిందుస్థాన్ యునిలీవర్	2372.60	2398.20	2348.20
ఐటీసీ	337.15	343.00	333.20
మారికో	755.10	770.10	744.30

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	274.25	291.00	263.30
సీజీ పవర్	594.75	633.10	567.30
ఎల్ అండ్ టీ	4025.20	4129.60	3954.00
సీమెన్స్	3043.80	3168.60	2922.60
థెర్మాక్స్	3023.40	3083.70	2955.90

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1198.70	1222.80	1176.00
బయోకాన్	379.60	390.80	366.50
సిప్లా	1465.70	1475.60	1451.20
డాక్టర్ రెడ్డీస్	1210.10	1222.80	1197.20
గ్లెన్‌మార్క్ ఫార్మా	2007.20	2109.70	1945.70
నాట్కో ఫార్మా	890.20	941.70	857.30

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	939.00	958.30	923.70
ఐసీఐసీఐ బ్యాంక్	1404.30	1439.80	1383.80
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	86.00	87.70	84.20
ఇండస్‌ఇండ్ బ్యాంక్	882.25	898.10	870.20
కోటక్‌మహీంద్రా బ్యాంక్	2126.80	2142.30	2108.30
పీఎన్‌బీ	122.90	125.90	120.70
ఎస్‌బీఐ	1000.50	1014.80	986.80

భారత స్టాక్ మార్కెట్లు సమీప కాలంలో బలహీనంగా కదలాడొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రష్యా చమురును దిగుమతి చేసుకునే దేశాలపై అమెరికా టారిఫ్‌లపై అనిశ్చితి ఇందుకు నేపథ్యంగా చెబుతున్నారు. రష్యా చమురును కొంటున్న దేశాలపై 500% పన్ను విధించేందుకు వీలుకల్పించే ఒక బిల్లుకు ట్రంప్ ఇప్పటికే ఆమోదం తెలపగా.. ఈ వారంలో ఓటింగ్‌కు అవకాశం ఉన్న సంగతి తెలిసిందే. అయితే నేడు టీసీఎస్‌తో మొదలయ్యే డిసెంబరు త్రైమాసిక సీజను మార్కెట్‌కు కొంత ఉపశమనం కలిగిస్తుందని అంచనా వేస్తున్నారు. నిఫ్టీ-50కి 25,900-26,000 వద్ద నిరోధం, 25,570 వద్ద మద్దతు లభించొచ్చని సాంకేతిక నిపుణులు అంచనా వేస్తున్నారు. సోమవారం విడుదల కానున్న డిసెంబరు నెల సీపీఐ ద్రవ్యోల్బణ గణాంకాలు, అంతర్జాతీయ సంకేతాలు ఈ వారం మార్కెట్‌ను ప్రభావితం చేయొచ్చని చెబుతున్నారు. వివిధ రంగాలపై విశ్లేషకుల అంచనా ఇలా..

- డిసెంబరు త్రైమాసిక ఫలితాల ప్రకటనలు మొదలుకానున్నందున నిఫ్టీ బ్యాంక్ సూచీ ఈ వారం రాణించొచ్చు. ఈ సూచీ 58800-60400 స్థిరీకరణ శ్రేణిలోనే కదలాడొచ్చు. ఈ శ్రేణి నుంచి బయట పడితేనే దిశానిర్దేశం లభిస్తుంది.
- లోహ కంపెనీల షేర్ల విలువ అధికంగా ఉండటంతో సమీప భవిష్యత్‌లో పరిమితంగానే పెరగొచ్చు. ట్రంప్ టారిఫ్ బెదిరింపులపై తదుపరి వార్తలు ఈ షేర్లకు దిశానిర్దేశం చేయనున్నాయి. డిసెంబరు ఫలితాలనూ మదుపర్లు మదింపు చేయవచ్చు. నిఫ్టీ మెటల్ సూచీకి 10750-10600 వద్ద మద్దతు లభించొచ్చు.
- టెలికాం షేర్లు సమీప భవిష్యత్‌లో ఒక శ్రేణికి లోబడి కదలాడొచ్చు. 2026లో టారిఫ్‌లు పెంచే అవకాశం ఉంది. రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ మాతృసంస్థ జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ ప్రభావం చూపొచ్చు.
- భౌగోళిక రాజకీయ అనిశ్చితుల మధ్య చమురు కంపెనీల షేర్లు ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. టారిఫ్ అంశాలపై స్పష్టత కోసం ఈ షేర్లు ఎదురుచూడవచ్చు. వెనెజువెలాపై అమెరికా దాడుల వల్ల చమురు ధర ఇంకా పడవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.
- యంత్రపరికరాల కంపెనీల షేర్లు ప్రతికూల ధోరణితో ఒక శ్రేణికి లోబడి కదలాడవచ్చు. చైనా కంపెనీలపై విధించిన 2020 నాటి ఆంక్షలను ఎత్తేయాలని కేంద్రం అనుకుంటుండడం ఇందుకు నేపథ్యం.
- వాహన కంపెనీల షేర్లు పుంజుకోవచ్చు. జీఎస్‌టీ రేట్ల తగ్గింపు, గ్రామీణ సెంటిమెంటు మెరుగుపడడం, అక్టోబరు-డిసెంబరులో బలమైన విక్రయాలు తదితరాలు కలిసిరావొచ్చు. కొత్త మోడళ్ల ఆవిష్కరణలు, ఎగుమతుల వృద్ధితో పలు కంపెనీల ఆదాయాలు రాణించొచ్చు.
- నిఫ్టీ ఐటీ సూచీ మార్కెట్‌తో పాటే రికవరీ ధోరణిలో కదలాడవచ్చు. నిఫ్టీ ఐటీ సూచీకి 37300 వద్ద మద్దతు, 38740 వద్ద నిరోధం కనిపించొచ్చు. టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్ ఫలితాలు సోమవారం వెలువడనున్నాయి. ఆ తర్వాతి రోజు టాటా ఎలెక్సీ ఫలితాలున్నాయి. హెచ్‌సీఎల్ షేర్లు రూ.1695-1700 స్థాయిని తాకొచ్చు.
- సిమెంటు కంపెనీలు నష్టాల్లోనే చలించొచ్చు. ధరల ఒత్తిడి కారణంగా వీటికి బలహీన డిసెంబరు త్రైమాసికం నమోదు కావొచ్చు. విక్రయాలు పెరిగినా ధరల కోత వల్ల లాభాల్లో రికవరీ కనిపించకపోవచ్చు.
- సిగరెట్లపై సుంకం పెంపుతో గత వారం డీలా పడ్డ ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీల షేర్ల నష్టాలు కొనసాగొచ్చు. డిసెంబరు త్రైమాసికంలో వినియోగదారు గిరాకీలో రికవరీ అంచనా కంటే తక్కువగానే ఉండొచ్చు.
- ఫార్మా కంపెనీల షేర్లు ఒక శ్రేణిలోనే చలించొచ్చు. 15 నెలలుగా స్థిరీకరణ దశలో ఉన్న నిఫ్టీ ఫార్మా సూచీ దిశానిర్దేశం కోసం ఇక ఫలితాలపై మదుపర్లు దృష్టి సారించొచ్చు. భారత ఔషధ కంపెనీల దేశీయ విక్రయాల వృద్ధి ఒక అంకెలో ఉండొచ్చని జెఫ్రీస్ అంచనా కడుతోంది.

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిండాల్కో	900.95	915.60	886.70
హిందుస్థాన్ జింక్	606.45	626.30	578.20
ఎన్ఎమ్‌డీసీ	80.48	84.40	76.80
సెయిల్	145.67	149.30	141.90
టాటా స్టీల్	178.40	183.20	174.90
వేదాంతా	609.85	622.10	596.20

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	1475.30	1488.30	1458.50
బీపీసీఎల్	354.15	362.80	347.90
హెచ్‌పీసీఎల్	448.75	459.00	441.20
ఐఓసీఎల్	157.61	160.40	153.70
ఓఎన్‌జీసీ	234.09	241.00	228.50
ఆయిల్ ఇండియా	420.05	432.40	405.80

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1661.40	1689.10	1633.30
ఇన్ఫోసిస్	1614.10	1641.80	1593.20
పర్సిస్టెంట్ సిస్టమ్స్	6413.50	6528.50	6292.50
టీసీఎస్	3207.80	3248.20	3170.80
టెక్ మహీంద్రా	1582.20	1617.20	1560.60
విప్రో	261.95	265.60	258.60

సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1705.80	1735.70	1686.10
అంబుజా సిమెంట్స్	536.95	553.20	527.50
ఇండియా సిమెంట్స్	464.60	475.80	452.90
శ్రీ సిమెంట్	26950.00	27316.70	26486.70
అల్ట్రాటెక్ సిమెంట్	11937.00	12164.30	11738.30

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	2027.10	2105.60	1984.00
ఎమ్‌టీఎన్ఎల్	34.36	36.00	33.30
టాటా కమ్యూనికేషన్స్	1741.70	1812.30	1690.90
వొడాఫోన్ ఐడియా	11.26	13.00	10.30

ఎన్ఐటీ వరంగల్‌లో

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ), వరంగల్.. వివిధ విభాగాల్లో 39 నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✦ సూపరింటెండెంట్: 02 ✦ టెక్నికల్ అసిస్టెంట్: 11 ✦ సీనియర్ అసిస్టెంట్: 02 ✦ సీనియర్ టెక్నీషియన్: 07 ✦ జూనియర్ అసిస్టెంట్: 03 ✦ టెక్నీషియన్: 14

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో టెన్త్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీలతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** ఫిబ్రవరి 8, 2026 నాటికి 27-33 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీకి మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్లు గరిష్ఠ వయసులో మినహాయింపు ఉంది.

వేతన శ్రేణి: నెలకు రూ.21,700-1,12,400.
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.1500. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, మహిళలకు రూ.1000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 8. **ఎంపిక:** రాత పరీక్షతో **వెబ్‌సైట్:** https://nitw.ac.in/page/?url=/careersnitw/Jobs/



చాలా మంది ఇంజినీరింగ్ విద్యార్థులు కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌)ను ఒక సబ్జెక్ట్‌గా చూస్తారు. ఒక పేపర్ పూర్తయితే 'ఏఐ అయిపోయింది' అనుకుంటారు. కానీ పరిశ్రమ దృష్టిలో ఏఐ అంటే ఒక సామర్థ్యం. మనిషి ఆలోచించే విధానాన్ని వేగంగా, విస్తృతంగా, నిరంతరంగా అమలు చేయగల శక్తి. అందుకే సంస్థలు ఏఐలో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెడుతున్నాయి. విద్యార్థులు దీన్ని హైప్‌లా కాకుండా, పరిశ్రమల్లో వ్యాపారానికి ఉపయోగపడే ఆలోచనా విధానంగా అర్థం చేసుకోవాలి.

రేపటి ఇంజినీర్లకు ఏఐ రోడ్ మ్యాప్!

కాలేజీ తరగతి గదిలో ఏఐ అంటే నిర్వచనాలు, అల్గారిథమ్‌లు, పరీక్షలు. కానీ బోర్డు రూమ్‌లో ఏఐ అంటే నిర్ణయాలు, ప్రమాదాలు, బాధ్యత. ఉదాహరణకు మనం దైనందిన జీవితంలో విస్తృతంగా ఉపయోగిస్తోన్న గూగుల్ మ్యాప్స్ దారిని చూపే సాధనం కాదు. పరిస్థితులను అర్థం చేసుకుని నిర్ణయాలు తీసుకునే ఒక తెలివైన వ్యవస్థ. గూగుల్ మ్యాప్స్ పరీక్షలు రాయదు, కానీ నిర్ణయాలు తీసుకుంటుంది. ఇది ఎలా సాధ్యమంటే.. గత డేటా నుంచి నేర్చుకోవడం, ప్రస్తుతం జరుగుతున్నదాన్ని గమనించడం, రాబోయేదాన్ని అంచనా వేయడం. ఇక్కడే తరగతి గది చదువుకు, పరిశ్రమలోని రియల్ టైమ్ ఉపయోగానికి మధ్య ఉన్న అసలు తేడా కనిపిస్తుంది. ఉద్యోగ ఇంటర్వ్యూల్లో కూడా ఇదే గ్యాప్ బయటపడుతోంది. కాన్సెప్ట్స్ తెలుసు, కానీ చాలా మంది ఇంజినీరింగ్ విద్యార్థులు వాటిని ఒక పూర్తి కథనంలా వివరించలేరు.

మైండ్ సెట్ ముఖ్యం

గణితంలో పట్టు లేకపోతే ఏఐలో రాణించలేమని అనుకోవద్దు. కోర్ ఏఐ పరిశోధన పాత్రలకు లోతైన గణితం అవసరం. కానీ ఎక్కువ ఏఐ ఉద్యోగాలు అనువర్తిత స్వభావంలో ఉంటాయి. సమస్యను ఎలా నిర్వచిస్తున్నాం, తర్కబద్ధంగా ఎలా ఆలోచిస్తున్నాం, డేటాను ఎలా అర్థం చేసుకుంటున్నాం అన్నది ముఖ్యం. గణితం ఒక సాధనం మాత్రమే. అసలు కీలకం మైండ్ సెట్. ఉద్యోగార్థిలో సంస్థలు గమనించేవి.. ఈ వ్యక్తి సరైన ప్రశ్నలు అడగగలడా? డేటాలో ఉన్న పరిమితులను గుర్తించగలడా? వ్యాపార సమస్యను సాంకేతిక సమస్యగా మార్చగలడా? ఇవే మీ ఉద్యోగాన్ని నిర్ణయిస్తాయి.

నిరంతర అధ్యయనంతోనే

ఏఐ నేర్చుకోవడం అంటే మారథాన్ లాంటిది. ఇంజినీరింగ్ విద్యార్థులు మొదటి సంవత్సరంలో కోడింగ్ లాజిక్, విశ్లేషణాత్మక ఆలోచన లాంటి లక్షణాలు పెంపొందించుకోవాలి. మధ్య సంవత్సరాల్లో ఏఐ కాన్సెప్ట్‌లపై అవగాహన తెచ్చుకోవాలి. చివరి సంవత్సరాల్లో ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్పుల ద్వారా రియల్ లైఫ్ సమస్యలపై పట్టు సాధించాలి. గూగుల్ మ్యాప్స్ ఒక్క రోజులో మేటి వేదికగా రూపొందలేదు. ఎన్నో ఏళ్లుగా నేర్చుకుంటూ, మారుతూ, ఎదుగుతూ వచ్చింది. ఇంజినీరింగ్ కెరియరూ అంతే.


అందరికీ అవకాశం

ఎక్కువ మంది ఏఐ కెరియర్ అంటే కోడింగ్ మాత్రమే అనుకుంటారు లేదా కంప్యూటర్ సైన్స్ వాళ్లకే అవకాశం ఉందని భావిస్తారు. ఇది పూర్తిగా అపోహ. ఏఐ పరిసర వ్యవస్థ చాలా విస్తృతమైంది. డేటా ఇంజినీర్లు, మెషీన్ లెర్నింగ్ ఇంజినీర్లు మాత్రమే కాదు.. ఏఐ విశ్లేషకులు, డొమైన్ నిపుణులు, కన్సల్టెంట్లు, సిస్టమ్ ఇంటిగ్రేటర్లు కూడా అవసరం. మెకానికల్, ఈసీఈ, సివిల్ నేపథ్యం నుంచి వచ్చిన వాళ్లూ ఏఐలో మంచి విజయాలు సాధిస్తున్నారు. చేస్తోన్న రంగానికి తెలివిని ఎలా జోడించాలో అర్థం చేసుకుంటే చాలు. పరిశ్రమకు కావాల్సింది శుద్ధమైన కోడ్ కాదు. డొమైన్ పరిజ్ఞానం, ఏఐల కలయిక. పైథాన్, టూల్స్, ఫ్రేమ్‌వర్కులు ఇవన్నీ ప్రవేశ ద్వారాలే.

ఆలోచన మీదైతేనే

ఈతరం విద్యార్థులకు జనరేటివ్ ఏఐ సాధనాలు నేర్చుకునే విధానాన్నే మార్చేశాయి. ఇవి ఒకవైపు అవకాశాలు, మరోవైపు ప్రమాదాలు. సరైన విధంగా వాడితే ఇవి వ్యక్తిగత గురువుల్లా పనిచేస్తాయి. తప్పుగా ఉపయోగిస్తే మౌలిక అవగాహన బలహీనపడుతుంది. కాలిక్యులేటర్ ఉపయోగించడం వచ్చినప్పటికీ గణితం నేర్చుకోవాల్సిందే కదా. అలాగే ఏఐ సాధనాలు వాడినా ఆలోచన మనదే ఉండాలి. అసైన్‌మెంట్లు కాపీ చేయడం కాదు, అవగాహన పెంచుకోవడం లక్ష్యం కావాలి. ఏఐపై అతిగా ఆధారపడటమూ ప్రమాదమే, కానీ పరిష్కారం మాత్రం ఏఐని దూరం పెట్టడం కాదు - ఏఐతో బాధ్యతను పెంపొందించుకోవడం.





కొత్త కెరియర్లు

ఇప్పుడు మనం ఏఐ పరిణామంలో తర్వాతి దశ అయిన ఏజెంటిక్ ఏఐలోకి ప్రవేశిస్తున్నాం. ఒక లక్ష్యం ఇస్తే, దాన్ని సాధించడానికి అవసరమైన దశలను అదే నిర్ణయించుకుని చర్యలు తీసుకునే వ్యవస్థలు ఇవి. సంప్రదాయ ఆటోమేషన్ నియమాలను అనుసరిస్తే, ఏజెంటిక్ ఏఐ పరిస్థితిని అర్థం చేసుకుని నిర్ణయాలు తీసుకుంటుంది. గూగుల్ మ్యాప్స్‌లో మనం ఇదే చూస్తున్నాం. ట్రాఫిక్‌ని గుర్తించడం, మార్గం మార్చడం, చేరుకునే సమయాన్ని నిరంతరం నవీకరించడం. భవిష్యత్తులో దీనివల్ల ఏఐ ఆర్కెస్ట్రేషన్ పాత్రలు, ఏఐ సూపర్‌వైజర్లు, మనిషి- ఏఐ పరస్పర చర్య రూపకర్తల లాంటి కొత్త కెరియర్లు ఏర్పడతాయి.

కొలువులు పోవు

ఏఐ ఉద్యోగాలను తీసేస్తుందా? గూగుల్ మ్యాప్స్ డ్రైవర్లను తొలగించలేదు, దారి చూపే తెలివిని మెరుగుపరిచింది. అలాగే ఉద్యోగాలూ మాయం కావు, మార్పు చెందుతాయి. భవిష్యత్తు ఇంజినీర్లు ఏఐతో కలిసి పనిచేసే వృత్తి నిపుణులుగా మారాలి. ఈ రోజు మీరు గూగుల్ మ్యాప్‌లను అనుసరిస్తున్నారు. రేపు ఇలాంటి మరెన్నో ఇంటెలిజెంట్ వేదికలని మీరు రూపకల్పన చేసే అవకాశం ఉందని కలలు కనండి. కలలతోనే బాధ్యతలు మొదలవుతాయి. రోడ్లపై మొదలైన ఏఐ ప్రయాణం ఇప్పుడు తరగతి గదులు, కోడ్‌బేస్‌లు, కెరియర్లలోకి ప్రవేశిస్తోంది. ఏఐ ప్రమాదం కాదు. అది ఒక అవకాశం. అయితే సర్వదా సిద్ధంగా ఉన్నవారికి మాత్రమే అని గ్రహించాలి. ఏఐ యుగంలో భవిష్యత్తుకు సిద్ధమైన విద్యార్థులంతా దైనందిన జీవితంలో జిజ్ఞాస, ప్రశ్నించడం, నిరంతర అభ్యాసాన్ని భాగం చేసుకోవాలి. అదే నిజమైన రోడ్ మ్యాప్.



శ్రీనివాస రావు పేర్ల
డైరెక్టర్ – టెక్నికల్ ట్రెయినింగ్
సైయంట్ లిమిటెడ్

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

కంటెంట్ రైటింగ్

సంస్థ: స్కూల్ షేవర్ ఎల్ఎల్‌సీ
నైపుణ్యాలు: బ్లాగింగ్, క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ **స్టైపెండ్:** రూ.17,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 6
☛ https://tinyurl.com/4p7bc6jr

వీడియో ఎడిటింగ్

సంస్థ: ఫ్యూచర్‌సెప్ట్
నైపుణ్యాలు: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్టోరీటెల్లింగ్, వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ.10,000-20,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 6
☛ https://tinyurl.com/25eskmy6

మార్కెటింగ్

సంస్థ: స్టార్‌టూన్ ల్యాబ్స్ ప్రై.లి.
నైపుణ్యాలు: లీడ్ జనరేషన్, ఎంఎస్-ఆఫీస్, సోషల్ మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.8,000-10,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 6
☛ https://tinyurl.com/y7564dnw

సోషల్ మీడియా మార్కెటింగ్

సంస్థ: హౌస్ ఆఫ్ బ్రాండ్స్ ఫ్యాషన్ ఎల్ఎల్‌పీ
నైపుణ్యాలు: ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.5,000-10,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 6
☛ https://tinyurl.com/5x72yj8t

అకౌంటింగ్ అండ్ బుక్ కీపింగ్

సంస్థ: అన్‌సెడ్‌టాక్స్
నైపుణ్యాలు: అకౌంటింగ్, ఇన్వాయిస్ ప్రాసెసింగ్, జోహో బుక్స్
స్టైపెండ్: రూ.5,000-6,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 6
☛ https://tinyurl.com/4u5cfd5z

జర్నలిస్ట్

సంస్థ: టీఎఫ్‌డీ ఇండియా న్యూస్ 24
నైపుణ్యాలు: కంటెంట్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, హిందీ మాట్లాడటం
స్టైపెండ్: రూ.8,000-10,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 6
☛ https://tinyurl.com/2vp5wbte

హ్యూమన్ రిసోర్సెస్ (హెచ్ఆర్)

సంస్థ: స్పియర్‌మింట్ టెక్నాలజీ
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, ఎంఎస్-వర్డ్
స్టైపెండ్: రూ.5,000-8,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 6
☛ https://tinyurl.com/4k4vc7aj

సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్ అవ్వాలంటే?

బీఏ (హెచ్ఈపీ) చదువుతున్నాను. సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్ కావాలనుంది. ఇందుకు సంబంధించి సంస్థలు, కోర్సులు ఉంటాయా? -అజయ్

■ హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్ (హెచ్ఈపీ) సబ్జెక్టులతో బీఏ చదువుతున్న మీరు సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్ కావాలనుకోవడం అభినందనీయం. ఈ సమకాలీన రంగానికి మంచి భవిష్యత్తు ఉంది. నేటి డిజిటల్ యుగంలో ప్రజల ఆలోచనలు, అభిప్రాయాలు, నిర్ణయాలపై సోషల్ మీడియా ద్వారా ప్రభావం చూపగల వారికే సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్ అనే గుర్తింపు వస్తుంది. ముఖ్యంగా సమాజం, రాజకీయాలు, ఆర్థిక అంశాలు, చరిత్ర లాంటి విషయాలపై అవగాహన ఉన్న హెచ్ఈపీ విద్యార్థులకు ఈ రంగం అనుకూలంగా ఉంటుంది.

◗ హెచ్ఈపీ సబ్జెక్టుల ద్వారా విద్యార్థికి సమాజ నిర్మాణం, ప్రజాస్వామ్య వ్యవస్థ, ఆర్థిక అసమానతలు, చారిత్రక మార్పులు లాంటి అంశాలపై లోతైన అవగాహన ఏర్పడుతుంది. ఈ పరిజ్ఞానం సోషల్ మీడియాలో కంటెంట్‌గా మారి ప్రజలను ఆలోచింపజేస్తుంది. కేవలం వినోదం కోసమే కాకుండా సమాజానికి ఉపయోగపడే సమాచారం, విశ్లేషణ, అవగాహన కలిగించే కంటెంట్ అందించడం ద్వారా ఒక బాధ్యతాయుతమైన సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా ఎదగవచ్చు.

సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్ కోసం అకడమిక్ పరిజ్ఞానంతో పాటు కొన్ని ఆధునిక నైపుణ్యాలూ తప్పనిసరిగా నేర్చుకోవాలి. ముఖ్యంగా డిజిటల్ మార్కెటింగ్, సోషల్ మీడియా మేనేజ్‌మెంట్, కంటెంట్ క్రియేషన్, వీడియో మేకింగ్, స్క్రిప్ట్ రైటింగ్, పర్సనల్ బ్రాండింగ్ లాంటి అంశాలు చాలా అవసరం. ఇవి నేర్చుకుంటే మీ ఆలోచనలను ఆకర్షణీయంగా ప్రజల ముందుకు తీసుకెళ్లగలుగుతారు.




◗ ఈ నైపుణ్యాలను వివిధ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ సంస్థలు అందిస్తున్నాయి. కోర్స్‌ఎరా, యుడెమి, గూగుల్ డిజిటల్ గ్యారేజ్, మెటా బ్లూప్రింట్ లాంటి వేదికలు డిజిటల్ మార్కెటింగ్, సోషల్ మీడియా సంబంధిత కోర్సులను అందిస్తున్నాయి. ఇవి చాలావరకు తక్కువ ఖర్చుతో లేదా ఉచితంగా సర్టిఫికేషన్లూ ఇస్తాయి.

◗ సోషల్ ఇన్‌ఫ్లుయెన్సింగ్ కోసం సరైన వేదికను ఎంచుకోవడమూ ముఖ్యమే. యూట్యూబ్ ద్వారా రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలపై విశ్లేషణాత్మక వీడియోలు చేయవచ్చు. ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ ద్వారా సంక్షిప్తంగా ప్రభావవంతమైన సందేశాలు అందించవచ్చు. ట్విటర్ రాజకీయ అభిప్రాయాలు, సమకాలీన చర్చలకు అనువైన వేదికగా ఉపయోగపడుతుంది. అలాగే లింక్డ్‌ఇన్ ద్వారా అకడమిక్, పాలసీ సంబంధిత కంటెంట్‌ను ప్రొఫెషనల్ వర్గాలకు చేరవేయవచ్చు.

◗ సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా ఎదిగిన తర్వాత ఆదాయ అవకాశాలూ ఉంటాయి. బ్రాండ్ ప్రమోషన్లు, యూట్యూబ్ ప్రకటనల ఆదాయం, సోషల్ మీడియా కన్సల్టెన్సీ, రాజకీయ లేదా సామాజిక సంస్థల అవేర్‌నెస్ క్యాంపెయిన్లు, సొంత ఆన్‌లైన్ కోర్సులు, వెబినార్లు లాంటి మార్గాల ద్వారా ఆర్థికంగా స్థిరపడవచ్చు. అయితే ఆదాయం కన్నా ముందు నమ్మకం, విశ్వసనీయత, విలువలతో కూడిన కంటెంట్‌ను నిర్మించుకోవడం ముఖ్యం.

◗ చివరిగా, బీఏ హెచ్ఈపీ చదువుతున్న విద్యార్థికి సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్ కావడం ఒక గౌరవప్రదమైన, ప్రభావవంతమైన కెరియర్ అవకాశం. నిరంతర అధ్యయనం, క్రమశిక్షణ, సమాజ బాధ్యతతో కూడిన కంటెంట్ సృష్టిస్తే ఈ రంగంలో మంచి గుర్తింపు, స్థిరమైన భవిష్యత్తు తప్పక సాధించవచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్,
కెరియర్ కౌన్సెలర్



బీఈ/ బీటెక్ పూర్తి చేసుకున్నవారికి సాఫ్ట్‌వేర్/ ఐటీ సంస్థల్లోనే కాదు ఆర్మీలోనూ ఆకర్షణీయ వేతనాలు అందుతున్నాయి. ఉద్యోగ భద్రతకు ఢోకా ఉండదు. తక్కువ వ్యవధిలోనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు. అందువల్ల అర్హతలు, ఆసక్తి ఉన్నవారు ఆర్మీలో షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) టెక్నికల్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్వ్యూతో నియామకాలుంటాయి. శిక్షణ అనంతరం పీజీ డిప్లొమా అందుకుని, లెఫ్టినెంట్ హోదాతో ఉద్యోగంలో చేరిపోవచ్చు.

ఆర్మీ ఆహ్వానిస్తోంది

రూ.18 లక్షల వార్షిక వేతనం

ఏడాదికి రెండుసార్లు ఇండియన్ ఆర్మీ ఎస్ఎస్‌సీ టెక్ పోస్టులకు ప్రకటన విడుదలచేస్తోంది. అందువల్ల ఇంజినీరింగ్ పట్టభద్రులు వీటిని లక్ష్యంగా చేసుకోవచ్చు. రాత పరీక్ష ఉండదు. ఇంటర్వ్యూలో రాణిస్తే సరిపోతుంది. ఇంజినీరింగ్‌లో చదివిన బ్రాంచీ నేపథ్యంతోనే ఉద్యోగ విధులు నిర్వర్తించవచ్చు. భద్రమైన కెరియర్, మెరుగైన వేతనం, త్వరగా పదోన్నతులు, పలు సౌకర్యాలు.. ఇవన్నీ సొంతం చేసుకోవచ్చు.

ఎంపిక..

దరఖాస్తులను గ్రాడ్యుయేషన్ (బీటెక్) మార్కులతో వడపోస్తారు. ఇలా అవకాశం వచ్చినవారిని సెలక్షన్ కేంద్రాల్లో ఇంటర్వ్యూకి ఆహ్వానిస్తారు. ఏపీ, తెలంగాణ వారికి బెంగళూరులో ముఖాముఖీ ఏప్రిల్-జూన్ మధ్యలో ఉంటుంది. సైకాలజిస్ట్, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్, ఇంటర్వ్యూ ఆఫీసర్ ఆధ్వర్యంలో వీటిని నిర్వహిస్తారు. ఇవి రెండు దశల్లో ఐదు రోజులు కొనసాగుతాయి. తొలిరోజు స్టేజ్-1లో ఉత్తీర్ణులే తర్వాతి 4 రోజులు నిర్వహించే స్టేజ్-2 ఇంటర్వ్యూలో కొనసాగుతారు. ఇందులోనూ విజయవంతమైనవారికి వైద్య పరీక్షలు నిర్వహించి, శిక్షణకు తీసుకుంటారు.

శిక్షణ.. వేతనాలు..

ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీలో అక్టోబరు, 2026 నుంచి శిక్షణ మొదలవుతుంది. వ్యవధి 49 వారాలు. ఈ సమయంలో నెలకు రూ.56,100 స్టైపెండ్ చెల్లిస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్నవారికి పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ డిగ్రీని మద్రాస్ యూనివర్సిటీ అందిస్తుంది. వీరిని లెఫ్టినెంట్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు. ఉద్యోగంలో లెవెల్-10 రూ.56,100 మూల వేతనంతోపాటు మిలటరీ సర్వీస్ పే, డీఏ, హెచ్ఆర్ఏ, ఇతర ప్రోత్సాహకాలు అందుతాయి. తొలి నెల నుంచే అన్నీ కలిపి సుమారు రూ.1.5 లక్షల వరకు పొందవచ్చు. పదేళ్లు విధుల్లో కొనసాగవచ్చు. అనంతరం సంస్థ అవసరాలు, అభ్యర్థుల ఆసక్తుల ప్రకారం కొందరిని శాశ్వత విధుల్లోకి (పర్మనెంట్ కమిషన్) తీసుకుంటారు. మిగిలినవారికి మరో నాలుగేళ్లపాటు సర్వీస్ పొడిగిస్తారు. ఆ వ్యవధి తర్వాత వీరు వైదొలగాలి. లెఫ్టినెంట్ హోదాతో ఉద్యోగంలో చేరినవాళ్లు.. రెండేళ్ల అనుభవంతో కెప్టెన్, ఆరేళ్ల సేవలతో మేజర్, 13 ఏళ్లు కొనసాగితే లెఫ్టినెంట్ కల్నల్ హోదాకు చేరుకోవచ్చు.

వివరాలు

ఖాళీలు: పురుషులకు 350, మహిళలకు 29 (వీటిలో ఆర్మీ విడోలకు 2 కేటాయించారు) మెన్ పోస్టుల్లో విభాగాలవారీ.. సివిల్ 75, కంప్యూటర్ 60, ఎలక్ట్రికల్ 33, ఎలక్ట్రానిక్స్ 64, మెకానికల్ 101, మిగతా బ్రాంచీల్లో 17 ఉన్నాయి. మహిళలకు.. సివిల్ 7, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ 4, ఎలక్ట్రికల్ 3, ఎలక్ట్రానిక్స్ 6, మెకానికల్ 9 ఉన్నాయి.

విద్యార్హత: సంబంధిత/ అనుబంధ విభాగాల్లో ఇంజినీరింగ్ పూర్తి చేసినవారు, ప్రస్తుతం చివరి ఏడాది కోర్సులు చదువుతున్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్ సైన్స్ ఖాళీలకు.. బీటెక్ (ఐటీ), ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులవారూ అర్హులే. డిఫెన్స్ విడో ఖాళీల్లో ఒక పోస్టుకు ఏదైనా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు, మరొకదానికి ఇంజినీరింగ్ వాళ్లు పోటీపడొచ్చు.

వయసు: 01.10.2026 నాటికి 20 నుంచి 27 ఏళ్లలోపు ఉండాలి. 01.10.1999 - 30.09.2006 మధ్య జన్మించినవారు అర్హులు. ఆర్మీ విడోలకు గరిష్ఠ వయసు 35 ఏళ్లు మించరాదు.

ఆన్‌లైన్ దరఖాస్తులకు గడువు తేదీ: పురుషులకు ఫిబ్రవరి 5. మహిళలకు ఫిబ్రవరి 4.
వెబ్‌సైట్: https://www.joinindianarmy.nic.in/

డిప్యూటీ మేనేజర్లు

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన డిప్యూటీ మేనేజర్(టెక్నికల్) ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✦ డిప్యూటీ మేనేజర్(టెక్నికల్): 40 పోస్టులు

అర్హత: సివిల్ ఇంజినీరింగ్ డిగ్రీతో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు: 30 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు ఉంటుంది.
వేతన శ్రేణి: నెలకు రూ.56,100-1,77,500.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 9.
ఎంపిక: గేట్-2025 స్కోరుతో.
వెబ్‌సైట్: https://nhai.gov.in/#/vacancies/current%20%3Chttps:

మైక్రోవేవ్ రిగ్గర్లు

టెలి కమ్యూనికేషన్స్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్.. ఒప్పంద ప్రాతిపదికన మైక్రోవేవ్ రిగ్గర్, ట్రాన్స్‌లేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

✦ మైక్రోవేవ్ రిగ్గర్: 31
✦ ట్రాన్స్‌లేటర్: 03

అర్హత: పోస్టులను అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో డిగ్రీతో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు: 40-45 ఏళ్ల మధ్య ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 23. **ఎంపిక:** ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: www.tcil.net.in/current_opening.php

ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో

ఆదాయ పన్ను శాఖ కార్యాలయం, ముంబయి రీజియన్.. స్పోర్ట్స్ కోటాలో పలు విభాగాల్లో 97 పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ✦ స్టెనోగ్రాఫర్ - 12 ✦ ట్యాక్స్ అసిస్టెంట్ - 47 ✦ మల్టీ టాస్కింగ్ స్టాఫ్ - 38

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో టెన్త్/ ఇంటర్/ డిగ్రీతో పాటు స్పోర్ట్స్ సర్టిఫికెట్ ఉండాలి.
వయసు: 18-27 ఏళ్ల మధ్య ఉండాలి.
వేతన శ్రేణి: నెలకు స్టెనోగ్రాఫర్, ట్యాక్స్ అసిస్టెంట్‌కు రూ.25,500-81,100. మల్టీ-టాస్కింగ్ స్టాఫ్‌కు రూ.18,000-56,900.
ఎంపిక: సంబంధిత క్రీడల్లో ప్రతిభతో.
దరఖాస్తు ఫీజు: రూ.200.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 31.
వెబ్‌సైట్: https://www.incometaxmumbai.gov.in/

హెచ్ఈఎంఆర్ఎల్‌లో

డీఆర్‌డీవో, పుణె పరిధిలోని హై ఎనర్జీ మెటీరియల్స్ రిసెర్చ్ ల్యాబొరేటరీ (హెచ్ఈఎంఆర్ఎల్).. ఆరు నెలల కాలానికి ఇంటర్న్‌షిప్ కోసం దరఖాస్తులు కోరుతోంది.

✦ పెయిడ్ ఇంటర్న్‌షిప్: 40 ఖాళీలు

విభాగాలు: ఏరోస్పేస్, కెమికల్, మెకానికల్, ఫిజిక్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ ఇంజినీరింగ్
ఇంటర్న్‌షిప్ వ్యవధి: 6 నెలలు.
అర్హత: సంబంధిత విభాగాల్లో బీఈ/ బీటెక్, ఎంటెక్/ఎమ్మెస్సీ. **స్టైపెండ్:** నెలకు రూ.5,000. **ఎంపిక:** విద్యార్హతలతో.
పోస్టు ద్వారా దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: 20.01.2026.
చిరునామా: ది డైరెక్టర్ హెచ్ఈఎంఆర్ఎల్, సుతర్వాడి, పుణె. **వెబ్‌సైట్:** https://drdo.gov.in/drdo/en/offerings/vacancies

న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్‌లో

న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్.. వివిధ విభాగాల్లో 114 పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

✦ సైంటిఫిక్ అసిస్టెంట్ (సివిల్): 02
✦ స్టైపెండరీ ట్రెయినీ/టెక్నీషియన్: 95
✦ ఎక్స్-రే టెక్నీషియన్: 02
✦ అసిస్టెంట్ గ్రేడ్-1: 15

విభాగాలు: సివిల్, మెకానికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రికల్, హెల్త్ ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్, ప్లాంట్ ఆపరేటర్, మెషినిస్ట్, ఫిట్టర్, టర్నర్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్.

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్/ ఐటీఐ/ డిప్లొమా/ డిగ్రీతో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు: 04-02-2026 నాటికి 18-30 ఏళ్ల మధ్య ఉండాలి.
వేతనం: నెలకు సైంటిఫిక్ అసిస్టెంట్‌కు రూ.55,932. టెక్నీషియన్‌కు రూ.34,286. ఎక్స్-రే టెక్నీషియన్‌కు రూ.40,290. అసిస్టెంట్ గ్రేడ్-1కు రూ.40,290.
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.100-150. మిగిలినవారికి ఫీజు లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 4.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో.
వెబ్‌సైట్: https://www.npcilcareers.co.in/MainSiten/DefaultInfo.aspx

కరెంట్ అఫైర్స్



★ న్యూయార్క్ నగర మేయర్‌గా ఇటీవల ఎవరు ఎన్నికయ్యారు? (న్యూయార్క్ నగర మొదటి ముస్లిం మేయర్‌గా, ఈ పదవి చేపట్టిన తొలి దక్షిణాసియా సంతతి వ్యక్తిగా ఘనత సాధించారు. ఉగాండాలో జన్మించిన ఈ భారత సంతతి వ్యక్తి గత శతాబ్దానికి పైగా ఈ పదవి చేపట్టిన వారిలో

మాదిరి ప్రశ్నలు

అత్యంత పిన్నవయస్కుడిగా నిలిచారు.)
జ: జోహ్రాన్ మమ్దానీ

★ 2025, నవంబరు 2న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) భారత్ నుంచి ప్రయోగించిన అత్యంత బరువైన కమ్యూనికేషన్ ఉపగ్రహంగా గుర్తింపు పొందిన సీఎంఎస్‌-03ను ఏ రాకెట్ ద్వారా విజయవంతంగా ప్రయోగించింది?
జ: ఎల్‌వీఎం-3-ఎం5 (జీఎస్ఎల్వీ -ఎంకే 3 అని కూడా దీనిని పిలుస్తారు. సీఎంఎస్-03 కమ్యూనికేషన్ ఉపగ్రహం బరువు 4410 కిలోలు.)

★ థోరియం కరిగిన ఉప్పు రియాక్టర్ (టీఎంఎస్ఆర్ - థోరియం మోల్టెన్ సాల్ట్ రియాక్టర్)లో మొదటిసారిగా థోరియం నుంచి యురేనియం ఇంధన మార్పిడిని విజయవంతంగా నిర్వహించిన దేశంగా ఏది వార్తల్లో నిలిచింది? (థోరియం కరిగిన ఉప్పు రియాక్టర్ అనేది ఒక అధునాతన అణువ్యవస్థ. ఇది నీటికి బదులుగా కరిగిన ఉప్పును శీతలీకరణిగా, థోరియాన్ని సారవంతమైన ఇంధన వనరుగా ఉపయోగిస్తుంది.)
జ: చైనా

మరింత సమాచారం

జూనియర్ ఇంటర్ - జంతు శాస్త్రం
జంతు రాజ్యం (ఎనిమేలియా)

1. స్పంజికల కుల్యావ్యవస్థల విధులు ఏవి?
జ: స్పంజికల్లో నీటి ప్రవాహ వ్యవస్థ లేదా కుల్యా వ్యవస్థ ఉంటుంది. పరిసర జలం శరీర కుడ్యంలోని కుల్యాముఖాల ద్వారా దేహం మధ్యలో ఉండే స్పంజికా కుహరంలోకి, అక్కడి నుంచి ఆస్కులం ద్వారా బయటికి నిరంతరం ప్రవహిస్తూ ఉంటుంది. ఈ నీటి ప్రసరణ ఆహార సముపార్జనలో, శ్వాస వాయువుల వినిమయంలో వ్యర్థాలు తొలగించడంలోనూ తోడ్పడుతుంది.

2 మార్కులు

2. నిడేరియన్ల రెండు ప్రధాన దేహ రూపాలు ఏమిటి? వాటి ప్రధాన విధులు ఏమిటి?
జ: నిడేరియన్లలో పాలిప్, మెడ్యుసా అనే రెండు ప్రధాన దేహ రూపాలుంటాయి. పాలిప్ స్థూపాకార, స్థానబద్ధ జీవకం. ఉదా: హైడ్రా, అడామ్సియా. మెడ్యుసా గొడుగు ఆకృతిలో ఉండి స్వేచ్ఛగా ఈదే జీవకం. ఉదా: అరీలియా లేదా జెల్లీ చేప. ఈ రెండు దేహ రూపాలున్న నిడేరియా జీవుల జీవిత చరిత్రలో తరాల ఏకాంతరత వ్యక్తమవుతుంది. అంటే పాలిప్ రూపం అలైంగిక పద్ధతిలో మెడ్యుసాను, మెడ్యుసాలు లైంగిక పద్ధతిలో పాలిప్ రూపాలను ఏర్పరుస్తాయి. ఉదా: ఒబీలియా

ఫైనల్ పరీక్షలు - 2026
ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

3. నీరిస్‌లో ఉండే పార్శ్వఉపాంగాలు ఏమిటి? వాటి కర్తవ్యం?
జ: నీరిస్ లాంటి జలచర జీవుల్లో పార్శ్వ పాదాలు అనే ఉపాంగాలు ఈదడానికి ఉపయోగపడతాయి.

4. రాడ్యులా విధి ఏమిటి? అది ఏ జీవుల్లో ఉంటుంది?
జ: మొలస్కా జీవుల ఆస్యకుహరంలో ఆకురాయి లాంటి నికషణ అవయవం ఉంటుంది. దీన్నే రాడ్యులా (radula) అంటారు. ఇది ఆహారాన్ని తురమడానికి ఉపయోగపడుతుంది.

4 మార్కులు

1. జంతువుల్లో నాలుగు దేహ వ్యవస్థీకరణ స్థాయిలను వివరించండి.
జ: జంతువులన్నీ బహుకణజీవులు అయినప్పటికీ, కణ వ్యవస్థీకృత పరంగా అవి ఒకే నమూనాను చూపవు. స్పంజికల్లో కణాలు వదులైన కణ సమూహాలుగా అమరి, కణ స్థాయి వ్యవస్థీకరణను చూపుతాయి. ఈ కణాలు శ్రమవిభజనను ప్రదర్శిస్తాయి. సీలెంటిరేటా జీవుల్లో కణాల అమరిక మరింత సంక్లిష్టతను చేరుకుంది. వీటిలో ఒకే రకమైన విధిని నిర్వహించే కణాలు కణజాలంగా ఏర్పడ్డాయి. అంటే వీటిని కణజాల స్థాయి వ్యవస్థీకరణ జీవులుగా పేర్కొనవచ్చు. అవయవ స్థాయిని ప్లాటీహెల్మెంథిస్ వర్గ జీవులు ప్రదర్శిస్తాయి. వీటిలో రకరకాల కణజాలాలు సంఘటితమై ఒక ప్రత్యేక విధిని నిర్వర్తించడానికి ఏర్పడే నిర్మాణాన్ని అవయవం అంటారు. అనెలిడా, ఆర్థ్రోపొడా, మొలస్కా, ఇకైనోడర్మేటా, కార్డేటాజీవుల్లో వివిధ అవయవాలు సంఘటితమై అవయవ వ్యవస్థను ఏర్పరుస్తాయి. ప్రతి వ్యవస్థ ఒక నిర్దిష్టమైన శరీరధర్మ క్రియలను నిర్వర్తిస్తుంది. ఈ స్థాయినే అవయవ వ్యవస్థ స్థాయి వ్యవస్థీకరణ అంటారు.

ముఖ్యమైన ప్రశ్నలు-జవాబులు



రచయిత: కంటి రవిచరణ్

ఆదుకుంటూ.. అన్నింటినీ పరిష్కరిస్తూ!


జనరల్ స్టడీస్ - ఏపీ ఎకానమీ

విభజన చట్టం- ముఖ్యమైన సెక్షన్లు-వివరాలు

(ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం-2014)



షీలా బేడీ



జైదీప్ గోవింద్

ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలో మొత్తం భాగాల సంఖ్య 12. ఈ భాగాల్లోని సెక్షన్లు 108. చట్టంలో ఉన్న మొత్తం షెడ్యూళ్లు 13. ఏపీ విభజన చట్టం-2014 ప్రకారం షెడ్యూల్ 9లో ప్రారంభంలో ఉన్న కార్పొరేషన్‌లు లేదా కంపెనీలు 89. ప్రస్తుతం వీటి సంఖ్య 91కు పెరిగింది. 9వ షెడ్యూల్‌లోని సంస్థలు, ఉద్యోగులను విభజించేందుకు కేంద్రం షీలా బేడీ నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటుచేసింది. ఈ కమిటీ విభజన చట్టంలోని హెడ్‌క్వార్టర్ అనే పదానికి నిర్వచనం చెప్పాలని, దీని ప్రాతిపదికనే షెడ్యూల్ 9లోని కార్పొరేషన్‌లకు సంబంధించిన ఆస్తులు పంపిణీ చేయాల్సి ఉంటుందని సిఫార్సు చేసింది. విభజన చట్టం ప్రకారం షెడ్యూల్ 10లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు ప్రారంభంలో 107 ఉండగా, ప్రస్తుతం 142కు పెరిగింది. 10వ షెడ్యూల్‌లోని రాష్ట్ర ప్రభుత్వ సంస్థల విభజనకోసం సుప్రీంకోర్టు సూచనపై కేంద్రం జైదీప్ గోవింద్ కమిటీని నియమించింది. నేటికీ 9, 10వ షెడ్యూళ్లపై వివాదాలు రెండు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్నాయి. జలవివాదాల పరిష్కారం కోసం గోదావరినది నిర్వహణ బోర్డును తెలంగాణలో, కృష్ణానది నిర్వహణ బోర్డును ఏపీలో ఏర్పాటుచేయాలని విభజన చట్టం తెలియజేస్తుంది.



ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంతో వేరుపడిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించింది. మిగిలిన భూభాగం సరికొత్త ఆంధ్రప్రదేశ్‌గా అవతరించింది. సాంకేతికంగా రెండు కొత్త రాష్ట్రాలుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉనికిలోకి వచ్చాయి. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సరిహద్దుల నుంచి ప్రభుత్వ సిబ్బంది, నీటిపంపకాల వరకు అన్నింటినీ విభజన చట్టం వివరించింది. ఆస్తులతో పాటు అప్పులనూ జనాభా ప్రాతిపదికన పంచింది. విభజనతో నష్టపోయిన అవశేష ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం చేయాల్సిన పనులను, ఆర్థిక సాయాలను తెలియజేసింది. పదేళ్ల పాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా కొనసాగుతుందని, అక్కడే ఉన్న హైకోర్టు రెండు రాష్ట్రాలకు సేవలను అందిస్తుందని పేర్కొంది. కీలకమైన నీటివనరుల పంపిణీకి శాశ్వత పరిష్కారాన్ని సూచించింది. ఈ విధంగా విభజన చట్టంలోని ప్రతి అంశాన్ని పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. అందులోని షెడ్యూళ్లు, సెక్షన్ల వారీగా ఉన్న వివరాలను, గణాంకాలతో సహా గుర్తుంచుకోవాలి.

షెడ్యూల్ నంబరు	షెడ్యూళ్ల గురించి క్లుప్తంగా.. విషయం
1.	ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న రాజ్యసభ స్థానాల పునర్విభజన
2.	పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన
3.	శాసనమండలి నియోజకవర్గం పునర్విభజన
4.	కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఏర్పడిన శాసనమండళ్లలోని సభ్యుల జాబితా
5.	తెలంగాణ రాష్ట్రంలో షెడ్యూల్ కులాలను సూచిస్తుంది
6.	తెలంగాణ రాష్ట్రంలోని షెడ్యూల్ తెగలను సూచిస్తుంది
7.	ప్రావిడెంట్ ఫండ్స్, పెన్షన్ ఫండ్స్, బీమా ఫండ్, దివాళా నిధి, రిజర్వు ఫండ్‌ల గురించి తెలియజేస్తుంది.
8.	పింఛను చెల్లింపు బాధ్యతల గురించి తెలియజేస్తుంది.
9.	ప్రభుత్వ కంపెనీలు, కార్పొరేషన్‌ల జాబితా.
10.	రాష్ట్రప్రభుత్వ సంస్థల జాబితా.
11.	నదీ జలాల నిర్వహణ బోర్డుల విధి విధానాలు
12.	బొగ్గు, చమురు, సహజ వాయువు, విద్యుత్తు ఉత్పత్తి, సరఫరా, పంపిణీ గురించి తెలియజేస్తుంది.
13.	ఏపీ, తెలంగాణలో ఏర్పాటు చేయబోయే విద్యాసంస్థలు, మౌలిక సదుపాయాల గురించి తెలియజేస్తుంది.

విభజన చట్టంలోని ముఖ్యమైన సెక్షన్లు

సెక్షన్-1: చట్టం పేరు-ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంగా తెలియజేస్తుంది.

సెక్షన్-2: చట్టంలో పేర్కొన్న నిర్వచనాలను వివరిస్తుంది. నియమిత తేదీ అంటే కేంద్రం గెజిట్ ద్వారా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుచేసిన తేదీ అని అర్థం. ఏపీ-తెలంగాణకు సంబంధించి జనాభా నిష్పత్తి అంటే 2011 జనాభా లెక్కల ప్రకారం 58.32 : 41.68 నిష్పత్తి అని అర్థం.

సెక్షన్-3: తెలంగాణ రాష్ట్రం అవతరణ.

సెక్షన్-4: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన భూభాగాలు.

సెక్షన్-5: నియమిత తేదీ నుంచి పదేళ్లకు మించని కాలానికి తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉంటుంది. పదేళ్ల గడువు ముగిసిన తర్వాత తెలంగాణకు హైదరాబాద్ రాజధానిగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని ఉంటుంది.

సెక్షన్-6: అవశేష ఆంధ్రప్రదేశ్ రాజధాని కోసం కేంద్రం నిపుణుల కమిటీని నియమిస్తుంది. ఈ కమిటీ ఏపీ విభజన చట్టం-2014 ఆమోదించిన తేదీ నుంచి 6 నెలల్లోపు నూతన రాజధాని విషయమై తగిన సిఫార్సులు చేస్తుంది.

★ కేంద్ర ప్రభుత్వం ఏపీ నూతన రాజధాని కోసం మార్చి 28, 2014న కె. శివరామకృష్ణన్ అధ్యక్షతన అయిదుగురు సభ్యులతో నిపుణుల కమిటీని నియమించింది. వికేంద్రీకృత అభివృద్ధిని సాధించాలంటే రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలను విస్తరింపజేయాలని ఈ కమిటీ సూచించింది. ఏపీ ప్రభుత్వం 2015, ఏప్రిల్ 23న అమరావతిని ఏపీ రాజధానిగా ప్రకటించింది. 2015, అక్టోబరు 22న ఉద్దండరాయునిపాలెం వద్ద ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఏపీ రాజధాని అమరావతికి శంకుస్థాపన జరిగింది.



సెక్షన్-7: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న గవర్నరు కొత్తగా ఏర్పాటయ్యే ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు రాష్ట్రపతి నిర్ణయించిన కాలం వరకు ఉమ్మడిగవర్నర్‌గా ఉంటారు.

సెక్షన్-26: శాసనసభ నియోజకవర్గాల పునర్విభజనను వివరిస్తుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 170 ప్రకారం నూతనంగా ఏర్పడే ఏపీ-తెలంగాణ శాసనసభల్లోని సీట్ల సంఖ్య వరుసగా 175 నుంచి 225కు, 119 నుంచి 153కు పెరుగుతుంది.

సెక్షన్-46: 13వ ఆర్థిక సంఘం నిధులను విభజనానంతరం నూతనంగా ఏర్పాటయ్యే ఇరు రాష్ట్రాల మధ్య జనాభా ప్రాతిపదికన పంపిణీ చేయాలి. అవశేష ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ, ఉత్తర కోస్తాల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్యాకేజీ అందించాలి.

సెక్షన్-68: వివిధ కంపెనీలు, కార్పొరేషన్లకు సంబంధించిన నిబంధనలు అంటే 9వ షెడ్యూల్‌లోని సంస్థల గురించి తెలియజేస్తుంది.

సెక్షన్-76: అఖిల భారత సర్వీసులకు సంబంధించిన నిబంధనలు.

సెక్షన్-84: కృష్ణా, గోదావరి నదీ జలాల నిర్వహణ మండళ్ల పనిని పర్యవేక్షించేందుకు కేంద్రం అపెక్స్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేస్తుంది. దీనికి కేంద్ర జలవనరులమంత్రి ఛైర్మన్‌గా, ఏపీ ముఖ్యమంత్రి ఒక సభ్యుడిగా, తెలంగాణ ముఖ్యమంత్రి మరొక సభ్యుడిగా వ్యవహరిస్తారు.

సెక్షన్-85: గోదావరి జల నిర్వహణ మండలి, కృష్ణా నది నిర్వహణ మండలిని ఏర్పాటు చేయాలని తెలియజేస్తుంది.

సెక్షన్-90: పోలవరం నీటిపారుదల ప్రాజెక్టును జాతీయప్రాజెక్టుగా ప్రకటించారు.

సెక్షన్-95: కొత్తగా ఏర్పడే రెండు రాష్ట్రాల్లోని విద్యార్థులకు పదేళ్లపాటు ఉన్నత విద్యలో సమాన అవకాశాలు కల్పిస్తూ ప్రస్తుత విధానాలే కొనసాగించాలి.

సెక్షన్-108: ఈ చట్టం నిబంధనను అమలు చేయడంలో ఏదైనా సంకటం ఏర్పడితే, దానిని తొలగించడానికి రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా అవసరమైన మార్పులు చేయవచ్చు.



రచయిత: సుబ్బారెడ్డి

కోరుకున్న లక్షణాలతో కొత్త జీవి సృష్టి!

జనరల్ స్టడీస్ - పర్యావరణ అంశాలు
పర్యావరణం - జన్యుపరివర్తిత జీవులు




మానవ జాతి ఎదుర్కొంటున్న ఆహార, ఆరోగ్య, పర్యావరణ సవాళ్లను అధిగమించడానికి దోహదపడే పరిజ్ఞానాల్లో జన్యుపరివర్తన కీలకమైంది. జీవుల అనువంశికానికి మూలమైన జన్యువుల్లో మార్పు చేయడం ద్వారా పోషక విలువలతో కూడిన పంటలను పండించవచ్చు. వ్యవసాయంలో పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి, అధిక దిగుబడులు సాధించవచ్చు. మెరుగైన ఫలాలిచ్చే మొక్కలను, కావాల్సిన లక్షణాలతో జంతువులను సృష్టించుకోవచ్చు. మొండి వ్యాధులకు చికిత్స మార్గాలను కనిపెట్టవచ్చు. శరీరంలో కోల్పోయిన భాగాలను తిరిగి నిర్మించుకోవచ్చు. ఈ విధంగా వ్యవసాయం, వైద్యం, పారిశ్రామిక, పర్యావరణ రంగాలకు విభిన్న ప్రయోజనాలను అందిస్తున్న జన్యుపరివర్తన ఉత్పత్తుల గురించి పోటీ పరీక్షార్థులు ప్రాథమికంగా తెలుసుకోవాలి. దేశంలో అనుమతించిన జన్యుపరివర్తన పంటలు, ఆ దిశగా జరుగుతున్న పరిశోధనలు, జంతువుల క్లోనింగ్ విషయంలో పురోగతి, అనుమతులు ఇచ్చే విభాగాలు, వాటి విధులతో పాటు ఈ పరిజ్ఞానానికి సంబంధించి తాజా పరిణామాలపై పెరుగుతున్న ఆందోళనలనూ అర్థం చేసుకోవాలి.

1. జెనెటిక్ ఇంజినీరింగ్ పద్ధతులకు సంబంధించిన అంశాల్లో సరైనవి?
ఎ) వాంఛనీయ లక్షణాలున్న జన్యువును ఒక జీవి నుంచి వేరుచేసి జెనెటిక్ ఇంజినీరింగ్ పద్ధతుల ద్వారా మరో జీవిలోకి ప్రవేశపెట్టడాన్నే 'జన్యు రూపాంతరత' అంటారు.
బి) ట్రాన్స్ జెనిసిస్‌లో వాడిన జన్యువునే 'ట్రాన్స్ జీన్' అంటారు.
సి) ఈస్ట్ కణాలు జన్యు బదిలీకి గురైన మొదటి యూకారియోటిక్ జీవులు.
1) బి 2) సి 3) ఎ, బి, సి 4) బి, సి

2. జన్యుపరంగా సవరించిన మొక్కలకు సంబంధించిన అంశాల్లో సరైనవి?
ఎ) జన్యు రూపాంతరత ద్వారా వాంఛనీయ లక్షణాలున్న కొత్త జన్యువును ప్రవేశపెట్టగా ఏర్పడిన మొక్కలనే 'జన్యుపరంగా సవరించిన మొక్కలు' అంటారు.
బి) ప్రపంచంలో మొదటి జన్యుమార్పిడి పంట పొగాకు.
సి) విటమిన్-సి సమృద్ధిగా లభ్యమయ్యే గోల్డెన్ రైస్ వంగడాన్ని 'స్విస్ ఫెడరల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' రూపొందించింది.
1) ఎ, బి 2) సి 3) ఎ, బి, సి 4) బి, సి

3. గోల్డెన్ రైస్‌కి సంబంధించిన అంశాల్లో సరికానివి?
ఎ) గోల్డెన్ రైస్‌లో బీటాకెరొటిన్ పుష్కలంగా లభిస్తుంది. బీటాకెరొటిన్ శరీరంలో చేరాక విటమిన్-ఎ గా మారుతుంది.



బి) ఈ బియ్యాన్ని పండించేందుకు ఫిలిప్పీన్స్‌లోని 'ఇంటర్నేషనల్ రైస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' 2001లో మొదటిసారి లైసెన్స్ ఇచ్చింది.
సి) గోల్డెన్ రైస్ వాణిజ్య ఉత్పత్తిని ఆమోదించిన మొదటి దేశం ఫిలిప్పీన్స్.
డి) భారతదేశంలో గోల్డెన్ రైస్ వాణిజ్యపరంగా ఉత్పత్తి చేసి వినియోగిస్తున్నారు.
1) ఎ, బి 2) సి 3) డి 4) బి, సి

4. బయోఫోర్టిఫికేషన్‌కు సంబంధించిన అంశాల్లో సరైనవి ఏవి?
ఎ) బయోఫోర్టిఫికేషన్ అనేది మొక్కల పెంపకం, వ్యవసాయ, ఆధునిక బయోటెక్నాలజీ పద్ధతులతో సహా వివిధ పద్ధతుల ద్వారా ఆహార పంటల పోషక విలువను పెంచే ప్రక్రియ.
బి) సెలెక్టివ్ బ్రీడింగ్ లేదా జెనెటిక్ ఇంజినీరింగ్ ద్వారా పంటలను బయోఫోర్టిఫై చేయవచ్చు. భారతదేశంలో బయోఫోర్టిఫికేషన్ సెలెక్టివ్ బ్రీడింగ్ ద్వారా ప్రత్యేకంగా జరుగుతుంది.
సి) ప్రస్తుతం బయోఫోర్టిఫైడ్ మిల్లెట్, బియ్యం, గోధుమలు దేశంలో రైతులకు అందుబాటులో ఉన్నాయి.
1) ఎ 2) సి 3) ఎ, బి, సి 4) బి, సి

5. జన్యుమార్పిడి మొక్కల సృష్టిలో ఉన్న వివిధ దశల వరుసలో సరైనదాన్ని గుర్తించండి.
1) వాంఛనీయ జన్యువు తయారీ - జన్యు క్లోనింగ్ - మొక్క కణంలోకి ఆర్-డీఎన్ఏను ప్రవేశపెట్టడం - ఆర్-డీఎన్ఏ తయారీ
2) జన్యు క్లోనింగ్ - వాంఛనీయ జన్యువు తయారీ - ఆర్-డీఎన్ఏ తయారీ - మొక్క కణంలోకి ఆర్-డీఎన్ఏను ప్రవేశపెట్టడం
3) ఆర్-డీఎన్ఏ తయారీ - మొక్క కణంలోకి ఆర్-డీఎన్ఏను ప్రవేశపెట్టడం - వాంఛనీయ జన్యువు తయారీ - జన్యు క్లోనింగ్ - ఆర్-డీఎన్ఏ తయారీ
4) వాంఛనీయ జన్యువు తయారీ - జన్యు క్లోనింగ్ - ఆర్-డీఎన్ఏ తయారీ - మొక్క కణంలోకి ఆర్-డీఎన్ఏను ప్రవేశపెట్టడం.

6. జెనెటిక్ ఇంజినీరింగ్ పద్ధతులకు సంబంధించిన అంశాల్లో సరైనవి?



ఎ) 'రిస్ట్రిక్షన్ ఎండోన్యూక్లియేజ్' అనేది మిశ్రమ నమూనా డీఎన్ఏ క్రమంలో తేడాలను గుర్తించడానికి ఉపయోగించే ఒక ప్రయోగశాల సాంకేతికత.
బి) సదరన్ బ్లాటింగ్ డీఎన్ఏ సీక్వెన్స్‌లను గుర్తించే ఎంజైమ్‌లు. వీటి ద్వారా దాత కణజాలం నుంచి డీఎన్ఏను కత్తిరిస్తారు.
సి) జన్యు క్లోనింగ్‌లో తయారుచేసిన జన్యు ప్రతులను లైగేజ్ అనే ఎంజైమ్ సహాయంతో ప్లాస్మిడ్స్‌కు జతపరుస్తారు.
1) ఎ, సి 2) సి 3) ఎ, బి, సి 4) బి, సి

7. వాదన-(ఎ): గోల్డెన్ రైస్ వినియోగం వల్ల చిన్నారుల్లో అంధత్వం తగ్గుతుంది.
కారణం-(ఆర్): గోల్డెన్ రైస్‌లో బీటాకెరొటిన్ పుష్కలంగా లభిస్తుంది. ఇది శరీరంలో చేరాక విటమిన్-ఇ గా మారుతుంది.
1) ఎ, ఆర్ నిజం; ఆర్ అనేది ఎ కు సరైన వివరణ.
2) ఎ నిజం, ఆర్ తప్పు.
3) ఎ, ఆర్ నిజం; ఆర్ అనేది ఎ సరైన వివరణ కాదు.
4) ఎ తప్పు, ఆర్ నిజం.

8. బాసిల్లస్ తురింజియెన్సిస్‌కు సంబంధించిన అంశాల్లో సరైనవి?
ఎ) ఇది గ్రామ్ - పాజిటివ్ వైరస్.



బి) బాసిల్లస్ తురింజియెన్సిస్ స్పోర్యులేషన్ దశలో ఎండోటాక్సిన్ లేదా డెల్టా ఎండోటాక్సిన్‌ను ఉత్పత్తి చేస్తుంది. స్ఫటికాకార ప్రొటీన్, క్రిమిసంహారక లక్షణాలతో ఉంటుంది.
సి) క్రై ప్రొటీన్లు లెపిడోప్టెరాన్ కీటకాలకు వ్యతిరేకంగా పనిచేస్తాయి. కొన్ని డిప్టెరాన్, కోలియోప్టెరాన్, నెమటోడ్‌లకు వ్యతిరేకంగా కూడా పనిచేస్తాయి.
1) ఎ 2) సి 3) ఎ, బి, సి 4) బి, సి

9. బీటీ పత్తికి సంబంధించిన కింది అంశాల్లో సరికానిది గుర్తించండి.
ఎ) బీటీ పత్తి భారతదేశంలో 2002, మార్చిలో వాణిజ్య సాగు కోసం ఆమోదించిన మొదటి జీఎం పంట.
బి) పత్తి కాయ తొలిచే పురుగును ఎదుర్కోవడానికి ఒక పురుగుమందును ఉత్పత్తి చేయడానికి జన్యుపరంగా మార్పు చేసింది.
సి) భారతదేశంలో వాణిజ్య సాగు కోసం కేంద్రం ఆమోదించిన జీఎం పంటలు బీటీ పత్తి, బీటీ వరి, బీటీ చెరకు.
1) ఎ, సి 2) సి 3) ఎ, బి, సి 4) బి, సి

10. హెర్బిసైడ్ టాలరెంట్ బీటీ పత్తికి సంబంధించిన అంశాల్లో సరైనవి ఏవి?
ఎ) హెర్బిసైడ్ టాలరెంట్ బీటీ పత్తి వేరియంట్ మొక్క హెర్బిసైడ్ గ్లైఫోసేట్‌కు నిరోధకతను కలిగిస్తుంది.



బి) ఇటీవల భారత ప్రభుత్వం హెర్బిసైడ్ టాలరెంట్ బీటీ సాగుకు అనుమతి మంజూరు చేసింది.
సి) ఇండియాలో హెర్బిసైడ్ టాలరెంట్ బీటీ పత్తి అక్రమ సాగు భారీగా పెరిగింది. ఈ విత్తన ప్యాకెట్ల విక్రయం 2020లో 30 లక్షల నుంచి 2021 నాటికి 75 లక్షలకు పెరిగింది.
1) ఎ, సి 2) సి 3) ఎ 4) బి, సి

11. జన్యు రూపాంతర మొక్కల అనువర్తనాలకు సంబంధించిన అంశాల్లో సరైనవి?
ఎ) జన్యు రూపాంతరతను ఉపయోగించి కీటక నిరోధక పంటలు తయారు చేయడం ద్వారా అధిక దిగుబడులు పొందొచ్చు.
బి) వివిధ రకాల వ్యాధులకు నిరోధకతను ప్రదర్శించే జన్యు పరివర్తిత పంటలు తయారుచేయవచ్చు.
సి) గుల్మనాశకాలను తట్టుకునే జన్యు పరివర్తిత మొక్కలను రూపొందించవచ్చు.
డి) అధిక ఉష్ణోగ్రత, అధిక శీతలం, అధిక లవణీయత, జలాభావ పరిస్థితులను తట్టుకునే పంటలను రూపొందించవచ్చు.
1) ఎ, బి, సి 2) సి, డి
3) ఎ, బి, సి, డి 4) ఎ, బి, డి

12. జన్యు ఇంజినీరింగ్ అంచనాల కమిటీకి సంబంధించిన అంశాల్లో సరైనవి?
ఎ) ఇది మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కింద పనిచేసే సంస్థ.
బి) పర్యావరణ పరిరక్షణ చట్టం, 1986 ప్రకారం జన్యు ఇంజినీరింగ్ అంచనాల కమిటీని ఏర్పాటు చేశారు.
సి) పర్యావరణంలోకి జన్యుపరంగా ఇంజినీరింగ్ చేసిన జీవులు, ఉత్పత్తులను విడుదల చేసే ప్రతిపాదనల అంచనాకు జన్యు ఇంజినీరింగ్ అంచనాల కమిటీ బాధ్యత వహిస్తుంది.
1) ఎ, బి, సి 2) సి 3) ఎ 4) బి, సి

13. జన్యు ఇంజినీరింగ్ అంచనాల కమిటీకి సంబంధించిన అంశాల్లో సరైనవి?
ఎ) జన్యు ఇంజినీరింగ్ అంచనాల కమిటీ ఛైర్మన్‌గా ప్రధానమంత్రి ఉంటారు.
బి) పారిశ్రామిక అభివృద్ధి మంత్రిత్వ శాఖ, బయోటెక్నాలజీ విభాగం, అటామిక్ శక్తి శాఖ ప్రతినిధులు ఇంజినీరింగ్ అంచనాల కమిటీలో సభ్యులుగా ఉంటారు.
సి) ప్రస్తుతం ఇందులో 24 మంది సభ్యులున్నారు.
1) బి 2) సి 3) ఎ, సి 4) బి, సి

14. జెనెటిక్ ఇంజినీరింగ్ అప్రైజల్ కమిటీ నిపుణుల సభ్యుల్లో ఎవరు ఉంటారు?
ఎ) డైరెక్టర్ జనరల్ - ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్
బి) డైరెక్టర్ జనరల్ - ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్
సి) డైరెక్టర్ జనరల్ - హెల్త్ సర్వీసెస్, ప్లాంట్ ప్రొటెక్షన్ అడ్వైజర్, డైరెక్టరేట్ ఆఫ్ ప్లాంట్ ప్రొటెక్షన్, క్వారంటైజ్ అండ్ స్టోరేజ్
డి) డైరెక్టర్ జనరల్ - కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్, ఇండస్ట్రియల్ రిసెర్చ్
ఇ) సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఛైర్మన్
1) ఎ, బి, సి 2) ఎ, బి, సి, డి, ఇ
3) ఎ, బి, డి, ఇ 4) బి, డి, ఇ

15. బీటీ వంకాయకు సంబంధించిన అంశాల్లో సరైనవి?
ఎ) బీటీ వంకాయ అనేది ఆగ్రోబాక్టీరియం - మధ్యవర్తిత్వ రీకాంబినెంట్ డీఎన్ఏ సాంకేతికత ద్వారా వంకాయలో బ్యాక్టీరియా బాసిల్లస్ తురింజియెన్సిస్ నుంచి బీటీ జన్యువుని చొప్పించడం ద్వారా సృష్టించిన జన్యుమార్పిడి వంకాయ.



బి) ధార్వాడ్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్, తమిళనాడు అగ్రికల్చరల్ యూనివర్సిటీ సహకారంతో మహికో (మహారాష్ట్ర, హైబ్రిడ్ సీడ్స్ కంపెనీ) అభివృద్ధి చేసిన బీటీ వంకాయను వాణిజ్య పరంగా విడుదల చేయాలని జెనెటిక్ ఇంజినీరింగ్ అప్రైజల్ కమిటీ 2007లో సిఫార్సు చేసింది.
సి) బీటీ వంకాయ చిన్న రైతులకు ప్రయోజనం చేకూరుస్తుంది. ఎందుకంటే ఇది కీటకాలను తట్టుకోగలదు, దిగుబడిని పెంచుతుంది.
డి) 2020 నుంచి బీటీ వంకాయను వాణిజ్యపరంగా ఇండియాలో సాగు చేస్తున్నారు.
1) ఎ, బి, సి 2) సి
3) ఎ 4) బి, సి, డి



రచయిత: ఈదుబిల్లి వేణుగోపాల్

సమాధానాలు
1-3, 2-1, 3-3, 4-3, 5-4, 6-2, 7-2, 8-4, 9-2, 10-1, 11-3, 12-2, 13-4, 14-2, 15-1.

ఈనాడు
ప్రతిభ
■ e-mail: support@epratibha.net
17
సోమవారం జనవరి 12, 2026



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
అరిథ్‌మెటిక్

నాలుగో వాయిదాలో అదనంగా చెల్లించిన మొత్తం?

వాయిదాలు - II

పోటీపరీక్షల్లో అరిథ్‌మెటిక్ విభాగంలో వాయిదాలు అనే అంశం ముఖ్యమైంది. ఒక వస్తువు లేదా రుణం మొత్తాన్ని ఒకేసారి కాకుండా సమయానుసారం సమాన మొత్తాల్లో చెల్లించడాన్ని వాయిదాలుగా చెల్లించడం అంటారు. ఇందులో మూలధనం + వడ్డీ ఉంటాయి. వాయిదాల సంఖ్య పెరిగితే వడ్డీ కూడా పెరుగుతుంది. వీటిని బారువడ్డీ, చక్రవడ్డీలో వాయిదాలుగా విభజించవచ్చు. వాయిదా పద్ధతిలో వసూలు చేసే వడ్డీ మారుతూ ఉంటే, రూపాయల్లో విలువ మాత్రం స్థిరంగా ఉంటుంది.

మాదిరి ప్రశ్నలు

1. వివేక్ సంవత్సరానికి $13\frac{1}{3}$ % చక్రవడ్డీకి రెండేళ్లలో రెండు సమాన వార్షిక వాయిదాలుగా తిరిగి ఇచ్చేట్లు రూ.7200 అప్పుగా తీసుకున్నాడు. అయితే ఒక్కో వాయిదా మొత్తం ఎంత?

1) రూ.4335 2) రూ.4353
3) రూ.4535 4) రూ.4600

సాధన: $R = 13\frac{1}{3}\% = \frac{40}{3}\% = \frac{40}{3\times100} = \frac{2}{15}$

అసలు : వాయిదా

$(15 : 17)\,17 = 255 : 289$

$15^2 : 17^2 = 225 : 289$

$480 : 2\times289$

480 భాగాల విలువ = 7200

ఒక్కో వాయిదా 289 భాగాల విలువ $= 7200\times\frac{289}{480}$

$= 15\times289 = 4335$

సమాధానం: 1

2. కవిత ఒక వ్యక్తి దగ్గర కొంత మొత్తం అప్పుగా తీసుకుంది. ఆ మొత్తంపై వార్షిక చక్రవడ్డీ రేటు $7\frac{1}{7}$ % చొప్పున రెండు సంవత్సరాల్లో సమాన వార్షిక వాయిదాగా రూ.3150 చెల్లిస్తే ఆమె ఆ వ్యక్తి దగ్గర తీసుకున్న అప్పు మొత్తం ఎంత?

1) రూ.5664 2) రూ.5864
3) రూ.5684 4) రూ.5680

సాధన: $R = 7\frac{1}{7}\% = \frac{50}{7}\% = \frac{50}{7\times100} = \frac{1}{14}$

కాలం = 2 సంవత్సరాలు

సమాన వార్షిక వాయిదా = రూ.3150

అసలు : వాయిదా

$(14 : 15)15 = 210 : 225$

$14^2 : 15^2 = 196 : 225$

$406 : 2\times225$

ఒక్కో వాయిదా 225 భాగాల విలువ = 3150

అసలు మొత్తం 406 భాగాల విలువ $= \frac{3150\times406}{225}$

$= 5684$

సమాధానం: 3

3. సరళ రూ.68660 విలువైన మొబైల్ ఫోన్ కొనడానికి రూ.45000 ముందస్తుగా చెల్లించి, మిగతా డబ్బును $14\frac{2}{7}$ % వార్షిక చక్రవడ్డీ రేటు చొప్పున మూడేళ్లలో సమాన వార్షిక వాయిదాల చొప్పున చెల్లిస్తే, ఒక్కో వాయిదా మొత్తం ఎంత?

1) రూ.10500 2) రూ.10024
3) రూ.12040 4) రూ.10240

సాధన: $R = 14\frac{2}{7}\% = \frac{100}{7}\% = \frac{100}{7\times100} = \frac{1}{7}$

అప్పు మొత్తం = 68,660 – 45,000 = 23,660

అసలు : వాయిదా

$(7 : 8)\times8^2 = 448 : 512$

$(7^2 : 8^2)\times8 = 392 : 512$

$(7^3 : 8^3)\times1 = 343 : 512$

$1183 : 512\times3$

అసలు మొత్తం 1183 భాగాల విలువ = 23660

ఒక్కో వాయిదా 512 భాగాల విలువ $= \frac{23660\times512}{1183}$

$= 10240$

సమాధానం: 4

4. ఒక వ్యక్తి ఏడాదికి 10% చక్రవడ్డీ రేటుతో రూ.32550 అప్పుగా తీసుకున్నాడు. అతడు ఆ మొత్తాన్ని రెండు సమాన వార్షిక వాయిదాల్లో చెల్లిస్తాడు. రెండో వాయిదా, మొదటి వాయిదాకు రెట్టింపు అయితే రెండో వాయిదా విలువ ఎంత?

1) రూ.25410 2) రూ.26000
3) రూ.25000 4) రూ.25400

సాధన: $R = 10\% = \frac{10}{100} = \frac{1}{10}$; వాయిదాల నిష్పత్తి = 1 : 2

అసలు : వాయిదా

$(10 : 11)\times11\times1 = 110 : 121$

$(10^2 : 11^2)\times1\times2 = 200 : 242$

$310 : 363$

అసలు మొత్తం 310 భాగాల విలువ = 32550

రెండో వాయిదా విలువ 242 భాగాల విలువ = 25410

సమాధానం: 1

5. ఒక వ్యక్తి తీసుకున్న అప్పును 10% వార్షిక చక్రవడ్డీతో 5 సమాన వార్షిక వాయిదాల్లో చెల్లించాలి. అయితే మొదటి రెండు వాయిదాలు చెల్లించిన తర్వాత అప్పుదారుడు మూడో వాయిదా చెల్లించకుండా, దాన్ని నాలుగో వాయిదాలో కలిపి చెల్లిస్తాడు. ప్రతి వార్షిక వాయిదా రూ.65000. అయితే నాలుగో వాయిదా చెల్లింపులో అదనంగా చెల్లించిన మొత్తం ఎంత? (రూ.లలో)

1) 5000 2) 6000 3) 6500 4) 5800

సాధన: మూడో వార్షిక వాయిదా రూ. 65000.

అప్పుడు చెల్లించకుండా నాలుగో వాయిదాతో కలిపి చెల్లిస్తే అదనంగా చెల్లించాల్సిన మొత్తం $= 65000\times10\% = 6500$

సమాధానం: 3

6. ఒక రుణాన్ని రెండు సమాన వార్షిక వాయిదాల్లో చెల్లించాలి. ఒకవేళ రుణంపై వార్షిక చక్రవడ్డీ రేటు $6\frac{1}{4}$ %, ప్రతి సమాన వాయిదా రూ.7225. అయితే ఆ రుణంపై చెల్లించిన మొత్తం వడ్డీ ఎంత?

1) రూ.1200 2) రూ.1250 3) రూ.1520 4) రూ.1225

సాధన: $R = 6\frac{1}{4}\% = \frac{25}{4}\% = \frac{25}{4\times100} = \frac{1}{16}$

అసలు : వాయిదా

$(16 : 17)\times17 = 272 : 289$

$16^2 : 17^2 = 256 : 289$

$528 : 578$

సమాన వాయిదా 289 భాగాల విలువ = 7225

రుణంపై వడ్డీ (578 – 528) = 50 భాగాల విలువ

$= \frac{7225\times50}{289} = 25\times50 = 1250$

సమాధానం: 2

7. లిఖిత కొంత సొమ్మును అప్పుగా తీసుకుని ఏడాదికి $8\frac{1}{3}$% చక్రవడ్డీ చొప్పున రెండేళ్లలో సమాన వార్షిక వాయిదాగా రూ.8450 తిరిగి చెల్లించింది. ఆమె చెల్లించిన మొత్తం వడ్డీలో 65% ఎంత? (రూ.లలో)

1) 1900 2) 1235 3) 1735 4) 1850

సాధన: $R = \frac{1}{12}$ (సూక్ష్మీకరణ తర్వాత)

అసలు : వాయిదా

$(12 : 13)\times13 = 156 : 169$

$(12^2 : 13^2)\times1 = 144 : 169$

$300 : 338$

169 భాగాల విలువ = 8450

మొత్తం చెల్లించిన వడ్డీ = 38 భాగాల విలువ = 1900

లెక్కలో కోరిన జవాబు

$= 1900\times\frac{65}{100} = 1235$

సమాధానం: 2



రచయిత
డా. వంగల శ్రీనివాస్
విషయ నిపుణులు

889 Word of the Day

Mercurial

Telugu meaning: చంచలమైన, చురుకైన


English meaning: The word mercurial (మెర్క్యూరియల్) is an adjective that describes a person whose mood or behaviour changes suddenly and unpredictably.

Synonyms: Fickle, Volatile; ***Antonyms:*** Stable, Consistent

Usage: **1.** His mercurial temperament made it difficult for colleagues to predict his reactions.

2. The mercurial nature of the stock market demands constant vigilance from investors.

కరెంట్ అఫైర్స్



నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జీ) అభివృద్ధి చేసిన జాతీయ డిజిటల్ ఐఈడీ డేటా మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎన్ఐడీఎంఎస్) ప్లాట్‌ఫాంను కేంద్ర హోంమంత్రి అమిత్ షా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 2026, జనవరి 9న ప్రారంభించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశానికి ముందు తరం భద్రతా కవచంగా ఇది నిలుస్తుందని అమిత్ షా పేర్కొన్నారు. దేశంలో జరిగే అన్నిరకాల బాంబు పేలుళ్లను ఎదుర్కొనే సమగ్ర నిరోధక వ్యవస్థగా ఇది పనిచేస్తుందని తెలిపారు.

☛ హరియాణాలోని గురుగ్రామ్ సమీప మనేసర్‌లోని ఎన్ఎస్‌జీ గారిసన్‌లో ఎన్ఐడీఎంఎస్‌ను నెలకొల్పారు.



ప్రవాస భారతీయుల అభివృద్ధి, భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవానికి అందిస్తున్న విశిష్ట సేవలకు గాను ప్రవాస తెలంగాణ మహిళ అబ్బగొని నందినికి ఖతార్‌లోని భారతీయ దౌత్య కార్యాలయం నారీశక్తి పురస్కారం లభించింది. ఖతార్ రాజధాని దోహాలో 2026, జనవరి 9న జరిగిన ప్రవాసీ భారతీయ దినోత్సవంలో అక్కడి భారతీయ రాయబారి విపుల్ పురస్కారాన్ని అందజేశారు


ఈ ఏడాది (2026)లో భారత వృద్ధి రేటు 6.6 శాతంగా నమోదుకావొచ్చని ఐక్యరాజ్యసమితి (ఐరాస) అంచనా వేసింది. అమెరికా సుంకాల ప్రభావాన్ని స్థిరమైన ప్రైవేట్ వినియోగం, ప్రభుత్వ పెట్టుబడులు భర్తీ చేస్తాయని తెలిపింది. వరల్డ్ ఎకనామిక్ సిచ్యువేషన్ అండ్ ప్రాస్పెక్ట్స్ పేరిట ఐక్యరాజ్య సమితి ఈ నివేదికను విడుదల చేసింది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ 2026లో 2.7% వృద్ధి చెందొచ్చని ఈ నివేదిక పేర్కొంది.

తెలంగాణకు చెందిన బాక్సర్లు నిఖత్ జరీన్, మహ్మద్ హుసాముద్దీన్ జాతీయ సీనియర్ బాక్సింగ్ టోర్నీలో విజయం సాధించారు. 2026 జనవరి 10న జరిగిన మహిళల 51 కిలోల విభాగం ఫైనల్లో నిఖత్ మాజీ ప్రపంచ ఛాంపియన్ నీతును ఓడించింది. హుసాముద్దీన్ పురుషుల 60 కిలోల విభాగంలో సచిన్ సివాచ్‌పై విజయం సాధించాడు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జాతీయ యువజన దినోత్సవం

జనవరి 12
చరిత్రలో ఈనాడు



దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి యువతకే ఉంది. దేశ ప్రగతిలో వీరి పాత్ర ఎనలేనిది. కుల, లింగ, ఆర్థిక అసమానతలు లేని సమాజాన్ని నిర్మించడంలో; ప్రజలకు మంచి పాలన అందించడంలో; ఆర్థిక వృద్ధి సాధనలో యువతరం భాగస్వామ్యం కీలకం. జాతీయ శ్రేయస్సులో యువత పోషించే పాత్రను గుర్తించే లక్ష్యంతో ఏటా జనవరి 12న 'జాతీయ యువజన దినోత్సవం'గా (National Youth Day) నిర్వహిస్తారు. స్వామి వివేకానంద జయంతి కూడా ఈరోజే! సమాజ హితం పట్ల యువకుల్లో స్ఫూర్తి నింపేలా ఆయన అనేక కార్యక్రమాలు చేపట్టారు. మెరుగైన సమాజ నిర్మాణంలో యువతను భాగస్వాములను చేయాల్సిన ఆవశ్యకతను తెలియజేయడంతోపాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

యువత అంటే?

నేషనల్ యూత్ పాలసీ 2003 ప్రకారం, 13 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు వారిని మన దేశంలో యువతగా పేర్కొంటారు. జాతీయ అభివృద్ధిలో క్రియాశీల భాగస్వాములుగా వీరిని నిర్వచించారు. ఇతరులపై ఆధారపడే బాల్య దశ నుంచి స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదిగే సమాజ సభ్యులే యువత.

స్వామి వివేకానంద: ఈయన అసలు పేరు నరేంద్రనాథ్ దత్. 1863, జనవరి 12న కలకత్తాలో జన్మించారు. సాంఘిక, మత రంగాల్లో గొప్ప సంస్కర్త ఈయన. 1893 సెప్టెంబరు 11న అమెరికాలోని చికాగో నగరంలో జరిగిన సర్వమత సమ్మేళనంలో ప్రసంగించి, హైందవ మత గొప్పదనాన్ని ప్రపంచ దేశాలకు తెలియజేశారు. 'నేను సోషలిస్టును' అని ప్రకటించుకున్న తొలి భారతీయుడు వివేకానందుడే.


☛ 1897లో స్వామి వివేకానంద కలకత్తాలోని బేలూర్‌లో రామకృష్ణ మిషన్‌ను స్థాపించారు. తన గురువైన రామకృష్ణ పరమహంస బోధనలను ప్రచారం చేయడానికి దీన్ని నెలకొల్పారు. 'మానవ సేవే మాధవ సేవ' అనే రామకృష్ణ పరమహంస సందేశం రామకృష్ణ మిషన్ నినాదం. వివేకానంద 1902, జులై 4న మరణించారు.

ఐరాస గణాంకాలు, స్వామి వివేకానంద జీవిత విశేషాలు, గతంలో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భౌతికశాస్త్రం

అయస్కాంతత్వం

అయస్కాంతం ప్రదర్శించే గుణం లేదా ధర్మాన్ని అయస్కాంతత్వం అంటారు. నిత్యం మనం వాడే అనేక వస్తువుల్లో అయస్కాంతత్వ ప్రభావాలను చూస్తుంటాం. ఇళ్లలోని మోటార్లు, విద్యుత్తును ఉత్పత్తి చేసే జనరేటర్లు, ఏటీఎం, క్రెడిట్ కార్డులు, కంప్యూటర్ హార్డ్‌డ్రైవ్‌లు, సీడీలు, ఎం.ఆర్.ఐ. స్కానింగ్, దిక్సూచి, మైకులు, సౌండ్ బాక్స్‌లు, ఇయర్‌ఫోన్లు మొదలైన వాటిలో అయస్కాంతత్వం ఇమిడి ఉంటుంది.



మాగ్నటైట్

కొన్ని రకాల సహజసిద్ధమైన రాళ్ల ఇనుము లాంటి (చిన్న పరిమాణంలోని) పదార్థాలను ఆకర్షిస్తున్నాయని క్రీ.పూ.120లోనే గమనించారు. ఈ సహజమైన రాళ్లలో మాగ్నటైట్ అనే లోహ ఖనిజం ఉందని గుర్తించారు.

☛ మాగ్నటైట్ తరహా రాళ్లను (సహజ అయస్కాంతాలను) ఆసియా మైనర్‌లోని 'మాగ్నీసియా' ప్రాంతంలో కనుక్కోవడం ద్వారా వీటికి అయస్కాంతాలు అనే పేరు వచ్చింది.

అయస్కాంతాల రకాలు

1. సహజ అయస్కాంతాలు
2. కృత్రిమ అయస్కాంతాలు
3. శాశ్వత అయస్కాంతాలు
4. తాత్కాలిక అయస్కాంతాలు

విద్యుదయస్కాంతాలు - ఉపయోగాలు, అయస్కాంతీకరణ పద్ధతులు, కూలుమ్స్ విలోమ వర్గ నియమం, అయస్కాంత ప్రేరణ, అయస్కాంత బల (క్షేత్ర) రేఖలు, అయస్కాంత క్షేత్రం, అయస్కాంత పదార్థాలు, పారా అయస్కాంతత్వం, ఫెర్రో అయస్కాంతత్వం, భూ అయస్కాంతత్వంతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..

Latest Updates

Graduate Trainee Posts

Manganese Ore India Limited (MOIL) in Nagpur is inviting applications for Graduate Trainee, Management Trainee, and Manager posts in various departments. The total number of posts is 67. The application fee is Rs. 590. Eligible candidates can apply online before 20 January 2026.

Managerial Posts

Ramagundam Fertilisers and Chemicals Limited (RFCL), invites applications for the Managerial Posts for its Ramagundam Plant, Telangana and Corporate Office, Noida. The total number of posts is 36. The application fee is Rs.700. The last date for online applications is 15 January 2026.

Marketing Executive Posts

Prasar Bharati is inviting applications for Marketing Executive positions on a contract basis. The total no. of posts is 14. Eligible candidates can apply online before 22 January 2026.

Did You Apply..?

Today (January 12) is the last date for the following Jobs

☛ 215 Young Professional posts at ITI Limited. *Eligibility:* B.Tech, BE, MBA, PG Diploma, or ITI.

☛ 64 Associates posts in NHIDCL. *Eligibility:* B.Tech (Civil).

☛ 53 Posts in the Institute of Mental Health (IMH), Kadapa. *Eligibility:* 10th, Intermediate, ITI, Diploma, Degree, PG, M.Phil.

For more information and other notifications - scan QR code

SSC Exams
English

Phrasal Verbs

Directions (Qs. 1 - 25): *Select the most appropriate phrasal verb to fill the blank in the given sentence.*

1. The government decided to .... subsidies gradually to reduce the fiscal burden.
A) cut back on B) bring about
C) give away D) take over

2. The committee will .... the proposal before approving the funds.
A) look after B) go through
C) turn down D) run into

3. The villagers were forced to .... their homes after the flood warning.
A) move on B) set up
C) move out D) take in

4. The teacher asked the students to .... unnecessary details from their answers.
A) bring up B) put on
C) cross out D) run down

5. The doctor advised him to .... smoking immediately.
A) cut down B) slow down
C) take off D) give up

6. The company plans to .... several startups to expand its market reach.
A) take over B) bring up
C) look into D) pass on

7. The opposition strongly .... the new taxation policy.
A) put up with B) fell back on
C) spoke out against
D) went through

8. He .... his anger and responded calmly during the interview.
A) broke out B) gave in to
C) ran into D) held back

9. The new law will .... next month after parliamentary approval.
A) fall through B) come into force
C) come across D) break into

10. The journalist refused to .... political pressure.
A) give in to B) turn up
C) carry out D) look for

11. The students were asked to .... examples related to climate change.
A) take after B) come up with
C) get away with D) run out of

12. The factory had to .... operations due to power shortages.
A) carry on B) turn over
C) shut down D) break down

13. She .... an old friend at the railway station.
A) ran over B) ran out
C) ran down D) ran into

14. The authorities decided to .... the protest peacefully.
A) bring in B) break down
C) break up D) put off

15. The speaker .... several key points during the seminar.
A) took off B) pointed out
C) turned in D) looked down

16. The student failed because he .... important instructions.
A) missed out on B) took up
C) put forward D) passed by

17. The company decided to .... outdated machinery.
A) look after B) set off
C) run into D) do away with

18. The speaker's remarks .... a heated debate.
A) set aside B) set off
C) set out D) set up

19. The teacher warned students not to .... rules during examinations.
A) break away from B) break down
C) break through D) break out

20. The proposal was .... due to lack of funds.
A) turned over B) turned up
C) turned down D) turned into

21. The soldier refused to .... his duty despite danger.
A) call for B) look into
C) put on D) back out of

22. The chairman asked the members to .... their differences and work towards a common goal.
A) sort out B) fall out
C) pass out D) break out

23. The editor decided to .... the controversial paragraph.
A) take after B) take out
C) take over D) take in

24. The new employee is still trying to .... the company culture.
A) get away from B) fall apart
C) fit in with D) look down on

25. The minister promised to .... the issue in the next session.
A) take down
B) take off
C) take in
D) take up

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert

చెరకు రైతులకు కాసుల పంట 'కర్ణ-18'



హరియాణాలోని కర్నాల్‌లో ఉన్న సుగర్‌కేన్ బ్రీడింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రాంతీయ కేంద్రం అన్నిరకాల వాతావరణ పరిస్థితుల్లోనూ సాగుకు అనుకూలంగా ఉండి, మంచి దిగుబడినిచ్చే కొత్తరకం చెరకు వంగడం 'కర్ణ-18 (సీవో-18022)'ను అభివృద్ధి చేసింది. అత్యధికంగా చెరకు ఉత్పత్తి చేసే వాయవ్య భారతంలోని రైతులకు కర్ణ-18 రకం చెరకు వంగడం మంచి బహుమతి లాంటిదని ఈ కేంద్ర సీనియర్ శాస్త్రవేత్త ఎం.ఆర్.మీనా తెలిపారు. ఇది లవణీయత, కరవు పరిస్థితులను కూడా తట్టుకొంటుందని.. చెరకును పట్టి పీడించే ఎర్ర, టాప్ బోరర్ వంటి తెగుళ్ల బెడద కూడా ఉండదన్నారు. ఇది రాటూన్ క్రాప్‌నకు (ప్రధాన పంటను కోసిన తర్వాత మిగిలిపోయిన వేర్లు/మొద్దుల నుంచి వచ్చే ద్వితీయపంట) కూడా అనుకూలమన్నారు. ఈ రకం చెరకు దిగుబడి హెక్టారుకు 98.6 టన్నులుగా.. చక్కెర మిల్లుల వద్ద రికవరీ దాదాపు 11 శాతంతో హెక్టారుకు 12.6 టన్నుల పంచదార ఉత్పత్తి ఉంటుందని మీనా తెలిపారు.

24 x 7 మిల్క్ ఏటీఎం

మధ్యప్రదేశ్‌లోని జిల్లా కేంద్రమైన ఛింద్వాడాకు చెందిన ఆకాశ్ సూర్యవంశీ అనే యువకుడు పాల విక్రయానికి ఏటీఎం మిషన్‌ను అందుబాటులోకి తెచ్చారు. స్థానికంగా పాల సేకరణ కేంద్రం నిర్వహిస్తున్న ఈయన కొన్ని పెద్ద నగరాల్లో ఏర్పాటుచేసిన ఇటువంటి యంత్రాలను చూసి ఈ స్టార్టప్‌ను ప్రారంభించారు. ఇకపై ఛింద్వాడా ప్రజలకు 24 గంటలూ పాలు అందుబాటులో ఉంటాయని ఆకాశ్ తెలిపారు. దాదాపు 200 లీటర్ల నిల్వ సామర్థ్యం గల ఈ యంత్రంలోని పాలు 5 రోజుల దాకా పాడవకుండా ఉంటాయి. అచ్చం ఏటీఎం మిషను లాగానే ఇది పనిచేస్తుంది. ఇందులో నగదు చెల్లింపు లేదా కార్డు, క్యూఆర్ కోడ్ స్కానింగుతోనూ పాలు పొందవచ్చు. ఈ ఏటీఎం కేంద్రానికి ప్రజలు పాత్రలతో వస్తారని, తద్వారా ప్లాస్టిక్ బెడద కూడా తప్పుతుందని స్థానిక కౌన్సిలరు సందీప్‌సింగ్ చౌహాన్ అభిప్రాయపడ్డారు.



ఐ-ప్యాక్ తృణమూల్ నల్లధనాన్ని దాచి ఉంచే వేదికా?

- ప్రశ్నించిన భాజపా

దిల్లీ: కోల్‌కతాలోని ఐ-ప్యాక్ కార్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలను పశ్చిమ బెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినాయకురాలు మమతా బెనర్జీ అడ్డుకోవడంపై భాజపా మరోసారి విమర్శలు గుప్పించింది. ఐ-ప్యాక్ అనేది రాజకీయ సంప్రదింపుల సంస్థా.. లేదంటే తృణమూల్ నల్లధనాన్ని దాచి ఉంచే వేదికా అని ప్రశ్నించింది. మమత చేతుల్లో ఆయుధంగా బెంగాల్ పోలీసులు మారిపోయారని భాజపా సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ దిల్లీలో ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ ఆరోపించారు. అవమానకర, రాజ్యాంగవిరుద్ధ, అప్రజాస్వామిక కార్యకలాపాల కోసం వారిని సీఎం వాడుకుంటున్నారని విమర్శించారు. మమత భయపడ్డారని, అందుకే ఐ-ప్యాక్ కార్యాలయం నుంచి దస్త్రాలను తీసుకెళ్లారని రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు.

భాజపాది కుహనా హిందుత్వం

- ఠాక్రే సోదరుల విమర్శ

ముంబయి: భాజపాది కుహనా హిందుత్వమని శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, ఆయన సోదరుడైన మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్) అధిపతి రాజ్ ఠాక్రే విరుచుకుపడ్డారు. మహారాష్ట్ర పురపాలక ఎన్నికలను పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన ఉమ్మడి సభలో వారిద్దరూ మాట్లాడారు. ముంబయికి ముప్పిరిగొన్న ప్రమాదం దృష్ట్యానే తామిద్దరం మళ్లీ ఒకటయ్యామని రాజ్ చెప్పారు. ఈ ఎన్నికల్లో ఏ ఒక్క తప్పు జరిగినా ముంబయి కోసం చేసిన పోరాటాన్ని శాశ్వతంగా వదులుకోవాల్సిందేనని అన్నారు. మరాఠీలు, హిందువులు, మహారాష్ట్ర ప్రయోజనాల కోసం ఇద్దరం విభేదాలు పక్కనపెట్టామని ఉద్ధవ్ తెలిపారు. భాజపా ముంబయి పేరును తిరిగి బొంబాయిగా మార్చాలనుకుంటోందా అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు విభజనవాద రాజకీయాలకు భాజపా దిగుతోందని, ఆ పార్టీ చెబుతున్న హిందుత్వవాదం, జాతీయవాదం ఉత్తుత్తివేనని విమర్శించారు. 'దేశమే ముందు' అనే బదులు 'అవినీతే ముందు' అని చెప్పేదిగా భాజపా మారిందని ఆరోపించారు.

లౌకిక పార్టీలు విధ్వంస రచన చేస్తున్నాయ్

- విమర్శలు గుప్పించిన అసదుద్దీన్ ఒవైసీ

ఛత్రపతి సంభాజీనగర్: చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టాన్ని (ఉపా) సవరించేందుకు భాజపాతో కాంగ్రెస్ చేతులు కలిపిందని ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. దానివల్లే ముస్లిం యువత జైల్లో మగ్గుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా పర్భానీ, జాల్నాల్లో ఆదివారం నిర్వహించిన ర్యాలీల్లో అసదుద్దీన్ ప్రసంగించారు. "ఎన్నికలు సమీపించిన ప్రతిసారీ.. భాజపాకు బీ-టీమ్ అంటూ కాంగ్రెస్ మాపై ఆరోపణలు గుప్పిస్తుంది. అయితే ఉపాను సవరించేందుకు కమలదళానికి సహాయం చేసింది హస్తం పార్టీయే. లౌకిక పార్టీలుగా చెప్పుకొంటున్న రాజకీయ పక్షాలు మన విధ్వంసానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. ముస్లిం యువత జైళ్లలో మగ్గేలా చట్టాలు చేస్తున్నాయి" అని అసదుద్దీన్ పేర్కొన్నారు.

డయాబెటిక్ ఫుట్ బాధితుల కాళ్లకు రక్ష

- సరికొత్త ఏఐ సాధనం సిద్ధం


దిల్లీ: మధుమేహం కారణంగా ప్రపంచవ్యాప్తంగా 20 సెకన్లకో వ్యక్తి కాలును తొలగించాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో మధుమేహులకు నిలయమైన భారత్‌లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. డయాబెటిక్ ఫుట్ అనే సమస్య కారణంగా ఏటా లక్ష మందికి కాలు తొలగింపును చేపట్టాల్సి వస్తోంది. అయితే సకాలంలో స్క్రీనింగ్, వైద్యం వల్ల వీటిలో 80 శాతం కేసుల్లో కాళ్లను కాపాడుకునే వెసులుబాటు ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. అయినా భారత్‌లో మధుమేహ నిర్వహణకు సంబంధించిన అంశాల్లో డయాబెటిక్ ఫుట్ అనేది పెద్ద సమస్యగా ఉందని పరిశోధకులు చెబుతున్నారు. ఈ సమస్యను అధిగమించడానికి స్ట్రైడ్ ఎయిడ్ అనే సంస్థ ఏఐ ఆధారిత డిజిటల్ పాయింట్ ఆఫ్ కేర్ (డీ-పీవోసీ) అనే స్క్రీనింగ్ వ్యవస్థను అభివృద్ధి చేసింది. అది డయాబెటిక్ ఫుట్ ముప్పును కొద్దినిమిషాల్లో పసిగడుతుంది. దీని నిర్వహణ కోసం పెద్ద ఆసుపత్రులు అవసరంలేదు. చిన్న క్లినిక్‌లలోనూ దీన్ని వాడొచ్చు. ఇది థర్మల్ ఇమేజింగ్ విధానంతో ఇన్‌ఫ్లమేషన్‌ను,



ప్లాంటార్ ప్రెజర్ మ్యాపింగ్‌తో అధిక ముప్పు ఉన్న ప్రదేశాలను గుర్తిస్తుంది. నాడులకు కలిగిన నష్టాన్ని పసిగట్టడానికి న్యూరోపతీ మదింపు ప్రక్రియను చేపడుతుంది. యాంకిల్ బ్రేకియల్ ఇండెక్స్ ఆధారిత రక్తనాళ స్క్రీనింగ్‌ను నిర్వహించి రక్త ప్రవాహాన్ని మదిస్తుంది. ఈ ప్రక్రియ మొత్తం 20 నిమిషాల్లో పూర్తవుతుంది. అనంతరం అది సమగ్ర ముప్పు విశ్లేషణను అందిస్తుంది. కృత్రిమ మేధ సంబంధ అల్గోరిథమ్‌లను ఉపయోగించడం ద్వారా ఈ ముప్పును తక్కువ, మధ్య, అధిక విభాగాలుగా వర్గీకరించొచ్చు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) సాధనాలను ఏఐతో అనుసంధానించడం ద్వారా డయాబెటిక్ ఫుట్ బాధితులను కాపాడాలని భావిస్తున్నట్లు స్ట్రైడ్‌ఎయిడ్ సంస్థ డైరెక్టర్ పవన్ బెలెహళ్లి తెలిపారు.

ఆ డబ్బును మదురో కేసులపై ఖర్చు చేయొద్దు

- వెనెజువెలా చమురు ఆదాయంపై ట్రంప్ కీలక ఆదేశం



వాషింగ్టన్: వెనెజువెలా ముడి చమురుకు సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక కార్యనిర్వాహక ఉత్తర్వు జారీ చేశారు. ఆ దేశానికి ముడి చమురు ద్వారా వచ్చే రాబడిని మదురో దంపతులకు న్యాయ సహాయం అందించడం కోసం వినియోగించొద్దని ఆదేశించారు. ఆ డబ్బును మదురోపై కేసుల కోసం వెచ్చిస్తే.. వెనెజువెలాలో ఆర్థిక, రాజకీయ సుస్థిరత సాధనకు తాము చేస్తున్న ప్రయత్నాలకు విఘాతం కలుగుతుందన్నారు. గత శుక్రవారం అమెరికాలోని దిగ్గజ ఇంధన రంగ కంపెనీల సీఈఓలతో ట్రంప్ సమావేశమయ్యారు. వెనెజువెలా చమురు మార్కెట్‌లోని అవకాశాలు, అక్కడ అమెరికా కంపెనీలు పెట్టుబడులు పెట్టడంపై చర్చించారు. అనంతరం 24 గంటల్లోనే ప్రస్తుత కార్యనిర్వాహక ఆదేశం వెలువడింది. "వెనెజువెలా చమురుతో వచ్చే ఆదాయం కచ్చితంగా ఆ దేశానిదే. అమెరికా నిర్వహణలో ఉండే ఆ ఆదాయాన్ని వెనెజువెలా ప్రభుత్వ/దౌత్య అవసరాలకు వినియోగించొచ్చు. ప్రైవేటు అవసరాలకు వాడకూడదు" అని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. అమెరికా జాతీయ అత్యవసరాల చట్టం, అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం కింద ఈ ఆదేశాన్ని ట్రంప్ జారీ చేశారు. ఒకవేళ వెనెజువెలా చమురు ఆదాయ వనరుల నుంచి మదురోకు న్యాయ సహాయం లభిస్తే, అది అమెరికాకు అసాధారణ ముప్పుగా పరిణమిస్తుందన్నారు.

వాయు నాణ్యతను గాలికొదిలేశారు

- కేంద్రంపై కాంగ్రెస్ విమర్శలు



దిల్లీ: వాయు నాణ్యత అనేది దేశవ్యాప్త సమస్య అని, దానిపై కేంద్ర ప్రభుత్వ స్పందన ఏ మాత్రం ప్రభావవంతంగా లేదని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. గాలి నాణ్యతను గాడిన పెట్టేందుకు 'జాతీయ స్వచ్ఛ గాలి కార్యక్రమం'(ఎన్‌సీఏపీ) ద్వారా పకడ్బందీగా సంస్కరణలను అమలు చేయాలని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆదివారం డిమాండు చేశారు. ఎన్‌సీఏపీ జాతీయ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం 'అస్తవ్యస్థం'గా మార్చిందని విమర్శలు గుప్పించారు. "వాయు నాణ్యత అనేది దేశవ్యాప్త సమస్యగా ఉందనే రహస్యాన్ని చాలాకాలం పాటు దాచారు. ఇటీవలే సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (సీఆర్ఈఏ) విశ్లేషణలో ఈ వాస్తవాన్ని వెల్లడించారు. గత ఐదేళ్లుగా (2019-2024) మన దేశ గాలిలో పీఎం 2.5 స్థాయి కాలుష్య ఉద్గారాల మోతాదు పెరుగుతూపోతోంది. దేశంలోని దాదాపు 44 శాతం నగరాల్లో తీవ్ర వాయు కాలుష్యం ఉందని ఉపగ్రహ చిత్రాల ద్వారా సీఆర్ఈఏ గుర్తించింది. అంటే దేశంలోని 4,041 నగరాలు, పట్టణాలకుగానూ 1,787 చోట్ల కాలుష్యం తీవ్ర రూపం దాల్చింది. ఈ విషయం కేంద్రానికి తెలిసినా, కేవలం 130 నగరాలనే ఎన్‌సీఏపీలో చేర్చారు. ఈ 130 నగరాలకుగానూ 28 చోట్ల ఇప్పటివరకు నిరంతర గాలి నాణ్యతా పర్యవేక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. 102 నగరాల్లోనే గాలి నాణ్యతా పర్యవేక్షణ కేంద్రాలు ఉండగా, వీటిలోని 100 నగరాల గాలిలో 80 శాతానికిపైగా 'పీఎం 10' స్థాయి కాలుష్య ఉద్గారాలు ఉన్నాయి. కానీ ప్రస్తుతం దేశంలో తీవ్ర కాలుష్యాన్ని ఎదుర్కొంటున్న కేవలం 4 శాతం నగరాలపైనే ఎన్‌సీఏపీ దృష్టి పెడుతోంది" అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. దేశంలోని వెయ్యి తీవ్ర కాలుష్యమయ పట్టణాల్లో వాయు నాణ్యతను పెంచడంపై దృష్టి సారించాలని డిమాండు చేశారు.

పాకిస్థాన్‌లో హిందూ యువరైతు కాల్చివేత

కరాచీ: పాకిస్థాన్‌లో ఓ భూస్వామి జరిపిన కాల్పుల్లో హిందూ యువరైతు మృతి చెందాడు. సింధ్ ప్రావిన్సు బాడిన్ జిల్లా తల్హార్ గ్రామంలో ఈ నెల 4న ఈ ఘటన చోటుచేసుకుంది. సర్ఫరాజ్ నిజామాని అనే ఓ భూస్వామి కలాష్ కోహ్లీ(23) అనే హిందూ యువ రైతుపై కాల్పులు జరిపాడని పోలీసులు తెలిపారు. తన భూమిలో రైతు నివాసం నిర్మించుకున్నాడన్న కారణంతోనే భూస్వామి ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటన అక్కడి హిందూ సమాజంలో విస్తృత నిరసనలకు దారి తీసింది. ఈ నేపథ్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పరారీలో ఉన్న సర్ఫరాజ్‌తో పాటు అతని సహాయకుడు జఫారుల్లాను పోలీసులు అరెస్ట్ చేశారు.

పెళ్లిలో పేలిన గ్యాస్ సిలిండర్

- పాక్‌లో వధూవరులు సహా 8 మంది మృతి

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో ఘోర ప్రమాదం జరిగింది. ఓ పెళ్లి వేడుకలో సిలిండర్ పేలి 8 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో వధూవరులు కూడా ఉన్నారు. ఆదివారం ఉదయం ఓ ఇంట్లో వివాహ తంతు జరుగుతున్న సమయంలో ఈ ఘటన చేసుకుంది. గ్యాస్ లీకేజీ కారణంగానే పేలుడు సంభవించినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని అధికారులు తెలిపారు. భారీ పేలుడుతో చుట్టుపక్కల నాలుగు భవనాలు ధ్వంసమయ్యాయని పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో మరో 11 మంది గాయపడినట్లు పోలీసులు తెలిపారు.

ఉక్రెయిన్ డ్రోన్ దాడిలో ఒకరి మృతి

కీవ్: ఉక్రెయిన్ డ్రోన్లు రష్యాపై విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో వరోనిష్ నగరంలో ఒకరు మృతి చెందారు. ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ విషయాన్ని మాస్కో అధికారులు ఆదివారం తెలిపారు. డ్రోన్ శకలాలు తాకడంతో ఓ మహిళ ప్రాణాలు కోల్పోయారని, మూడు అపార్ట్‌మెంట్ భవనాలు, కొన్ని వ్యక్తిగత నివాసాలు, ఓ హైస్కూల్‌కు నష్టం కలిగినట్లు పేర్కొన్నారు.

అత్యాచార ఆరోపణల కేసులో పాలక్కాడ్ ఎమ్మెల్యే అరెస్టు



రాహుల్ మామ్‌కుటత్తిల్

తిరువనంతపురం: అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న పాలక్కాడ్ ఎమ్మెల్యే, రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ మామ్‌కుటత్తిల్ అరెస్టయ్యారు. పాలక్కాడ్‌లోని ఓ హోటల్‌లో ఆయనను అరెస్టుచేసినట్లు పోలీసులు ఆదివారం వెల్లడించారు. తమను లైంగికంగా వేధిస్తున్నట్లు ఓ నటి, మరో యువతి గతంలో రాహుల్‌పై ఫిర్యాదు చేశారు. ఈ కేసుల్లో ఆయన ముందస్తు బెయిల్ పొందారు. ఇటీవలే మరో యువతి అతడిపై పలు ఆరోపణలు చేసింది. 2024లో రాహుల్ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని, గర్భం తొలగించుకోవాలని బెదిరించాడని ఫిర్యాదుచేసింది. తనను వివాహం చేసుకుంటానని నమ్మించి మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేసినట్లు ఆరోపించింది. రాజకీయంగా పలుకుబడి ఉండటంతో ఇన్నాళ్లూ రాహుల్‌పై ఫిర్యాదు చేయలేదని, అతడిపై వరుసగా అత్యాచార కేసుల నమోదు కావడంతో ఈ నెల 8న పోలీసులను ఆశ్రయించినట్లు యువతి పేర్కొంది. కేసు నమోదైనప్పటి నుంచి పరారీలో ఉన్న రాహుల్‌ని ఆదివారం అర్ధరాత్రి పోలీసులు అరెస్టుచేశారు. లైంగిక వేధింపుల వరుస ఆరోపణలతో పార్టీ నుంచి రాహుల్‌ను కాంగ్రెస్ ఇదివరకే బహిష్కరించింది. ఈ అరెస్టు విషయంలో జోక్యం చేసుకోబోమని, రాహుల్‌కు ఎటువంటి మద్దతు ఇవ్వబోమని పార్టీ సీనియర్ నేత కె.మురళీధరన్ మరోసారి స్పష్టం చేశారు. వైద్య పరీక్షల నిమిత్తం రాహుల్‌ను ఆసుపత్రికి తీసుకువెళ్లగా.. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ), యువ మోర్చాలకు చెందిన నిరసనకారులు ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పరీక్షల అనంతరం రాహుల్‌ను జుడీషియల్ కస్టడీకి తరలించారు.

కొత్త సంఘాన్ని ఏర్పాటు చేస్తే గాజా ప్రభుత్వాన్ని రద్దు చేస్తాం: హమాస్

కైరో: కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా కొత్త పాలస్తీనా సంఘాన్ని ఏర్పాటు చేస్తే ప్రస్తుతం తమ నేతృత్వంలో ఉన్న గాజా ప్రభుత్వాన్ని రద్దు చేసేందుకు సిద్ధమని హమాస్ ప్రకటించింది. అమెరికా కుదిర్చిన శాంతి ప్రణాళికలో భాగంగా గాజా పాలనను పర్యవేక్షించటానికి పాలస్తీనా, అంతర్జాతీయ నిపుణులతో ఓ సంఘం ఏర్పాటు కానుంది. ఇందుకు సంబంధించిన పేర్లను ఇంకా ప్రకటించలేదు. రాజకీయాలతో సంబంధం లేని వారిని ఈ సంఘంలో నియమించే అవకాశం ఉంది. ఇది తాత్కాలిక ప్రభుత్వంగా పనిచేస్తుంది. అయితే ప్రస్తుత ప్రభుత్వాన్ని ఎప్పుడు రద్దు చేయనున్నామన్న విషయాన్ని హమాస్ పేర్కొనలేదు. మరోవైపు కాల్పుల విరమణ ఉల్లంఘన జరుగుతూనే ఉంది. ఇజ్రాయెల్ కాల్పుల్లో ముగ్గురు మరణించినట్లు పాలస్తీనా ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

శిందేతో పనిచేయడం సులభం: ఫడణవీస్



ఇంటర్నెట్ డెస్క్: మహారాష్ట్ర మాజీ సీఎంలు ఉద్ధవ్ ఠాక్రే, ఏక్‌నాథ్ శిందేలలో శిందేతో పనిచేయడం సులభమని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ వ్యాఖ్యానించారు. ఈ ఇద్దరు నేతలతో కలిసి పనిచేసిన అనుభవంపై ఓ వార్తాసంస్థ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఠాక్రేతో కలిసి పనిచేయడం చాలా కష్టమన్నారు. రాష్ట్రంలోని అధికార కూటమిలో అంతర్గత కలహాలున్నాయన్న వాదనలను తోసిపుచ్చారు. "శిందే ఎమోషనల్ వ్యక్తి. నాదీ అదే తరహా మనస్తత్వం. కాబట్టి.. ఇద్దరి మధ్య సమన్వయం చక్కగా కుదిరింది. ఆయనలోని భావోద్వేగ కోణాన్ని అర్థం చేసుకుంటే వ్యవహరించడం సులభం. నేను ఆయన కంటే ఎక్కువ ఆచరణవాదిని. ఉద్ధవ్ ఠాక్రే విషయానికొస్తే.. ఆయన్ను అస్సలు అంచనా వేయలేం. ఠాక్రేను అర్థం చేసుకునేందుకు ప్రత్యేకంగా ఒక పరిశోధకుడిని నియమించాల్సి ఉంటుంది" అని ఫడణవీస్ వివరించారు. మహారాష్ట్రలో తమ కూటమి స్థిరంగా కొనసాగుతోందని చెప్పారు.

ప్రపంచశాంతి స్థాపనలో మోదీ కీలకపాత్ర

- ఉక్రెయిన్ రాయబారి ఒలెక్సాండర్



ఈటీవీ భారత్: ప్రపంచ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, యుద్ధ వాతావరణం నేపథ్యంలో ఉక్రెయిన్ రాయబారి ఒలెక్సాండర్ పొలిష్‌చుక్ ప్రధాని మోదీని ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ దేశాల మధ్య శాంతిని నెలకొల్పడంలో మోదీ కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. రాజ్‌కోట్‌లో జరిగిన 'వైబ్రెంట్ గుజరాత్ రీజినల్ కాన్ఫరెన్స్'లో ఆయన ఈ మాట్లాడారు. ప్రాంతీయస్థాయి నుంచి ప్రపంచస్థాయికి మోదీ ఎదిగిన తీరు అద్భుతమని ఒలెక్సాండర్ కొనియాడారు. ప్రస్తుతం ప్రపంచ వేదికపై శాంతి స్థాపనలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. రష్యాతో యుద్ధం నడుస్తున్న క్లిష్ట సమయంలో 2024లో ఉక్రెయిన్‌లో పర్యటించిన దక్షిణార్ధగోళ దేశాలకు చెందిన అతికొద్ది మంది నేతల్లో ప్రధాని మోదీ ఒకరని పొలిష్‌చుక్ గుర్తు చేశారు. శాంతి పునరుద్ధరణ ద్వారానే భారత్- ఉక్రెయిన్ మధ్య, ముఖ్యంగా గుజరాత్ రాష్ట్రంతో బలమైన ఆర్థిక సంబంధాలు ఏర్పడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 2023 నుంచి ఉక్రెయిన్ ఈ గ్లోబల్ ఫోరమ్‌లో భాగస్వామిగా ఉందని, ఇది ఇరు దేశాల మధ్య ఉన్న నమ్మకానికి నిదర్శనమని తెలిపారు. విద్యుత్, ఐటీ, ఇంజనీరింగ్, వ్యవసాయం, విద్య, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో ఉక్రెయిన్ కంపెనీలు భారత సంస్థలతో చర్చలు జరుపుతున్నాయని వివరించారు. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా రక్షణ రంగంలో సాంకేతిక సహకారాన్ని విస్తరించుకోవాలని భావిస్తున్నట్లు పొలిష్‌చుక్ తెలిపారు. యుద్ధం తర్వాత ఉక్రెయిన్ పునర్నిర్మాణంలో భారతీయ వ్యాపారవేత్తలు భాగస్వాములు కావాలని, ఈ ఏడాది జరగబోయే 'ఉక్రెయిన్ రికవరీ కాన్ఫరెన్స్'కు రావాలని ఆయన ఆహ్వానించారు. మరోవైపు.. ఈ ఏడాది చివర్లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ భారతదేశాన్ని సందర్శించే అవకాశం ఉందని ఒలెక్సాండర్ వెల్లడించారు.



15,000 మంది విద్యార్థులతో హనుమాన్ చాలీసా పఠనం



జగద్గురు స్వామీ రామభద్రాచార్య మహరాజ్

ఈటీవీ భారత్: రాజస్థాన్ రాజధాని నగరమైన జైపుర్‌లోని సీకర్ రోడ్డులో గల నీందడ్ వద్ద కొనసాగుతున్న పది రోజుల శ్రీరామ కథా ప్రవచన కార్యక్రమంలో శనివారం 15,000 మంది విద్యార్థులు పాల్గొని హనుమాన్ చాలీసా శ్లోకాలను పఠించారు. ఈ సందర్భంగా తులసీ పీఠాధీశ్వరులైన జగద్గురు స్వామీ రామభద్రాచార్య మహరాజ్ మాట్లాడుతూ.. రామ నామ పఠనంలో ఉత్తమ విద్యార్థిగా హనుమంతుడిని అభివర్ణించారు. రామ నామాన్ని హనుమంతుడిలా తమ జీవితాలకు పునాదిగా చేసుకునేవారు శ్రీరాముణ్ని హృదయంలో ప్రతిష్ఠించుకుంటారన్నారు. సూర్యుడిని నోటితో పట్టుకొన్న హనుమంతుడు సీతారాములకు తన హృదయంలో స్థానం ఇచ్చాడని, ఇదే నిజమైన భక్తి సందేశమన్నారు.



గ్రామ సింహాలు

రాజస్థాన్‌లోని జైపుర్‌లో ఆదివారం నిర్వహించిన ఓ డాగ్ షోలో ఆకట్టుకున్న మాస్టిఫ్ జాతి(టిబెట్) పెంపుడు శునకాలు. ఇవి అచ్చం సింహాలను పోలి ఉండటం విశేషం

పూజా ఖేడ్కర్ ఇంట్లో చోరీ!

పుణె ఇంట్లో పనిచేస్తున్న వ్యక్తి తనతో పాటు తల్లిదండ్రులను అపస్మారక స్థితిలోకి వెళ్లేలా చేసి చోరీకి పాల్పడ్డాడన్న ఐఏఎస్ మాజీ ప్రొబేషనరీ అధికారిణి పూజా ఖేడ్కర్ ఆరోపణల మేరకు దర్యాప్తు ప్రారంభించామని ఆదివారం పోలీసులు తెలిపారు. పుణెలోని బనేర్ రోడ్డులో తాము నివాసముంటున్న భవనంలో దొంగతనం జరిగిందని పూజ శనివారం రాత్రి పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు అధికారులు తెలిపారు. నేపాల్‌కు చెందిన ఓ వ్యక్తి ఇటీవలే పూజ ఇంట్లో పనికి చేరాడు. పూజ, ఆమె తల్లిదండ్రులు దిలీప్ ఖేడ్కర్, మనోరమ ఖేడ్కర్‌లకు ఆ వ్యక్తి మత్తుమందు ఇచ్చి వారు అపస్మారక స్థితిలోకి వెళ్లాక విలువైన వస్తువులు, వారి మొబైల్ ఫోన్లను చోరీ చేశాడు. తనను తాను విడిపించుకున్న పూజ మరో మొబైల్ ఫోన్ నుంచి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇదిలాఉంటే.. దొంగతనం జరిగిన వస్తువుల వివరాలు పూజ తెలియజేయలేదని, లిఖితపూర్వక ఫిర్యాదు ఇవ్వలేదని పోలీసులు పేర్కొన్నారు.

కక్ష్యలోనే ఉపగ్రహాలకు ఇంధన సరఫరా!

- ప్రయోగాత్మకంగా ట్యాంకర్ శాటిలైట్‌ను పంపుతున్న సంస్థ

దిల్లీ: భూ కక్ష్యలో పరిభ్రమిస్తున్న ఉపగ్రహాలకు ఇంధనాన్ని నింపేందుకు వీలు కల్పించే పరిజ్ఞానాన్ని చెన్నైకి చెందిన ఆర్బిట్ ఎయిడ్ అనే అంకుర సంస్థ పరీక్షించబోతోంది. దీనివల్ల శాటిలైట్ల జీవితకాలాన్ని పొడిగించడానికి వీలవుతుంది. అలాగే రోదసిలో వ్యర్థాల సమస్యను ఎదుర్కోవడానికి మార్గం సుగమమవుతుంది. ఆయుల్‌శాట్ అనే ప్రత్యేక ట్యాంకర్ ఉపగ్రహాన్ని సోమవారం పీఎస్ఎల్వీ రాకెట్ ద్వారా నింగిలోకి పంపుతున్నారు. ఇది ఇంధనాన్ని, విద్యుత్‌ను, డేటాను బదిలీ చేస్తుంది. ఇందుకోసం స్టాండర్డ్ ఇంటర్‌ఫేస్ ఫర్ డాకింగ్ అండ్ రీఫ్యూయెలింగ్ పోర్ట్ (ఎస్ఐడీఆర్‌పీ)ని ఉపయోగిస్తుంది. ప్రయోగంలో భాగంగా తొలుత ఉపగ్రహంలోని ఒక ట్యాంక్ నుంచి మరో ట్యాంక్‌లోకి పంపుతామని ఆర్బిట్‌ఎయిడ్ వ్యవస్థాపకుడు, సీఈవో శక్తికుమార్ రామచంద్రన్ తెలిపారు. ఇది భారత తొలి వాణిజ్య డాకింగ్, రీఫ్యూయెలింగ్ వ్యవస్థ అని పేర్కొన్నారు. ఈ ఏడాది చివర్లోగా మరో ఉపగ్రహాన్ని ప్రయోగిస్తామని, అది ఛేజర్‌గా వ్యవహరిస్తుందన్నారు. ఇది కక్ష్యలో ఆయుల్‌శాట్‌తో అనుసంధానమవుతుందని, అనంతరం ఉపగ్రహాల మధ్య ఇంధన బట్వాడా జరుగుతుందని చెప్పారు. తద్వారా కక్ష్యలో ఇంధనాన్ని నింపే సామర్థ్యం కలిగిన నాలుగో దేశంగా భారత్ గుర్తింపు పొందుతుందని వివరించారు. త్వరలోనే కక్ష్యలోనే ఇంధన కేంద్రాలు వస్తాయని, అవి ఉపగ్రహాల జీవితకాలాన్ని పొడిగిస్తాయన్నారు.





బీకానేర్‌లో అలరించిన ఒంటెల పండుగ

ఈటీవీ భారత్: రాజస్థాన్‌లోని బీకానేర్‌లో జరిగిన మూడు రోజుల అంతర్జాతీయ ఒంటెల ఉత్సవంలో భాగంగా స్థానిక ఒంటెల జాతీయ పరిశోధన కేంద్రంలో నిర్వహించిన పలు విన్యాసాలు జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకట్టుకొన్నాయి. ఎముకలు కొరికే చలిలోనూ ఒంటెల నృత్యాలు, పరుగు పందేల వంటివి చూసేందుకు జనం పోటెత్తారు. రాజస్థాన్ జానపద వాయిద్యాలకు అనుగుణంగా ఒంటెలు నృత్యం చేశాయి. సంప్రదాయ తలపాగాలతో విదేశీయులు ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రాజస్థాన్ పర్యాటకశాఖ నిర్వహించిన ఉత్సవాల్లో ఈ ఏడాది ఒంటెల ఒంటిపై పర్యావరణ పరిరక్షణ వంటి చిత్రాలతో 'ఫర్ కటింగ్' (కేశ కళ) ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ పండుగ రాజస్థాన్ సంస్కృతిని ప్రపంచం దృష్టికి తీసుకువెళుతుందని గత పాతికేళ్లుగా ఈ కేమెల్ ఫెస్టివల్‌కు హాజరవుతున్న కిశోర్‌సింగ్ తెలిపారు.

భవిష్యత్తుకు దారి చూపించే వినూత్న ఆలోచన నెక్స్ట్

- గ్రామీణ ప్రాంతాల్లో వైద్యుల సంఖ్యను పెంచే దిశగా ఫ్యామిలీ మెడిసిన్
- 'ఈనాడు'తో ఎన్ఎంసీ ఛైర్మన్ డాక్టర్ అభిజాత్ చంద్రకాంత్ సేఠ్

ఈనాడు, అమరావతి: 'నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ (నెక్స్ట్ పరీక్ష) భవిష్యత్తుకు దారి చూపించే ఒక వినూత్న ఆలోచన. దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్న జాతీయస్థాయి అంచనా వ్యవస్థ' అని జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ఛైర్మన్ డాక్టర్ అభిజాత్ చంద్రకాంత్ సేఠ్ తెలిపారు. విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలు, విద్యార్థులు, బోధన సిబ్బంది ఇలా భిన్న భాగస్వాముల అనుమానాలు నివృత్తిచేసి.. వారి ఆమోదం, సానుకూలత తర్వాతే సమర్థ విధానాన్ని అమలు చేస్తామన్నారు. ఇది ప్రస్తుత నీట్, పీజీ, ఎఫ్ఎంజీ వైద్యవిద్య పరీక్షల విధానాల కంటే మెరుగ్గా ఉంటుందని తెలిపారు. రాబోయే రెండు, మూడేళ్లలో నెక్స్ట్ పరీక్ష ప్రారంభిస్తామని వెల్లడించారు. 'ఈనాడు' ముఖాముఖిలో ఆయన తెలిపిన పలు విషయాలు ఇలా ఉన్నాయి..

వైద్యరంగం బలోపేతానికి పీపీపీ ఉత్తమ మార్గం

ప్రస్తుత వైద్య విద్య, ఆరోగ్య సేవల్లో ప్రభుత్వ-ప్రైవేటు అనే రెండు సమాంతర వ్యవస్థలు ఉన్నాయి. వీటిమధ్య సమన్వయం లేదు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో వైద్యవిద్య అవసరాల కోసం ఈ రెండు వ్యవస్థలు కలిసి పనిచేస్తే ఉన్న వనరుల సమర్థ వినియోగంతో పాటు రెండు రంగాలకూ లాభదాయకం. పీపీపీ విధానం వైద్యవిద్యను బలోపేతం చేసేందుకు మన ముందున్న ఉత్తమ మార్గం. పేదలకు ఆరోగ్య సేవల్లో నాణ్యత పెరుగుతుంది. నాణ్యమైన వైద్యవిద్య అందుతుంది.

ప్రతిభావంతులకే సగం సీట్లు

వైద్య కళాశాలల ఫీజులపై ఎన్ఎంసీ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఏపీలో ఈ ఫీజులపై నిర్ణయం తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానిదే. ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం మొత్తం సీట్లలో సగం రాష్ట్రంలో ప్రతిభావంతులకు ఇవ్వాలి. మిగిలిన సగం మేనేజ్‌మెంట్ కోటాకు కేటాయించుకోవచ్చు. వైద్య కళాశాలల్లో మౌలికవసతులు పూర్తిగా అభివృద్ధి చేయకపోతే ఆయా సంస్థలకు గుర్తింపు ఇవ్వడంలో సమస్యలు వస్తాయి.



సవరించిన అప్లికేషన్ గైడ్‌లైన్స్‌లో.. గతంలో ఉన్న 42 ప్రమాణాలను 20కి తగ్గించాం. తగిన మౌలిక వసతులు లేని వైద్య కళాశాలలకు వైద్యవిద్య సీట్లు, గుర్తింపు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వం.

ఐదేళ్లలో 75వేల యూజీ, పీజీ సీట్లు

కొత్త సీట్ల మంజూరుకు ఐదేళ్ల కాలానికి ఒక లక్ష్యాన్ని నిర్ణయించాం. యూజీ, పీజీ సీట్లు కలిపి 75 వేలు పెంచేలా ప్రణాళిక రూపొందించాం. 2024-25 విద్యా సంవత్సరంలో 18 వేలకు పైగా సీట్లు పెంచాం. భవిష్యత్తులో రాష్ట్రాలకు ఎక్కువ మేలు జరిగేలా.. అవసరాలకు తగ్గట్లు సీట్ల సంఖ్య పెంచుతాం. ఈ సీట్ల పెంపు ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉంటుంది.

ఎఫ్ఎంజీల సమస్యపై అధ్యయనానికి కమిటీ

విదేశాల్లో వైద్యవిద్య చదివే విద్యార్థులు (ఎఫ్ఎంజీలు) భాషా సమస్యలు, పాఠ్యాంశాలు, బోధన నాణ్యతలో ఏకరూపత లేకపోవడం, భారతీయ వైద్యవిద్యా విధానంపై సరైన అవగాహన లేకపోవడం వంటి కారణాల వల్ల వారు భారతదేశానికి తిరిగి వచ్చాక అర్హత పరీక్షల్లో ఫెయిల్ అవుతున్నారు. దీనిపై అధ్యయనానికి ఎన్ఎంసీ స్థాయిలో విదేశాంగ మంత్రిత్వ శాఖ, హోం శాఖలతో కమిటీ వేశాం. ఈ కమిటీ విదేశీ వైద్య విద్యాసంస్థలు, ఎన్ఎంసీ సిలబస్, థియరీ, ప్రాక్టికల్ మధ్య తేడాలు.. తదితర అంశాలపై అభిప్రాయాలు, సూచనలు అందిస్తుంది. ఆ నివేదిక ఆధారంగా సరైన అక్రిడిటేషన్ ప్రక్రియ అమలుచేసేలా, స్క్రీనింగ్, ఫిల్టరేషన్ విధానం సమగ్రంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం. ఆయా విద్యాలయాలు విదేశీ వైద్య సంస్థలుగా అర్హత కలిగినవా, కాదా అనేది ఎన్ఎంసీ పరిశీలిస్తుంది.

గ్రామీణ వైద్యుల సంఖ్య పెంచేలా చర్యలు

ఫ్యామిలీ మెడిసిన్ గ్రామీణ ప్రాంతాల్లో వైద్యుల సంఖ్యను పెంచేలా ఉపకరిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో సేవ చేయగల వైద్యులను ప్రోత్సహించేందుకు ఫ్యామిలీ మెడిసిన్ పాఠ్యాంశం అభివృద్ధి, అమలు అవసరం. దీన్ని తప్పనిసరిగా ప్రోత్సహించాలి.

మహిళల రక్షణలో దేశంలోనే విశాఖ నంబర్‌వన్

- దాడి కేసును సత్వరం ఛేదించిన నగర పోలీసులకు సీఎం చంద్రబాబు అభినందనలు

ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలో ఓ మహిళపై జరిగిన దాడి వెనుక వాస్తవాలను ఛేదించి, నిందితుడిని అదుపులోకి తీసుకున్న నగర పోలీసులను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. మహిళల రక్షణలో దేశంలోనే విశాఖ నంబర్‌వన్ అని.. అక్కడ శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీసుశాఖ ప్రజల భద్రతకు కట్టుబడి ఉందని ఆదివారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలపై రాజకీయం చేస్తూ, ప్రభుత్వంపై బురద చల్లాలని ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇటీవల జగదాంబ సెంటర్‌లో తనపై ఓ వ్యక్తి దాడి చేశాడని.. దుర్భాషలాడాడని ఓ మహిళ సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్నారు. పోలీసులకు సమాచారం అందించారు. సత్వరం స్పందించిన పోలీసులు ఘటనకు కారణమైన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అయితే అతడి మానసిక పరిస్థితి సరిగాలేదని ప్రాథమిక విచారణలో తేలింది. సదరు మహిళ కూడా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఈ విషయాన్ని నిర్ధారించారు. ఆ వ్యక్తిని మానసిక చికిత్సకు పంపాలని కోరారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవద్దని బాధితురాలు విజ్ఞప్తి చేశారు.

సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి

- ఉన్నతస్థాయికి వెళ్తేనే పరిష్కారం సాధ్యమన్న భావన ప్రజల్లో పోవాలి: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: సమస్య ఉన్నతస్థాయి యంత్రాంగం దృష్టికి వెళితేనే పరిష్కారం అవుతుందన్న భావన ప్రజల్లో పోగొట్టాలని.. ఐటీడీఏ, జిల్లా స్థాయి పాలనా యంత్రాంగం, స్థానిక ప్రజాప్రతినిధులు ఆ బాధ్యత తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచించారు. ఈ మధ్య చిన్నచిన్న సమస్యలు కూడా ప్రభుత్వం దృష్టికి వస్తున్నాయని, కొన్ని ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉంటున్నాయని ఆయన అన్నారు. ఆ ప్రాంత అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు నిబద్ధతతో వ్యవహరిస్తే అనేక సమస్యలు కింది స్థాయిలోనే పరిష్కారమవుతాయని ఎక్స్ వేదికగా ఉప ముఖ్యమంత్రి అన్నారు. 'ప్రభుత్వంలోని అన్ని శాఖలతో ఐటీడీఏ, జిల్లా యంత్రాంగం సమన్వయం చేసుకుని గిరిజనుల సమస్యలకు పరిష్కారం చూపాలి. గిరిజనాభివృద్ధి, ఆ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. అడవితల్లి బాట పథకంలో కొండలపై ఉన్న గ్రామాలకూ రోడ్లు వేస్తున్నాం. డోలీ మోతలు లేకుండా ఉండాలన్నదే మా సంకల్పం. ఆయా ప్రాంతాల్లో విద్యుత్తు వెలుగులు నింపుతున్నాం. పీఎం జన్‌మన్, ఉపాధిహామీ తదితర పథకాల కింద నిధులు అందుబాటులోకి తెచ్చాం' అని ఉప ముఖ్యమంత్రి వివరించారు.



వడ్డే ఓబన్నకు చంద్రబాబు నివాళి

ఈనాడు, అమరావతి: తెల్లదొరల అణచివేతకు ఎదురొడ్డి.. రేనాటి వీరుడు వడ్డే ఓబన్న సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని సీఎం చంద్రబాబు కొనియాడారు. ఓబన్న జయంతి సందర్భంగా ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి ఆదివారం పూలమాల వేసి నివాళి అర్పించారు. ఓబన్న దేశభక్తి, త్యాగస్ఫూర్తి భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సైన్యానికి వెన్నెముక వడ్డే ఓబన్న

మంత్రి లోకేశ్ నివాళి

ఈనాడు, అమరావతి: ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సైన్యానికి రేనాటి వీరుడు వడ్డే ఓబన్న వెన్నెముకగా నిలిచారని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కొనియాడారు. ఓబన్న సాగించిన అలుపెరగని పోరాటం నేటితరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఓబన్న జయంతి సందర్భంగా 'ఎక్స్' వేదికగా ఆయనకు నివాళి అర్పించారు. దేశం కోసం ఆ మహనీయుడు చేసిన త్యాగాల్ని గుర్తుచేశారు.

నేడు శిర్డీ సాయినాథుడ్ని దర్శించుకోనున్న లోకేశ్ దంపతులు

ఈనాడు, అమరావతి: శిర్డీలోని సాయినాథుడ్ని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్, ఆయన సతీమణి బ్రాహ్మణి సోమవారం దర్శించుకోనున్నారు. సాయిబాబాకు నిర్వహించే కాగడ హారతిలో పాల్గొంటారు. ఆదివారమే శిర్డీ చేరుకున్న లోకేశ్ దంపతులకు కోపర్గావ్ ఎమ్మెల్యే, శ్రీసాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ మాజీ ఛైర్మన్ అశుతోష్ ఆకాశరావు, ఆలయ అధికారులు స్వాగతం పలికారు. లోకేశ్ వెంట చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఉన్నారు.

ఆలయాల్లో సామాన్యులకు ఇబ్బంది కలిగించవద్దు

- భక్తుల రద్దీ ఆధారంగా క్యూ లైన్ల నిర్వహణ
- ఉత్తర్వులు జారీ చేసిన దేవాదాయశాఖ కమిషనర్

ఈనాడు, అమరావతి: సామాన్య భక్తులకు దర్శనాలు కల్పించడంలో ప్రాధాన్యత, భక్తులకు ఇబ్బంది లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై మార్గదర్శకాలను నిర్దేశిస్తూ దేవాదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధాన ఆలయాల్లో క్యూ లైన్ల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. మార్గదర్శకాలను సమర్థంగా అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

- ✦ దర్శన వేళల్లో ఎలాంటి అంతరాయం లేకుండా సామాన్య భక్తులకు దర్శనాన్ని కల్పించాలి. వీఐపీలు, ప్రత్యేక దర్శనాల వేళల్లోనూ వీరికి ఆటంకం ఉండకూడదు.
- ✦ ఉచిత దర్శనం, టికెట్ల ద్వారా కల్పించే దర్శనం, వీఐపీ/ప్రొటోకాల్, సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, పసిపిల్లల తల్లులు, గర్భిణులకు ప్రత్యేక క్యూలైన్లు నిర్వహించాలి.
- ✦ జనరల్, టికెట్లు, వీఐపీ క్యూలైన్ల మధ్య ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులు ఉండకూడదు.
- ✦ అన్ని లైన్లలోని భక్తులందరికీ దర్శనం చేసుకునే అనువైన పరిస్థితి ఉండాలి.
- ✦ రద్దీ ఎక్కువగా ఉండే రోజుల్లో భక్తుల భద్రత కోసం జనరల్ క్యూలైన్ల దగ్గర బారికేడింగ్, హోర్డింగులు, కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేయాలి.
- ✦ దర్శనానికి వచ్చే వారికి, బయటకు వెళ్లడానికి వేర్వేరు మార్గాలు ఉండాలి.
- ✦ క్యూలైన్లలోని భక్తులకు మంచినీటి సదుపాయం, వాష్‌రూమ్‌కు వెళ్లే వెసులుబాటు ఉండాలి.
- ✦ భక్తులకు ఎప్పటికప్పుడు సూచనలు.. సమాచారాన్ని అందించే వ్యవస్థ ఉండాలి.
- ✦ సీసీ టీవీల ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి.
- ✦ పండుగలు, రద్దీ వేళల్లో ప్రముఖులు, ప్రొటోకాల్ దర్శనాలకు ప్రత్యేక స్లాట్‌లు నిర్వహించాలి.
- ✦ రద్దీ ఎక్కువగా ఉన్న సమయాల్లో, ముఖ్యమైన రోజుల్లో టికెట్ల ద్వారా అంతరాలయ దర్శనాన్ని నిలిపేయాలి. ప్రముఖులు/ ప్రొటోకాల్ దర్శనాలకు మాత్రమే పరిమితం చేయాలి.

బదిలీపై వెళ్లేటప్పుడు ఆభరణాలు అప్పగించాలి

ఆలయాల కార్యనిర్వాహక అధికారులు (ఈవోలు) బదిలీపై వెళ్లే సమయంలో విలువైన ఆభరణాలు, ఇతర వస్తువులను నిర్దేశిత వ్యవధిలో కొత్తగా బాధ్యతలు చేపట్టే వారికి అప్పగించాలని కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. జాప్యం జరగడం వల్ల ఆలయాల రోజువారీ కార్యకలాపాలకు ఇబ్బంది కలుగుతుందని పేర్కొన్నారు. దీంతో పాలు అక్రమాలు జరిగేందుకు అవకాశం ఉంటుందని కమిషనర్ అన్నారు. ఈ దృష్ట్యా నిర్దేశిత వ్యవధిలో వాటిని అప్పగించాలని కోరారు.

- ✦ జాయింట్ కమిషనర్ క్యాడర్ ఆలయాల్లో బాధ్యతలు అప్పగించినప్పటినుంచి 6 వారాల్లో ఆభరణాలు, విలువైన ఇతర వస్తువులు అప్పగించాలి.
- ✦ డిప్యూటీ కమిషనర్, ఏఈ స్థాయి అధికారులు ఉండే ఆలయాల్లో నాలుగు వారాలు, ఇతర 6ఎ, 6బి, 6సి, 6డి ఆలయాల్లో మూడు వారాల్లో ఆభరణాలు అప్పగించాలి.

గాలిపటం బతుకు పాఠం



సంక్రాంతి అంటేనే ఎన్నో సరదాలు. ఊరంతా పండుగ సందడే... రంగుల పతంగులతో నీలాల నింగి అందంగా ముస్తాబవుతుంది. గాలిపటాన్ని తొలిగా శ్రీరాముడే ఎగురవేశాడనీ, అది ఆకాశపుటంచుల్ని దాటి ఇంద్రలోకానికి చేరిందనేది పౌరాణిక కథనం. సూర్యుడు దక్షిణాయనం నుంచి ఉత్తరాయణంలోకి మారడాన్ని తెలిపేందుకే పతంగులను ఎగురవేసేవారనీ చెబుతారు. అలాగే మకర సంక్రాంతి రోజున సూర్యకాంతికి అనేక ఆరోగ్య ప్రయోజనాలుంటాయనీ, ఆరోజున శరీరం మీద పడే కిరణాలు అమృతంతో సమానమనీ విశ్వసించే వారూ ఉన్నారు. పతంగుల సంబరంలో పాలుపంచుకునేందుకు బయటకు రావడం వల్ల డి-విటమిన్ కూడా లభిస్తుందన్న శాస్త్రీయ కోణమూ ఉంది. పైగా జీవిత పాఠాల్నీ నేర్పిస్తుందీ గాలిపటం. ఆకాశంలో విహరించే గాలిపటం... మనల్ని ఉన్నతస్థితికి ఎదగమని చెబుతుంటే, చేతిలోని దారం ఏ స్థాయికెళ్లినా అదుపు తప్పకుండా ఉండమని.. ఎటు వెళుతున్నామో చూసుకోమని బోధిస్తుంది. అలాగని మరీ పట్టుకున్నా, మొత్తంగా వదిలేసినా తెగిపడుతుందని.. జీవితమూ కుప్పకూలుతుందనేది గాలిపటంలోని తత్వం. జనవరి 12 నుంచి 14 వరకు అహ్మదాబాద్‌లో జరిగే అంతర్జాతీయ వేడుకలో సుమారు 50 దేశాలు పాల్గొంటాయి. తెలంగాణ టూరిజం విభాగం సైతం ఈ వేడుకల్ని 13, 14 తేదీల్లో నిర్వహిస్తోంది. పిల్లలు ఎగరేసేటప్పుడు పెద్దలు దగ్గరే ఉండండి. – వసుంధర డెస్క్

కొత్తవిషయాలు నేర్చుకోవాలనే పవనన్న తపన నేటి తరానికి స్ఫూర్తి

మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: 'ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉంటే మనస్తత్వం, ఎంత విజ్ఞానం సంపాదించినా ఇంకా కొత్త అంశాలు నేర్చుకోవాలనే పవనన్న తపన నేటి తరానికి స్ఫూర్తి' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రశంసించారు. పురాతన జపనీస్ కత్తిసాము కళ 'కెంజుట్సు'లో అధికారికంగా ఆయన ప్రవేశం పొందడంపై అభినందనలు తెలిపారు. 'తెలుగువారి అభిమాన కథానాయకుడై బహుముఖ ప్రతిభతో పవర్ స్టార్‌గా ఎదిగారు. రాజకీయాల్లో ప్రజాభిమానం సంపాదించారు. సినిమాల్లో ప్రవేశించకముందే మార్షల్ ఆర్ట్స్‌లో నిష్ణాతులయ్యారు' అని లోకేశ్ పేర్కొన్నారు.

తాడేపల్లి ప్యాలెస్ ఎప్పుడైనా మునిగిందా?

- అదీ నదీ తీర ప్రాంతంలోనే ఉందిగా?
- ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

ఈనాడు, అమరావతి: 'జగన్ తాడేపల్లి ప్యాలెస్ కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలోనే ఉంది. ఎప్పుడైనా అది మునిగిందా?' అని తెదేపా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ప్రశ్నించారు. ఏపీలో అమలుచేస్తున్న కుట్రలకు బెంగళూరులోని యలహంక ప్యాలెస్‌లో జగన్ పథక రచన చేస్తున్నారని విమర్శించారు. అక్కడ ఏం జరుగుతోందో సీబీఐతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానని వివరించారు. ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసం వద్ద ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'వైకాపా ఎంపీలు అవినాష్‌రెడ్డి, మిథున్‌రెడ్డిల ఆస్తులు కొంతకాలంగా విపరీతంగా పెరిగాయి. వారి ఆస్తుల వివరాలు చూసి దేశంలోని ఎంపీలంతా ఆశ్చర్య పోతున్నారు. దోపిడీలు, భూకబ్జాలు, అక్రమాలు, బెదిరింపులతోనే వాళ్లు ఇన్ని ఆస్తులు సంపాదించారు. మరో పక్క, రాష్ట్రంలో వైకాపా ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లకుండా దొంగ సంతకాలతో జీతభత్యాలు తీసుకుంటున్నారు. కనీసం అసెంబ్లీకొచ్చి జగన్ తనను గెలిపించిన పులివెందుల ప్రజల సమస్యలనైనా ప్రస్తావించాలి' అని అప్పలనాయుడు హితవు పలికారు. 'మూడు రాజధానుల పేరిట రాష్ట్రాన్ని జగన్ నాశనం చేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రధాని మోదీ సహకారంతో అమరావతి నిర్మాణానికి చంద్రబాబు కృషి చేస్తుంటే వైకాపా వాళ్లు దానికి తూట్లు పొడుస్తున్నారు. అమరావతి అంటే జగన్‌కు ఇష్టమని సజ్జల రామకృష్ణారెడ్డి చేస్తున్న వ్యాఖ్యలతో ప్రజలు నవ్వుకుంటున్నారు' అని ఆయన విమర్శించారు. అమరావతిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, నదీ తీర ప్రాంతాల్లో ఉన్న మహానగరాల గురించి ఓ వీడియో రూపొందించి బెంగళూరు ప్యాలెస్‌లో ఉండే జగన్‌రెడ్డికి పంపుతానని తెలిపారు.

ఏపీ ఫైబర్‌నెట్‌కు రూ.60 కోట్లు

ఈనాడు, అమరావతి: ఏపీ ఫైబర్‌నెట్‌లో పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు రూ.60 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మొత్తాన్ని 2025-26 బడ్జెట్ కేటాయింపుల నుంచి విడుదల చేస్తున్నట్లు పేర్కొంది.

ముఠాగా ఏర్పడి.. రూ.549 కోట్లు కొల్లగొట్టి..

- ఖమ్మం జిల్లాలో 24 మందిపై కేసు నమోదు.. 18 మంది అరెస్ట్

పెనుబల్లి, న్యూస్‌టుడే: యువతకు ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆశ కల్పించి.. నిరుద్యోగులకు కమీషన్ ముట్టచెబుతామని మాయమాటలు చెప్పి.. వారితో బ్యాంకు ఖాతాలు తెరిపించి.. వాటిని వాడుకుని.. రూ.549.95 కోట్లు కొల్లగొట్టిన తెలంగాణలోని ఖమ్మం జిల్లా సత్తుపల్లి, పరిసర ప్రాంతాలకు చెందిన సైబర్ క్రైమ్ ముఠా పోలీసులకు చిక్కింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఖమ్మం జిల్లా కల్లూరు మండలం ఎర్రబోయినపల్లికి చెందిన పోట్రు ప్రవీణ్‌ను హైదరాబాద్‌లో గతంలో అరెస్ట్ చేయడంతో ఈ ముఠా ఆగడాలు వెలుగుచూశాయి. మొత్తం 24 మందిపై కేసు నమోదు చేసి 18 మందిని అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను వీఎం బంజర్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ వెల్లడించారు. ఈ కేసు విచారణను సత్తుపల్లి గ్రామీణ సీఐ ముత్తిలింగం, ఏసీపీ వసుంధర యాదవ్‌లు చేపట్టారు. కమిషనర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.

సైబర్ మోసాలను ఆసరాగా చేసుకొని..

తనకు ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి, బ్యాంకు ఖాతా తెరిపించి మోసం చేశారని సత్తుపల్లి మండలం తుంబూరుకి చెందిన మోదుగు సాయికిరణ్ గతేడాది డిసెంబరు 24న వీఎం బంజర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై వారు విచారణ చేపట్టగా అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఎర్రబోయినపల్లికి చెందిన పోట్రు ప్రవీణ్, సత్తుపల్లికి చెందిన పోట్రు మనోజ్ కల్యాణ్, మేడా భానుప్రియ, ఉడతనేని వికాస్‌చౌదరి, వేంసూరు మండలం రాజుగూడేనికి చెందిన మేడా సతీష్, లింగపాలేనికి చెందిన మోరంపూడి చెన్నకేశవ తొలుత ముఠాగా ఏర్పడ్డారు. తరువాత అందులో తమ బంధువులను చేర్చుకున్నారు. వారు అంతర్జాతీయ సైబర్ నేరస్థులతో కలిసి మ్యాట్రిమోని, రివార్డు పాయింట్లు, గేమింగ్, బెట్టింగ్, షేర్ మార్కెట్లో పెట్టుబడులు, క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ పేరిట పలువురిని మోసగించారు. ఈ క్రమంలో కాంబోడియా దేశంలో నివసిస్తున్న చైనాకు చెందిన పలువురిని ఏజెంట్లుగా నియమించుకున్నారు. వీరు కాజేసిన సొమ్మును సత్తుపల్లి ప్రాంతానికి చెందిన నిరుద్యోగులు, యువతతో తాము తెరిపించిన బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా చూశారు. అక్కడి నుంచి ఏజెంట్ల ఖాతాలకు.., చివరికి సొంత ఖాతాలకు డబ్బును మళ్లించుకున్నారు. మనోజ్ కల్యాణ్ బ్యాంకు ఖాతాలో రూ.114.18 కోట్లు, అతడి భార్య భానుప్రియ ఖాతాలో రూ.45.62 కోట్లు, బావమరిది సతీష్ ఖాతాలో రూ.135.48 కోట్లు, నాగలక్ష్మి ఖాతాలో రూ.81.72 కోట్లు, రాజు బ్యాంకు ఖాతాలో రూ.92.54 కోట్లు, వికాస్‌చౌదరి ఖాతాలో రూ.80.41 కోట్లు లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఇలా నిందితులు సుమారు రూ.549.95 కోట్లకు పైగా కాజేసినట్లు గుర్తించారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్. చిత్రంలో ఏసీపీ వసుంధర యాదవ్, సీఐ ముత్తిలింగం

సమ్మక్క, సారలమ్మ మహా జాతర పూజలకు వేళాయె..

- 14న గుడిమెలిగే పండగ

తాడ్వాయి, న్యూస్‌టుడే: తెలంగాణలోని ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో వనదేవతలు సమ్మక్క, సారలమ్మ మహా జాతర సమీపిస్తోంది. నాలుగు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు ఆరు నెలల కిందటే పూజారులు ముహూర్తం ఖరారు చేశారు. మహా జాతరకు రెండు వారాల ముందే మేడారంలోని సమ్మక్క గుడిలో, కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో పూజారులు గోప్యంగా పూజలు చేస్తారు. ఇవి వారం రోజులపాటు కొనసాగుతాయి.

✦ మహా జాతరకు సరిగ్గా రెండు వారాల ముందు అంటే జనవరి 14న గుడిమెలిగే పండగ నిర్వహిస్తారు. దేవతలకు ధూపదీపాలతో పూజలు చేసి, నైవేద్యాలు సమర్పిస్తారు. జనవరి 21న మండమెలిగే పండగ నిర్వహించి, మహా జాతరను విజయవంతంగా నిర్వహించే శక్తిని ప్రసాదించాలంటూ దేవతలను పూజారులు ప్రార్థిస్తారు. ఈ రెండు పండగలతో ఉత్సవాలు మొదలైనట్లు భావిస్తారు.

✦ మహా జాతర ప్రారంభమైన సరిగ్గా వారానికి అంటే ఫిబ్రవరి 4న నిర్వహించే తిరుగువారం పండగతో ఉత్సవాలు ముగుస్తాయి. ఇది పూర్తిగా పూజారుల పండగ. మహా జాతర పూజల విషయంలో పొరపాట్లు జరిగితే మన్నించాలంటూ దేవతలను వేడుకొంటారు. పూజారులందరూ కుటుంబాల సమేతంగా మొక్కులు తీర్చుకుంటారు. ఆదివాసీలు, గ్రామ పెద్దలు, బంధుమిత్రులకు దేవతల దర్శనం చేయిస్తారు.

ఉత్సవాలిలా...

జనవరి 14: గుడిమెలిగే పండగ.
21: మండమెలిగే పండగ.
27: మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు మేడారానికి పయనం.
✦ అదే రోజు తాడ్వాయి మండలం కన్నెపల్లి నుంచి జంపన్న బయలుదేరి... మేడారంలోని గద్దెకు చేరుకుంటారు.
28: కన్నెపల్లి నుంచి సారలమ్మ దేవత, ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి గోవిందరాజులు, మహబూబాబాద్ జిల్లా నుంచి బయలుదేరిన పగిడిద్దరాజులు గద్దెకు చేరుకుంటారు.
29: సమ్మక్క దేవత చిలుకల గుట్టనుంచి బయలుదేరి గద్దెపైకి చేరుకుంటారు.
30: భక్తుల ప్రత్యేక పూజలు, మొక్కులు తీర్చుకోవడం.
31: దేవతల వనప్రవేశం.
ఫిబ్రవరి 4: తిరుగువారం పండగ, మహా జాతర ఉత్సవాల ముగింపు.

అమరావతికి కేంద్ర నిధులు రాకుండా జగన్ కుట్రలు

- తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు

ఈనాడు, అమరావతి: భవిష్యత్తులో అమరావతి భూమిపై కూడా ఉండకూడదని వైకాపా అధినేత జగన్ చెబుతారేమోనని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ఎద్దేవా చేశారు. ప్రపంచంలోని పలు దేశాలు, వివిధ రాష్ట్రాల రాజధానులు నదీతీరాల వెంబడే అభివృద్ధి చెందాయన్నారు. నీటి సరఫరా, వాణిజ్యం, రవాణా తదితర కీలక అంశాలే దీనికి కారణమని స్పష్టం చేశారు. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవడానికే అమరావతిపై జగన్ కుట్రలు పన్నుతున్నారని ఆదివారం ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. "డాన్యూబ్ నది నాలుగు రాజధానుల మీదుగా వెళ్తుంది. వియన్నా(ఆస్ట్రియా రాజధాని), బ్రాటిస్లావా(స్లోవేకియా), బుడాపెస్ట్(హంగరీ), బెల్గ్రేడ్(సెర్బియా) ఈ నది ఒడ్డునే ఉన్నాయి. నైలు నది ఒడ్డున కైరో, థేమ్స్ నది ఒడ్డున లండన్, సీన్ నదిపై పారిస్, పొటోమాక్ నదిపై వాషింగ్టన్ డీసీ ఉన్నాయి. అమరావతి అభివృద్ధి చెందకూడదని, కేంద్రం నుంచి దానికి ఎలాంటి సాయమూ, నిధులూ అందకూడదనే దురుద్దేశంతోనే జగన్ ఈ తరహా దుష్ప్రచారాలు చేస్తున్నారు" అని యనమల మండిపడ్డారు.

జగనన్న కాలనీల్లో.. విద్యుత్ తీగలు మాయం!

- రూ.1,815 కోట్లతో సామగ్రి ఏర్పాటు
- చాలావరకు తీగలు.. ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ
- పట్టించుకోని అధికారులు

ఈనాడు, అమరావతి: జగనన్న కాలనీల్లో రూ.1,815.31 కోట్లతో వేసిన విద్యుత్‌లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లలో చాలావరకు చోరీకి గురయ్యాయి. సుమారు రూ.వెయ్యి కోట్లకు పైగా దుర్వినియోగమైనట్లు అంచనా. అసలా కాలనీల్లో నివసించే పరిస్థితులు ఉన్నాయా లేవా అని చూడకుండానే విద్యుత్ పంపిణీ సంస్థలు(డిస్కంలు) లైన్లు వేసేశాయి. చాలా కాలనీల్లో ఒక్క ఇల్లూ కట్టకపోవడంతో విద్యుత్ స్తంభాలు, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు నిరుపయోగంగా మారాయి. విద్యుత్ సరఫరా లేకపోవడంతో స్తంభాలకు ఏర్పాటుచేసిన విద్యుత్ వైర్లు, 16 కె.వి. ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. కొన్ని కాలనీల్లో ఖాళీస్తంభాలు కనిపిస్తున్నాయి. దీనిపై డిస్కంలు పట్టించుకున్న పాపాన పోలేదు.

చోరీకి గురవుతున్నా.. లెక్కాపత్రం లేదు

జగనన్న కాలనీల్లో చేసిన పనులకు లెక్కాపత్రం లేదు. కాలనీల కోసం ఏర్పాటుచేసిన విద్యుత్ సామగ్రి చాలాచోట్ల చోరీకి గురైంది. అసలు అప్పట్లో ఏర్పాటు చేసిన స్తంభాలు ఎన్ని? ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కడ ఉన్నాయి? కండక్టర్ ఏమైంది? అనే లెక్కలే డిస్కంలలో లేవు. కనీసం ఎంత సామగ్రి పోయిందన్న వివరాలూ లేవు, ఎవరూ ఫిర్యాదూ చేయలేదు.

✦ పనుల నిర్వహణకు టెండర్లలోనే భారీ అవినీతి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. కాలనీల్లో వినియోగించే విద్యుత్ స్తంభాలు, సామగ్రి ధరలు అడ్డగోలుగా నిర్ణయించి.. కొందరు అధికారులు గుత్తేదారులతో కుమ్మక్కైనట్లు తెలుస్తోంది. సామగ్రి సరఫరా చేయగానే.. ప్రతిపాదించిన మొత్తంలో 85% వరకు గుత్తేదారులకు ఆఘమేఘాల మీద డిస్కంలు చెల్లించేశాయి. సీపీడీసీఎల్ పరిధిలో ఒక్కొక్క విద్యుత్ స్తంభాన్ని రూ.8 వేలకు కొన్నట్లు విశ్వసనీయ సమాచారం. దాని వాస్తవ ధర రూ.2,500కు మించదు.

రూ.3,455 కోట్ల రుణం

వైకాపా ప్రభుత్వం జగనన్న కాలనీలకు విద్యుత్ సరఫరా కల్పించేందుకు హడావుడి చేసింది. పనుల నిర్వహణకు చేసే ఖర్చు ప్రభుత్వం భరించాలి. కానీ, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ), రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్(ఆర్ఈసీ) నుంచి రూ.3,455.10 కోట్ల రుణాన్ని తీసుకుని పనులు చేయాలని డిస్కంలకు సూచించింది. ఆ మొత్తాన్ని తర్వాత చెల్లించనున్నట్లు చెప్పింది. దీంతో డిస్కంలు రుణం తెచ్చి మరీ పనులు చేపట్టాయి. అదంతా వృథాగా మారింది.

డిస్కంల పరిధిలో నిర్వహించిన పనులు.. చేసిన ఖర్చు

డిస్కం	కాలనీలు	స్తంభాలు	ట్రాన్స్‌ఫార్మర్లు	వీధిదీపాలు	ఖర్చు(రూ.కోట్లలో)
ఈపీడీసీఎల్	3,942	1,29,122	6,616	38,059	481.14
సీపీడీసీఎల్	2,769	1,27,433	5,069	70,395	768.84
ఎస్పీడీసీఎల్	5,253	1,45,962	6,436	81,073	565.33
మొత్తం	11,964	4,02,517	18,121	1,89,527	1,815.31

డిస్కంలు ప్రతిపాదించిన పనులు.. ఖర్చు(రూ.కోట్లలో)

డిస్కం	లేఔట్ల సంఖ్య	అంచనా ఖర్చు
ఎస్పీడీసీఎల్	2,813	1,413.50
సీపీడీసీఎల్	2,612	843.10
ఈపీడీసీఎల్	4,642	1,198.50